


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 183

శనివారం 23-9-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



తొలి వన్డే భారత్‌దే

5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై విజయం.. భారత్ 1–0తో ముందంజ - 15లో



19,700 దిగువకు నిఫ్టీ

సెన్సెక్స్ నష్టం 221 పాయింట్లు.. నాలుగో రోజూ బేర్స్ పైచేయి - 15లో



బీజేపీతో జేడీఎస్ దోస్తీ

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలో కలిసి పోటీ చేయాలని తాము నిర్ణయించుకున్నట్లు బీజేపీ, జేడీఎస్‌లు తెలిపాయి.

వివరాలు 6లో ▸



అందుకే ఆ బిల్లుకు ఆమోదం

సుస్థిరమైన ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకోవడం వల్లే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



వారిని అధికారానికి దూరం చేశారు

మహిళా రిజర్వేషన్ల బిల్లులో ఓబీసీలకు కోటా పెట్టకుండా వారిని అధికారానికి కేంద్రం దూరం చేసిందని రాహుల్ గాంధీ అన్నారు.

వివరాలు 6లో ▸



భారత్‌కు మినహాయింపులుండవ్

ఖలిస్తాన్ అంశంలో భారత్‌కు మినహాయింపులు ఉండవని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు సలీవాన్ చెప్పారు.

వివరాలు 6లో ▸



గరుడ వాహనంపై గోవిందుడు

తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు శుక్రవారం రాత్రి గరుడ వాహనాన్ని అధిరోహించారు. రాత్రి 7 గంటలకు ఆరంభమైన ఈ వాహన సేవ అర్ధ రాత్రి వరకు సాగింది. గరుడ వాహనం ముందు భక్త బృందాలు, భజనలు, డప్పు వాయిద్యాలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

- వివరాలు 3లో

బాబుకు భంగపాటు

స్కిల్ స్కామ్ కేసు కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ

ఏసీబీ కోర్టు ఉత్తర్వుల్లో సైతం జోక్యం సాధ్యం కాదని స్పష్టీకరణ

- చంద్రబాబుపై సీఐడీ దర్యాప్తు ప్రాథమిక దశలో ఉంది
- 2021లో కేసు నమోదు తర్వాత 140 మంది సాక్షుల విచారణ
- 4000కు పైగా డాక్యుమెంట్ల సేకరణ.. ఇలాంటి కేసుల్లో ప్రావీణ్యం కలిగిన నిపుణులే దర్యాప్తు చేపట్టాలి
- హైకోర్టులు ఏం చేయాలన్న దానిపై సుప్రీంకోర్టు పలు కొలమానాల ద్వారా నిర్దేశం.. ఈ కేసులో జోక్యానికి అవి అనుమతించడం లేదు
- దర్యాప్తునకు తగిన సమయం ఇవ్వాలని చెప్పిన సుప్రీంకోర్టు
- ఈ కేసులో బాబు 10న అరెస్ట్.. 12న కేసు కొట్టేయమన్నారు
- ఇదే రీతిలో దాఖలు చేసిన ఓ కేసును మద్రాసు హైకోర్టు కొట్టేసింది.. ఆ తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది
- చిత్తశుద్ధితో అధికారిక విధులు, బాధ్యతలు నిర్వర్తించే వారి రక్షణకే సెక్షన్ 17ఏ.. శాసనకర్తల ఉద్దేశం కూడా ఇదే
- నిధుల దుర్వినియోగం, లంచాలు తీసుకోవడం వంటివి సెక్షన్ 17ఏ పరిధిలోకి రావు.. ఈ కేసులో చంద్రబాబు నిర్ణయాలు, నిధుల దుర్వినియోగం అధికారిక విధులు కావు
- అందువల్ల ఆయనపై సీఐడీ దర్యాప్తునకు ముందస్తు అనుమతి అవసరం లేదు.. తేల్చి చెప్పిన హైకోర్టు.. చంద్రబాబు క్వాష్ పిటిషన్ కొట్టివేత

2లో



సీఐడీ కస్టడీకి చంద్రబాబు

రెండు రోజుల పాటు విచారించేందుకు ఏసీబీ కోర్టు అనుమతి
రాజమండ్రి జైల్లోనే విచారిస్తామని తెలిపిన సీఐడీ
ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 వరకు విచారణ
ప్రతీ గంటకు 5 నిమిషాల చొప్పున బ్రేక్
మొత్తం ప్రక్రియ వీడియో చిత్రీకరణ
చంద్రబాబుకు అవసరమైన మందులు, వైద్య సాయం అందించాలి
సీఐడీకి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశం
బాబు పాత్రపై ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని వెల్లడి

2లో

చంద్రబాబు రిమాండ్ 24 వరకు పొడిగింపు

వీడియో కాన్ఫరెన్స్‌లో విచారించిన ఏసీబీ కోర్టు జడ్జి

2లో

పలాయనవాదమే లక్ష్యం

మాట్లాడటానికి ఏమీ లేకే గందరగోళం

- శాసనసభలో రెండో రోజూ టీడీపీ అదే వైఖరి
- ఇందులో భాగంగానే విజిల్స్.. నినాదాలతో రభస
- కుర్చీలపై నిల్చొని కవ్వింపు చర్యలు
- నిషేధం ఉన్నా సభలో వీడియో చిత్రీకరణ
- అచ్చెన్నాయుడు, అశోక్ సెషన్ మొత్తం సస్పెన్షన్
- స్పీకర్ చైర్ వద్ద నినాదాలు.. సభ రెండుసార్లు వాయిదా
- స్పీకర్ ఎంత సర్ది చెప్పినా మారని టీడీపీ ఎమ్మెల్యేల తీరు
- నిమ్మల, వెలగపూడి, గోరంట్ల ఒకరోజు సస్పెన్షన్

10లో



అసెంబ్లీలో చంద్రబాబు సీటు వద్ద విజిల్ ఊదుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

సభ చరిత్రలో దుర్దినం

- స్కిల్ స్కామ్ నిజమన్నది టీడీపీకి తెలుసు.. అందుకే పారిపోయారు
- ప్రతిపక్షం తీరు విచారకరం: మంత్రి బొత్స

11లో

డొల్ల కంపెనీలు.. దొంగ అగ్రిమెంట్లు

- స్కిల్ కుంభకోణంపై అసెంబ్లీలో చర్చలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్
- రూ.371 కోట్ల స్కిల్ నిధుల్ని చంద్రబాబు లూటీ చేశారు
- ప్రజాధనాన్ని దోచేస్తే అరెస్టు చేయకుండా సన్మానించాలా?
- సెబీ, జీఎస్టీ, ఈడీ, ఐటీ శాఖ విచారణల్లో వెలుగులోకి అక్రమాలు
- సీఐడీ దర్యాప్తుతో బాబు అవినీతి వ్యవహారాలు నిర్ధారణ

11లో

చీకటి ఒప్పందానికి రుజువు

స్కిల్ స్కామ్‌పై సభలో మాజీ మంత్రులు కన్నబాబు, పేర్ని నాని ధ్వజం
కరెంట్ పోవడంతో తేదీ వేయలేదని సుమన్‌బోస్ కట్టు కథలు చెబుతున్నాడు
చంద్రబాబును పెద్ద లంచగొండిగా గతంలో కార్టూన్‌లు వేయించిన రామోజీ
గుజరాత్‌లో సీమెన్స్ సీఎస్ఆర్ కింద రూ.99.85 కోట్లు నిధులు ఇచ్చింది
ఏపీలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ అంటూ బోగస్ ఒప్పందం

- వివరాలు 12లో


క్లుప్తంగా...

మాజీ ఎమ్మెల్యేల మృతికి అసెంబ్లీ సంతాపం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇటీవల మృతిచెందిన పలువురు ఎమ్మెల్యేల మృతి పట్ల శుక్రవారం అసెంబ్లీ సంతాపం తెలిపింది. మాజీ ఎమ్మెల్యేలు వై.నారాయణస్వామి, పాటిల్ నీరజారెడ్డి, డి.వెంకటేశ్వర్లు, టి.సన్యాసినాయుడు, అల్లూరి కృష్ణంరాజు, కె.నూకరాజు మృతి పట్ల సంతాప తీర్మానాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం శాసనసభలో ప్రవేశపెట్టారు. మృతిచెందిన మాజీ ఎమ్మెల్యేల ఆత్మకు శాంతి చేకూరాలని సభ సంతాపం ప్రకటించింది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది. ఈ సందర్భంగా సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

మూడు కమిటీల్లో సభ్యుల ఎన్నికపై కసరత్తు

3న పీఏసీ, ఎస్టిమేట్స్ కమిటీ, పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక



సాక్షి, అమరావతి: రాష్ట్ర అసెంబ్లీలో 2023–24 సంవత్సరానికి ఏర్పాటయ్యే పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ), ఎస్టిమేట్స్ కమిటీ, పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీలకు నూతన సభ్యుల ఎన్నికపై కసరత్తు ప్రారంభమైంది. శాసన మండలి నుంచి ఒక్కో కమిటీకి ముగ్గురు, శాసనసభ నుంచి తొమ్మిది మంది చొప్పున నూతన సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ మేరకు సభ్యుల ఎన్నికలపై శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు. మూడు కమిటీల్లో సభ్యుల నియామకానికి సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫున కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం శాసనమండలిలో ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. అనంతరం సభ్యుల ఎన్నికల షెడ్యూల్‌ను చైర్మన్ మోషేన్‌రాజు ప్రకటించారు. ఈ నెల 25, 26 తేదీల్లో శాసనమండలి సభ్యుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారని, 27న ఉపసంహరణకు గడువు ఇస్తారని తెలిపారు. ఎన్నికలు అనివార్యమైతే అక్టోబర్ 3వ తేదీన అసెంబ్లీ కమిటీ హాలులో పోలింగ్ ఉంటుందని చైర్మన్ వెల్లడించారు. అదేవిధంగా శాసనసభ నుంచి కూడా ఒక్కో కమిటీకి తొమ్మిది మంది చొప్పున సభ్యులను ఎన్నుకోనున్నట్లు సభలో స్పీకర్ తమ్మినేని సీతారాం కూడా ప్రకటించారు.

ఏపీవీవీపీ రద్దు బిల్లుకు ఆమోదం

మరో రెండు బిల్లులకు ఆమోదం తెలిపిన శాసనసభ

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య విధాన పరిషత్(ఏపీవీవీపీ) రద్దు బిల్లు–2023కు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ప్రభుత్వం ప్రత్యేక చట్టం ద్వారా 1986లో ఏపీవీవీపీని ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ప్రభుత్వం సహాయక గ్రాంట్ కింద నిధిని సమకూర్చి పీడీ అకౌంట్ ద్వారా ఈ విభాగాన్ని నిర్వహిస్తోంది. ఈ విభాగంలో 14,490 పడకల సామర్థ్యంతో 246 సీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆస్పత్రులు ఉండగా, 14,658 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కాగా, సంస్థ ప్రారంభం నుంచి స్వయం పాలన కోసం చట్టపరమైన ప్రక్రియ అమలులో ఉన్నప్పటికీ ఉత్పాదక ఆదాయ వనరులు లేకపోవడంతో నిర్వహణపై ప్రభావం పడుతోంది. ఏపీవీవీపీ ఉద్యోగులకు 010 ప్రధాన పద్దు కింద జీతాలు, ఇతర చెల్లింపులు లేకపోవడంతో ఉద్యోగులకు పదవీవిరమణ, ఇతర ప్రయోజనాలను అందజేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ పరిస్థితులను గుర్తించిన సీఎం జగన్ ప్రభుత్వం ఏపీవీవీపీ చట్టాన్ని రద్దు చేసి ప్రభుత్వం పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా 010 ప్రధాన పద్దు కింద జీతాలను తీసుకునే హోదాను కల్పించింది. దీంతో వేతనాలు, సెలవుల రెగ్యులరైజేషన్‌లో జాప్యంతోపాటు ఇతర అంశాల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు తెరపడనుంది. అదేవిధంగా ఏపీ ప్రత్యేక భద్రతా దళం –2023, ఏపీ ఆధార్ బిల్లు–2023లను హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సభలో ప్రవేశపెట్టగా, సభ ఆమోదం తెలిపింది. ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలు, కార్యక్రమాలకు ఆధార్‌ను అనుసంధానం చేసేలా ఏపీ ప్రభుత్వ ఆధార్ (లక్షిత ఆర్థికపరమైన, ఇతర సబ్సిడీలు, ప్రయోజనాలు, సేవలందించడం) చట్టం–2016ను సవరిస్తూ ఏపీ ప్రభుత్వ ఆధార్–2023 బిల్లును ప్రవేశపెట్టారు.

బాబుకు భంగపాటు

స్కిల్ స్కామ్ కేసు కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ

ఏసీబీ కోర్టు ఉత్తర్వుల్లో సైతం జోక్యం సాధ్యంకాదని స్పష్టీకరణ

సీఐడీ దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందన్న న్యాయస్థానం

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు హైకోర్టులో భంగపాటు ఎదురైంది. వందల కోట్ల రూపాయల ప్రజాధనం లూటీకి సంబంధించి ఆయనపై సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేసేందుకు హైకోర్టు నిరాకరించింది. తనపై సీఐడీ కేసును కొట్టేయడంతో పాటు, సీఐడీ కేసు ఆధారంగా ఏసీబీ కోర్టు తనకు రిమాండ్ విధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సైతం రద్దు చేయాలన్న చంద్రబాబు అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. స్కిల్ కుంభకోణంలో సీఐడీ దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉందని చెప్పింది. హైకోర్టు తన స్వతఃసిద్ధ అధికారాలను ఉపయోగించి కేసును కొట్టేయాలని అభ్యర్థిస్తూ, నేర విచారణ ప్రక్రియ స్మృతి (సీఆర్‌పీసీ)లోని సెక్షన్ 482 కింద దాఖలు చేసిన పిటిషన్‌లో 'మినీ ట్రయల్' నిర్వహించడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. 'దర్యాప్తు సంస్థ 2021లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత 140 మంది సాక్షులను విచారించింది. 4 వేలకు పైగా డాక్యుమెంట్లను సేకరించింది. నిగూఢమైన ఈ వ్యవహారంలో వృత్తి సంబంధ ప్రావీణ్యం కలిగిన నిపుణులే దర్యాప్తు చేపట్టాల్సి ఉంది. దర్యాప్తు తుది దశకు చేరేందుకు వెసులుబాటు కల్పించే సీఐడీ కేసు విషయంలోనూ, తదనుగుణంగా ఏసీబీ కోర్టు జారీ చేసిన రిమాండ్ ఉత్తర్వుల విషయంలో ప్రస్తుతం ఏ రకంగానూ జోక్యం చేసుకోలేం' అని హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం 68 పేజీల తీర్పు వెలువరించారు.



అభ్యంతరం లేదన్నాకే న్యాయమూర్తి విచారణ

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ చంద్రబాబు ఈ నెల 12న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే సీఐడీ నమోదు చేసిన కేసు ఆధారంగా తనకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను సైతం కొట్టేయాలని కోర్టును అభ్యర్థించారు. ఈ వ్యాజ్యం తేలేంత వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంపై ఏసీబీ కోర్టులో జరుగుతున్న విచారణను నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని ఆయన కోర్టును కోరారు. చంద్రబాబు దాఖలు చేసిన ఈ క్వాష్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి రోజంతా విచారణ జరిపారు. విచారణకు ముందే ఆయన గతంలో తాను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా చంద్రబాబుకు వ్యతిరేకంగా వాదనలు వినిపించానని, ఇప్పుడు ఆయన కేసును విచారించడంపై మీకేమైనా అభ్యంతరం ఉందా? అంటూ అటు సీఐడీ, ఇటు చంద్రబాబు తరపు న్యాయవాదులను ప్రశ్నించారు. ఇరుపక్షాలు కూడా ఎలాంటి అభ్యంతరం లేదన్న తర్వాతే ఆయన విచారణ కొనసాగించారు. అటు చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, సిద్దార్థ లూథ్రా, ఇటు సీఐడీ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, రంజిత్ కుమార్, అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు విన్నారు. సెక్షన్ 17–ఏ పై చంద్రబాబు న్యాయవాదులు గట్టిగా వాదనలు వినిపించారు. సుదీర్ఘ వాదనలు విన్న నేపథ్యంలో న్యాయమూర్తి తాను మధ్యంతర ఉత్తర్వులు కాకుండా ప్రధాన వ్యాజ్యంలోనే ఉత్తర్వులు జారీ చేస్తానంటూ తీర్పును రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు తీర్పును వెలువరించారు. చంద్రబాబు పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు తీర్పు చెప్పారు.

దర్యాప్తునకు సమయం ఇవ్వాలి

'భజన్‌లాల్ కేసు మొదలు నిహారికా కేసు వరకు సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద హైకోర్టు తన పరిధిని ఉపయోగించే విషయంలో సుప్రీంకోర్టు నిర్దిష్టమైన పలు కొలమానాలను నిర్దేశించింది. సుప్రీంకోర్టు నిర్దేశించిన ఆ కొలమానాలేవీ కూడా ఈ కేసులో ఇప్పుడు జోక్యం చేసుకునేందుకు అనుమతించడం లేదు. ప్రస్తుత కేసులో సీఐడీ చంద్రబాబును 2023 సెప్టెంబర్ 7న 37వ నిందితునిగా చూపింది. 2023 సెప్టెంబర్ 9న ఆయన్ను అరెస్ట్ చేసింది. కేసును కొట్టేయాలంటూ చంద్రబాబు 2023 సెప్టెంబర్ 12న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే రీతిలో మరిదాస్ కేసులోనూ జరిగింది. మరిదాస్‌పై 2021 డిసెంబర్ 9న ఎఫ్ఐఆర్ నమోదైంది. 2021 డిసెంబర్ 10న కేసు కొట్టేయాలంటూ మరిదాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. 2021 డిసెంబర్ 14న మద్రాసు హైకోర్టు మరిదాస్‌పై కేసు కొట్టేసింది. మద్రాసు హైకోర్టు తీర్పును ఆ తర్వాత సుప్రీంకోర్టు రద్దు చేసింది. హైకోర్టు సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద తనకున్న అధికారాన్ని ఉపయోగించే ముందు ఏం చేయాలో సుప్రీంకోర్టు ఆ కేసులో చాలా స్పష్టంగా చెప్పింది. దర్యాప్తు సంస్థకు దర్యాప్తు చేసేందుకు తగిన సమయం ఇవ్వకుండా కేసు కొట్టేయడాన్ని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. దర్యాప్తు చేసేందుకు దర్యాప్తు సంస్థకు సహేతుక సమయం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆ తీర్పులో చాలా స్పష్టంగా చెప్పింది' అని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

ఆర్థిక నేరాల విషయంలో భిన్న దృక్పథం

'వాస్తవానికి లలిత కుమారి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం విచారణకు స్వీకరించతగ్గ కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందే. సీఆర్‌పీసీ సెక్షన్ 154కు అనుగుణంగా ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడం తప్పనిసరి. ఈ కేసులో రికార్డుల్లో ఉన్న ఆధారాలను పరిశీలిస్తే అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్)లో సెక్షన్ 17–ఏను చేర్చడానికి ముందే ప్రాథమిక విచారణ జరిగింది. కేసు నమోదుకు కారణమైన ఫిర్యాదు ఆధారంగా ఆ విచారణ జరిగింది. తీవ్రమైన ఆర్థిక నేరాలకు సంబంధించి దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నప్పుడు న్యాయస్థానాల దృక్పథం భిన్నంగా ఉండాలి. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే చట్టం ముఖ్య ఉద్దేశం ఏమిటన్న దాన్ని కూడా న్యాయస్థానాలు పరిగణనలోకి తీసుకోవాలి' అని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించే వారి కోసమే సెక్షన్ 17–ఏ

చిత్తశుద్ధితో, సదుద్దేశంతో అధికారిక బాధ్యతలను, విధులను నిర్వర్తించే పబ్లిక్ సర్వెంట్‌లను కాపాడేందుకే అవినీతి నిరోధక చట్టంలో సెక్షన్ 17-ఏను చేర్చారు. శాసనసభకర్తల ఉద్దేశం కూడా ఇదే. అయితే పబ్లిక్ సర్వెంట్ చర్యలు నేరపూరితంగా ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు, ఆ చర్యలు నేరమైనప్పుడు వాటిపై విచారణ జరిపేందుకు పీసీ యాక్ట్‌లోని సెక్షన్ 17-ఏ కింద ముందస్తు అనుమతి అవసరం లేదు. నిధుల దుర్వినియోగం, తప్పుడు అకౌంట్లు సృష్టించడం, మోసం, నేరపూరిత విశ్వాస ఘాతుకం, లంచాలు తీసుకోవడం వంటివి సెక్షన్ 17-ఏ పరిధిలోకి రావు. ప్రస్తుత కేసులో చంద్రబాబు నిధుల చెల్లింపు విషయంలో తీసుకున్న నిర్ణయం లేదా చేసిన సిఫారసు, ఆయన చేసిన నిధుల దుర్వినియోగం.. అధికారిక విధులు, బాధ్యతల కిందకు రావు. అందువల్ల ఆ నేరాలపై దర్యాప్తు చేసేందుకు కాంపిటెంట్ అథారిటీ నుంచి ముందస్తు అనుమతి అవసరం లేదు. 2018 జూలై 26కు ముందు జరిగిన అన్ని కేసులకు సెక్షన్ 17-ఏ వర్తించదు. పబ్లిక్ సర్వెంట్ తన అధికారిక విధులను నిర్వర్తిస్తూ నేరానికి పాల్పడినప్పుడు మాత్రమే అది వర్తిస్తుంది. అధికార విధుల్లో భాగం కాకుండా నేరానికి పాల్పడితే సెక్షన్ 17-ఏ వర్తించదు' అని న్యాయమూర్తి తన తీర్పులో వివరించారు.

చంద్రబాబు తదితరుల కుట్రపూరిత వ్యవహారం

- న్యాయమూర్తి తన తీర్పులో చంద్రబాబుపై ఉన్న ఆరోపణలను సైతం స్పష్టంగా వివరించారు. 'చంద్రబాబు, ఇతర నిందితులు కలిసి కుట్రపూరితంగా ప్రజా ఖజానాకు సంబంధించిన నిధులను దుర్వినియోగం చేశారు. రూ.110 కోట్ల నుంచి రూ.130 కోట్లతో మాత్రమే అమలు చేసే ఓ ప్రాజెక్టును రూ.3,300 కోట్లుగా మోసపూరితంగా చూపారు. రూ.371 కోట్ల విలువైన వర్క్ ఆర్డర్‌ను నామినేషన్ ప్రాతిపదికన ఇచ్చేశారు.
- ఇందులో కనీసం రూ.241 కోట్ల మేర నిధుల దుర్వినియోగం జరిగింది. చంద్రబాబు, ఇతర నిందితులు కలిసి కుట్రపూరితంగా మంత్రి మండలి ఆమోదం లేకుండానే ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌ఎస్‌డీసీ)ను ఏర్పాటు చేశారు.
- చంద్రబాబు నాయుడు రూ.3,300 కోట్ల ప్రాజెక్టు వ్యయంలో సీమెన్స్, డిజైన్‌టెక్ సంస్థలు 90 శాతం ఖర్చును భరిస్తాయని, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.371 కోట్లు (ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం) చెల్లిస్తే సరిపోతుందని మంత్రులకు చెప్పి, ఆ మొత్తాన్ని ఆ సంస్థలకు విడుదల చేయించేందుకు అనుమతి పొందారు.
- మంత్రి మండలి తీర్మానం, జీవో ఎమ్మెస్ నెంబర్ 4 ప్రకారం సాంకేతిక సాయం అందిస్తున్న సీమెన్స్, డిజైన్‌టెక్‌ల నుంచి ఆ 90 శాతం గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా వస్తుందని పేర్కొన్నారు. కొన్ని వారాల తర్వాత సీమెన్స్ అప్పటి ఎండీ, ఈ కేసులో 6 నిందితుడు ఆ మొత్తాన్ని గ్రాంట్ ఇన్ కైండ్‌గా చెబుతూ.. చంద్రబాబును, ఆర్థిక శాఖ కార్యదర్శిని ప్రభుత్వ వాటా కింద ఇవ్వాల్సిన 10 శాతం మొత్తాన్ని విడుదల చేయాలని కోరారు.
- జీవో ఎమ్మెస్ 4లో నియమ నిబంధనలు చాలా స్పష్టంగా ఉన్నాయి. అయితే వాటిని ఉద్దేశ పూర్వకంగా పక్కన పెట్టి ముసాయిదా ఒప్పందానికి ఆమోద ముద్ర వేశారు. ఈ ముసాయిదా ఒప్పందాన్ని సీమెన్స్, డిజైన్‌టెక్‌కు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టే రీతిలో తయారు చేశారు. రూ.371 కోట్లను ముందునే ఆ కంపెనీలకు ఇచ్చేశారు.
- కేంద్ర దర్యాప్తు సంస్థలైన డీజీజీ ఎస్ఐటీ ఆఫీస్ పూణే, ఆదాయపు పన్ను శాఖ, సీమెన్స్ అంతర్గత విచారణ, ఏపీఎస్ఎస్‌డీసీ చేపట్టిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో రూ.241 కోట్లను బోగస్ ఇన్వాయిస్‌ల ద్వారా, షెల్ కంపెనీల ద్వారా దుర్వినియోగం చేసినట్లు తేలింది. చంద్రబాబు పర్సనల్ సెక్రటరీగా పని చేసిన పెండ్యాల శ్రీనివాస అనే వ్యక్తికి ఆదాయపు పన్ను శాఖ సీఆర్‌పీసీ సెక్షన్ 160 కింద నోటీసు ఇచ్చింది. ఆ వ్యక్తి అమెరికా పారిపోయారు.
- సీమెన్స్ ఇండియా యాజమాన్యం ఈ కేసులో 6వ నిందితుడితో తమ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని చెప్పింది. గ్రాంట్ ఆన్ ఎయిడ్ కింద 90% ఇచ్చేలా తాము ఎలాంటి స్కీంను చేపట్టలేదని కూడా సీమెన్స్ స్పష్టం చేసింది. రికార్డును పరిశీలిస్తే ఆడిట్ జరిగినట్లు స్పష్టమవుతోంది. ఆడిట్ నివేదికను పరిశీలిస్తే, రూ.241.78 కోట్ల మేర నిధులను మళ్లించినట్లు తెలుస్తుంది. ఈ మొత్తంతో పాటు షెల్ కంపెనీల ద్వారా మరో షెల్ కంపెనీ అయిన ఏసీఐకి చెల్లింపులు కూడా చేశారు' అని న్యాయమూర్తి తన తీర్పులో ప్రముఖంగా ప్రస్తావించారు.

సీఐడీ కస్టడీకి చంద్రబాబు

రెండు రోజుల పాటు విచారించేందుకు ఏసీబీ కోర్టు అనుమతి

థర్డ్ డిగ్రీ పద్ధతులు ప్రయోగించరాదు

24 సాయంత్రం 5 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరు పరచండి

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును విచారించేందుకు సీఐడీకి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం అనుమతినిచ్చింది. ఐదు రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని సీఐడీ కోరగా, ఏసీబీ కోర్టు మాత్రం రెండు రోజుల కస్టడీకి ఇచ్చింది. సమయాభావం, ఇతరత్రా కారణాల వల్ల చంద్రబాబును రాజమండ్రి సెంట్రల్ జైలులోనే విచారిస్తామని సీఐడీ.. ఏసీబీ కోర్టుకు తెలిపింది. కోర్టు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. 23, 24వ తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే చంద్రబాబును విచారించాలని సీఐడీకి కోర్టు స్పష్టం చేసింది. ప్రతి గంటకు ఐదు నిమిషాల చొప్పున బ్రేక్ ఇవ్వాలంది. బ్రేక్ సమయంలో చంద్రబాబు తన న్యాయవాదితో మాట్లాడవచ్చని తెలిపింది. పోలీసు కస్టడీ సమయంలో విచారణ కనిపించేంత దూరంలో చంద్రబాబు న్యాయవాదిని అనుమతించాలని సీఐడీకి స్పష్టం చేసింది. పోలీసు కస్టడీలో ఏ విధంగానూ జోక్యం చేసుకోరాదని, సుప్రీంకోర్టు నిర్దేశించిన విధంగానే సాయం అందించాలని చంద్రబాబు న్యాయవాదిని ఆదేశించింది. విచారణ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేయాలని, ప్రక్రియను మొత్తం రహస్యంగా ఉంచి, సీల్డ్ కవర్‌లో తమ ముందుంచాలంది. మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు భోజన విరామ సమయం ఇవ్వాలంది. చంద్రబాబు వయస్సు, ఆరోగ్యం దృష్ట్యా ఆయనకు అవసరమైన వైద్య, ఇతర సౌకర్యాలు కల్పించాలని సీఐడీని ఆదేశించింది. పోలీసు కస్టడీకి ముందు, తర్వాత చంద్రబాబుకు వైద్య పరీక్షలు నిర్వహించాలంది. విచారణ సందర్భంగా చంద్రబాబుపై ఎలాంటి థర్డ్ డిగ్రీ పద్ధతులు గానీ, కఠిన చర్యలు గానీ చేపట్టడానికి వీల్లేదని ఆదేశించింది.

విచారణ ముగిశాక కోర్టుకు హాజరు పరచాలి

24న విచారణ ముగిసిన తర్వాత చంద్రబాబును సాయంత్రం 5 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ ముందు హాజరు పరచాలని ఏసీబీ కోర్టు చెప్పింది. ఇద్దరు మధ్యవర్తులైన అధికారులు, సీఐడీకి చెందిన వీడియోగ్రాఫర్‌ను.. వారి పేర్లు, ఇతర వివరాలు నమోదు చేసుకున్న తర్వాతే లోపలికి అనుమతించాలని జైలు అధికారులను ఆదేశించింది. చంద్రబాబు పోలీసు కస్టడీకి తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పింది. కోర్టు సమర్పించిన జాబితాలోని అధికారులను, అలాగే కోర్టుకు సమర్పించిన జాబితాలోని చంద్రబాబు న్యాయవాదుల్లో ఒకరిని అనుమతించాలని జైలు అధికారులను ఆదేశించింది. ఇదిలా ఉండగా కోర్టుకు చంద్రబాబు న్యాయవాదులు సమర్పించిన పేర్లలో న్యాయవాదులు దమ్మాలపాటి శ్రీనివాస్, గింజుపల్లి సుబ్బారావు, మెండా లక్ష్మీనారాయణ, టి.విష్ణు తేజ, డి.రాంబాబు, సువ్వారి శ్రీనివాస్, పారా కిషోర్ ఉన్నారు.

చంద్రబాబు పాత్రపై ప్రాథమిక ఆధారాలున్నాయి

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి చంద్రబాబు పాత్రపై కీలక ఆధారాలున్నాయని, వాటిని ఆయన ముందుంచి మరిన్ని వివరాలు రాబట్టాల్సిన అవసరం ఉందని, అందు కోసం ఆయన్ను ఐదు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ.. ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్ రెడ్డి, స్పెషల్ పీపీ యడవల్లి నాగ వివేకానంద, హైకోర్టు అదనపు పీపీ ఎస్.దుష్యంత్‌రెడ్డి సుదీర్ఘ వాదనలు వినిపించారు. చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్, దమ్మాలపాటి శ్రీనివాస్‌లు వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ఏసీబీ కోర్టు, చంద్రబాబును పోలీసు కస్టడీకి అప్పగించేందుకు కారణాలు ఉన్నాయా? లేదా? అన్న ప్రశ్నకు కోర్టు తన ఉత్తర్వుల్లో సమాధానం ఇచ్చింది. సీఐడీ తమ ముందుంచిన సాక్ష్యాధారాలను బట్టి స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు పాత్ర ఉందనేందుకు ప్రాథమిక ఆధారాలున్నాయని ఏసీబీ కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన సాంకేతిక సాయం అందజేసిన కంపెనీలకు చెల్లింపుల తాలుకు నోట్ ఫైళ్లు, ఆయా కంపెనీలతో జరిపిన లావాదేవీలు, చర్చలు తదితరాలకు సంబంధించిన సమాచారం చంద్రబాబుకు మాత్రమే తెలిసిన నేపథ్యంలో ఆయన్ను పోలీసు కస్టడీకి ఇవ్వడం సముచితమని తెలిపింది. ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ, చంద్రబాబును రెండు రోజుల పాటు సీఐడీ కస్టడీకి ఇస్తున్నట్లు న్యాయస్థానం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

చంద్రబాబు రిమాండ్ 24 వరకు పొడిగింపు

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న మాజీ సీఎం చంద్రబాబు జ్యుడీషియల్ రిమాండ్‌ను ఏసీబీ కోర్టు రెండు రోజుల పాటు పొడిగించింది. ఈ నెల 24వతేదీ వరకు ఆయన రిమాండ్‌ను పొడిగిస్తూ ఏసీబీ ప్రత్యేక కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అంతకు ముందు ఉదయం 11.10 గంటల సమయంలో చంద్రబాబును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీబీ కోర్టు ముందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా చంద్రబాబుతో మాట్లాడిన న్యాయమూర్తి జైలులో పరిస్థితుల గురించి వాకబు చేశారు. ఆయనకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఏమైనా ఫిర్యాదులు ఉంటే చెప్పాలని సూచించారు. ఆహారం విషయంలో ఫిర్యాదులు ఉంటే చెప్పొచ్చని పేర్కొన్నారు. చంద్రబాబుకు కల్పిస్తున్న భద్రతకు సంబంధించిన వివరాలను లిఖితపూర్వకంగా తమ ముందుంచాలని జైలు అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. తనది 45 ఏళ్ల రాజకీయ జీవితం అని, తనను అక్రమంగా ఈ కేసులో ఇరికించారని చంద్రబాబు న్యాయమూర్తికి నివేదించారు. తాను మాజీ ముఖ్యమంత్రినని, తనను జైలులో ఉంచడం ద్వారా మానసిక క్షోభకు గురి చేస్తున్నారని వాపోయారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ మాజీ ముఖ్యమంత్రి అయినా, సామాన్యుడైనా చట్టం ముందు ఒకటేనని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడే నడుచుకోవాల్సి ఉంటుందని, తాము కూడా చట్టానికి లోబడే విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. మీపై ఉన్నవి ఆరోపణలు మాత్రమేనని, దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదన్నారు. దర్యాప్తు పూర్తై చార్జిషీట్ దాఖలు చేసిన తరువాత ట్రయల్ మొదలవుతుందని, నేరం చేశారో లేదో అందులో తేలుతుందన్నారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉంచడాన్ని శిక్షగా భావించరాదన్నారు. దర్యాప్తు జరుగుతున్నప్పుడు నిందితులు బయట ఉంటే దానికి ఆటంకం కలుగుతుందని విచారణ సంస్థ ఆందోళన వ్యక్తం చేసినప్పుడు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపుతామని చెప్పారు. జ్యుడీషియల్ రిమాండ్ అంటే కోర్టు సంరక్షణలో ఉన్నట్లేనని తెలిపారు. కోర్టు ఆదేశాలను సానుకూల దృక్పథంతో, హుందాగా చూడాలన్నారు. ఇరుపక్షాలు చెప్పిన అన్ని విషయాలను పరిగణలోకి తీసుకున్న తరువాతే కోర్టు ఓ నిర్ణయానికి వస్తుందన్నారు.

నేటి నుంచి చంద్రబాబు విచారణ

- రాజమహేంద్రవరం జైలులోనే విచారించనున్న సీఐడీ
- ముగ్గురు డీఎస్పీల నేతృత్వంలో ప్రత్యేక బృందం
- కీలక ఆధారాలు రాబట్టేలా ప్రశ్నావళి
- న్యాయస్థానం మార్గదర్శకాల మేరకు విచారణ

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణం కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడును విచారించేందుకు సీఐడీ సన్నద్ధమవుతోంది. చంద్రబాబు అవినీతి బండారాన్ని జాతీయస్థాయిలో బట్టబయలు చేసిన ఈ కేసుపై దేశమంతటా ఆసక్తి నెలకొంది. ఎందుకంటే సీఐడీతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), జీఎస్టీ తదితర విభాగాలు కూడా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ముసుగులో భారీగా ప్రజాధనాన్ని దోపిడీ చేశారని నిర్ధారించాయి. సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ కంపెనీ ముసుగులో రూ.3,300 కోట్ల నకిలీ ప్రాజెక్టును చూపిస్తూ రూ.371 కోట్లు కొల్లగొట్టిన కుంభకోణంలో మరిన్ని వాస్తవాలను రాబట్టేందుకు సీఐడీ శాస్త్రీయంగా సంసిద్ధమవుతోంది. ఈ కేసులో చంద్రబాబును రెండు రోజుల పాటు సీఐడీ కస్టడీకి అనుమతిస్తూ విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం ఆదేశించింది. దాంతో న్యాయస్థానం మార్గదర్శకాలను పాటిస్తూ శని, ఆదివారాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులోనే చంద్రబాబును సీఐడీ విచారించనుంది. అందుకోసం ముగ్గురు డీఎస్పీల నేతృత్వంలో నలుగురు సీఐలు, సహాయక సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం శుక్రవారం రాత్రే రాజమహేంద్రవరం చేరుకుంది. ఈ బృందంలో మొత్తం 12 మంది ఉన్నారు.

సీఐడీ వాదనకు కొండంత బలం

స్కిల్ కుంభకోణం కేసులో చంద్రబాబు కస్టడీ కోసం న్యాయస్థానం అనుమతి పొందడం ద్వారా సీఐడీ మరో ముందడుగు వేసింది. ఇప్పటికే ఈ కుంభకోణంలో నిధులను అక్రమంగా మళ్లించిన అవినీతి నెట్‌వర్క్‌ను సీఐడీ ఛేదించింది. ఈ ప్రాజెక్టుతో సంబంధం లేదని జర్మనీలోని సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయం న్యాయస్థానంలో వాంగ్మూలం ఇవ్వడంతో ఈ కేసుకు మరింత బలం చేకూరింది. దాంతో ఏ–1 చంద్రబాబుతో పాటు 8 మందిని సీఐడీ ఇప్పటివరకు అరెస్టు చేసింది. చంద్రబాబు అరెస్టు సరైనదేనంటూ ఏసీబీ న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడం, తాజాగా రిమాండ్‌ను పొడిగించడం ద్వారా సరైన రీతిలోనే సీఐడీ కేసు దర్యాప్తు చేస్తోందని న్యాయస్థానం అభిప్రాయపడిందన్న విషయం వెల్లడైంది. తనపై తప్పుడు కేసు పెట్టారని, ఆ కేసునే కొట్టేయాలని చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కూడా హైకోర్టు తోసిపుచ్చింది. దాంతో విచారణ నుంచి తప్పించుకునేందుకు చంద్రబాబు వేసిన ఎత్తుగడ బెడిసికొట్టింది. సీఐడీ వాదనకు మరింత బలం చేకూరింది. ఈ కేసుపై టీడీపీ చేస్తున్న రాజకీయ రాద్ధాంతంతో నిమిత్తం లేకుండా సీఐడీ నిబంధనల ప్రకారం దర్యాప్తును కొనసాగిస్తోంది.

కీలక దశలో దర్యాప్తు

ఇప్పటికే ఈ కేసులో కీలక ఆధారాలు సేకరించిన సీఐడీ.. చంద్రబాబును రెండు రోజులపాటు కస్టడీలో విచారించడం ద్వారా మరిన్ని కీలక ఆధారాలను రాబట్టాలని భావిస్తోంది. ఈ నెల 9న చంద్రబాబును అరెస్ట్ చేసి సిట్ కార్యాలయంలో విచారించిన సమయంలో ఆయన తనకు ఏమీ తెలియదని, గుర్తు లేదని, మరచిపోయాను అంటూ ముక్తసరిగా సమాధానాలిచ్చి తప్పించుకునేందుకు యత్నించారు. ఆ అనుభవం దృష్ట్యా ఈసారి చంద్రబాబును అడగాల్సిన ప్రశ్నలపై సీఐడీ అధికారులు తగిన కసరత్తు చేసినట్టు తెలుస్తోంది.

ముగ్గురు డీఎస్పీలతో శాస్త్రీయమైన రీతిలో రూపొందించిన ప్రశ్నావళి నుంచి ఒక్కొక్కటిగా ప్రశ్నలు సంధించనుంది. ప్రధానంగా సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ కంపెనీ పేరిట జీవో ఎలా ఇచ్చారు? ఒప్పందం ఎలా కుదుర్చుకున్నారు? జీవోకు విరుద్ధంగా ఒప్పందం ఉండటం ఏమిటి? రూ.3,300 కోట్ల ప్రాజెక్టుగా ఎలా నిర్ణయించారు? ప్రైవేటు వ్యక్తి గంటా సుబ్బారావును ఏకంగా నాలుగు కీలకస్థానాల్లో ఎందుకు నియమించారు? ఆర్థిక శాఖ అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేయమని ఎందుకు ఆదేశించారు? ఏకంగా 13 చోట్ల నోట్‌ఫైళ్లపై సంతకాలు చేసి మరీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేలా అధికారులపై ఎందుకు ఒత్తిడి చేశారు? డిజైన్‌టెక్ కంపెనీకి చేరిన నిధులు వివిధ షెల్ కంపెనీల ద్వారా తరలించడం గురించి మీకు తెలుసా? అక్రమ నిధుల తరలింపులో కీలక పాత్రధారి మనోజ్ పార్థసానితో ఉన్న సంబంధం ఏమిటి? ఆయన మీ పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు రూ.241 కోట్లు ఎందుకు అందించారు? ఆ నిధులను ఆయన మీకు చేర్చారా? సీఐడీ నోటీసులు అందగానే మనోజ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్ ఎందుకు పరారయ్యారు వంటి పలు కోణాల్లో చంద్రబాబును సీఐడీ అధికారులు ప్రశ్నించే అవకాశాలున్నాయని సమాచారం. ఈ కేసులో ప్రధాన సాక్షుల వాంగ్మూలాలను ప్రస్తావిస్తూ చంద్రబాబును అధికారులు ప్రశ్నించనున్నారు. విచారణ తీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ తదుపరి ప్రశ్నలను సంధించనున్నారు.

జైల్లోనే విచారణకు ఏర్పాట్లు

రాజమండ్రి సెంట్రల్ జైల్లోనే చంద్రబాబును విచారించేందుకు జైలు అధికారులు కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం చంద్రబాబు ఉంటున్న స్నేహ బ్లాక్‌లో సీసీ కెమెరాలు ఉన్నందున అక్కడే విచారించాలా లేక వేరే గదిలో విచారించాలా అన్న విషయమై సమాలోచనలు చేస్తున్నారు. భద్రతా చర్యలు కూడా చేపట్టారు. ఇప్పటికే 300 మంది ఆక్టోపస్, ఇతర పోలీసు బలగాలతో జైలు బయట భద్రత కట్టుదిట్టం చేశారు.

క్లుప్తంగా...

ఆదిత్యనాథ్ దాస్ పదవీ కాలం పొడిగింపు



సాక్షి, అమరావతి: ఢిల్లీలోని ఏపీ భవన్ కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా బాధ్యతలు నిర్వహిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆదిత్యనాథ్ దాస్ పదవీ కాలం మరో ఏడాది పాటు ప్రభుత్వం పొడిగించింది. ఈ పదవిలో మరో ఏడాది పాటు ఆయన కొనసాగుతారని సీఎస్ జవహర్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

జ్యుడీషియల్ ప్రివ్యూకు బీచ్ శాండ్ మైనింగ్ టెండర్లు



సాక్షి, అమరావతి: ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ ద్వారా శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో బీచ్ శాండ్ మైనింగ్ కాంట్రాక్టింగ్ ఏజెన్సీ ఖరారు ప్రక్రియలో భాగంగా టెండర్ డాక్యుమెంట్లను జ్యుడీషియల్ ప్రివ్యూకు సమర్పించినట్లు ఏపీఎండీసీ వైస్ చైర్మన్ అండ్ ఎండీ వీజీ వెంకటరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రెండు జిల్లాల పరిధిలో వెయ్యి హెక్టార్లలో బీచ్ శాండ్ మైనింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. జ్యుడీషియల్ ప్రివ్యూ కమిషన్ వెబ్‌సైట్‌లో టెండర్ డాక్యుమెంట్లు అక్టోబర్ 4 వరకు ఉంటాయని, దీనిపై బిడ్డర్లు, సాధారణ ప్రజలు తమ సూచనలు, సలహాలను కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు.

మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు సరికొత్త అధ్యాయం

రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ జె.నివాస్



మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నివాస్

సాక్షి, అమరావతి: ప్రజలకు ఆరోగ్యవంతమైన, సురక్షితమైన, కల్తీలేని ఆహారాన్ని అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకువెళుతోందని రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ నివాస్ అన్నారు. శుక్రవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ టవర్స్ ప్రాంగణంలో మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ను ఆయన పరిశీలించారు. ఈ మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ద్వారా 80 రకాల ఆహార పదార్థాలను పరిశీలించే వీలుందని వివరించారు. ఆహార పదార్థాల్లో కల్తీని పరీక్షించే ప్రక్రియలో ఈ మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ సరికొత్త అధ్యాయమని, అక్కడికక్కడే పరీక్షించి వెంటనే నివేదికను అందచేస్తారని నివాస్ పేర్కొన్నారు. కల్తీలపై వినియోగదారులు, స్కూల్ పిల్లలకు ఈ వాహనాల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ముందుగా నాలుగు జోన్లకు నాలుగు వాహనాలను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో మరో 10 వాహనాలను కొనుగోలు చేస్తామని చెప్పారు.

గిరిజనులకు సత్వర న్యాయమే లక్ష్యం

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్



మాట్లాడుతున్న అనంతనాయక్. చిత్రంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణ, సత్వర న్యాయం అందించే లక్ష్యంతోనే జాతీయ ఎస్టీ కమిషన్ ఏర్పడిందని కమిషన్ సభ్యుడు అనంతనాయక్ అన్నారు. శుక్రవారం జిల్లాలో పర్యటించిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో పలు గిరిజన, ప్రజాసంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యలపై లిఖిత పూర్వక ఫిర్యాదులు సమర్పించాలన్నారు. గిరిజనులు పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ నిజమైన ఫిర్యాదులు వస్తే తప్పకుండా విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివాసీ జేఏసీ, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు రామారావుదొర, నీలకంఠం, శేషాద్రి మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయాన్ని బలోపేతం చేయాలని కోరారు. జీవో నంబరు 3 పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడమే కాకుండా, అల్లూరి జిల్లాను జోన్ వన్‌లోనే కొనసాగించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు.

చంద్రబాబు భజనపరులు కళ్లు తెరవాలి: ఎంపీ రెడ్డెప్ప



సాక్షి, న్యూఢిల్లీ: చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టేసిన నేపథ్యంలో ఆయన భజనపరులు ఇప్పటికైనా కళ్లు తెరవాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ రెడ్డెప్ప హితవు పలికారు. హైకోర్టు తీర్పును రాష్ట్ర ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఎల్లో మీడియా ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలన్నారు. చంద్రబాబుపై ఉన్న కేసుల్లో స్టేలు ఎత్తివేస్తే జీవితకాలం జైలులోనే ఉండాల్సిన పరిస్థితి ఉంటుందని వ్యాఖ్యానించారు.



శుక్రవారం సాయంత్రం గరుడ వాహన సేవలో పాల్గొన్న అశేష భక్త జనవాహిని



ఉదయం మోహినీ అవతారంలో మలయప్ప స్వామి

గరుడ వాహనంపై గోవిందుడు

విశేష అలంకరణలో విశ్వపతి దర్శనం

- రాత్రి 7 గంటలకే గరుడ వాహనం ఊరేగింపు
- ఉదయం మోహినీ అవతారంలో విహారం
- నేడు స్వర్ణ రథోత్సవం

తిరుమల/సాక్షి, తిరుపతి: తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు శుక్రవారం రాత్రి గరుడ వాహనాన్ని అధిరోహించారు. రాత్రి 7 గంటలకు ఆరంభమైన ఈ వాహన సేవ అర్ధరాత్రి వరకు సాగింది. గరుడ వాహనం ముందు భక్త బృందాలు, భజనలు, డప్పు వాయిద్యాలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వాయు గమనంతో పోటీపడే గరుత్మంతుడిని వాహనంగా చేసుకుని విశ్వాన్ని పాలించే జగత్కల్యాణ చక్రవర్తి మలయప్ప దేదీప్యమాన కాంతులతో ఆలయ మాడ వీధుల్లో ఊరేగారు. విశిష్టమైన గరుడ వాహన సేవలో గర్భాలయ మూల మూర్తికి వాడుతున్న మకరకంఠి, లక్ష్మీహారం, సహస్ర నామ కాసులమాల, సుదర్శన చక్ర మాల, మూలవిరాట్‌కు అలంకరించే పురాతనమైన విశేష ఆభరణాలు, శ్రీవిల్లి పుత్తూరు ఆండాళ్ తులసి, పుష్పమాల, చెన్నై నూతన ఛత్రాలను(గొడుగులు) అలంకరించారు. తన నిత్య సేవకుడు గరుత్మంతుడిపై దేవదేవుడు వైభవంగా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు శుక్రవారం ఉదయం స్వామివారు మోహిని అవతారంలో భక్తులకు సాక్షాత్కరించారు. శ్రీవారు మోహినీ రూపంలో దంత పల్లకిపై, పక్కనే వెన్న ముద్ద చేతబట్టిన చిన్నికృష్ణుడితో కలిసి భక్తకోటిని అనుగ్రహించారు. కాగా, తిరుమలలో శనివారం శ్రీవారు స్వర్ణరథంపై సాయంత్రం 4 గంటల నుంచి ఆలయ పురవీధుల్లో ఊరేగనున్నారు. కాగా, శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకుని వాహన సేవలో పాల్గొన్నారు.

టీటీడీ ఏర్పాట్లు భేష్..



వాహన సేవలో పాల్గొన్న జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ దంపతులు, టీటీడీ చైర్మన్ భూమన

బ్రహ్మోత్సవాల్లో అతిముఖ్యమైన గరుడ వాహన సేవను వీక్షించడానికి వచ్చిన భక్తులెవరూ ఇబ్బందులు పడకుండా టీటీడీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2 లక్షల మంది వేచి ఉండేందుకు వీలుగా గ్యాలరీలను నిర్మించింది. గరుడ సేవ దర్శనం కోసం ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లలో వేచి ఉండే భక్తులను సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవింద నిలయం నార్త్ వెస్ట్ గేట్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా గ్యాలరీల్లోకి టీటీడీ సిబ్బంది అనుమతించారు. ఇలా రెండోసారి రీఫిల్లింగ్ చేసి భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. గరుడ వాహన సేవ నేపథ్యంలో వాహనాలపై తిరుమలకు చేరుకునే భక్తులతో ఘాట్ రోడ్డు అత్యంత రద్దీగా కనిపించింది. మధ్యాహ్నం 2 గంటలకే అన్ని గ్యాలరీలూ నిండిపోయాయి. వీరికి ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నప్రసాదాలు, పాలు, బాదం పాలు, కాఫీ, మజ్జిగ, మంచినీరు, గుగ్గిళ్లను టీటీడీ అందిస్తూ వచ్చింది. భక్తుల కోసం ప్రత్యేకంగా వైద్య సిబ్బందిని నియమించింది. గరుడ సేవను తిలకించడానికి 3 లక్షలకు పైగా భక్తులు తిరుమలకు చేరుకున్నట్లు టీటీడీ అంచనా. మరోవైపు భక్తులు అలిపిరి, శ్రీవారిమెట్టు నుంచి పెద్ద ఎత్తున తిరుమలకు పయనమయ్యారు. శ్రీవారిమెట్టు నుంచి తిరుమలకు 2.1 కిలోమీటర్ల దూరమే ఉండటంతో భక్తులు ఈ మార్గం మీదుగా తిరుమలకు చేరుకునేందుకు ఆసక్తి చూపారు. రద్దీ నేపథ్యంలో చిన్న పిల్లలు తప్పిపోకుండా పోలీసులు జియో ట్యాగింగ్ వేశారు. అలాగే, గరుడసేవ నేపథ్యంలో తిరుమల బాలాజీ బస్టాండ్ నుంచి తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రం వరకు వాహన రాకపోకలను టీటీడీ, విజిలెన్స్, పోలీసు అధికారులు నిషేధించారు. ఉదయం నుంచి బాలాజీ బస్టాండ్, లేపాక్షి సర్కిల్, రాం భగీచా, నందకం గెస్ట్‌హౌస్, వెంగమాంబ అన్నదాన సత్రం వరకు వాహనాల అనుమతిని నిషేధించారు. దీంతో భక్తులెవరూ ఇబ్బందులు పడకుండా కొండ మీదకు సాఫీగా చేరుకుని గరుడ సేవను వీక్షించారు.

రాయలసీమ ఎత్తిపోతల తొలిదశకు గ్రీన్‌సిగ్నల్

చెన్నై, రాయలసీమకు అవసరమైన తాగునీటి సరఫరా పనులకు ప్రాధాన్యత

- 2,913 క్యూసెక్కుల సామర్థ్యం చొప్పున ఆరు పంపుల ఏర్పాటు
- రాష్ట్ర జలవనరుల శాఖ ఉత్తర్వులు
- జూన్, జూలై మధ్య 59 టీఎంసీలను తరలించడం ద్వారా చెన్నై, రాయలసీమకు నీటి సరఫరా
- పర్యావరణ అనుమతి వచ్చేలోగా ఈ పనులు పూర్తిచేసే దిశగా చర్యలు

సాక్షి, అమరావతి: రాయలసీమ ఎత్తిపోతల పథకం తొలిదశలో రాయలసీమలోని తీవ్ర దుర్భిక్ష ప్రాంతాలకు తాగునీరు, చెన్నైకి నీటిని సరఫరా చేసేందుకు అవసరమైన పనులను ప్రాధాన్యతగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆరు పంపులను (ఒక్కొక్కటి 2,913 క్యూసెక్కుల సామర్థ్యం) ఏర్పాటుచేసి.. నీటి సమస్య తీవ్రంగా ఉండే జూన్ నుంచి జూలై మధ్య 59 టీఎంసీలు తరలించి నీటి ఎద్దడిని నివారించవచ్చని కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజనీర్ పంపిన ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

శ్రీశైలం రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం సముద్ర మట్టానికి 885 అడుగుల ఎత్తున ఉంటుంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను 841 అడుగుల ఎత్తులో అమర్చారు. శ్రీశైలంలో 880 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో నీరు నిల్వ ఉన్నప్పుడే.. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ప్రస్తుత డిజైన్ మేరకు 44 వేల క్యూసెక్కులు తరలించే అవకాశం ఉంటుంది. ఈ హెడ్ రెగ్యులేటర్ ద్వారా చెన్నైకి 15 టీఎంసీలు, ఎస్సార్బీసీకి 19, తెలుగుగంగకు 29, గాలేరు–నగరికి 38 వెరసి 101 టీఎంసీలు సరఫరా చేయాలి. వర్షాభావ పరిస్థితులవల్ల శ్రీశైలానికి వరద వచ్చే రోజులు ఏయేటికాయేడు తగ్గుతున్నాయి. మరోవైపు.. తెలంగాణ సర్కార్ ఏకపక్షంగా 800 అడుగుల నుంచే నీటిని తోడేస్తుండటం ఫలితంగా శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గిపోతోంది. దీంతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు నీళ్లందడంలేదు.



అనుమతి వచ్చేలోగా తాగునీటి కోసం..


ఇక రాయలసీమ ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతి కోసం ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. అది వచ్చేలోగా చెన్నైకి 15 టీఎంసీలు, రాయలసీమలో దుర్భిక్ష ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే పనులు చేపట్టాలని నిర్ణయించింది. చెన్నైకి నీటిని సరఫరా చేయాలంటే.. తెలుగుగంగ ప్రధాన కాలువపై ఉన్న వెలిగోడు రిజర్వాయర్ (9.5 టీఎంసీలు), సోమశిల (17.33 టీఎంసీలు), కండలేరు 8.4 టీఎంసీలు వెరసి 35.23 టీఎంసీలు కనీసం నిల్వ ఉండాలి. అప్పుడే చెన్నైకి 15 టీఎంసీలను సరఫరా చేయడానికి అవకాశముంటుంది. రాయలసీమలో దుర్భిక్ష ప్రాంతాలకు తాగునీటి కోసం 8.6 టీఎంసీలు వెరసి 58.83 టీఎంసీలు (35.23+15+8.6)అంటే దాదాపు 59 టీఎంసీలను శ్రీశైలం నుంచి తరలించాలని ప్రభుత్వానికి జలవనరుల అధికారులు ప్రతిపాదించారు. పర్యావరణ అనుమతి వచ్చేలోగా రాయలసీమ ఎత్తిపోతలలో తాగునీటి కోసం తరలించడానికి అవసరమైన పనులను చేపట్టడానికి అనుమతివ్వాలన్న అధికారుల ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.

పర్యావరణ అనుమతితోనే పనులు

రాయలసీమ హక్కులను పరిరక్షించడం, చెన్నైకి నీటి సరఫరా చేయడమే లక్ష్యంగా.. శ్రీశైలం రిజర్వాయర్ జలవిస్తరణ ప్రాంతంలో సంగమేశ్వరం వద్ద 800 అడుగుల నుంచే రోజుకు 3 టీఎంసీల చొప్పున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన కుడి ప్రధాన కాలువలోకి ఎత్తిపోసేలా రూ.3,825 కోట్ల వ్యయంతో 2020, మే 5న రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. దీని ద్వారా చెన్నైకి 15 టీఎంసీలు సరఫరా, ప్రాజెక్టుల కింద 9.6 లక్షల ఎకరాలకు నీళ్లందించాలన్నది లక్ష్యం. పర్యావరణ అనుమతి తీసుకోకుండా ఎత్తిపోతలను చేపట్టడంవల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందంటూ ఎన్జీటీ (చెన్నై) బెంచ్‌లో టీడీపీ నేతలు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పాత ప్రాజెక్టుల ఆయకట్టుకు నీళ్లందించడానికే ఈ ఎత్తిపోతల చేపట్టామని.. అదనంగా నీటిని నిల్వచేసేలా రిజర్వాయర్లు నిర్మించడంలేదని.. ఈ నేపథ్యంలో పర్యావరణ అనుమతి తీసుకోవాల్సిన అవసరంలేదని ఎన్జీటీలో ప్రభుత్వం వాదించింది. కానీ.. ఎత్తిపోతల పనులను ఆపేయాలంటూ 2020, మే 20న ఎన్జీటీ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఎన్జీటీ నియమించిన జాయింట్ కమిటీ కూడా ఏపీ ప్రభుత్వ వాదననే బలపరుస్తూ నివేదిక ఇచ్చింది. కానీ, పర్యావరణ అనుమతితోనే పనులు చేపట్టాలని 2020, అక్టోబర్ 29న ఎన్జీటీ నిర్దేశించింది. దాంతో పర్యావరణ అనుమతి కోసం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖతో జలవనరుల అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

ఢిల్లీలో దాగుడుమూతలు!

- అరెస్టు భయంతో 10 రోజులుగా హస్తినలోనే లోకేశ్
- జాతీయ నేతలను కలిసేందుకు ప్రయత్నిస్తున్నా కానరాని స్పందన
- మరో మూడు రోజులు దేశ రాజధానిలోనే పచార్లు
- అయోమయంలో టీడీపీ క్యాడర్



సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టుతో బెంబేలెత్తుతున్న ఆయన తనయుడు నారా లోకేశ్ రాష్ట్రానికి వచ్చేందుకు జంకుతున్నారు. కుంభకోణాల్లో తనను అరెస్టు చేస్తారనే భయంతో పది రోజుల క్రితం ఢిల్లీ వచ్చిన చినబాబు పరిస్థితి ఎక్కే గడప దిగే గడపగా తయారైంది. ఒకవైపు అసెంబ్లీ సమావేశాల్లో ఎండగడుతున్న అధికార పక్షం, మరోవైపు చంద్రబాబు క్వాష్ పిటిషన్ తిరస్కృతి పరిణామాలతో టీడీపీ శ్రేణులు ఉక్కిరిబిక్కిరి అవుతుండగా లోకేశ్ మాత్రం ఢిల్లీని వదలడం లేదు. క్యాడర్‌కు మనోధైర్యం ఇచ్చేందుకు రాష్ట్రానికి రావాలని ఒత్తిళ్లు వస్తున్నా లోకేశ్ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో పార్టీ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నాయి.

పట్టించుకోని పార్టీలు..

చంద్రబాబు అరెస్టు, అనంతరం పరిణామాలను జాతీయ మీడియా, నేతలకు ఢిల్లీ వేదికగా చాటిచెబుతానంటూ ప్రత్యేక విమానంలో ఈనెల 14న ఢిల్లీ చేరుకున్న లోకేశ్ తొలి రెండు రోజులు కొంత హడావుడి చేసినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఒకట్రెండు జాతీయ ఛానళ్లు మినహా మీడియా లోకేశ్‌ను పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో నీరుగారిపోయిన చినబాబు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ఎంపీలతో సమావేశం అంటూ మరో నాలుగు రోజులు వెళ్లదీశారు. చంద్రబాబుకు మద్దతుగా జాతీయ పార్టీల మద్దతు కూడగట్టే యత్నాలు బెడిసికొట్టాయి. ఒకరిద్దరూ జాతీయ పార్టీ నేతలతో తమ ఎంపీలు ఎలాగోలా సమావేశాలను నిర్వహించినా వారు వేసిన ప్రశ్నలతో లోకేశ్ ఉక్కిరిబిక్కిరి అయినట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. వ్యవస్థల మేనేజ్‌మెంట్‌లో దిట్టగా పేరుపొందిన చంద్రబాబు ఎప్పుడో జైలు కెళ్లాల్సిందన్న వ్యాఖ్యలు జాతీయ పార్టీ నేతల నుంచి వినిపించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్లమెంట్ సమావేశాలు ముగియడంతో తాము నియోజకవర్గాల్లో పర్యటించాల్సి ఉందని ఎంపీలు మొత్తుకున్నా లోకేశ్ మాత్రం సోమవారం వరకూ ఉండాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. తాజాగా హైకోర్టులో చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను కొట్టివేయడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఒకవేళ లోకేశ్ ఢిల్లీని వీడినా నేరుగా హైదరాబాద్‌కు వెళ్లే అవకాశాలే ఎక్కువని, ఏపీకి వెళ్లడం ఇబ్బందేనని ఆ పార్టీ నేతలే పేర్కొంటున్నారు.

జీడీపీ వృద్ధిలో ఎంఎస్ఎంఈలది కీలకపాత్ర

- పీఎం గతి శక్తి పథకంతో ఇవి మరింత బలోపేతం
- ఎంఎస్ఎంఈ జాయింట్ సెక్రటరీ మెర్సీ ఇపావో



మాట్లాడుతున్న మెర్సీ ఇపావో

సాక్షి, విశాఖపట్నం: జీడీపీలో ఎంఎస్ఎంఈలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కేంద్ర ఎంఎస్ఎంఈ జాయింట్ సెక్రటరీ మెర్సీ ఇపావో తెలిపారు. విశాఖలో ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ)షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్‌పై శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆమె మాట్లాడారు. ఎంఎస్ఎంఈలు దేశ ఆర్థిక రంగ వృద్ధికి దోహదపడటమే కాక.. ఉపాధికి ముఖ్య వనరులుగా ఉన్నాయని, గ్రామీణ, వెనకబడిన ప్రాంతాల్లో ఆర్థిక, ప్రాంతీయ అసమానతలను కూడా తగ్గిస్తున్నాయని చెప్పారు. ప్రధానమంత్రి గతి శక్తి పథకంతో ఇవి మరింత బలోపేతమవుతున్నాయని వెల్లడించారు. ఎంఎస్ఎంఈ రంగాన్ని మరింత విస్తరించడానికి తమ మంత్రిత్వ శాఖ పలు కార్యక్రమాలు చేపడుతోందని, ఇందులో భాగంగా రుణ పరిధి పెంపు, ఆధునికీకరణకు ప్రోత్సాహం, సాంకేతిక సాయం, మౌలిక సదుపాయాల వృద్ధి, నైపుణ్యాల పెంపుదల, శిక్షణ అవకాశాల మెరుగుదల, మార్కెట్ల విస్తరణ, ఎగుమతుల ధ్రువీకరణ ప్రక్రియను మరింత సరళతరం చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఏపీ మారిటైం బోర్డు డెప్యూటీ సీఈవో లెఫ్టినెంట్ కమాండర్ బీఎం రవీంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం నుంచి ఎగుమతుల ప్రోత్సాహానికి, మౌలిక సదుపాయాల విస్తృతానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఎగుమతులు, దిగుమతులు పెరగడంలో మారిటైం బోర్డు తోడ్పడుతోందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న నాలుగు పోర్టుల ద్వారా కొత్తగా పలు పరిశ్రమలు వస్తాయని, ఫలితంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ లిమిటెడ్ ఎండీ జి.సాంబశివరావు, ఫ్యాప్సీ అధ్యక్షుడు కరుణేంద్ర ఎస్ జాస్తి తదితరులు ప్రసంగించారు. ఫ్యాప్సీ ఉపాధ్యక్షుడు కంకటాల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

యర్రబాలెం 'వైఎస్సార్' హెల్త్ సెంటర్‌లో ఎన్క్వాస్ బృందం

ఆస్పత్రిలోని 12 రకాల వైద్య ఆరోగ్య సౌకర్యాల పరిశీలన



ఎన్క్వాస్ టీమ్‌తో డీఎంహెచ్‌వో, డీపీఎంవో, డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ సిబ్బంది

మంగళగిరి: గుంటూరు జిల్లా యర్రబాలెంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఢిల్లీ నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్క్వాస్) బృందం శుక్రవారం సందర్శించింది. బృందం ప్రతినిధులు డాక్టర్ పీఎస్ వినోద్‌కుమార్, డాక్టర్ మొయిన్‌ఖాన్‌ల బృందం డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.శ్రవణ్‌బాబు, డీపీఎంవో డాక్టర్ సిహెచ్.రతన్‌మోహన్‌లతో కలిసి హెల్త్ సెంటర్‌లోని 12 రకాల వైద్య ఆరోగ్య సౌకర్యాలను పరిశీలించారు. హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై.రాజేష్ హెల్త్ సెంటర్ అభివృద్ధి, వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాల గురించి బృందం సభ్యులకు వివరించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ప్రత్యేక చొరవ తీసుకుని హెల్త్ సెంటర్‌ను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు కృషి చేయడంతో హెల్త్ సెంటర్ ఎన్క్వాస్ సర్టిఫికెట్ సాధించే విధంగా పేదలకు వైద్య సేవలందిస్తున్నామని డీఎంహెచ్‌వో ఏ.శ్రవణ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ ఆవరణలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన మలేరియా, లెప్రసీ, టీబీ, జాతీయ మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను బృందం ప్రతినిధులు సందర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే నగరంలోని గణపతినగర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్ రాష్ట్రంలోనే తొలిసారి ఎన్క్వాస్ సర్టిఫికెట్‌ను దక్కించుకోగా, రెండవది కూడా మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థలోని యర్రబాలెం హెల్త్ సెంటర్ కావడం విశేషం.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి

ఏపీ/తెలంగాణ భవన్‌లో బీసీ నేతల ధర్నా



మీడియాతో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ/తెలంగాణ భవన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద బీసీ సంఘం జాతీయ నేతలు గుజ్జ కృష్ణ, ఎన్.మారేష్‌ల అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తానరావు, బీఆర్ఎస్ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, మల్లు రవిలతో కలిసి కృష్ణయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం ఇవ్వకుండా గొర్రెలు, బర్రెలు, పందులు, పింఛన్‌లు ఇచ్చి ఓట్లు వేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

భౌతిక విషయాల నుండి నిర్లిప్తత
అంతర్గత శాంతికి మార్గం.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 23 సెప్టెంబర్ 2023

సంపన్న రాజ్యాల కపటత్వం

'పర్యావరణ పరిరక్షణ విషయంలో నిర్లిప్తంగా ఉండటం ద్వారా మానవాళి నరకానికి ద్వారాలు తెరుస్తోంది సుమా...' అని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ హెచ్చరించిన మర్నాడే 2015 ప్యారిస్ వాతావరణ శిఖరాగ్ర సదస్సుకు పూచీపడిన లక్ష్యాలను నీరుగారుస్తూ బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ నిర్ణయాలు తీసుకున్నారు. సహజంగానే పర్యావరణ ఉద్యమకారులను ఈ ప్రకటన దిగ్భ్రాంతిపరిచింది. గతంలో డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక గత ప్రభుత్వ నిర్ణయాలను తాము ఆమోదించబోమని ప్యారిస్ ఒడంబడిక నుంచి వైదొలగారు. తిరిగి జో బైడెన్ వచ్చాకే అమెరికా పాత విధానానికి మళ్లింది. సునాక్ అంత మాట అనకపోయినా ఆయన తాజా చర్యలు మాత్రం అలానే ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ కార్ల విక్రయాన్ని 2030 నుంచి నిలిపేస్తామని ప్యారిస్ శిఖరాగ్ర సదస్సులో బ్రిటన్ వాగ్దానం చేయగా, దీన్ని ఆయన మరో అయిదేళ్లు పొడిగించారు. అలాగే 2035 నాటికి కొత్త గ్యాస్ బాయిలర్ల ఏర్పాటును ఆపేస్తామన్న వాగ్దానాన్ని కూడా పక్కన బెట్టారు. 2050 నాటికల్లా కర్బన ఉద్గారాలను సంపూర్ణంగా తొలగించటమే లక్ష్యమని చెబుతూనే ఆ దిశగా తీసుకోవాల్సిన చర్యలను వాయిదా వేయటం సంపన్న రాజ్యాల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. హరిత లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకుంటే ఉపాధి దెబ్బతింటుందని, జనాగ్రహం వెల్లువెత్తుతుందని ఆయన చెబుతున్న మాటలు కేవలం సాకు మాత్రమే. కర్బన ఉద్గారాలకు కారణమయ్యే పరిశ్రమలు మూతబడినా, హరిత ఇంధనంతో పనిచేసే పరిశ్రమల్లో ఉపాధి లభిస్తుంది. భిన్నరూపాల్లో సబ్సిడీలు, ఆర్థిక సాయం అందిస్తే ప్రజలకు అంత కష్టం అనిపించదు. అందుకు భిన్నంగా ఆ లక్ష్యాల నుంచే తప్పుకోవటం అన్యాయం. వచ్చే ఎన్నికల్లో మధ్యతరగతి మద్దతు కోసం వారికి నొప్పి కలిగించే నిర్ణయాలు తీసుకోరాదని సునాక్ భావిస్తున్నారు. ఇందుకు పర్యావరణం బలయ్యే ప్రమాదం ఉన్నా ఆయనకు పట్టడం లేదు.

అసలు సంపన్న రాజ్యాల తీరుతెన్నులను ఐక్యరాజ్యసమితి సదస్సే పట్టిచూపింది. ఆ సదస్సుకు 34 దేశాల ప్రతినిధులు హాజరుకావాల్సివుండగా ప్రధాన కాలుష్యకారక దేశాలైన అమెరికా, చైనాలతో సహా ఎవరూ రాలేదు. నిజానికి బ్రిటన్ ప్రధాని హోదాలో పాల్గొనే అవకాశం తొలిసారి వచ్చినందున రిషి సునాక్ తప్పక హాజరవుతారని అందరూ అనుకున్నారు. కానీ ఆయన గైర్హాజరు కావటమే కాదు... పర్యావరణానికి ముప్పు తెచ్చే నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సదస్సులో పాల్గొనే ప్రతినిధులు లక్ష్యసాధన దిశగా తీసుకున్న చర్యలేమిటో, వైఫల్యాలుంటే కారణాలేమిటో చెప్పాలని సమితి అన్ని దేశాలనూ కోరింది. సరైన చర్యలు తీసుకుంటున్న దేశాలు ఇతర దేశాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నది ఐక్యరాజ్యసమితి ఉద్దేశం. కానీ హోంవర్క్ చేయని పిల్లలు ఆ మర్నాడు బడి ఎగ్గొట్టినట్టు పర్యావరణ హిత నిర్ణయాల అమలులో అలసత్వం ప్రదర్శిస్తున్న దేశాలన్నీ ఈ సదస్సుకు గైర్హాజరయ్యాయి. చిత్తశుద్ధి ఉంటే స్వచ్ఛమైన గాలి, నిరపాయకరమైన ఇంధనం అందుబాటులోకి రావటం పెద్ద కష్టం కాదని...ఈ రంగాల్లో ఉపాధి కల్పన అవకాశాలు కూడా పెరుగుతాయని గుటెరస్ చెబుతున్న మాట అరణ్యరోదనే అయింది. 2030 నాటికి బొగ్గు వినియోగం నుంచి ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) దేశాలు పూర్తిగా వైదొలగితే, మరో పదేళ్లకు ఇతర దేశాలు దాన్ని సాధించగలుగుతాయని పారిస్ సదస్సు నిర్దేశించింది. కానీ సంపన్న రాజ్యాలు సభ్యులుగా ఉన్న ఓఈసీడీలో ఏ ఒక్క దేశమూ ఆ దిశగా చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. సరిగదా కెనడా, అమెరికా, బ్రిటన్ తదితర సంపన్న దేశాలు మూతబడిన పాత ఫ్యాక్టరీలను సైతం తెరుస్తూ బొగ్గు వినియోగాన్ని మరింత పెంచాయి. ఈ ఏడాది జూన్-ఆగస్టు మధ్య ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్నిచోట్లా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పారిశ్రామికీకరణకు ముందున్న వాతావరణంతో పోలిస్తే కనీసం 1.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు పెరగటం ఎంతో దూరంలో లేదని పర్యావరణ శాస్త్రవేత్తలు చెప్పిన మాట అక్షరసత్యమని ఈ పరిణామం వెల్లడిస్తోంది. గుటెరస్ చేస్తున్న హెచ్చరిక మరింత గుబులు పుట్టిస్తుంది. మరో 2.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగే క్రమంలో ఉన్నామని ఆయన ప్రకటించారు. ప్యారిస్ ఒడంబడిక కుదిరిన సమయంలో ప్రపంచ దేశాలన్నీ 2020నాటికే ఇంతకు మూడింతల క్రియాశీల కార్యాచరణకు పూనుకోవాలని సదస్సు నిర్దేశించింది. అలాగైతే తప్ప లక్ష్యసాధనను చేరుకోలేమని చెప్పింది. కానీ మరో నాలుగేళ్లకే సంపన్న రాజ్యాల నిర్వాకం బయటపడింది. 2019లో జరిగిన ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సులో దాదాపు 60 దేశాలు తాము పూచీపడిన లక్ష్యాలకు మించి కర్బన ఉద్గారాలను తగ్గించుకున్నామని ప్రకటించగా...అందులో అత్యధిక దేశాలు చిన్నవే, తక్కువస్థాయి కాలుష్య కారక దేశాలే.

మరి సంపన్న దేశాలు ఏం చేసినట్టు? ఇచ్చిన వాగ్దానాలను గాలికొదిలేసి, పర్యావరణానికి తూట్లు పొడిచాయి. ఈ విషయంలో కాస్తయినా సిగ్గుపడటం మానేశాయి. వాతావరణ సదస్సుకు ముందురోజే జరిగిన సమితి సర్వసభ్య సమావేశంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భూగోళాన్ని వడగాడ్పులు చుట్టుముట్టడం, అడవులు తగలబడటం, కరువుకాటకాలు, వరదలు వగైరాల గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. శిలాజ ఇంధనాల వాడకం ఆపకపోతే ఈ ముప్పు మరింత పెరుగుతుందని హెచ్చరించారు. కానీ గత అయిదేళ్లలో సాధించిందేమిటో చెప్పాలి గనక ఆ మర్నాడు జరిగిన సదస్సుకు మాత్రం గైర్హాజరయ్యారు. ఇలాంటి ధోరణులు సరి కాదు. ఇప్పటికైనా సంపన్న రాజ్యాల తీరు మారాలి. భూగోళం ఉనికికి ముప్పు తెచ్చే చర్యలకు స్వస్తి పలకాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.అష్టమి ఉ.7.44 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** మూల ఉ.11.43 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.10.10 నుండి 11.43 వరకు, తిరిగి రా.8.53 నుండి 10.23 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.53 నుండి 7.27 వరకు, **అమృతఘడియలు:** లేవు

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.55
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఇది ఓ చారిత్రక ఘట్టం

మహిళా సాధికారతను నిజం చేసే బిల్లు ఎట్టకేలకు పార్లమెంట్ ఆమోదం పొందింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే ఈ బిల్లు దాదాపు మూడు దశాబ్దాలుగా ఆమోదానికి నోచుకోకుండా పడి ఉంది. ఇప్పుడు అది చట్టం కానుండడంతో అన్ని వర్గాలూ సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఈ బిల్లులో రిజర్వేషన్ అమలు మొదలయ్యే సమయం గురించి స్పష్టత లేకపోవడం, రాజ్యసభ, రాష్ట్రాల కౌన్సిళ్లలో రిజర్వేషన్ల సంగతిని ప్రస్తావించకపోవడం గమనించదగ్గవి.

ఎన్నాళ్లో వేచిన ఉదయం...

సందర్భం



అంజెలికా అరిబమ్

ఎట్టకేలకు చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు ఉద్దేశించిన 128వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఉభయ సభల ఆమోదం లభించింది. దేశాద్యంతం ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన అపురూపమైన ఘట్టమిది. దురదృష్టవశాత్తూ స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం ఇప్పటికీ చాలా తక్కువగానే ఉంది. పంచాయితీలు, స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జరిగిన 73, 74వ రాజ్యాంగ సవరణల పుణ్యమా అని పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. అదే సమయంలో చట్టసభల్లోనూ ఈ రిజర్వేషన్లకు డిమాండ్ కూడా మరింత జోరందుకుంది.

1996 నుంచి పలు ప్రభుత్వాలు మహిళల రిజర్వేషన్ల కోసం పలు రకాల బిల్లులు ప్రవేశ పెట్టాయి కానీ.. రాజకీయంగా ఏకాభిప్రాయాన్ని సాధించి బిల్లును కాస్తా చట్టంగా మార్చడంలో మాత్రం అన్నీ విఫలమయ్యాయి. 2008లో యూపీఏ ప్రభుత్వం రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టి రెండేళ్ల తరువాత ఆమోద ముద్ర వేయించుకుంది. అది కూడా 186 –1 తేడాతో! బిల్లును చట్టంగా మార్చడంలో యూపీఏ దాదాపుగా విజయం సాధించింది కానీ.. పార్లమెంటరీ పద్ధతులను అనుసరించి బిల్లును లోక్‌సభకు పంపడంతో పరిస్థితి మారిపోయింది. ప్రతిపక్షంలో ఉన్నవారితోపాటు యూపీఏ భాగస్వామ్య పక్షాల్లో కొన్ని కూడా దీన్ని వ్యతిరేకించాయి. దీంతో 2014లో లోక్‌సభ అవధి ముగిసిపోవడంతో ఈ బిల్లు కథ కూడా అటకెక్కింది.

ఈ దేశంలో చట్టాలను తయారు చేసే సంస్థల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలన్న ఆశలు ఇప్పటివరకూ ఆరుసార్లు నిరాశలయ్యాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం పార్లమెంట్‌లో పూర్తిస్థాయి మెజారిటీ కలిగి ఉంది. రాజ్యసభ, లోక్‌సభ గండాలు రెండింటినీ అధిగమించిన నేపథ్యంలో ఇప్పుడు 27 ఏళ్ల కల సాకారమైనట్లుగా భావించాలి. దీంతో మోదీ ప్రభుత్వం చరిత్రపుటల్లోకి ఎక్కుతుంది. నిజానికి తాజా బిల్లు 2008 నాటి బిల్లు తాలూకూ సూక్ష్మ రూపమని చెప్పాలి. లోక్‌సభతోపాటు రాష్ట్రాల అసెంబ్లీలు, ఢిల్లీ అసెంబ్లీలోనూ మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం ఉండాలని చెబుతుంది ఇది. ఇప్పుడున్న ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్ కోటాలోనూ 33 శాతం మహిళలకు ఉండేలా చూస్తుంది కూడా! రొటేషన్ పద్ధతిలో సీట్లు కేటాయిస్తారు. పదిహేనేళ్ల తరువాత రిజర్వేషన్లు రద్దవుతాయి.



2023 బిల్లును రెండు అంశాల్లో మాత్రం విమర్శించక తప్పదు. మొదటిది అమలు మొదలయ్యే సమయం గురించి స్పష్టత లేకపోవడం! "నియోజకవర్గాల పునర్విభజన తంతును చేపట్టిన తరువాత, జనాభా లెక్కల ద్వారా తగిన సమాచారం సేకరించిన తరువాత, 128వ రాజ్యాంగ సవరణ ప్రచురించిన తరువాత" అని బిల్లు పేర్కొంటోంది. వచ్చే ఎన్నికల నుంచే ఈ రిజర్వేషన్లు అమలై ఉంటే బాగుండేది.

రెండో లోపం... రాజ్యసభ, రాష్ట్రాల కౌన్సిళ్లలో మహిళలకు రిజర్వేషన్ల సంగతిని ఈ బిల్లు ప్రస్తావించకపోవడం! ప్రస్తుత పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం లోక్‌సభ కంటే రాజ్యసభలోనే తక్కువగా ఉంది. మహిళల ప్రాతినిధ్యం అటు లోక్‌సభ, ఇటు రాజ్యసభలోనూ ఉండటం ఆదర్శప్రాయమైన విషయం. ఈ లోటును సరిదిద్దడం ఎలా అన్నది పార్లమెంటేరియన్లు ఆలోచించాలి.

128వ రాజ్యాంగ సవరణ బిల్లులోని సానుకూల అంశాలను చాలామంది తక్కువ చేసి చూస్తున్నారు. పురుషులు మహిళా ప్రతినిధులకు ప్రాక్సీలుగా వ్యవహరిస్తారని అంటున్నారు. ఇది ఒకరకంగా లింగ వివక్షతో కూడిన అంచనా అని చెప్పాలి. మహిళ సామర్థ్యాన్ని శంకించేది కూడా. చట్టాన్ని దుర్వినియోగపరిచేందుకు కొందరు చేసే ప్రయత్నం మిగిలిన వారి హక్కులను నిరాకరించేందుకు ప్రాతిపదిక కాజాలదు.

చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం ఈ దేశ మహిళలు సుమారు 27 ఏళ్ల సుదీర్ఘకాలం వేచి చూడాల్సి వచ్చింది. ఉభయ సభల పరీక్షను దాటుకున్న ఈ బిల్లులో లోటుపాట్లు లేకపోలేదు కానీ... సంపూర్ణమైన చట్టం కోసం ఇంకో రెండు దశాబ్దాలు వేచి ఉండటం కూడా అసాధ్యం. ఇప్పటి ప్రభుత్వం తీసుకున్న చొరవను అభినందిద్దాం. అయితే రాజకీయాల్లో మహిళ, పురుషులిద్దరూ సమాన స్థాయికి చేరేందుకు ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. ఇది కేవలం ప్రారంభం మాత్రమే!

వ్యాసకర్త ఫెమ్మే ఫస్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు

సవాళ్లెన్ని ఎదురైనా...

సందర్భం



ప్రేమ్ చౌధరీ

మహిళా సాధికారతకు గొప్ప ప్రోత్సాహమిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ఆమోదం పొందడంతో భారత ప్రజాస్వామిక చరిత్రలో నూతన శకానికి నాంది పలికినట్లు అయ్యింది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లోని సీట్లలో మహిళలకు 33 శాతం కోటాను ఈ బిల్లు కేటాయించింది. ఇది అమల్లోకి రాగానే లోక్‌సభలో మహిళా ఎంపీల సంఖ్య 82 నుంచి 181కి పెరుగుతుందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘావల్ చెప్పారు.

చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు అనేక సంవత్సరాలుగా దేశంలో రాజకీయ చర్చకు కేంద్రంగా ఉంది. ఈ బిల్లును 1996లో ప్రవేశపెట్టినప్పటికీ, పలు రాజకీయ అవరోధాల కారణంగా ఇది ఆమోదం పొందలేదు. ఇప్పుడు పార్లమెంటులో మహిళలకు 15 శాతం లోపే ప్రాతినిధ్యం ఉంది. దేశ జనాభాలో దాదాపు సగంమంది మహిళలు ఉన్నప్పటికీ, వారి రాజకీయ భాగస్వామ్యం తగినంతగా లేదు. మహిళల గణనీయమైన భాగస్వామ్యంతో కూడిన పార్లమెంట్... భారత ప్రజల విభిన్న అవసరాలను, ఆందోళనలను మరింత మెరుగ్గా పరిష్కరించగలదు. పైగా, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి మహిళల రాజకీయ సాధికారత మరింతగా అవసరం అవుతోంది.

ఈ రిజర్వేషన్ నిజానికి మహిళలకు సాధికారత కల్పించకపోవచ్చని వ్యతిరేకులు వాదిస్తున్నారు. పురుష రాజకీయ నాయకులు తమ మహిళా బంధువులను తమ తరపున ఉపయోగించుకుంటారనేది ఒక వాదన. ప్రత్యేక నేపథ్యం ఉన్న మహిళలకు మాత్రమే ఇది ప్రయోజనం చేకూరుస్తూ సామాజిక అసమానతలను పెంచుతుందని విమర్శకులు వాదిస్తుంటారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా మరొక వాదన ఏమిటంటే, కోటాను అమలు చేయాలంటే చాలామంది పురుషులు తమ సీట్లను వదులుకోవలసి ఉంటుందనేది!

ఇలాంటి సవాళ్లు ఉన్నప్పటికీ, పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ ప్రయోజనాలు గణనీయంగా ఉన్నాయి. రాజకీయాల్లో ఉన్న మహిళలు విద్య, ఆరోగ్యం, సామాజిక న్యాయం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తారని ప్రపంచవ్యాప్తంగా పలు పరిశోధనలు చెబుతున్నాయి. పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడం వల్ల ఈ సంక్లిష్టమైన రంగాలకు మరిన్ని వనరులను కేటాయించవచ్చు. పైగా, మహిళా రిజర్వేషన్ ఇతర రంగాలలో లింగ సమానత్వానికి శక్తిమంతమైన ఉదాహరణగా నిలుస్తుంది. ఇది సాంప్రదాయికమైన జెండర్ నిబంధనలను, మూస పద్ధతులను సవాలు చేయగలదు.

పార్లమెంట్‌లో పెరిగే మహిళా ప్రాతినిధ్యం మరింత సమగ్రమైన, సమానమైన భారతదేశాన్ని వాగ్దానం చేస్తుంది. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడిచిన తర్వాత కూడా, రాజకీయాల్లో సమాన లింగ ప్రాతినిధ్యాన్ని భారతదేశం సాధించలేకపోయింది. పార్లమెంట్‌లో అత్యధిక మహిళా ప్రాతినిధ్యం ఉన్న టాప్ 20 దేశాల్లో చాలా వరకు మహిళలకు 30 శాతం రిజర్వేషన్లు ఉన్న విషయం ఈ సందర్భంగా గమనార్హం

పార్లమెంటులో మహిళలకు ప్రాతినిధ్యం లేకుండా సమానత్వంతో, న్యాయంతో సామాజిక అభివృద్ధిని సాధించలేము; అందుకే మహిళా రిజర్వేషన్ బిల్లు ఈనాటి అవసరం. రాజకీయ, ప్రజా జీవితంలో వివక్షను, ప్రత్యేకించి మహిళల పట్ల వివక్షను తొలగించడానికి తగిన చర్యలు తీసుకోవాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 7 ప్రభుత్వాలను నిర్దేశిస్తున్నది. మహిళలపై అన్ని రకాల వివక్షా నిర్మూలనకు సంబంధించిన కన్వెన్షన్‌పై భారతదేశం సంతకం చేసింది. ప్రభుత్వ విధానానికి, దాని అమలుకు సహకరించడంలో మహిళలకు 'పాల్గొనే హక్కు' ఉన్నందున, అన్ని ప్రభుత్వ సంస్థలకు ఎన్నికల్లో పోటీ చేయడానికి పురుషుల వలెనే వారు అర్హులు. ఈ నిబద్ధతను గౌరవించాల్సిన సమయం ఇది.

పార్లమెంటులో ఏ సమస్యలను లేవనెత్తుతారు, విధానాలను ఎలా రూపొందిస్తారు అనే అంశంపై పార్లమెంట్‌లో మహిళల విస్తృత ప్రాతినిధ్యం అపారమైన ప్రభావాన్ని చూపుతుంది. పైగా ఇది మహిళలపై వివక్షాపూరిత చట్టాలను సంస్కరించడానికీ, సవరించడానికీ, ప్రభుత్వ జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికీ తగిన స్పేస్‌ని సృష్టిస్తుంది. ఈ అన్ని ప్రయోజనాల దృష్ట్యా పార్లమెంట్ మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం హర్షణీయం.

వ్యాసకర్త రచయిత్రి, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ విద్యావేత్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

జీవన నైపుణ్యం



నేటి తక్షణ ప్రపంచంలో – అది సోషల్ మీడియా లైక్‌ల కోసం కావచ్చు, ఒక క్లిక్‌తో షాపింగ్ లేదా అదే రోజు డెలివరీ కోసం కావచ్చు – ఓపిక అనేది ఒక ముఖ్యమైన జీవన నైపుణ్యంగా మారబోతోంది. పిల్లల్లో బాల్యం నుంచే ఓపికను పాదుకొలిపే పరిస్థితులు ఉన్నాయని మీరు భావిస్తున్నారా?

– రోనీ స్క్రూవాలా, పారిశ్రామికవేత్త

ప్రతి ఇంటికీ మేలు



ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన మహిళలు విధానాల రూపకల్పనలో, విస్తృత ప్రయోజనాలకు అనుగుణంగా బడ్జెట్ అంచనాలను వెయ్యడంలో సమర్థమైన పాత్రను పోషిస్తారు. దేశంలోని ప్రతి ఇంటికి మేలు చేస్తారు. సమాజాన్ని మారుస్తారు.

– కిరణ్ బేడీ, మాజీ ఐపీఎస్ అధికారి

హాస్యాస్పదం!



కొత్త పార్లమెంటులో ప్రభుత్వం ఒక వైపు మహిళా సాధికారతపై అనర్గళంగా మాట్లాడుతూనే, మరో వైపు బిల్కిస్‌బానో కేసులో విడుదలైన 11 మంది దోషులకు అనుకూలంగా సుప్రీంకోర్టులో వాదించింది! ఎంత హాస్యాస్పదం. ప్రభుత్వంలో నిజాయతీ ఎక్కడ ఉన్నట్లు?

– సౌరవ్ దాస్, పరిశోధక పాత్రికేయుడు

ఎప్పటికీ ఒప్పుకోరు



మోదీ నిజంగా మహిళా సాధికారతకు ఎన్నో చర్యలు తీసుకున్నారు. అది కూడా ఏమాత్రం శబ్దం చెయ్యకుండా! ఆ కార్యశీలతే ఆయన్ని మిగతా నాయకుల నుండి వేరు చేస్తుంది. అయితే చైతన్యవంతులైన స్త్రీవాదులు దీనిని ఎప్పటికీ అంగీకరించరు.

– వరుణ్‌కుమార్ రాణా, రాజకీయ విశ్లేషకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

విస్మృత స్వాతంత్ర్యోద్యమ దీప్తి

మన దేశ స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న మహనీయుల చరిత్రలు సరిగా నమోదు కాలేదు, తద్వారా తర్వాతి తరం వ్యక్తులు వారిని దాదాపు విస్మరించారేమో! సమకాలీన గొప్ప నాయకుల్లో చాలా మందితో భుజం భుజం కలిపి ఉద్యమించిన నాగసూరు వీరరాఘవయ్య విషయంలో ఇదే జరిగిందనిపిస్తుంది. కావలి పట్టణంలో మీదు మిక్కిలి ధనవంతుల ఇంట వీరరాఘవయ్య 1882 సెప్టెంబరు 24న జన్మించారు. జాతీయోద్యమానికి అలుపు లేకుండా, వెరవకుండా వ్యయం చేసిన వీరరాఘవయ్య స్వాతంత్ర్య స్ఫూర్తి, గాంధీజీ ఆలోచనలు రంగరించుకున్న మంచి వక్త. టంగుటూరి ప్రకాశం పంతులుకు వీరరాఘవయ్య మంచి మిత్రుడు కనుక 'ఆంధ్రకేసరి' ఆ ఇంటికి క్రమం తప్పకుండా విచ్చేసిన అతిథి. బత్తిన పెరుమాళ్ళు నాయుడు, కటికనేని సోదరులు, బెజవాడ గోపాలరెడ్డి, నాగసూరు వీరరాఘవయ్యలకు ఎవరు అన్నం పెట్టినా శిక్షార్హులు అని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం నోటీసులు జారీ చేసిందంటే వారి పోరాట స్థాయి ఏమిటో మనకు బోధపడాలి.



నాగసూరు వీరరాఘవయ్య

గాంధీజీ తలపెట్టిన అనేక సంస్కరణ కార్యక్రమాలలో శ్రద్ధగా పాల్గొన్న నాగసూరు వీరరాఘవయ్య 203 వితంతు వివాహాలు జరిపించారని తెలుసుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అప్పట్లో వితంతువులైన తమ కూతుళ్ళకు పునర్వివాహం చేయ డానికి తల్లిదండ్రులు వెనకాడేవారు. అలాంటి వారి బాలికలకు తమ ఇంట్లో ఆశ్రయమిచ్చి, తగిన వరుడు లభించినపుడు వీరరాఘవయ్య పునర్వివాహాలు చేయించేవారు. అస్పృశ్యతా నివారణ, హరిజ నోద్ధరణ వంటి కార్యక్రమాలంటే ఆయనకు చాలా మక్కువ.

విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమానికి కావలిలో నాయకత్వం వహించారు. 1921లో అహమ్మదాబాదులో జరిగిన వార్షిక కాంగ్రెస్ సభలలో కావలి ప్రాంతం నుంచి పాల్గొన్న ఏకైక ప్రతినిధి కూడా ఆయనే. 1930లో జరిగిన ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని మద్రాసు, కడలూరు, రాయవెల్లూరు సెంట్రల్ జైళ్ళలో కారాగార శిక్షను అనుభవించారు. గరిమెళ్ళ సత్యనారాయణ, కళా వెంకట్రావు జైలులో ఆయనకు సహచరులు. బెజవాడ గోపాలరెడ్డి వంటివారు స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన మిత్రులు!

1954 నవంబరు 27న కాలం చేసిన నాగసూరు వీరరాఘవయ్య అనగానే కేవలం కావలి పురజనులకు గుర్తుండే విషయముంది. గాంధీజీ చితాభస్మాన్ని మోసుకు వెళ్తున్న రైలును ఆపడానికి వీరరాఘవయ్య రైలు పట్టాల మీద పడుకున్నారు. అందువల్లనే కావలివాసులు గాంధీజీ చితాభస్మాన్ని దర్శించగలిగారు. నాగసూరు వీరరాఘవయ్య సదా చిరస్మరణీయులు!

– డా॥ నాగసూరి వేణుగోపాల్ । 94407 32392

(రేపు స్వాతంత్ర్య సమరయోధులు నాగసూరు వీరరాఘవయ్య 141వ జయంతి)

వేగుచుక్కల వెలుగు కథలు

సందర్భం



కాత్యాయనీ విద్మహే

చరిత్ర వలెనె సాహిత్య చరిత్ర కూడా ఎప్పటికప్పుడు ఉపాంతీకరణకు గురైన భిన్న సామాజిక వర్గాల క్రియాశీల శక్తి సామర్థ్యాలనూ, సృజన విమర్శ శక్తులనూ సమీకరించి, చేర్చుకొంటూ సమగ్రం కావాల్సిందే. అలా తెలుగు సాహిత్య చరిత్ర స్త్రీల, దళిత బహుజనుల, ముస్లిముల సాహిత్యంతో 1980ల నుండి చైతన్యవంతంగా సంపద్వంతమవుతూనే ఉంది. ఈ చరిత్రలో భాగంగానే 'విరసం' ఇప్పుడు 'వియ్యుక్క' అనే పేరుతో ఆరు కథా సంకలనాలు ప్రచురిస్తున్నది. "ఈ సంకలనాల్లో చేరిన కథలు అజ్ఞాత మావోయిస్టు ఉద్యమంలో పని చేసి అమరులైనవారూ, కొనసాగుతున్నవారూ, అరెస్టయినవారూ, ఏ ఇతర కారణాల వల్లనైనా కొంత కాలం పని చేసి బయట ఉన్నవారూ రాసిన కథలు" అంటారు సంకలనాల సంపాదకురాలు బి. అనురాధ. ఆ రకంగా అటు విప్లవ సాహిత్యంలోనూ ఇటు స్త్రీల సాహిత్యంలోనూ ఇది ఒక చారిత్రక ఘట్టం.

2007 నుండి అజ్ఞాత రచయిత్రుల కథల సేకరణ చేస్తూ వచ్చిన అనురాధ స్త్రీల పేర్లతో ఉన్న కథలు అన్నీ స్త్రీలు రాసినవో కావో నిర్ధారించుకొనటానికి, ఒక రచయిత్రి ఎన్ని కలం పేర్లతో రాసిందో గుర్తించి ఒక పేరును ఖరారు చెయ్యటానికి అనుసరించిన పద్ధతులు చాలా ఆసక్తికరమైనవి. మహిళా ఉద్యమంతో తనకు ఉన్న సంబంధంతో పాటు, ఈ కథల గురించి విరసం ప్రకటనకు ఆ రచయిత్రులు స్పందించి పత్రికా ముఖంగా ఇచ్చిన వివరాలు కూడా ఈ పనికి ఉపకరించాయి అంటుందామె.

'వియ్యుక్క' గోండీ భాషాపదం. వేగుచుక్క అని దాని అర్థం. ఇందులోని 282 కథలు 52 మంది మహిళా విప్లవకారులు రాసినవి. స్త్రీల కథాసంకలనాలు ఎన్నో వచ్చాయి గానీ ఒక రాజకీయార్థిక సామాజిక అవగాహన కలిగిన 52 మంది స్త్రీల సంకలనాలు మాత్రం ఇప్పటికి ఇవే. వ్యక్తులుగా ఎవరు ఎన్ని కథలు రాశారన్నది చెప్పటం ఈ సంకలనాల ఉద్దేశం కాదు. ఒకటి రెండు కథలు రాసినవాళ్లు కూడా ఇందులో ఉన్నారు. విప్లవ జీవితం అందరికీ సమష్టి అనుభవం. ఆ అవగాహన నుండే విప్లవోద్యమంలో వచ్చిన పరిణామాన్ని స్త్రీల అనుభవ కోణం నుండి నమోదు చేయటం ఈ సంకలనాలకు లక్ష్యం. ఆరు సంకలనాలలో మొదటి మూడు ఇప్పుడు మార్కెట్లో ఉన్నాయి. మొత్తం ఈ 146 కథలకు విప్లవోద్యమమే వస్తువు.



అజ్ఞాత వీర నారీమణుల అక్షర ప్రతిబింబాలు

సొంత కుటుంబాలు, ఆస్తులు, పేర్లు – అన్నీ వదులుకొని శ్రామిక వర్గ ప్రయోజనాల కోసం, ఉత్పత్తి సంబంధాలలో మార్పు కోసం, ఉన్నత మానవీయ విలువలతో నూతన సమాజ నిర్మాణం కోసం విప్లవోద్యమంలోకి వెళ్ళిన వాళ్ళ అనుభవ కథనాలు ఇవి. ఈ కథలకు వస్తువైన జీవిత సందర్భాలు, శకలాలు భిన్నం కావచ్చు. కానీ సాధారణ ప్రజల అసాధారణ ధిక్కారం ఈ అన్ని కథలకూ అంతఃసూత్రం. ఆచారాలు, రివాజులు, దోపిడీ, పీడన, రాజ్యం, దాని అణచివేత, సామ్రాజ్యవాద చొరబాటు వంటివన్నీ ఈ కథల సాధారణ అంశం. దాని సారం క్రియాశీల సౌందర్యం. ప్రాణాలు పణం పెట్టే సంసిద్ధత, మృత్యువుతో క్రీడలు, వీటన్నిటి దుఃఖోద్వేగాలు ఈ కథల ప్రత్యేకత. ఇవన్నీ వ్యక్తిగత స్థాయిని దాటి విశ్వ ప్రేమగా ఈ కథలలో ఆవిష్కృతమయ్యాయి.

గనుల తవ్వకాలకు అడవులను ఆక్రమిస్తున్న బహుళ జాతి కంపెనీలకు మద్దతును ఇచ్చే ప్రభుత్వ అభివృద్ధి నమూనాకు ఆదివాసీల నిర్వాసితత్వానికి ఉన్న సంబంధాన్ని మానవ సంబంధాలలో భాగంగా అర్థం చేయించే సోయి, 'సీతాబాయి గెలుపు', 'లక్ష్మణరేఖ' వంటి కథలు ఎన్నో ఇందులో ఉన్నాయి. విప్లవోద్యమం మనుషులను అన్య వర్గ, ఆధిక్య భావన నుండి విముక్తం చేసి కొత్త మనుషులుగా మారుస్తుందని 'చాయ్ గ్లాస్' (2012) కథ చెప్తుంది. అహంకారాన్నీ, అధికారాన్నీ వదులుకొంటూ ఎదుటివాళ్లను వినగలిగిన, వాళ్ళ నుండి నేర్చుకొనగలిగిన సంసిద్ధత విప్లవ సాంస్కృతిక పర్యావరణంలోనే సాధ్యమని 'ఇద్దరు శస్త్రకారులు' కథ నిరూపిస్తుంది.

ఎన్‌కౌంటర్ అయిన పిల్లల శవాల కోసం ఆసుపత్రికి వెళ్లిన తల్లులు... మరణించిన బిడ్డలందరి కోసం తల్లులందరి గర్భశోకాన్ని మోసేవాళ్ళు కావటం, ఆ బిడ్డలకు అంత్యక్రియలు గౌరవకరంగా జరగాలనుకొని తమ కడుపున పుట్టకపోయినా ఒడిలోకి తీసుకొని బిడ్డలుగా ప్రకటించే చైతన్యవంతులు కావటం అత్యంత సహజంగా చిత్రితమైన కథలు 'ఈ శోకం ఎందరిది', 'నాబిడ్డనే', 'ముగ్గురు తల్లులు'. వాళ్ళు విప్లవ విశ్వమాతలుగా ఎదిగినవాళ్లు. మాతృత్వం విప్లవ మాతృత్వంగా ఆకాశమే హద్దుగా వ్యాపించటం ఈ కథల విశిష్టత. మావోయిస్టుల కార్యకలాపాల గురించీ, దళ జీవితం గురించీ, గిరిజనులకు వాళ్లకు ఉండే సంబంధాల గురించీ పత్రికలలో వచ్చే పాక్షిక కథనాలూ, వక్రీకరణలూ, వాటి వల్ల కలిగే దురభిప్రాయాలనూ దాటి ఇతిహాసపు చీకటి కోణం అడుగున పడి కనిపించని వాస్తవాల వైపు మన చూపు తిప్పే ఈ కథలు తప్పక చదవవలసినవి.

వ్యాసకర్త ప్రరవే కార్యదర్శి, తెలంగాణ

(ఈ 24న సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాదులో 'వియ్యుక్క' కథా సంకలనాల ఆవిష్కరణ)

'ధన' గణపతులు



గుంటూరు జిల్లా మంగళగిరి పూలకొట్ల సెంటర్‌లో రూ.2.20 కోట్ల కరెన్సీతో అలంకరణ

గణపతి నవరాత్రులను రాష్ట్ర వ్యాప్తంగా వైభవంగా నిర్వహిస్తున్నారు. పలు చోట్ల వినాయకుడు ధన గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. గణేశుడి ప్రతిమ, మండపాలను కోట్ల రూపాయల నోట్లతో ఉత్సవ కమిటీ సభ్యులు అందంగా ముస్తాబు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు శుక్రవారం భక్తులు ఆయా మండపాలకు భారీగా క్యూ కట్టారు.

– నెట్‌వర్క్



గుంటూరు నగరం ఆర్.అగ్రహారం శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో రూ.1.31 కోట్ల కరెన్సీ నోట్లతో గణనాథుడికి అలంకారం



ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలోని వాసవి మార్కెట్‌లో రూ.1.51 కోట్ల కరెన్సీతో ఏకదంతుడి అలంకరణ

కళాజాత బృందాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

- అక్టోబర్ 10వ తేదీ వరకు గడువు
- సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఏపీ జేడీ రత్నాకర్

సాక్షి, అమరావతి: భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ తరఫున మూడేళ్ల పాటు కళాజాతాల నిర్వహణ కోసం వ్యక్తిగతంగా, బృందాలుగా కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (ఏపీ రీజియన్) జాయింట్ డైరెక్టర్ పి.రత్నాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పది మందికిపైగా కళాకారులుంటే రూ.2 వేలు, అంతకంటే తక్కువ ఉంటే రూ.వెయ్యి రిజిస్ట్రేషన్ ఫీజును డీడీ రూపంలో "DDO, CBC, Visakhapatnam' పేరుతో చెల్లించాలని పేర్కొన్నారు. అక్టోబర్ 10వ తేదీలోగా దరఖాస్తులను విజయవాడలోని తమ కార్యాలయం 'ది జాయింట్ డైరెక్టర్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, కేంద్ర సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ, 2వ అంతస్తు, సీజీవో కాంప్లెక్స్ ఆటోనగర్ చిరునామాకు పంపించాలని సూచించారు. నక్సల్ ప్రభావిత శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి ప్రాంతాల కళాకారులతో పాటు బృందంలో 50% మంది మహిళలు (మహిళా బృందాలైనా), ఎస్సీ, ఎస్టీ కళాకారులు ఉన్న వారికి కూడా రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఉంటుందని తెలిపారు. వివరాలను www.davp.nic.in, www.cbcindia.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

సీలేరులో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు

- నవంబరులో టెండరు ప్రక్రియ పూర్తి
- ప్రాజెక్టు నిర్మాణానికి శరవేగంగా చర్యలు



సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా) : రాష్ట్రంలో మరింత విద్యుదుత్పత్తి పెంచేందుకు కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి సీలేరు అనువైన ప్రదేశమని ఏపీ జెన్‌కో డైరెక్టర్ (హైడల్) ఎండీ సత్యనారాయణ, గోదావరి రివర్ బోర్డు చైర్మన్ ఎంకే సిన్హా తెలిపారు. శుక్రవారం వారు సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లో పర్యటించారు. బలిమెల, గుంటవాడ డ్యామ్‌లు, జల విద్యుత్ కేంద్రం, కొత్తగా నిర్మించబోయే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును సీలేరులో నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా చర్యలు చేపట్టిందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే టెండర్లు పిలవడం జరిగిందని, ఈ ఏడాది నవంబరు చివరికల్లా పూర్తిస్థాయిలో టెండర్లు పిలుస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ పనులు చేపట్టేందుకు ఎల్ వన్ కాంట్రాక్టర్లు అర్హులన్నారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ సూచనల మేరకు ఈ ప్రాజెక్టు రూ.11,800 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది యూనిట్లతో 1300 మెగా వాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టు నిర్మించబోతున్నామని చెప్పారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రం (మోతుగూడెం)లో నిర్మిస్తున్న రెండు కొత్త యూనిట్లకు సంబంధించి ప్రస్తుతం సివిల్ పనులు జరుగుతున్నాయన్నారు.

క్లుప్తంగా...

లాండర్, రోవర్ నుంచి సంకేతాలు లేవు


బెంగళూరు: జాబిలిపై పరిశోధనల కోసం ప్రయోగించిన చంద్రయాన్-3 తాలూకు లాండర్, రోవర్లతో సంబంధాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు ఇస్రో శుక్రవారం ప్రకటించింది. విక్రమ్‌గా పిలుస్తున్న లాండర్, ప్రజ్ఞాన్‌గా పిలుస్తున్న రోవర్లను ఈ నెల మొదట్లో ఇస్రో సుప్తావస్థలోకి పంపడం తెలిసిందే. ఇప్పుడు అవి తిరిగి యాక్టివేట్ అయ్యే స్థితిలో ఏ మేరకు ఉన్నదీ పరిశీలిస్తున్నట్టు పేర్కొంది. కానీ ఇప్పటిదాకా అయితే వాటినుంచి తమకు ఎలాంటి సంకేతాలూ అందలేదని వివరించింది. వాటిని కాంటాక్ట్ చేసే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉంటాయని తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేసింది. సెప్టెంబర్ 20 దాకా చంద్రుని మీద రాత్రి వేళ. 14 రోజులు రాత్రి ఉంటుంది. అప్పుడక్కడ ఉష్ణోగ్రతలు ఏకంగా మైనస్ 120 డిగ్రీల దాకా పడిపోతాయి. దాంతో చంద్రయాన్ లాండర్, రోవర్ పాడయ్యే ప్రమాదముంది. అందుకే వాటిని ఇస్రో స్లీప్ మోడ్‌లోకి పంపింది. ఇప్పుడు పగటి సమయం కావడంతో వాటిని యాక్టివేట్ చేయాలని నిర్ణయించి ఆ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టింది.

25 నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం!

న్యూఢిల్లీ: నైరుతి రుతుపవనాలు ఈ నెల 25వ తేదీ తర్వాత వాయవ్య భారత్ నుంచి వెనక్కి వెళ్లిపోయే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) శుక్రవారం వెల్లడించింది. అక్టోబర్ 15 నాటికి నైరుతి రుతుపవనాలు దేశం నుంచి పూర్తిగా నిష్క్రమిస్తాయి. రాబోయే ఐదు రోజుల్లో ఉత్తర, మధ్య భారతదేశంలో వర్షాలు తగ్గిపోతాయని తెలియజేసింది. పశ్చిమ రాజస్తాన్ నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనానికి అనువుగా పరిస్థితులు మారుతున్నాయని పేర్కొంది. ఈ రుతుపవనాలతో సాధారణంగా 832.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి. కానీ, ఈసారి 780.3 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది.

చర్చల ద్వారానే 'కశ్మీర్'కు పరిష్కారం: మిర్వాయిజ్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అంశాన్ని చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించాలని వేర్పాటువాద హురియత్ కాన్ఫరెన్స్ చైర్మన్ మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్ అన్నారు. నాలుగేళ్ల గృహ నిర్బంధం అనంతరం శుక్రవారం ఆయన చారిత్రక జమియా మసీదు వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. కశ్మీరీలు మతాలు, వర్గాలకు అతీతంగా శాంతియుత సహజీవనాన్ని కోరుకుంటున్నారని అన్నారు. కశ్మీరీ పండిట్లు తిరిగి సొంత ప్రాంతాలకు రావాలని కోరుకుంటున్నామని చెప్పారు. మానవీయ కోణంలో చూడాల్సిన ఈ విషయాన్ని రాజకీయం చేయడాన్ని తాము అంగీకరించమన్నారు.



ఇంటెలిజెన్స్ సమాచారం పంచుకోవడంలో కీలకంగా అయిదు దేశాల కూటమి
యుద్ధాలు, ఉగ్రవాదంపై పోరులో సమాచారం మార్పిడి..
నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉందని ఆయా దేశాధినేతలతో ట్రూడో
లోతుగా దర్యాప్తు జరగాలంటున్న ఫైవ్ ఐస్ కూటమి

పంచనేత్రం!

ఖలిస్తాన్ అంశం భారత్, కెనడా మధ్య అగ్గి రాజేస్తోంది. ఖలిస్తాన్ సానుభూతిపరుడు నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందని సాక్షాత్తూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ఈ అంశంలో ట్రూడో ఇతర దేశాల మద్దతు కూడగట్టడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఫైవ్ ఐస్ (అయిదు కళ్లు) కూటమి తనకు అండగా ఉంటుందని ఆశలు పెట్టుకున్నారు. మన దేశంపై ఒత్తిడి తీసుకురావడానికి ఆయా దేశాల అధినేతలతో మంతనాలు సాగిస్తున్నారు. ఇంతకీ ఈ ఫైవ్ ఐస్ కూటమి అంటే ఏమిటి ? కెనడా, భారత్ వివాదంలో ఎందుకు కీలకంగా మారింది ?

➤ ఇంటెలిజెన్స్ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి అయిదు దేశాలతో ఏర్పాటైన కూటమిని ఫైవ్ ఐస్ (అయిదు కళ్లు) అని పిలుస్తారు. అమెరికా ఆధ్వర్యంలో నడిచే ఈ కూటమిలో యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈ అయిదు దేశాలకు చెందిన నిఘా సంస్థలు అధికారిక, అనధికారిక ఒప్పందాల ప్రకారం ఒకరికొకరు సహకారం అందించుకుంటాయి. భద్రతాపరంగా నిఘా సంస్థలకు అందే సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకుంటాయి. ప్రపంచ చరిత్రలో ఈ ఫైవ్ ఐస్ కూటమి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సమాచారాన్ని బదిలీ చేసుకుంటుందని పేరు పొందింది. ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ (కేటీఎఫ్) చీఫ్ హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ ప్రమేయం ఉందని తీవ్రమైన ఆరోపణలు చేసిన ట్రూడో ఈ కూటమిలో మిగిలిన నాలుగు దేశాల మద్దతు కూడగట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

రెండో ప్రపంచ యుద్ధం నాటి కూటమి..

➤ ఈ కూటమి ఏర్పాటు ఇప్పటిది కాదు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత అమెరికా, యూకే తొలుత చేతులు కలిపి నిఘా సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవడానికి 1946లో ఒక ఒప్పందాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. దీనినే బ్రూసా ఒప్పందం అని పిలుస్తారు. అమెరికా, రష్యా మధ్య ప్రచ్ఛన్న యుద్ధం ఎప్పుడైతే తారాస్థాయికి చేరుకుందో ఆ సమయంలో ఈ కూటమిలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా వచ్చి చేరాయి. నార్వే, డెన్మార్క్, పశ్చిమ జర్మనీలు తాత్కాలికంగా చేరినప్పటికీ , 1955 నాటికి మళ్లీ ఈ అయిదు దేశాలే సభ్యులుగా మిగిలాయి. 1990 వరకు ఈ కూటమి గురించి బాహ్య ప్రపంచానికి తెలీదు. న్యూజిలాండ్‌కు చెందిన ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టు నిక్కీ హేగర్, అమెరికన్ జర్నలిస్టు జేమ్స్ బామ్‌ఫోర్డ్, బ్రిటిష్ జర్నలిస్టు డంకెన్ క్యాంప్‌బెల్ పరిశోధనాత్మక కథనాలతో ఈ కూటమి గురించి అందరికీ తెలిసింది. 2013లో అమెరికాకు చెందిన జాతీయ భద్రతా సంస్థ సభ్యుడైన ఎడ్వర్ స్నోడెన్ ఈ కూటమి కార్యకలాపాలకు సంబంధించిన రహస్య పత్రాలను విడుదల చేయడంతో ఫైవ్ ఐస్‌పై చర్చ జరిగింది. మళ్లీ ఇన్నేళ్లకి ఆ అయిదు కళ్ల కూటమితో ట్రూడో సంప్రదింపులు జరుపుతూ ఉండడం తిరిగి తెరపైకి వచ్చింది.

సమాచార మార్పిడి ఇలా..!

➤ మానవ మేధ, సిగ్నల్ ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ ఇంటెలిజెన్స్, భౌగోళిక, ఉపగ్రహ ఆధారిత ఇంటెలిజెన్స్ సమాచారాన్ని ఒకరికొకరు పంచుకుంటాయి. రాడార్లు, ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్కింగ్ ద్వారా సమాచార మార్పిడి జరుగుతుంది. ఉపగ్రహ ఛాయాచిత్రాలను కూడా పంచుకుంటూ భద్రతాపరంగా హెచ్చరికలు పంపుకుంటూ ఉంటాయి.

ఏ సమయంలో సహకరించుకున్నాయి?

➤ వియత్నాం యుద్ధం, ఫాక్‌ల్యాండ్స్ యుద్ధం , గల్ఫ్ వార్, ఇరాన్ ప్రధాని మహమ్మద్ మొసాదిని పదవీచ్యుతుడిని చేయడం, చిలీ అధ్యక్షుడు సాల్వడార్ అలెండెను గద్దె దింపడం, ఉగ్రవాదంపై పోరాటం సమయంలో ఈ దేశాలు మూడో కంటికి తెలీకుండా సమాచారాన్ని అందించుకున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇప్పుడేం జరుగుతోంది?

మన దేశంలో జరిగిన జీ-20 సదస్సు కంటే ముందే ట్రూడో అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాధినేతలతో చర్చలు జరిపి నిజ్జర్ హత్య వెనుక భారత్ ప్రమేయం ఉందని తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఈ అంశాన్ని భారత్ దగ్గర ప్రస్తావించాలంటూ ఆయా దేశాల అధినేతలతో సంప్రదింపులు జరిపినట్టు వివిధ అంతర్జాతీయ పత్రికలు కథనాలు వెల్లడించాయి. నిజ్జర్ హత్యపై దర్యాప్తుకి భారత్ సహకరించేలా ఒత్తిడి పెంచాలని ట్రూడో స్వయంగా బైడెన్, రిషి సునాక్ వంటి వారిని కోరారు. అయితే ఈ



హత్యను బహిరంగంగా ఖండించడానికి నిరాకరించిన ఆయా దేశాలు దర్యాప్తు మరింతగా లోతుగా జరగాలని మాత్రమే అంటున్నాయి. ఈ దర్యాప్తుకి భారత్ సహకరించాలని అమెరికా అంటే, బ్రిటన్ కూడా అదే మాట మీదుంది. అయితే భారత్‌తో తమకున్న వాణిజ్య అంశాలపై దీని ప్రభావం ఉండబోదని బ్రిటన్ స్పష్టం చేసింది. నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయంపై తమ దగ్గర ఆధారాలున్నాయని ట్రూడో చెబుతూ ఉంటే, మరింత లోతుగా విచారణ చేయాలని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సూచిస్తున్నాయి. వాస్తవాలు బయటపడేవరకు తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని న్యూజిలాండ్ తెగేసి చెప్పేసింది. దీంతో ట్రూడో భారత్‌ను రెచ్చగొట్టేలా దౌత్యపరమైన చర్యలకు దిగుతూ రాయబారుల్ని దేశం నుంచి వీడి వెళ్లాలని ఆదేశించారు. భారత్ మరో అడుగు ముందుకు వేసి కెనడా పౌరుల వీసాలను కూడా నిలిపివేసింది. ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో ట్రూడో నాయకత్వ పటిమపై వ్యతిరేకత ఎదురు కావడం ఆయనకు గట్టి షాక్ ఇచ్చింది. ఆయనకున్న పాపులారిటీ 31శాతానికి పడిపోయిందని తాజా సర్వేలో వెల్లడైంది.

అక్కడి నుంచే సమాచారం

- నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఆరోపణలపై కెనడా మీడియా
- ఫైవ్ ఐస్ నెట్‌వర్క్ నుంచే కెనడాకు సమాచారం

టొరంటో: ఖలిస్తాన్ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ ప్రమేయం ఉందని కెనడా చేసిన ఆరోపణలకు ఫైవ్ ఐస్ నెట్‌వర్క్ అందించిన సమాచారమే ఆధారమని తెలుస్తోంది. ఈ అంశానికి సంబంధించి కెనడా ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ ఆ దేశ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. జూన్ 18న బ్రిటిష్ కొలంబియాలోని ఒక గురుద్వారాలో నిజ్జర్‌ను దుండగులు కాల్చి చంపిన తర్వాత కెనడా ప్రభుత్వం సాగించిన విచారణలో అయిదు కళ్ల కూటమిలో ఒక భాగస్వామ్య దేశం అందించిన సమాచారం ఆధారంగానే భారత్ ప్రమేయం ఉందన్న అనుమానాలు వచ్చాయని సీబీసీ న్యూస్ ఒక కథనంలో వెల్లడించింది. కెనడాలో భారత్ దౌత్యవేత్తల కమ్యూనికేషన్లకు సంబంధించిన సమాచారాన్ని కూడా ఆ దేశం కెనడాకు పంపినట్టుగా తెలిపింది. మానవ మేధస్సు, సిగ్నల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆ దేశం పంపిన సమాచారంలో భారత్ ప్రమేయంపై అనుమానాలున్నట్టు తెలుస్తోంది. కెనడాతో పాటు అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలు సభ్యత్వం ఉన్న ఆ కూటమిలో ఏ దేశం భారత్ ప్రమేయం ఉందని చెబుతున్న సమాచారం అందించిందో సీబీసీ న్యూస్ వెల్లడించలేదు.

కెనడాలో విద్వేషానికి చోటు లేదు

భారత్, కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న వేళ హిందువుల్ని బెదిరిస్తున్న వీడియో మరింతగా ఆందోళనల్ని పెంచుతోంది. కెనడాలో నివసిస్తున్న హిందువులు దేశం వీడి వెళ్లిపోవాలంటూ బెదిరింపులకు దిగిన ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ వీడియోపై స్పందించిన కెనడా ప్రభుత్వం ఇలాంటి విద్వేషపూరితమైన చర్యలకి తమ దేశంలో చోటు లేదని పేర్కొంది. కెనడాలో నివసిస్తున్న వారెవరూ భయాందోళనలకు లోనుకావల్సిన పని లేదని హామీ ఇచ్చింది.

భారత్‌కు ప్రత్యేక మినహాయింపులుండవ్: అమెరికా

ఖలిస్తాన్ అంశంలో కెనడా, భారత్ మధ్య రగిలిన చిచ్చుపై అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాక్ సలీవాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నిజ్జర్ హత్య వెనుక భారత్ ప్రమేయం ఉందన్న ఆరోపణలకు సంబంధించి తాము భారత్ దౌత్యవేత్తలతో నిరంతరం సంప్రదింపులు చేస్తున్నామన్నారు. ఈ అంశంలో భారత్‌కు ప్రత్యేకంగా ఎలాంటి మినహాయింపులు ఉండవన్నారు. భారత్‌తో బంధాల బలోపేతం కోసమే కెనడా వైపు అమెరికా మాట్లాడడం లేదన్న ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కెనడాతో తమకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు.

లోక్‌సభలో డానిష్ అలీపై వివాదాస్పద వ్యాఖ్యలు

ఎంపీ బిధూరికి బీజేపీ నోటీస్

న్యూఢిల్లీ: లోక్‌సభలో చంద్రయాన్-3 మిషన్ విజయవంతంపై చర్చ సందర్భంగా బీఎస్పీ ఎంపీ డానిష్ అలీపై బీజేపీ ఎంపీ రమేశ్ బిధూరి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు కలకలం రేపాయి. గురువారం రాత్రి లోక్‌సభలో తమ పార్టీ ఎంపీ బిధూరి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఖండిస్తూ షోకాజ్ నోటీసు జారీ చేసింది. 15 రోజుల్లోగా సమాధానమివ్వాలని ఎంపీ బిధూరీని ఆదేశించింది. ఎంపీ బిధూరి వ్యాఖ్యలపై రక్షణమంత్రి రాజ్‌నాథ్ విచారం వ్యక్తం చేశారు. బిధూరి వ్యాఖ్యలను తీవ్రమైనవిగా పరిగణిస్తున్నామని స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. భవిష్యత్తులో మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఆయనపై కఠిన చర్యలు తప్పవని స్పీకర్ హెచ్చరించారు. ఆ వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించినట్లు ప్రకటించారు. ముస్లిం ఎంపీని ఉద్దేశిస్తూ చేసిన అన్ పార్లమెంటరీ వ్యాఖ్యల వీడియో వైరల్ అవుతోంది. సదరు ఎంపీని సభ నుంచి సస్పెండ్ చేయాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఘటనపై బీఎస్పీ చీఫ్ మాయావతి స్పందించారు. రమేశ్ బిధూరీకి బీజేపీ షోకాజ్ నోటీసు ఇవ్వడం, మంత్రి రాజ్‌నాథ్ క్షమాపణ చెప్పడం సరే కానీ, సదరు ఎంపీపై సరైన చర్యలు తీసుకోకపోవడం విచారకరమని అన్నారు. కాంగ్రెస్, ఎన్సీపీ, టీఎంసీ, డీఎంకే నేతలు రమేశ్ బిధూరి వ్యాఖ్యల విషయాన్ని ప్రివిలేజ్ కమిటీకి పంపాలంటూ స్పీకర్ ఓం బిర్లాకు వేర్వేరుగా లేఖలు రాశారు.

ప్రివిలేజ్ కమిటీకి నివేదించండి: స్పీకర్‌కు డానిష్ అలీ లేఖ



లోక్‌సభలో బీజేపీ ఎంపీ రమేశ్ బిధూరి తనను అసభ్య పదజాలంతో దూషించడం విద్వేష ప్రసంగం కిందికే వస్తుందని, విషయాన్ని ప్రివిలేజ్ కమిటీకి పంపాలని బీఎస్పీ ఎంపీ డానిష్ అలీ స్పీకర్ ఓం బిర్లాను కోరారు. విద్వేష ప్రసంగం వినడానికి ప్రజలు తనను పార్లమెంట్‌కు పంపలేదన్నారు. తక్షణమే ఈ అంశంపై విచారణ చేయించాలని స్పీకర్‌ను కోరారు. బిధూరిపై చర్యలు తీసుకోకుంటే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. ఎంపీ బిధూరి వాడిన అత్యంత దుర్మార్గమైన భాష తీరని వేదన కలిగించిందన్నారు. అవి లోక్‌సభ రికార్డులో భాగమని కూడా తెలిపారు. 'ఇది అత్యంత దురదృష్టకరం. స్పీకర్‌గా మీ నేతృత్వంలోని పార్లమెంట్ కొత్త భవనంలో ఇలా జరగడం ఈ గొప్ప దేశంలోని మైనారిటీ వర్గానికి చెందిన ఎంపీగా నాకు తీవ్ర హృదయ వేదన కలిగించింది'అని డానిష్ అలీ తెలిపారు. విచారణ జరిపి నివేదిక అందించేందుకు లోక్‌సభ ప్రొసీజర్ అండ్ కాండక్ట్ ఆఫ్ బిజినెస్‌లోని రూల్ నంబర్ 227 కింద ప్రివిలేజ్ కమిటీకి ఈ విషయాన్ని రెఫర్ చేయాలని స్పీకర్‌ను ఆయన కోరారు.

సుస్థిర ప్రభుత్వం వల్లే మహిళా బిల్లుకు ఆమోదం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- దశాబ్ద కాలంలో మహిళా శక్తి పెరిగింది
- అందుకే బిల్లుకు అన్ని పార్టీల మద్దతు
- మోదీని సత్కరించిన బీజేపీ మహిళా మోర్చా

న్యూఢిల్లీ: కేంద్రంలో పూర్తి మెజార్టీతో కూడిన బలమైన, సుస్థిరమైన, నిర్ణయాత్మక ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకోవడం వల్లే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. బిల్లుకు రికార్డు స్థాయిలో మద్దతు లభించిందని, చిరకాలం నాటి కల సాకారమైందని అన్నారు. పూర్తి మెజార్టీతో కూడిన స్థిరమైన ప్రభుత్వం అధికారంలో ఉంటే గొప్ప నిర్ణయాలు తీసుకోవచ్చని ఈ పరిణామం నిరూపిస్తోందని తెలిపారు. బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో పార్టీ మహిళా ఎంపీలు, నేతలు శుక్రవారం ఢిల్లీలో ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, స్మృతి ఇరానీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగించారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం అనేది సాధారణ చట్టం కాదని చెప్పారు. ఇది నవ భారతదేశంలో నూతన ప్రజాస్వామిక అంకితభావ తీర్మానమని స్పష్టం చేశారు. గతంలో మహిళా రిజర్వేషన్ల బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా అడ్డుకున్న ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలు ఇప్పుడు తాము తీసుకొచ్చిన బిల్లుకు మద్దతిచ్చాయని గుర్తుచేశారు. గత దశాబ్ద కాలంలో తమ ప్రభుత్వ హయాంలో మహిళా శక్తి పెరిగిందని, అందుకే బిల్లుకు అన్ని పార్టీల మద్దతు లభించిందని వివరించారు.

గౌరవాన్ని పెంచితే తప్పేమిటి?

మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావడం కంటే ముందే మహిళల అభివృద్ధి, సాధికారత కోసం ఎన్నో పథకాలు, కార్యక్రమాలు అమల్లోకి తీసుకొచ్చామని ప్రధాని మోదీ వెల్లడించారు. అన్ని స్థాయిల్లో మహిళల స్థితిగతులను మెరుగుపర్చడమే లక్ష్యంగా పనిచేశామన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యక్తుల రాజకీయ ప్రయోజనాలు అడ్డుపడకుండా చర్యలు చేపట్టామన్నారు. గతంలో ఈ బిల్లు విషయంలో అప్పటి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించలేదని ఆక్షేపించారు. మహిళలను కించపర్చే ప్రయత్నాలు జరిగాయని అన్నారు. మహిళా బిల్లుకు 'నారీశక్తి వందన్' అనే పేరుపెట్టడం పట్ల విపక్ష ఎంపీలు చేస్తున్న ఆరోపణలను మోదీ తిప్పికొట్టారు. మహిళామణుల గౌరవాన్ని పెంచితే తప్పేమిటని ప్రశ్నించారు. బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించే అవకాశం తమ ప్రభుత్వానికి దక్కడం అదృష్టంగా భావిస్తున్నామని మోదీ వ్యాఖ్యానించారు. మూడు దశాబ్దాల బీజేపీ ఆకాంక్ష నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు.






శుక్రవారం ఢిల్లీలో తనను సన్మానిస్తున్న కార్యకర్తలకు నమస్కరిస్తున్న ప్రధాని మోదీ.. హర్షధ్వానాలు చేస్తున్న మహిళా కార్యకర్తలు

మహిళల్లో నూతన విశ్వాసం

కొన్ని నిర్ణయాలకు దేశ భవిష్యత్తు మార్చే శక్తి ఉంటుందని, ప్రతిపాదిత మహిళా రిజర్వేషన్ చట్టం కూడా వాటిలో ఒకటని ప్రధానమంత్రి అన్నారు. ఈ చట్టం మహిళల్లో నూతన విశ్వాసాన్ని నింపుతుందని, దేశాన్ని బలోపేతం చేస్తుందని చెప్పారు. ఈ నెల 20, 21న కొత్త చరిత్ర నమోదైందని, దీని గురించి భవిష్యత్తు తరాలు చర్చించుకుంటాయని పేర్కొన్నారు. 'మోదీ గ్యారంటీలు' అమలవుతాయని చెప్పడానికి మహిళా బిల్లే ఒక నిదర్శనమని చెప్పారు. మహిళల సారథ్యంలో అభివృద్ధి అనే నూతన శకంలోకి అడుగుపెట్టబోతున్నామని ప్రకటించారు. భారత్‌ను చంద్రుడిపైకి చేర్చడంలో మహిళల పాత్ర కీలకమని ప్రశంసించారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ... గత ప్రభుత్వాలు బుజ్జగింపు రాజకీయాలు చేశాయని విమర్శించారు. మోదీ ప్రభుత్వం మహిళా సాధికారతే ధ్యేయంగా ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు.

ఉక్రెయిన్‌కు మరో రూ.2,695 కోట్ల సాయం

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటన



వాషింగ్టన్: రష్యా సైనిక చర్య వల్ల ఎంతగానో నష్టపోయిన ఉక్రెయిన్‌కు ఇప్పటికే వివిధ రూపాల్లో సాయం అందించిన అగ్రరాజ్యం అమెరికా మరో భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. భద్రతా సాయం కింద ఉక్రెయిన్‌కు 325 మిలియన్ డాలర్లు (రూ.2,695 కోట్లు) ఇవ్వనున్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వెల్లడించారు. ఆయన తాజాగా వైట్‌హౌస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమయ్యారు. రష్యాతోయుద్ధంపై వారు చర్చించుకున్నారు. రష్యా దురాక్రమణ నుంచి ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని కాపాడడమే తమ కర్తవ్యమని బైడెన్ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ ప్రజలు అంతులేని ధైర్య సాహసాలు ప్రదర్శిస్తున్నారని ప్రశంసించారు. ఆయుధాలు, పేలుడు పదార్థాలు, క్షిపణి నిరోధక వ్యవస్థలు సహా ఉక్రెయిన్‌కు రూ.2,695 కోట్ల సాయం అందజేయబోతున్నామని తెలిపారు. అబ్రామ్స్ యుద్ధ ట్యాంకులను వచ్చేవారం ఉక్రెయిన్‌కు ఇస్తామని వివరించారు.

ఐరాసలో పాక్ నోట మళ్లీ 'కశ్మీర్' మాట

ఐక్యరాజ్యసమితి: ఐక్యరాజ్యసమితిలో కశ్మీర్ అంశాన్ని మరోసారి పాకిస్తాన్ ప్రస్తావించింది. భారత్‌తో సంబంధాలు సజావుగా కొనసాగేందుకు కశ్మీరే కీలకమని పాక్ ఆపద్ధర్మ ప్రధాని అన్వరుల్ హక్ కకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఆయన ప్రసంగించారు. భారత్ సహా అన్ని పొరుగు దేశాలతో సత్సంబంధాలు కొనసాగించాలని పాకిస్తాన్ కోరుకుంటోందని చెప్పారు. అయితే, భారత్‌తో సంబంధాల విషయంలో మాత్రం కశ్మీరే కీలకమన్నారు. కశ్మీర్‌కు సంబంధించి భద్రతా మండలి చేసిన తీర్మానాలన్నిటినీ అమలయ్యేలా చూడాలని కోరారు. ఐరాస మిలటరీ అబ్జర్వర్ గ్రూప్ ఆఫ్ ఇండియా అండ్ పాకిస్తాన్(యూఎన్ఎంవోజీఐపీ)ని తిరిగి అమల్లోకి తేవాలని కకర్ అన్నారు. వ్యూహాత్మక, సంప్రదాయ ఆయుధాలపై పరస్పర నియంత్రణకు సంబంధించిన పాక్ ప్రతిపాదనను అంగీకరించేలా భారత్‌పై ఒత్తిడి తేవాలన్నారు.

బీజేపీతో చేతులు కలిపిన జేడీఎస్

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలో కలిసి పోటీ చేయాలని బీజేపీ, జేడీఎస్ నిర్ణయించాయి. ఢిల్లీలో హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డాలతో జేడీఎస్ నేత కుమారస్వామి కలిసి చర్చలు జరిపారు. అనంతరం జేపీ నడ్డా..'నేషనల్ డెమోక్రాటిక్ అలయెన్స్(ఎన్డీఏ)లో చేరేందుకు జేడీఎస్ నిర్ణయించుకుందని తెలుపుతున్నందుకు సంతోషంగా ఉంది. ఆ పార్టీని ఎన్డీఏలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాము. ఈ పరిణామంతో ఎన్డీఏకు, 'నవీన భారతం, సుదృఢ భారతం' అనే ప్రధాని మోదీజీ దార్శనికతకు మరింత బలం చేకూరనుంది'అని శుక్రవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. 'బీజేపీతో జట్టు కట్టేందుకు నిర్ణయించుకున్నాము. సీట్ల పంపకంపై చర్చలు సాగుతాయి'అని కుమారస్వామి సైతం ప్రకటించారు.

ఉదయనిధి స్టాలిన్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

సాక్షి, చెన్నై: సనాతన ధర్మానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలని తమిళనాడుప్రభుత్వానికి, రాష్ట్రక్రీడల మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కి సుప్రీంకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఇటీవల ఓ కార్యక్రమంలో సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఉదయనిధిపై కేసు నమోదు సహా చర్యలు తీసుకోవాలని కోరుతూ చెన్నైకి చెందిన జగన్నాథ్ పిటిషన్ వేశారు. దీనిపై శుక్రవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిల ధర్మాసనం విచారణ జరిపింది. 'ఈ అంశంపై ఇప్పటికే నోటీసు ఇచ్చాం. కానీ, కేసు నమోదు చేయాలంటూ పోలీస్ స్టేషన్‌కు వచ్చినట్లుగా సుప్రీంకోర్టుకు వచ్చారు. మీరు హైకోర్టుకు వెళ్లాల్సింది'అని ధర్మాసనం పేర్కొంది. దీనిపై సీనియర్ న్యాయవాది శేషాద్రి నాయుడు స్పందిస్తూ..'ఉదయనిధి మంత్రి అయినందువల్ల పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదు'అని విన్నవించారు. దీంతో, సనాతన ధర్మానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని ఉదయనిధికి ధర్మాసనం ఆదేశించింది.

నిర్ణీత సమయానికి మించి పనిచేసిన పార్లమెంట్

న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సెషన్‌లో లోక్‌సభ, రాజ్యసభలు షెడ్యూల్ సమయానికి మించి పనిచేశాయి. 17వ లోక్‌సభ సెషన్లలో ఎటువంటి వాయిదాలు లేకుండా పూర్తి సమయంపాటు కార్యకలాపాలు కొనసాగించిన ఏకైక సెషన్ కూడా ఇదే. ఈ విషయాలను పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ తెలిపింది. గురువారంతో ముగిసిన ఈ ప్రత్యేక సెషన్‌లో 75 ఏళ్ల పార్లమెంట్ ప్రస్థానం, చంద్రయాన్-3 మిషన్ విజయవంతంపై చర్చ జరిగింది. ఒకే ఒక్క మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. స్పెషల్ సెషన్‌లో లోక్‌సభ షెడ్యూల్ సమయం 22 గంటల 45 నిమిషాలు కాగా ఎనిమిదిగంటల కంటే ఎక్కువగా మొత్తం 31 గంటలపాటు పనిచేయడం విశేషం. దీంతో, లోక్‌సభ 137 శాతం ఎక్కువ సమయం పనిచేసింది. అదే విధంగా, రాజ్యసభ షెడ్యూల్ సమయం 21 గంటల 45 నిమిషాలు కాగా, 27 గంటల 44 నిమిషాల సేపు కార్యకలాపాలు సాగాయి. దీంతో, రాజ్యసభ 128 శాతం ఎక్కువ సమయం పనిచేసినట్లయిందని పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ వివరించింది.

ఓబీసీలను అధికారానికి దూరం చేశారు



గత కుల గణన లెక్కలు బయటపెట్టాలి: రాహుల్
- తాజా కుల గణనకు డిమాండ్
- మహిళా రిజర్వేషన్లను తక్షణం అమలు చేయాలి

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణం అమల్లోకి తేవాలని కాంగ్రెస్ సీనియర్ ఎంపీ రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. యూపీఏ హయాంలో తాము ప్రతిపాదించిన బిల్లులో ఓబీసీ మహిళలకు రిజర్వేషన్లను వర్తింపజేస్తామని పేర్కొనపోవడం పట్ల తనకిప్పటికీ ఎంతగానో ఆవేదనగా ఉందని చెప్పారు. ఇప్పుడు వారికి రిజర్వేషన్ కోసం పట్టుబడతామని ఒక ప్రశ్నకు బదులుగా స్పష్టం చేశారు. మోదీ సర్కారు ఫక్తు రాజకీయ కారణాలతోనే మహిళా బిల్లు తెచ్చిందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లులో ఓబీసీలకు ప్రత్యేక కోటా పెట్టకపోవడం ద్వారా వారిని అధికారానికి దూరం చేసిందని రాహుల్ కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కేంద్రం తక్షణం కుల గణన చేపట్టి, ఆ వివరాలను అందరికీ తెలిసేలా బహిరంగపరచాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఇతర సామాజిక వర్గాల మహిళలకు కూడా వారి జనాభా నిష్పత్తి ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దృష్టి మళ్లించే నాటకమే

పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను అధికార బీజేపీ ప్రతిపాదించినప్పుడు తాము ఆహ్వానించామని రాహుల్ అన్నారు. 'ఆ సందర్భంగా ఎంపీలమంతా అట్టహాసంగా పార్లమెంటు పాత భవనంలో నుంచి కొత్త భవనంలోకి మారాం కూడా. మోదీ కూడా అత్యంత నాటకీయ ఫక్కీలో రాజ్యాంగ ప్రతిని చేబూనారు. 'అతి ముఖ్యమైన బిల్లును ఆమోదించబోతున్నాం, అంతా సహకరించండి' అని అన్నారు. ఆయన ప్రతిపాదించిన మహిళా బిల్లు నిస్సందేహంగా వారి సాధికారత దిశగా కీలక అడుగు. కానీ జన గణన, డీ లిమిటేషన్ రూపంలో రెండు మెలికలు పెట్టారు. వాటి వల్ల అది మరో పదేళ్లకు గానీ అమల్లోకి రాదు. ఇది ఫక్తు సమస్యల నుంచి దృష్టి మళ్లించే కుట్ర' అని ఆరోపించారు.

అధిక సంఖ్యాకులకు అధికారమేది?

కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి హోదాలో కేవలం ముగ్గురు ఓబీసీలు మాత్రమే ఉన్నారని తెలిసి తాను షాకయ్యానని రాహుల్ అన్నారు. 'ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు కలిపి బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు కేవలం ఆరు శాతం! ప్రధాని మోదీ మాట్లాడితే తాను ఓబీసీ నేతను అంటుంటారు. వారి చేతుల్లో అధికారం లేని ఈ దురవస్థకు కారణం ఏమిటో ఆయనే చెప్పాలి. ఈ చేదు నిజాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు దేశంలో ఓబీసీలు ఎందరు? ఇతర సామాజికవర్గాల వారు ఎందరు? ఇవిప్పుడు కీలక ప్రశ్నలు. అందుకే మేం కుల గణనకు డిమాండ్ చేస్తున్నాం' అని చెప్పారు. 'దేశ ప్రజలకు అధికారాన్ని బదలాయించాలంటే ఈ సామాజిక గణాంకాలు తెలియడం చాలా అవసరం. జన గణన ఇప్పటికే జరిగింది గనుక ఈ లెక్కలన్నీ ఇప్పటికే కేంద్రం వద్ద అన్నాయి. ప్రధాని మోదీ వాటిని ఎందుకు విడుదల చేయడం లేదు?' అని రాహుల్ ప్రశ్నించారు.

వారికి భాగస్వామ్యం ఉందా?

తమ పార్టీలో అత్యధిక సంఖ్యలో ఓబీసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారన్న బీజేపీ వాదనను రాహుల్ ఎద్దేవా చేశారు. 'చట్టాల రూపకల్పనలో, దేశ ద్రవ్య వినిమయంలో వారు ఏ మేరకు పాలుపంచుకుంటున్నారో అడగండి. అసలే లేదని వారే అంగీకరిస్తారు' అన్నారు. ప్రజాస్వామ్య దేవాలయంగా చెప్పుకునే లోక్ సభలో బీజేపీ ఎంపీలకు వాస్తవంలో ఎలాంటి అధికారాలూ లేవని రాహుల్ అన్నారు. వారు కేవలం ఉత్సవ విగ్రహాలుగా మాత్రమే ఉన్నారన్నారు. ఒక బీజేపీ ఎంపీయే తనకు ఈ విషయం చెప్పారన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



తిరుమలకు కూరగాయలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ధర్మజ్యోతి ఆధ్యాత్మిక సాంస్కృతిక సేవా సంఘం వారు ఈ నెల 24న తిరుమలలో జరిగే నిత్యాన్నదానానికి 10వేల కిలోల కూరగాయలు పంపుతున్నారు.



జిల్లా సాఫ్ట్ బాల్ జట్ల ఎంపిక

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కర్నూలులో వచ్చే నెలలో జరగనున్న 10వ రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్ బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టును శుక్రవారం ఎంపిక చేశారు.



బై బై...గణేశా...

ఉమ్మడి కృష్ణా జిల్లాలో వినాయక నిమజ్జనాలు శుక్రవారం కూడా కొనసాగాయి. వివిధ పందిళ్లలో పూజించిన విగ్రహాలను భారీ ఊరేగింపులతో భక్తులు తీసుకువెళ్లి సమీప కాలువలలో నిమజ్జనం చేశారు.

భూముల రీసర్వే భళా!

- ఎన్టీఆర్ జిల్లాలో 299 గ్రామాల్లో డ్రోన్ ఫ్లై పూర్తి
- మొదటి దశ 14 గ్రామాల్లో ఎల్‌పీఎం బేస్డ్ రిజిస్ట్రేషన్లు కూడా...
- రెండో దశ 15 గ్రామాల్లో పూర్తయిన స్టోన్ ప్లాంటేషన్
- మూడో దశ 100 గ్రామాల్లో జనవరి 15 నాటికి భూహక్కు పత్రాలు ఇచ్చేలా ప్రణాళిక

డెబ్బై ఐదేళ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో దేశంలో ఏ రాష్ట్రంలోనూ, ఏ ముఖ్యమంత్రీ చేయడానికి సాహసించని కార్యాన్ని మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారు. ఎప్పుడో బ్రిటిష్ వారి హయాంలో వారు శిస్తు వసూళ్ల కోసం భూములు సర్వే చేశారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు మన పాలకులకు ఆ రికార్డులే ఆధారం. వందేళ్ల తర్వాత ఇప్పుడు ఈ సాహసోపేత కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం తలకెత్తుకుంది. అంతేకాదు భవిష్యత్తులో ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా ఆధునిక సాంకేతికతతో రీ సర్వే చేసి ఎటువంటి ట్యాంపరింగ్‌కు అవకాశం లేనివిధంగా భూహక్కు పత్రాలు రూపొందించి గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు కూడా చేస్తోంది.



జగ్గయ్యపేట మండలం షేర్ మహ్మద్ పేటలో వైఎస్సార్ జగనన్న శాశ్వత హక్కు భూరక్ష, భూసర్వే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వైఎస్సార్ జగనన్న శాశ్వత హక్కు, భూరక్ష పథకానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. సమగ్ర భూసర్వే ద్వారా రెవెన్యూ విభాగంలోనే విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట మండలంలోని షేర్ మహమ్మద్ పేటలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020 డిసెంబరు21వ తేదీన తన జన్మదినం నాడు లాంఛనంగా ప్రారంభించారు. రీ సర్వే కోసం అధికారులు అత్యాధునిక టెక్నాలజీతో కూడిన డ్రోన్‌లను వినియోగిస్తున్నారు. జిల్లాలో 300 గ్రామాలను నోటిఫై చేయగా ఇందులో 299 గ్రామాల్లో డ్రోన్ కార్యకలాపాలు పూర్తయ్యాయి. మొదటి దశలో 14 గ్రామాల్లో రీసర్వేకు శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామాల్లో వెబ్ ల్యాండ్ అప్‌డేషన్, గ్రామ ల్యాండ్ రిజిస్టర్‌ల అప్‌డేషన్, గ్రామ ఖాతా రిజిస్టర్‌ల స్వచ్ఛీకరణ పూర్తి చేశారు. స్టోన్ ప్లాంటేషన్ కూడా పూర్తయింది. ఎవ్వరూ టాంపర్ చేయని విధంగా భూహక్కు పత్రాల పంపిణీని పూర్తి చేశారు. అక్కడ సర్వే నంబర్ల ఆధారంగా కాకుండా ఎల్‌పీఎం(ల్యాండ్ పార్శిల్ మ్యాపుల) ఆధారంగా రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఆటో మ్యూటేషన్‌లు జరుగుతున్నాయి.

మొదటి దశలో సర్వే పూర్తయిన గ్రామాలు : పరిటాల, షేర్ మహమ్మద్ పేట, వామకుంట, ముష్టికుంట్ల, చిట్టేల, ఆంజనేయపురం, చంద్రుపట్ల, రాజవరం, చెన్నవరం, గంపలగూడెం, కనుమూరు, అనుముల్లంక, వినగడప, మారేపల్లి. ఇక్కడ మొత్తం భూకమతాలకు సంబంధించి పటాల సంఖ్య 22,978 కాగా, మొత్తం 12,277 మంది భూ యజమానులకు భూహక్కు పత్రాలు అందించారు.

రెండో దశలో...

రెండో దశలో బోదవాడ, చౌటపల్లి, రామాపురం, దాచవరం, పల్లంపల్లి, జగన్నాథపురం, వీరులపాడు, కత్రేనిపల్లి, బ్రహ్మబొట్లపాలెం, మునగలపల్లి, పెండ్యాల, పెరికలపాడు, పొలగిరి, సుబ్బాయగూడెం, షాబాద మొత్తం 15 గ్రామాలను రీసర్వే కోసం ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో ఇప్పటికే గ్రౌండ్ ట్రూతింగ్, వెక్టరైజేషన్, ఫైనల్ ఆర్ఓఆర్ ప్రక్రియ పూర్తయింది. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో శరవేగంగా స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ జరుగుతోంది. జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్ కుమార్ స్వయంగా క్షేత్ర స్థాయికి వెళ్లి ఆ ప్రక్రియను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ గ్రామాల్లో ఏ క్లాస్ స్టోన్‌లు 56, బీ క్లాస్ స్టోన్‌లు 12912 మొత్తం 12,968 స్టోన్‌లు ప్లాంటేషన్ చేయాల్సి ఉండగా ఇందులో ఇప్పటికే 3684 స్టోన్‌లకు సంబంధించి ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తయింది. మిగిలిన పని యుద్ధప్రాతిపదికన సాగుతోంది. రెండోదశకు సంబంధించి గురువారం నుంచి భూహక్కు పత్రాల పంపిణీ ప్రక్రియ సైతం ప్రారంభించారు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న సమస్యలు తొలగిపోయి, భూ యజమానులకు క్లియర్ టైటిల్ లభిస్తోందన్న ఆనందం భూ యజమానుల్లో సైతం వ్యక్తం అవుతోంది.

మూడోదశలో...

జిల్లాలో మూడో దశలో 100 గ్రామాలను రీసర్వే కోసం ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో సమగ్ర భూసర్వే కార్యక్రమం వేగంగా సాగుతోంది. ఇప్పటికే 85 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ పూర్తయింది. జనవరి 15 నాటికి భూహక్కు పత్రాలు అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోల్ మోడల్‌గా రీసర్వే ప్రాజెక్టు



రాష్ట్రంలో చేస్తున్న రీసర్వే ప్రాజెక్టు అనేక రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తోంది. జిల్లాలో మొదటి దశలో 14 గ్రామాల్లో రీసర్వే పూర్తయి, భూహక్కు పత్రాలను అందజేశాం. అక్కడ ఎల్‌పీఎం ఆధారంగా రిజిస్ట్రేషన్లు కూడా జరుగుతున్నాయి. గ్రామ సచివాలయాల పరిధిలోనే రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్‌లో ఆటో మ్యూటేషన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

–డాక్టర్ సంపత్‌కుమార్, జేసీ, ఎన్టీఆర్ జిల్లా

భూ వివాదాలకు చెక్



వైఎస్సార్–జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా భూ వివాదాల సమస్య శాశ్వతంగా తొలగింది. ప్రభుత్వం రైతులపై భారం పడకుండా సర్వే ఖర్చు అంతా తానే భరించింది. భూములను సర్వే చేసి హద్దు రాళ్లను ఏర్పాటు చేసింది. భూహక్కు పత్రాలను కూడా అందించింది. దీంతో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటుతో పాటు ఆటో మ్యూటేషన్ కూడా చేసుకోవచ్చు.

–ఉడుగూరి శివకృష్ణ, రైతు, షేర్ మహమ్మద్ పేట, జగ్గయ్యపేట మండలం

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి చెన్నైకు చెందిన భక్తులు శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. చెన్నై చెట్‌పేట్‌కు చెందిన డి.ఫణీంద్రరావు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి డి.ఫణీంద్రరావు, డీఎల్‌వీఆర్ మాధవ్ పేరిట రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు బచ్చు మాధవీకృష్ణ, కేసరి నాగమణి పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో 14.3 మి.మీ. సగటు వర్షపాతం



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో శుక్రవారం 14.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చల్లపల్లి మండలంలో 95.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా ఉయ్యూరు, గుడివాడ మండలాల్లో 0.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో మిగిలిన మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. ఘంటసాల మండలంలో 62.8 మి.మీ., మచిలీపట్నం 27.2, అవనిగడ్డ 24.6, పెడన 21.2, మోపిదేవి 20.2, మొవ్వ 18.0, గూడూరు 17.2, నందివాడ 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కృత్తివెన్ను మండలంలో 10.4 మిల్లీమీటర్లు, పమిడిముక్కల 10.0, గుడ్లవల్లేరు 8.8, బంటుమిల్లి 6.2, బాపులపాడు 5.6, ఉంగుటూరు 5.2, నాగాయలంక 3.8, పామర్రు 3.4, కోడూరు 2.8, పెదపారుపూడి మండలంలో 1.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గన్నవరం, కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు మండలాల్లో వర్షం కురవలేదు.

జాతీయ స్థాయి సాహితీ, సాంస్కృతిక పోటీలు



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల రజతోత్సవం పురస్కరించుకుని శుక్రవారం జాతీయ స్థాయి సాహితీ, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ రంగస్థల నటుడు మహ్మద్ ఖాజీవలీ ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కళాశాల చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమం కోసమే పోలీస్ వెల్ఫేర్ డే



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర డీజీపీ ఉత్తర్వుల మేరకు పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం సీపీ టీకే రాణా 'పోలీస్ వెల్ఫేర్ డే' కార్యక్రమం నిర్వహించారు. ఈ పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నుంచి బదిలీలు, సర్వీసుకు సంబంధించిన వివిధ సమస్యలపై వచ్చిన 19 ఫిర్యాదుల గురించి వారితో స్వయంగా సీపీ టీకే రాణా మాట్లాడి వాటిని సత్వరం పరిష్కరించవలసినదిగా సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం జరిగే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది స్వయంగా తమ సమస్యలను విన్నవించిన వెంటనే వాటిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం దృష్ట్యా నిర్వహించే ఈ పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని అవసరం ఉన్న సిబ్బంది సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలియజేశారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు ప్రతిపాదనలు సిద్ధం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ– 2024 లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, తుది ఓటర్ల జాబితా రూపకల్పన తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో 1,779 పోలింగ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో అధికారులు సందర్శించారన్నారు. పోలింగ్ స్టేషన్ లొకేషన్ మార్పుకు సంబంధించి ఫార్మాట్–1 లో 166, పేర్ల మార్పుకు సంబంధించి ఫార్మాట్ –2 లో 315 మార్పులు చేసేలా ప్రతిపాదనలు చేశారన్నారు. వీటన్నింటిని ఎన్నికల సంఘం ఆమోదం కోసం పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఆంజనేయరెడ్డి (వైఎస్సార్‌సీపీ),ఎల్.శివరాంప్రసాద్ (టీడీపీ), పీవీ శ్రీహరి(బీజేపీ), ఎస్.వీరభద్రరావు (సీపీఐ), డీవీ కృష్ణ(సీపీఎం) పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ దరఖాస్తులకు ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆదేశాల మేరకు పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లలో ప్రవేశం కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో తాహెరా సుల్తానా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. వివరాలకు 80084 03506 నంబరులో సంప్రదించాలన్నారు.

అన్నార్తుల పాలిట ఆపద్బాంధవుడు



సేకరించిన ఆహార పదార్థాలను పేదలకు అందజేస్తున్న సాయిబాబు(ఫైల్)

సాయం చేసే మనసుండాలే కాని...అందుకు ఏ వైకల్యం అడ్డురాదు. కరోనా కాలంలో కూటికి నోచుకోని సంచార జీవుల వెతలను కళ్లారా చూసి స్పందించిన ఓ దివ్యాంగుడి మదిలో మెదిలిన ఆలోచన ఓ స్వచ్ఛంద సంస్థగా రూపుదాల్చి ఈరోజు ఎందరో పేదల కడుపు నింపుతోంది. నందిగామలో సాయిబాబు అనే వ్యక్తి అన్నపూర్ణ సేవా సమితి పేరుతో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ పట్టణ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు.

- శుభకార్యాలలో మిగిలిన ఆహార పదార్థాల సేకరణ
- ప్రత్యేక వాహనం ద్వారా తరలించి వితరణ
- సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న సాయిబాబు
- సహాయ సహకారాలందిస్తున్న పలువురు వ్యాపారులు

నందిగామ: పేదవాడి ఆకలి తీర్చాలన్న ఆలోచనలో నుంచి పురుడు పోసుకున్న ఒక స్వచ్ఛంద సంస్థ నేడు ఎంతోమందికి కడుపు నింపుతోంది. అదే స్ఫూర్తితో అనేక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణానికి చెందిన పారేపల్లి సాయిబాబు దివ్యాంగుడైనప్పటికీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తనతో పాటు మరో పదిమందిని కలుపుకొని మొత్తం 11 మంది సభ్యులతో 2021లో కరోనా కాలంలో అన్నపూర్ణ సేవా సమితి అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. ఆ సేవా సమితి ద్వారా నాటి నుంచి నేటి వరకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అన్నపూర్ణ సేవా సమితి పేరుతో సేవలు

నందిగామ పట్టణానికి చెందిన సాయిబాబుకు తనకు చేతనైనంతలో పేదవారి ఆకలి తీర్చాలన్న ఆలోచన కలిగింది. ఈ నేపథ్యంలో తన మిత్రులతో కలిసి 2021 డిసెంబర్ 2 న అన్నపూర్ణ సేవా సమితిని ప్రారంభించారు. ముఖ్యంగా శుభకార్యాలలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను సేకరించి వాటిని పేదవారికి, సంచార జీవనం సాగిస్తున్న వారికి పంపిణీ చేయడం ప్రారంభించారు. సాయిబాబు సేవలను గమనించిన పట్టణానికి చెందిన చందోలు శివ అనే వ్యాపారి ఒక గూడ్స్ ఆటోతో పాటు, ఆహార పదార్థాలు తరలించేందుకు అవసరమైన సామగ్రిని వితరణగా అందజేశారు. అప్పటి నుంచి వీరి సేవలు మరింత విస్తరించాయి. ఏ ప్రాంతంలో శుభకార్యం జరిగినా అక్కడ మిగిలిన ఆహార పదార్థాలను సేకరించి పేదవారికి పంపిణీ చేస్తున్నారు. ఇప్పటివరకు 35,734 మంది పేదవారికి కడుపునింపారు.

సేకరించిన వస్త్రాల పంపిణీ

అన్నదానం చేయడంతో పాటు ప్రతి ఇంట్లోనూ వాళ్లకి అవసరం లేని దుస్తులను సేకరించి ప్రతి నెల రెండవ ఆదివారం పేదలకు పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు మూడు వేల మందికి పైగా వస్త్రాలను పంపిణీ చేశారు. తాజాగా వినాయక చవితి నుంచి మరో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి పండుగకు పేదవాళ్లకు నూతన వస్త్రాలు అందజేయాలన్న ఆలోచనతో వినాయక చవితి నాడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రారంభించిన రోజే దాతల సాయంతో 100 మంది చిన్నారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఇవన్నీ దాతల సహాయ సహకారాల ద్వారా నిర్వహిస్తున్నారు. వీరి సేవలను గమనించిన అనేకమంది ఫోన్ చేసి మరీ సహాయ సహకారాలందిస్తున్నారు. దాతల ప్రోత్సాహంతో సేవా సమితి సేవలు మరింత విస్తరించాయి.



పలు ఇళ్లలో సేకరించిన పాత వస్త్రాలను పేదలకు అందజేస్తూ...

ఆహార పదార్థాలు మిగిలితే కాల్ చేయండి

నందిగామ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి శుభకార్యాలు జరిగినా అక్కడ ఆహార పదార్థాలు మిగిలితే 98490 48238 నంబర్ ద్వారా సేవా సమితిని సంప్రదించవచ్చని అన్నపూర్ణ సేవాసమితి నిర్వాహకులు చెబుతున్నారు. వాళ్లు అందజేసిన ఆహార పదార్థాలను హాట్ బాక్సుల ద్వారా సేకరించి పంపిణీ చేస్తున్నారు.

భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు

శుభకార్యాల్లో మిగిలిన ఆహార పదార్థాలను అందరూ వృథాగా పారేస్తూ ఉంటారు. వాటిని సేకరించి పేదవారి ఆకలి తీర్చాలన్న ఆలోచనలో నుంచే అన్నపూర్ణ సేవాసమితి పుట్టింది. మేము ఎక్కడ శుభకార్యాలు జరిగినా వాళ్లను కలసి మిగిలిన ఆహార పదార్థాలను సేకరిస్తాం. వాటిని సంచార జీవనం గడిపే వాళ్లకు, పేదవాళ్లకు మాత్రమే పంపిణీ చేస్తాం. వీటితోపాటు ఇళ్లలో పనికిరాని పాత దుస్తులను సేకరించి పేదలకు పంపిణీ చేస్తున్నాం. తాజాగా ప్రతి పండగకు దాతల సాయంతో పేద కుటుంబాల పిల్లలకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించాం. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలనే ఆలోచనలో ఉన్నాం.

– పారేపల్లి సాయిబాబు, అన్నపూర్ణ సేవా సమితి నిర్వాహకుడు

పౌష్టికాహారంతో శారీరక, మానసిక దృఢత్వం

డీఈఓ తాహెరా సుల్తానా

కంకిపాడు: శారీరక, మానసిక దృఢత్వానికి పౌష్టికాహారం దోహదపడుతుందని డీఈఓ తాహెరా సుల్తానా అన్నారు. మండలంలోని కోలవెన్ను ఎంపీపీఎస్ పాఠశాలలో అమలు జరుగుతున్న జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న గోరుముద్ద అమలు తీరుపై విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈఓ తాహెరా సుల్తానా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేసి చిన్నారులకు అందించాలన్నారు. పౌష్టికాహారం ద్వారా అనారోగ్యం దరి చేరకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. బోధన అభ్యసనాలు, విజ్ఞానాన్ని పొందేందుకు రాగిజావ, గుడ్డు, రుచికరమైన భోజనాన్ని తీసుకోవాలని సూచించారు. పరిశీలనలో డీవైఈఓ పద్మరాణి, మధ్యాహ్న భోజన పరిశీలకుడు ఎంఎల్ నరసింహారావు, ఎంఈఓ ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులను అభినందిస్తున్న డీఈఓ తాహెరా సుల్తానా

మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాట్ల పరిశీలన

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24న విద్యాధరపురం హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్వహించనున్న ఆయుష్మాన్ భవ మెగా హెల్త్ క్యాంపు ఏర్పాట్లను శుక్రవారం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్ పరిశీలించారు. శిబిరం నిర్వహించే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి జిల్లా ఆరోగ్యశాఖ అధికారులకు తగు సూచనలు చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శిబిరం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ క్యాంపులో స్పెషలిస్ట్ వైద్యుల సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఉచిత రక్త దాన శిబిరం, ఉచిత అవయవ దాన రిజిస్ట్రేషన్, యోగా కార్యక్రమం నిర్వహణ, ఆరోగ్యశ్రీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని, హెచ్‌డబ్ల్యూసీ రాష్ట్ర నోడల్ అధికారి శ్యామల, పట్టణ ఆరోగ్య కేంద్రాల రాష్ట్ర నోడల్ అధికారి విజయలక్ష్మి, జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఉషారాణి, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం అధికారి డాక్టర్ మాధవి, ఆరోగ్యశ్రీ సమన్వయ అధికారి డాక్టర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.



మెగా హెల్త్ క్యాంపు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ నివాస్, డీఎంహెచ్ఓ సుహాసిని

నకిలీ బిల్లులతో నిధులు దుర్వినియోగం

సహకరించిన అధికారులపై కూడా కేసు నమోదు

కూచిపూడి(మొవ్వ): ఫేక్ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెట్టి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసిన ఓ విశ్రాంత ఉద్యోగి, అతనికి సహకరించిన అధికారులపై కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు కూచిపూడి ఎస్ఐ డి.సందీప్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే సాధారణ వార్షిక తనిఖీల్లో భాగంగా 2022–23వ సంవత్సరంలో విశ్రాంత పంచాయతీ రాజ్ ఏఈ (చల్లపల్లి) ఎస్.పోతురాజు 14 ఫేక్ బిల్లులు పెట్టి రూ.41.86 లక్షల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసినట్లు గుర్తించామని జిల్లా ట్రెజరీ సహాయ అధికారి ఎంవీపీ శ్రీదేవి గురువారం కూచిపూడి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటిలో రూ.23 లక్షలు రికవరీ చేశామని, మిగిలిన రూ.18.86 లక్షలు రికవరీ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ విషయంలో పోతురాజుకు సహకరించిన చల్లపల్లి ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వై.శ్యామ్‌సన్ బాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీవోలు కేవీ సుబ్బారావు, అరుణకుమారి, ఎంపీడీవో సీహెచ్ చిన రాట్నాలు, మొవ్వ ఎన్డీవో టి.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ బి.ప్రవీణ్‌లపై కూడా చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

నేడు, రేపు ఫిజీషియన్ల రాష్ట్ర సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ చాప్టర్ సమావేశాలు ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఈ నెల 23, 24 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు సదస్సు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ మనోజ్‌కుమార్ తెలిపారు. గవర్నర్ పేట లోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ వెటర్నరీ కాలనీలోని అవెన్యూ కన్వెన్షన్ సెంటర్ నిర్వహించే ఈ సదస్సును వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శనివారం లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. ఈ వార్షిక రాష్ట్ర స్థాయి సదస్సులో 650కి పైగా పీజీ వైద్యులు, ప్రాక్టీషనర్లు, వైద్య కళాశాల జనరల్ మెడిసిన్ బోధనా వైద్యులు పాల్గొంటారని తెలిపారు. సదస్సులో 500 వరకూ పరిశోధనా పత్రాలు, నూతన చికిత్సా విధానాలపై విశ్లేషణాత్మక ప్రసంగాలు, సాంకేతిక చర్చలు ఉంటాయని తెలిపారు.

క్లుప్తంగా

జిల్లా సాఫ్ట్ బాల్ జట్ల ఎంపిక

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కర్నూలు జిల్లా వేదికగా అక్టోబర్‌లో జరగనున్న 10వ రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్ బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనడానికి ఉమ్మడి కృష్ణా జిల్లా సాఫ్ట్ బాల్ జట్ల ఎంపిక కార్యక్రమం విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో శుక్రవారం జరిగింది. జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం కార్యదర్శి గుమ్మడి సాంబశివరావు ఆధ్వర్యంలో సెలక్షన్ కమిటీ సభ్యులుగా మత్తి హరిగోపాల్, సరిదే మోహన లక్ష్మి వ్యవహరించి జిల్లా జట్టును ఎంపిక చేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రెండు రోజుల క్రితం అదృశ్యమైన ఓ యువకుడు తన ఇంటి సమీపంలోనే సైడు కాలువలో శవమై కనిపించాడు. ఈ సంఘటన నున్న రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుందావారి కండ్రికలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుందావారి కండ్రిక గ్రామానికి చెందిన నేలపాల రాజేష్(20) తన తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. బుధవారం రాత్రి ఆ గ్రామంలోని వినాయక చవితి వేడుకల్లో విగ్రహ నిమజ్జన కార్యక్రమానికి వెళ్లి కనిపించకుండాపోయాడు. దీంతో యువకుడి తల్లిదండ్రులు నున్న పోలీసులను ఆశ్రయించగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

సైడు కాలువలో..

వినాయక విగ్రహ నిమజ్జనానికి వెళ్లి అదృశ్యమైన రాజేష్ తన ఇంటి సమీపంలోని సైడు కాలువలో శుక్రవారం శవమై కనిపించాడు. కాలువలో రాజేష్ మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని రాజేష్ మృతదేహాన్ని వెలికితీసి వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇది హత్యా లేక ఆత్మహత్యా లేదా మద్యం మత్తులో రాజేష్ కాలువలో పడిపోయి ఉంటాడా అనే కోణంలో పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. రాజేష్ మరణవార్తను తెలుసుకున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'బ్లాక్' ప్రారంభోత్సవానికి పక్కా ఏర్పాట్లు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



ఇబ్రహీంపట్నంలో మండల స్థాయి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశ వ్యాప్తంగా ఈ నెల 30న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్న అభిలషణీయ బ్లాక్ పథకం (ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం) కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఉన్నతాధికారులకు వివరించారు. ఈ నెల 30న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని ప్రగతి మైదాన్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న ఈ కార్యక్రమానికి జిల్లాలో ఎంపికైన ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాలలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై కేంద్ర ప్లానింగ్, పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు, నీతి అయోగ్ సీఈవో ఢిల్లీ నుంచి కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఇప్పటికే ఎంపిక చేసిన ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాలలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆయా మండలాల పరిధిలోని గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యేలా కార్యక్రమ వివరాలపై ముందస్తు సమాచారాన్ని అందించామని కలెక్టర్ అధికారులకు వివరించారు. కాన్ఫరెన్స్‌లో సీపీఓ వై. శ్రీలత, ఎంపీడీఓలు బీవీ. రామకృష్ణనాయక్, ఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం..

ఇబ్రహీంపట్నం(మైలవరం): అభిలషణీయ బ్లాక్ పథకం ఎంపికచేసిన ఇబ్రహీంపట్నంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభిలషణీయ బ్లాక్ పథకంలో భాగంగా అక్టోబర్ 3 నుంచి 9వ తేదీ వరకూ నిర్వహించే పలు కార్యక్రమాలను విజయవంతం నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో విజయవాడ సబ్ కలెక్టర్ అదితి సింగ్, ఎంపీడీఓలు బీవీ రామకృష్ణనాయక్, పాలడుగు జ్యోత్స్న, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'తో సమస్యలకు పరిష్కారం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

ఇబ్రహీంపట్నం: ప్రజా సమస్యలు మెరుగైన పరిష్కారం చూపడం కోసం ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో స్పందనలో భాగంగా ప్రజల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా స్థాయి అధికారులు మండల స్థాయిలో కూడా ప్రజా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కారం చూపాలన్నారు. గ్రామస్థాయిలోఅధికారులు పర్యటించడం ద్వారా ప్రజలు సంతృప్తి చెందుతారన్నారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, ఎన్టీటీపీఎస్ సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని జగనన్న కాలనీ లే అవుట్లలో మేరక పనులు చేపట్టాలని కోరారు. మండలంలోని వ్యవసాయ లంక భూములు, రియల్ ఏస్టేట్ వెంచర్లు, శ్మశాన వాటికలు తదితర సమస్యలపై అర్జీలను ఆయా శాఖల అధికారులు పంపించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అదితిసింగ్, ఎంపీడీఓ రామకృష్ణానాయక్, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్పానికి ఆరాటం.. పక్షికి ప్రాణ సంకటం



కొంగపిల్లను ఒడిసి పట్టుకున్న పాము



పక్షిని మింగుతూ కిందికి వేలాడుతున్న పాము

కృత్తివెన్ను: క్షుద్బాధ తీర్చుకోవాలన్న ఆతృత ఆ సర్పానిది.. ప్రాణాలు కాపాడుకోవాలన్న తపన పక్షిది. వెరసి ఇరువురి జీవన పోరాటంలో పాముదే పై చేయి అయ్యింది. వేప చెట్టుపై ఓ కొంగ గుడ్లు పెట్టి పిల్లలను పొదిగింది. ఎలా చూసిందో కానీ పాము మెల్లగా చెట్టుపైకి ఎక్కి ఓ కొంగ పిల్లను నోటకరుచుకుంది. ప్రాణాలు కాపాడుకోవడానికి ఆ కొంగ పిల్ల ఎంత ప్రయత్నించినా పాము బలం ముందు దాని పోరాటం నిలవలేక పోయింది. దాదాపు 40 నిముషాల పాటు కిందికి వేలాడుతూనే ఆ పాము కొంగ పిల్లని పూర్తిగా మింగేసింది. కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం గాంధీనగరంలో శుక్రవారం ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

బాలికపై వేధింపుల కేసులో నిందితుడికి జైలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): బాలికపై వేధింపులకు గురిచేసిన కేసులో నిందితుడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 31వేలు జరిమానా విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి డాక్టర్ ఎస్.రజని శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నున్న పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన బాలిక ఇంటర్ వరకు చదువుకుని కుటుంబ సభ్యులతో కలసి నివాసముంటుంది. తన అక్కతో కలసి ప్రతి రోజు సమీపంలోని స్వీట్ షాపులో పనికి వెళ్తుంటుంది. ఈ క్రమంలో 2018, మే 31వ తేదీ సాయంత్రం 7.30 గంటలకు పని ముగించుకుని అక్కతో కలసి బాలిక వెళ్తుండగా అదే ప్రాంతానికి చెందిన తిరుపతిరెడ్డి అనే యువకుడు బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. పక్కనే ఉన్న బాలిక అక్క అతన్ని నెట్టివేసి వెళ్లిపోయారు. తిరుపతిరెడ్డి జరిగిన విషయం అతని అమ్మ, అక్కకు చెప్పడంతో వారు బాలిక ఇంటికి వెళ్లి గొడవపడి బాలిక అమ్మ, అక్కను కొట్టారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి నున్న ఎస్‌ఐ కె. నాగేశ్వరరావు 2018 జూలై 7న ప్రధాన నిందితుడైన మల్లంపాటి తిరుపతిరెడ్డి(29), అతని తల్లి మల్లంపాటి సీతమ్మ(45), అక్క అయిన కంసాని రమణ(30)లను అరెస్ట్ చేశారు. కాగా రెండో ముద్దాయి మల్లంపాటి సీతమ్మ 2023లో మరణించింది. ఈ కేసులో నిందితులపై నేరం రుజువు కావటంతో మల్లంపాటి తిరుపతిరెడ్డికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.31వేలు జరిమానా, మూడో నిందితురాలికి రూ.1,000 జరిమానా విధించారు. అలాగే బాధిత బాలికకు జరిమానా నుంచి రూ. 29 వేలు అందించాల్సిందిగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

నిధులు దుర్వినియోగం కేసులో హెచ్‌ఎంకు మూడేళ్ల జైలు

గన్నవరం: పాఠశాల అభివృద్ధికి వినియోగించాల్సిన నిధులు దుర్వినియోగం చేసిన ఓ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ. 10 వేలు జరిమానా విధిస్తూ గన్నవరం 12వ ఏఎంఎం కోర్టు తీర్పు ఇచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమాచారం ప్రకారం ఉంగుటూరు మండలంలోని తేలప్రోలు జెడ్పీ హైస్కూల్ అభివృద్ధికి తల్లిదండ్రుల సమాఖ్య విజ్ఞప్తి మేరకు కాకినాడ ఓఎన్‌జీసీ సంస్థ రూ. 6.22 లక్షలు విరాళం ఇచ్చింది. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, బెంచీలు ఏర్పాటుకుగాను ఆ నగదును 2017 జనవరి 13న ఆర్‌ఎంఎస్‌ఏ ఖాతాకు ఓఎన్‌జీసీ జమచేసింది. పాఠశాల అభివృద్ధి కమిటీ తీర్మానం ప్రకారం ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉంది. అయితే పాఠశాల హెచ్‌ఎం తాడి ప్రసాద్ మాత్రం ఆర్‌ఎంఎస్‌ఏ నుంచి విడతల వారీగా రూ. 2.03 లక్షలు డ్రా చేసుకుని సొంతానికి వాడుకున్నారు. ఈ విషయమై డీఈఓ ఆదేశాల మేరకు నూజివీడు డీవైఈఓ ఎన్‌వీ రవిసాగర్ విచారణ జరిపి హెచ్‌ఎం ప్రసాద్ నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారించారు. డీవైఈఓ ఫిర్యాదు మేరకు ఉంగుటూరు పోలీసులు హెచ్‌ఎంపై కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో హెచ్‌ఎం తాడి ప్రసాద్‌కు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ 12వ ఏఎంఎం కోర్టు జడ్జి తీర్పు ఇచ్చినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. ప్రసన్న తెలిపారు.

చేతి వృత్తులతో స్వయం ఉపాధి

యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ తెలుగు రాష్ట్రాల డైరెక్టర్ విశ్వనాథరెడ్డి



మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి
చిత్రంలో డైరెక్టర్ విజయభారతి

మచిలీపట్నంటౌన్: మహిళలు చేతి వృత్తుల్లో నైపుణ్యం సాధించి స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని యూనియన్ బ్యాంక్ గ్రామీణ ఉపాధి స్వయం శిక్షణ సంస్థ తెలుగు రాష్ట్రాల డైరెక్టర్ విశ్వనాథరెడ్డి అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని పట్టాభి గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళలతో శిక్షణ అంశాలపై చర్చించారు. రికార్డులు పరిశీలించారు. శిక్షణ కేంద్రంలో కంప్యూటర్ ట్యాలీ, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ నేర్చుకుంటున్న అభ్యర్థులతో మాట్లాడి వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ శిక్షణ సంస్థలో శిక్షణ పొందిన వారికి యూనియన్ బ్యాంకు అన్ని విధాల సహాయసహకారాలు అందిస్తుందన్నారు. మచిలీపట్నం సంస్థ డైరెక్టర్ విజయభారతి మాట్లాడుతూ తమ శిక్షణ కేంద్రంలో ఇస్తున్న పలు రంగాలకు చెందిన శిక్షణను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సాఫ్ట్‌వేర్ డవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో తమ కళాశాల ఆవరణలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డవలపర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి ఓ ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన వారు ఈ శిక్షణ పొందటానికి అర్హులని పేర్కొన్నారు. ఈ కోర్సులో భాగంగా నూతన సాంకేతికత పరిజ్ఞానంలో శిక్షణ ఇస్తామని తెలియజేశారు. శిక్షణ పూర్తి అయిన తర్వాత ఏపీఎస్ఎస్‌డీసీ నుంచి సర్టిఫికెట్‌తో పాటుగా ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చూపిస్తామని వివరించారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు ఈ నెల 25వ తేదీలోగా విద్యార్హతల మార్కుల జాబితా, ఆధార్ కార్డు, ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌తో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రమేష్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 93477 79032 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

విద్యుత్ వాహనాలను వాడుదాం

విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి



ఈవీ వాహనాలతో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు బెల్లందుర్గ, అవుతు శ్రీశైలజ

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0లో కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా కార్ ఫ్రీ డే జరిగింది. ఈ సందర్భంగా వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎలక్ట్రిక్ వాహనాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఎలక్ట్రిక్ వాహనాలను అందరు ఉపయోగించాలని మున్సిపల్ అధికారులకు, సిబ్బంది సూచించారు. వాయు కాలుష్యానికి కారణమయ్యే కర్బన ఉద్గారాల వినియోగంపై ప్రజలంతా చైతన్యం పెంచుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడాలని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో విద్యుత్ ద్విచక్ర వాహనాలు ఇచ్చేందుకు స్టేట్ నోడల్ ఏజెన్సీగా ఆంధ్రప్రదేశ్ నూతన పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ వ్యవహరిస్తోందన్నారు. ఈ పథకంలో ఏ విధమైన ముందస్తు డబ్బులు కట్టవలసిన అవసరం లేదని, దరఖాస్తు చేసుకునేందుకు హెచ్‌టీటీపీ//ఈవీఎస్ఆర్ ఈడీసీఏపీడాట్ఇన్ వెబ్‌సైట్లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు బెల్లందుర్గ, అవుతు శ్రీశైలజ రెడ్డి, అదనపు కమిషనర్(జనరల్) శకుంతల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, మేనేజర్ బి.శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తులు ఆహ్వానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ కోసం నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 25వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్ పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, తల్లిదండ్రుల సంవత్సరాదాయం రూ.3,50,000 లోపు ఉన్న విద్యార్థులు అందరూ ఈ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. కేంద్రియ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ప్రైవేట్ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అర్హులు కాదన్నారు. ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉన్న లింక్‌ను ఓపెన్ చేసి సంబంధిత స్కూల్ కోడ్‌ను నమోదు చేయాలన్నారు. తర్వాత ఇతర పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం వెబ్ సైట్ లేదా సంబంధిత విద్యాశాఖాధికారి కార్యాలయంలో గానీ సంప్రదించాలన్నారు.

నేడు ప్రత్యేక ప్రసంగం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో ప్రత్యేక ప్రసంగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగం డీన్ ఈదర శ్రీనివాసరెడ్డి ఆన్‌లైన్‌లో హాజరై మాధ్యమాల అవసరాలు-కృత్రిమ మేధ (ఏఐ) అనే అంశంపై మాట్లాడతారన్నారు. డిప్లొమా ఇన్ జర్నలిజం కోర్సు చేస్తున్న వారితో పాటుగా ఆసక్తి ఉన్న వర్కింగ్ జర్నలిస్టులు జూమ్ ఐడీ-815 9892 6979, పాస్‌వర్డ్-12345 ద్వారా హాజరై ఈ ప్రత్యేక ప్రసంగాన్ని వినవచ్చన్నారు.

క్లుప్తంగా

శెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపులు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి పన్ను, డ్రైనేజి పన్ను, వాటర్ మీటర్ పన్నులను మొదటి అర్ధ సంవత్సరం ముగుస్తున్నందున పన్నులు చెల్లించేందుకు వీఎంసీ ప్రత్యేక క్యాష్ కౌంటర్లను ఏర్పాటు చేసిందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల సౌకర్యార్థం వీఎంసీ మూడు సర్కిళ్ల పరిధిలో ఆయా క్యాష్ కౌంటర్లు శెలవు దినాల్లోనూ పనిచేస్తాయని పేర్కొన్నారు. ఈ నెలలో 24న ఆదివారం, 28న మిలాదున్ నబి రోజున కూడా ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని అన్నారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నలంద ఎన్‌సీసీ కేడెట్స్‌కి ఎ సర్టిఫికెట్ ప్రదానం



లబ్బీపేట(విజయవాడతూర్పు):నలంద విద్యానికేతన్‌కు చెందిన 29 మంది ఎన్‌సీసీ కేడెట్‌లకు శుక్రవారం ఎ సర్టిఫికెట్స్ అందచేశారు. 17వ ఆంధ్రా బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ కేడెట్స్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎ సర్టిఫికెట్స్ కోసం నిర్వహించిన పరీక్షకు నలంద కేడెట్స్ 29 మంది రాయగా, వందశాతం ఎ గ్రేడ్ సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతను క్రమశిక్షణ, దేశభక్తి గల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. విద్యతో పాటు ఎన్‌సీసీలో ఉండటం విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి రాయవరపు ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందుల దుష్ఫలితాలపై అవగాహన




లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మందులు దుష్ఫలితాలు వచ్చినప్పుడు తక్షణమే ఏమి చేయాలి, ఎవరిని సంప్రదించాలనే అనే అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించడంతో పాటు రంగోలీ, నాటకం, ఫ్లాష్‌మాబ్ ప్రదర్శన ద్వారా ప్రజలు, రోగుల్లో అవగాహన కలిగిస్తూ చైతన్యం నింపుతున్నారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.వెంకట రమణ, ప్రొఫెసర్ డాక్టర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ పోస్టర్ ఆవిష్కరణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో చలో కలెక్టరేట్‌కు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యల గురించి చర్చ జరపాలన్నారు.ఎన్టీఆర్ జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోపి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు రూ.1.12 లక్షల విరాళం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో గోశాల నిర్వహణ, అభివృద్ధికి శుక్రవారం దాత పి.కామేశ్వర శర్మ దంపతులు రూ.1.12 లక్షలు మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. దాతలు మాట్లాడుతూ మందిరంలో నిర్వహిస్తున్న గోశాల నిర్వహణ, అభివృద్ధికి తన వంతు బాధ్యతగా విరాళం అందజేస్తున్నామని చెప్పారు. గౌతం రెడ్డి మాట్లాడుతూ సకల దేవతల స్వరూపమైన గోవుల పరిరక్షణకు తాము గోశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దాతలకు పూజలు చేయించి బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి, యాదల శ్రీనివాసరావు పాల్గొన్నారు.





వరద వచ్చినా తట్టుకునేలా..

కృష్ణానది పరివాహక ప్రాంతంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం నిర్మిస్తున్న రక్షణ గోడ ఫేజ్-3 నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ముంపు ప్రాంతమైన రణదీవెనగర్ కరకట్టవాసులకు రక్షణగా కనకదుర్గ వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు 1.05 కిలోమీటర్లు పొడవున సుమారు రూ.135 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం గత నవంబర్‌లో గోడ నిర్మాణ పనులు ప్రారంభించింది. ఇప్పటికే దాదాపు 70 శాతానికి పైగా నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఎగువ నుంచి 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిన ముంపు నుంచి తట్టుకునేలా రక్షణ గోడను నిర్మిస్తున్నారు. వరద ముంపు కష్టాలు తీరనున్నాయని కరకట్ట ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–కృష్ణలంక (విజయవాడ ఈస్ట్)

వార్డు వలంటీర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో ఖాళీగా ఉన్న 1407 మంది వార్డు వలంటీర్ల ఎంపికకకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఈ నెల 20 నాటికి 18–35 ఏళ్ల వయస్సుల వారు, నగరంలో నివాసం ఉండేవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ పూర్తి విద్యార్హతలు, ఇతర ధృవీకరణ పత్రాలతో హెచ్‌టీటీపీ::/ /40.81.211.107.ఏపీవాలంటీర్20/ఏపీవాలంటీర్0904202049.బీటీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు వీఎంసీ అధనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) లేదా వార్డు సెక్రటరీ స్పెషల్‌సెల్ నంబర్ 8185933187 నంబర్లో సంప్రదించాలని కోరారు.

ప్రజలు అసహ్యించుకునేలా టీడీపీ ఎమ్మెల్యేల తీరు



తోపుడు బండ్లు, టిఫిన్ బండిని అందచేస్తున్న దేవినేని అవినాష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల సొమ్ముతో నిర్వహిస్తున్న శాసనసభ సమావేశాలను సజావుగా సాగనీయకుండా అడ్డుపడుతున్న టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్న తీరు ప్రజలు అసహ్యించుకునే విధంగా ఉందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 6వ డివిజన్‌లోని బ్రహ్మానందరెడ్డి నగర్‌లో అవినాష్ శుక్రవారం పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఇటీవల ఈ డివిజన్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పేద కుటుంబాలకు చెందిన ముగ్గురు తమకు జీవనోపాధికి ఇబ్బందులు పడుతున్నామని, తాము వ్యాపారాలు నిర్వహించుకునేందుకు బండ్లు కావాలని అవినాష్‌ను కోరారు. దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.60 వేలు విలువ చేసే రెండు తోపుడు బండ్లు, ఒక టిఫిన్ బండిని అవినాష్ శుక్రవారం అందచేశారు.

వైఎస్సార్ సీపీ వచ్చిన తర్వాతే అభివృద్ధి...

అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే కొండ ప్రాంతాల్లో అభివృద్ధి మొదలైందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తూర్పు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు విడుదల చేస్తున్నారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్‌తో పాటుగా ఈ డివిజన్ కార్పొరేటర్ ఇలా అందరూ టీడీపీ వారే అయినా డివిజన్‌లోని సమస్యలపై కన్నెత్తి చూడలేదని తెలిపారు. సమస్యలు పట్టించుకోలేదని డివిజన్ వాసులు తమకు చెప్పారన్నారు. టీడీపీకి ఓట్లు తప్ప అభివృద్ధి అనేది పట్టదని ప్రజలకు అర్థమైందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొండ చివర ఉన్న ఇంటికి కూడా వలంటీర్లు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని అందిస్తున్నామని చెప్పారు. కార్పొరేటర్ అమర్‌నాథ్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజ, వైఎస్సార్ సీపీ 6వ డివిజన్ అధ్యక్షుడు లంకా అబ్బినాయుడు, నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీను, లక్ష్మణ్, షకీలా, రాంబాబు, నాని, రాజబాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి వసతులు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు):నగరంలో కొత్తగా ఏర్పాటు చేయాల్సిన పోలింగ్ కేంద్రాలతో పాటు ప్రస్తుత కేంద్రాల్లోనూ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1400 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులతో కలిసి నగరంలోని 29 వ డివిజన్ మధురానగర్‌లోని తూనుగుంట రమాదేవి ఎలిమెంటరీ స్కూల్, శ్రీ వెంకటేశ్వర శివరామకృష్ణ ముదిరాజ్ కళ్యాణ మండపం, నగరపాలక సంస్థ కళ్యాణ మండపం, శాతవాహన కాలేజీ, 27 వ డివిజన్‌లోని సాంబమూర్తి రోడ్డు, గులాబితోటలో ఉన్న 199, 200 సచివాలయాలు తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అక్కడ అనువుగా ఉందో లేదో అధికారుల ద్వారా తెలుసుకున్నారు. పోలింగ్ స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన ఆయా కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుపై జిల్లా ఎన్నికల అధికారి సూచనలు పాటించాలని తెలిపారు. ఏ పోలింగ్ కేంద్రంలో సంఖ్యకు మించి అధికంగా ఓటర్లు ఉన్నారో గుర్తించి సమాచారాన్ని అందించాలని అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను ఆదేశించారు. ఓటర్లు, ఎన్నికల సిబ్బంది భద్రతపై ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. తాగునీరు, విద్యుత్తు సౌకర్యాలు ఉన్న భవనాలను మాత్రమే పోలింగ్ కేంద్రాల ఎంపికకు పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. కేంద్రాలకు ఏమైనా మరమ్మతులు చేయాల్సి ఉన్న పక్షంలో ముందుగానే గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అమ్రపాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు):పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ప్రముఖ చిత్రకారిణి అమ్రపాలి అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో పర్యావరణ వేత్త యలవర్తి నాయుడమ్మ 101వ జయంతి సందర్భంగా జాషువా సాంస్కృతిక వేదిక, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, 64 కళలు డాట్ కం ఆధ్వర్యంలో శుక్రవారం పర్యావరణంపై బాలబాలికలు వేసిన చిత్రాల ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అమ్రపాలి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు ఎంతో ఆలోచనాత్మకంగా చిత్రాలు గీసారన్నారు. ఇప్పటికే పర్యావరణం అసమతుల్యంగా మారిందని ఆవేదన చెందారు. నేటి చిన్నారులు పర్యావరణ పరిరక్షణకు నడుంకట్టాలని పిలుపునిచ్చారు. నాయుడమ్మ దేశంలో గొప్ప శాస్త్రవేత్తల్లో ఒకరని, లెదర్ టెక్నాలజీలో విశేష కృషి చేశారని కొనియాడారు. నాయుడమ్మను స్మరించుకుంటూ చిన్నారులు మరిన్ని మంచి చిత్రాలు గీయాలని కోరారు. స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణంపై చిన్నారులు గీసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని అభినందించారు. 64 కళలు డాట్ కం బాధ్యుడు కళాసాగర్ మాట్లాడుతూ వైజ్ఞానిక రంగంలో, పర్యావరణానికి నాయుడమ్మ ఎంతో కృషి చేశారన్నారు. చిన్నారులు పర్యావరణంపై వేసిన చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జాషువా సాంస్కృతికి వేదిక బాధ్యుడు గుండు నారాయణరావు, ఫోరంఫర్ ఆర్టిస్ట్స్ బాధ్యులు గిరిధర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ మానసిక స్థితిపై సందేహం

లబ్బీపేట(విజయవాడతూర్పు): అసెంబ్లీలో బాలకృష్ణ ప్రవర్తించిన తీరును పరిశీలిస్తే ఆయన మానసిక స్థితిపై అనేక సందేహాలు వస్తున్నాయని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్ షేక్ తెలిపారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ శాసన సభలో మీసాలు తిప్పడం, అసభ్యంగా సైగలు చేయడం, విజిల్ వేయడం వంటివి మానసిక స్థితి సరిగా లేదనేందుకు సంకేతాలని పేర్కొన్నారు. గతంలోనే మానసిక జబ్బు ఉన్నట్లు సర్టిఫికెట్ ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. బాలకృష్ణ తీరు పెత్తందారీ పోకడలకు అద్దం పడుతున్నాయని ఎద్దేవా చేశారు. అవినీతి కేసులో బావ చంద్రబాబు జైలుకు వెళ్లడం, అరెస్టు భయంతో ఢిల్లీకి వెళ్లిన అల్లుడు తిరిగి రాకపోవడం వంటి ఘటనలతో మతిభ్రమించి పిచ్చి చేష్టలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా బాలకృష్ణ బావ కళ్లలో ఆనందం కోసం కాకుండా ఆయన సినిమాల్లో పదే పదే చెబుతున్నట్లు న్యాయం, ధర్మం వైపు నిలబడాలని, చట్టం, చట్టసభలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. అలా కాకుండా అసెంబ్లీని షూటింగ్ ప్రదేశం అనే భ్రమలో పిచ్చి చేష్టలు చేస్తే ఈసారి ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

మహిళా బిల్లులో బీసీ వాటా తేల్చాలి

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



బీసీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పార్లమెంటులో ఆమోదం పొందిన మహిళా బిల్లులో ఓబీసీ మహిళలకు ఎంత వాటా కేటాయిస్తున్నారో స్పష్టత ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని తమ కార్యాలయంలో శుక్రవారం బీసీ సంఘాల ప్రతినిధులతో మహిళా బిల్లు, బీసీల వాటా అంశంపై సమావేశం నిర్వహించారు. కేసన శంకరరావు మట్లాడుతూ మూడు దశాబ్దాల కిందటే మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారన్నారు. ఈ బిల్లులో ఓబీసీ మహిళలకు ఎంత వాటా కేటాయిస్తున్నారో స్పష్టత ఇవ్వాలని ములాయంసింగ్ యాదవ్, లాలూప్రసాద్ యాదవ్ వంటి వారు నిలదీయడంతో బిల్లును ఆమోదించలేదన్నారు. అప్పటి నుంచి డిమాండ్ సాధన కోసం బీసీ సంఘాలు వివిధ రూపాల్లో ఉద్యమాలు చేస్తూనే ఉన్నాయని తెలిపారు. వాటిని ఏమి పట్టించుకోకుండా బీజేపీ 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఓబీసీలకు తీరని ద్రోహం చేయడంపై ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళల కోటా సాధనే ధ్యేయంగా దేశ వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించేందుకు భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ముస్తాఫా, ప్రధాన కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు, కార్యదర్శి కారంపూడి సత్యనారాయణ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కొలకలూరు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న దేవినేని అవినాష్



కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కృష్ణలంక(విజయవాడతూర్పు):గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కృష్ణలంక, 21వ డివిజన్, హైస్కూల్ రోడ్డులోని పచ్చమేడ బజార్ సెంటర్‌లో వినాయక మండపం వద్ద 21వ డివిజన్ జై గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజారెడ్డి, కార్పొరేటర్లు పుప్పాల కుమారి, భీమిశెట్టి ప్రవల్లిక పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించారు. జై గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్ సమీపంలోని స్క్రూబ్రిడ్జి సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్, 11 కేవీ టెలిఫోన్ ఎక్సేంజ్ ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. ఇందులో భాగంగా పకీరుగూడెం, ప్రగతినగర్, శ్రీరాంనగర్, చంద్రమౌళిపురం, ఎంజీ రోడ్డు, బెంజిసర్కిల్ నుంచి స్వీట్ మ్యాజిక్ ప్రాంతంతో పాటు మైత్రేయ వీధుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

డయల్ యువర్ సీపీకి 10 ఫిర్యాదులు



మాట్లాడుతున్న సీపీ టీకే రాణా

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రజా సమస్యల సత్వర పరిష్కార వేదికగా శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమంలో 10 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ టీకే రాణా నేరుగా బాధితులతో మాట్లాడి ఫిర్యాదులు తీసుకున్నారు. అందులో ట్రాఫిక్ సమస్యలు, అసాంఘిక శక్తుల గురించి, కుటుంబ కలహాల గురించి, ఆర్థిక నేరాలు, స్థలం తగాదాలు తదితర 10 సమస్యలపై ఫిర్యాదులు అందాయి. సంబంధిత పోలీస్ స్టేషన్ల యస్‌హెచ్‌ఓలు, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాల్సిందిగా టీకే రాణా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నేరుగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను సత్వరమే పరిష్కారించడంతో పాటు ప్రజల్లో పోలీసుల పట్ల విశ్వాసాన్ని కల్పించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.


ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఎన్నిక



రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ఏపీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఎన్నిక విజయవాడలో శుక్రవారం జరిగింది. నగరంలో ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో నూతన రాష్ట్ర స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్.వీరారెడ్డి, సీనియర్ పాస్ట్ ప్రెసిడెంట్‌గా బి.సురేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ యదిద్య, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ. వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి.సాంబశివరావు, డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ.రవికుమార్, జాయింట్ సెక్రటరీ సుబ్బారావు, శిరీష, ప్రేమ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఎస్.వెంకట్, ఎ.వెంకటేశ్వరరావు, జి.వెంకటేశ్వర్లు, రాయలసీమ ఇన్‌చార్జిగా ఈ బాలగౌడ్, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికయిన రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులను చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ అభినందించారు. అలాగే వచ్చే ఆరు నెలలో రాష్ట్రంలో 24 ట్రైనింగ్ క్యాంప్స్, 3 అంతర్జాతీయ పారిశ్రామిక సదస్సులు, 3 రాష్ట్ర స్థాయి బిజినెస్ ఎగ్జిబిషన్స్, 3 ఇండస్ట్రియల్ టూర్స్, 3 ఇంక్యూబేషన్ సెంటర్స్‌లను ఐఐటీ కాన్పూర్ సహకారంతో చేయటానికి కార్యాచరణ రూపొందించారు. నూతన రాష్ట్ర స్టీరింగ్ కమిటీ 26 జిల్లాలలో పారిశ్రామిక అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గ కమిటీ వివరాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంబంధిత అధికార విభాగాలకు పంపిస్తామని తెలిపారు.

జ్వరంతో బాలుడి మృతి



రామవరప్పాడు : జ్వరంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఒకటో తరగతి విద్యార్థి మృతి చెందిన ఘటన విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో శుక్రవారం వెలుగు చూసింది. బాలుడు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో కలపాల రాజశేఖర్, కవిత దంపతులు నివసిస్తున్నారు. వీరికి కలపాల శశిధర్ (7), జాహ్నవి (6) ఉన్నారు. శశిధర్ ఎన్టీఆర్ సర్కిల్‌లోని నిర్మల కాన్వెంట్‌లో 1వ తరగతి చదువుతున్నాడు. గత శుక్రవారం శశిధర్‌కు జ్వరం వచ్చింది. సాధారణ జ్వరమనుకుని దగ్గరలోని హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. తగ్గకపోవడంతో పీడబ్ల్యూడీ గ్రౌండ్ సమీపంలోని సెయింట్ ఆన్స్ హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. రానూ రానూ శశిధర్‌కు నీరసం ఎక్కువవడం, ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయి. మూడు రోజులుగా చికిత్స అందించినా బాలుడి ఆరోగ్య పరిస్థితి మెరుగు పడకపోవడంతో మరో హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో శశిధర్‌ను నోరి హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. అప్పటికే బాలుడి పరిస్థితి విషమించి బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత (తెల్లారితే గురువారం) మృతి చెందాడు. బాలుడి తల్లిదండ్రులు రాజశేఖర్, కవితలు బోరున విలపించడం చూపరులకు కంటతడి తెప్పించింది.

24న మెగా రక్తదాన శిబిరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఈ నెల 24వ తేదీన మెగా రక్త దాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. కొత్తపేట కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో ఈ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఆ కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లపై జిల్లా వైద్యాశాఖ అధికారులు శుక్రవారం పరిశీలన చేసి స్థానిక అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఏటీవో డాక్టర్ ఉషారాణి, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం అధికారి డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ యూనివర్సిటీ వద్ద కాంగ్రెస్ నిరసన

లబ్బీపేట(విజయవాడతూర్పు): రెండో విడత ఎంబీబీఎస్ కౌన్సిలింగ్‌లో రిజర్వేషన్ విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లాం తాంతియాకుమారి తదితరులు యూనివర్శిటీ వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

● కాలుష్య రహిత నగరమే లక్ష్యం..



కాలుష్య రహిత నగరమే లక్ష్యంగా వీఎంసీ చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఎలక్ట్రిక్ వాహనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ద్విచక్రవాహనం నడుపుతున్న డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మేయర్ భాగ్యలక్ష్మి చిత్రమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

ఫారం నెం. VII

ఆర్.సి.నెం.ఇ4/1589/2019 తేది: 21.09.2023

(2013 వ సంవత్సరము 30 వ చట్టం వలన భూసేకరణ పునరావాసము , పునఃస్థాపనలతో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టములో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ 25 సబ్ రూలు(1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింద షెడ్యూలులో నిర్దిష్టపరచిన ఆత్మకూరు మండలములోని, **లక్ష్మీపాడు మజరా అప్పారావుపాలెం గ్రామ పరిధిలో నడికుడి-శ్రీ కాళహస్తి కొత్త బ్రాడ్ గేజ్ రైల్వే లైను నిర్మాణము** కొరకు ఎ.34.41 సెం.లు భూమి కావలయునని రైల్వే శాఖ డిప్యూటీ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ (కన్స్ట్రక్షన్) వరల్డ్ క్లాస్ స్టేషన్ ప్రాజెక్ట సికింద్రాబాద్ వారు కోరినందున, భూమి కావలయునని భావించి 2013 వ సంవత్సరము 30 వ చట్టములోని 15వ విభాగమునననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట శ్రీయుత జిల్లా కలెక్టరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దారుల భూములను ప్రజాప్రయోజనముల నిమిత్తము భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరము 30వ చట్టములోని 19(1) విభాగమునననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీయుత జిల్లా కలెక్టరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు వారు 2013వ సంవత్సరము 30వ చట్టములోని సెక్షన్ 19(1) విభాగమునననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు సుమారుగా **ఎ.34.41 సెం.లు** విస్తీర్ణమును రైల్వే లైను నిర్మాణము కొరకు భూమి అవసరమని భావించినందున భూసేకరణ చేయుటకు ఇందుమూలముగా ప్రకటన చేయుచున్నారు.

షెడ్యూలు

జిల్లా: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు | మండలం: ఆత్మకూరు | గ్రామం: అప్పారావు పాలెం మజరా లక్ష్మీపాడు

క్ర. సం.	సర్వే నెం. సబ్ డివిజన్ నెం.	మొత్తం విస్తీర్ణం (ఎ.సెం.)	భూసేకరణ విస్తీర్ణం (ఎ.సెం.)	తరగతి	సంబంధిత ఆసామి పేరు మరియు తండ్రి/భర్త పేరు	హద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు,కట్టడములు మరియు పంట వివరములు
1	24-2	1.56	0.81	పట్టా మెట్ట	పెమ్మసాని హజరత్తయ్య తండ్రి ఇద్రయ్య	24-2	25	24-1	26-2	మామిడి, కొబ్బరి కాయ, చింత, సీతాఫలం, జామ, పనస, వేరు, వేప, తాటి, ఈత, నిమ్మ, బోరు, బావి, పైపులైన్
2	24-1	1.06	0.07	పట్టా మెట్ట	చంద్ర దామోదర్ తండ్రి కోటయ్య	24-2	1066	24-1	26-2	సాగు భూమి
3	26-2	0.09	0.03	పట్టా మెట్ట	చంద్రా దామోదర్ తండ్రి కోటయ్య	324	25	26-1	332/1	బీడు
4	26-1	1.87	1.54	పట్టా మెట్ట	పయ్యావుల ఆదెమ్మ భర్త వెంకట రత్నం	324	25	24, 27	332/1	మామిడి, నిమ్మ, చింత, తాటి, టేకు, సపోటా, సీతాఫలం, వేప, పనస, మునగ, బోరు
5	27-1	1.33	0.14	పట్టా మెట్ట	పెమ్మసాని హజరత్తయ్య తండ్రి ఇద్రయ్య	27-2	27-1	27-1	26	మామిడి
6	27-2	1.06	0.05	పట్టా మెట్ట	పెమ్మసాని హజరత్తయ్య తండ్రి ఇద్రయ్య	324,28	27-1	26-2	27-2	మామిడి
7	69-3	2.11	0.31	పట్టా మెట్ట	కిలారి ఉమామహేశ్వర రావు తండ్రి బలరామయ్య	70	204	69-3	121	సాగుభూమి
8	70-3	1.06	0.14	పట్టా మాగాణి	చంద్రా కోటేశ్వరరావు తండ్రి రంగయ్య	70-1	69	121	70-1	సాగుభూమి
9	82-1	4.59	0.84	పట్టా మెట్ట	రావిళ్ళ యశోదమ్మ భర్త రమణయ్య	83	70	82-1	120, 119	సాగుభూమి
			0.05	పట్టా మెట్ట	కన్నెధారి వెంకట సురేష్ తండ్రి బలరామయ్య					
10	83-2	4.82	0.61 0.11	పట్టా మెట్ట	కన్నెధారి వెంకటసుధీర్ తండ్రి బలరామయ్య	84	82	83-2	119, 118	సాగుభూమి
11	84-1బి	5.10	0.57	పట్టా మాగాణి	పయ్యావుల ప్రభాకర్ నాయుడు తండ్రి శివరామానాయుడు	85	84-1ఎ	116, 118	84-1బి	సాగుభూమి
			0.54	పట్టామాగాణి	మూడాల జయమ్మ భర్త రత్నయ్య					
			0.49	పట్టా మాగాణి	గంగవరం ప్రభాకర్ తండ్రి రామస్వామినాయుడు					
			0.13	పట్టా మాగాణి	పెమ్మసాని మోహన్ తండ్రి రామానాయుడు					
12	84-1ఎ	1.93	1.62	పట్టా మెట్ట	పెమ్మసాని వీరమ్మ భర్త రమణయ్య	84-1బి	83	118	84-1బి	నల్ల తుమ్మ, తాటి, వేప
13	85	5.65	0.30	పట్టా మెట్ట	ఏలూరు వెంకటరత్నం తండ్రి వెంకట రామానాయుడు	86	86	86	115	సాగుభూమి
			0.41	పట్టా మెట్ట	పయ్యావుల దయాకర్ నాయుడు తండ్రి శివరానాయుడు					
			1.36	పట్టామెట్ట	చంద్ర సాయమ్మ భర్త మధుసూదన్					
14	86-1	2.67	0.34	పట్టా మెట్ట	ఏలూరు వెంకటరత్నం తండ్రి వెంకట రామానాయుడు	112	85	86	86-1	సాగుభూమి
			0.45	పట్టామెట్ట	చంద్ర సాయమ్మ భర్త మధుసూదన్					
15	86-2	1.83	0.70	పట్టా మెట్ట	చంద్ర సాయమ్మ భర్త మధుసూదన్	86-1	85	86-2	86-1	సాగుభూమి
16	110-1	2.72	0.47	పట్టా మెట్ట	ఈగ లక్ష్మీ రెడ్డి తండ్రి యల్లారెడ్డి	111	112	110-1	112	సాగుభూమి
17	112	15.21	0.53	పట్టా మెట్ట	ఈగ లక్ష్మీ రెడ్డి తండ్రి యల్లారెడ్డి	112	86	110	112	తాటి, వేప
			0.42	పట్టామెట్ట	చంద్ర సాయమ్మ భర్త మధుసూదన్					
			0.10	పట్టా మెట్ట	పెమ్మసాని తిరుపతమ్మ తండ్రి చెంచురామయ్య					
			0.20	పట్టామెట్ట	చంద్ర సుగుణమ్మ తండ్రి శ్రీనివాసులు					
			0.32	పట్టా మెట్ట	కొత్త భూమి					
			2.70	పట్టా మెట్ట	చంద్ర తిరుపతయ్య తండ్రి చెంచురామయ్య					
			0.34	పట్టామెట్ట	చంద్ర సుగుణమ్మ తండ్రి శ్రీనివాసులు					
18	118	2.94	0.04	పట్టా మెట్ట	రావెళ్ళ యశోదమ్మ భర్త రమణయ్య	118	119	84	118	సాగుభూమి
19	119-2	2.58	0.31	పట్టా మెట్ట	పెంచెం పెంచలయ్య తండ్రి పరదేశయ్య	118	120	83, 82	119-2	వేప
20	120	3.24	0.17	పట్టా మెట్ట	కిలారి సుందర రామయ్య తండ్రి వెంకటసుబ్బయ్య	119	121	82, 70	120	సాగుభూమి
21	121-1	0.51	0.23	పట్టా మాగాణి	గంగినేని రాగమ్మ భర్త లేట్ వెంకటేశ్వరు	120	121-2	70	121-1	సాగుభూమి
22	121-2	0.47	0.32	పట్టా మాగాణి	గంగినేని రాగమ్మ భర్త లేట్ వెంకటేశ్వర్లు	121-1	121-3	70	121-2	సాగుభూమి
23	121-3	1.04	0.42	పట్టా మాగాణి	కిలారి వెంకట రామయ్య తండ్రి బాల రామయ్య	121-2	121-3	69	121-3	సాగుభూమి
			0.03	పట్టా మాగాణి	గంగినేని రాగమ్మ భర్త లేట్ వెంకటేశ్వర్లు					
24	121-4	2.37	0.31	పట్టా మాగాణి	కిలారి వెంకట రామయ్య తండ్రి బాల రామయ్య	121-3	204	69	121-4	సాగుభూమి
25	204	2.31	0.04	పట్టా మాగాణి	కిలారి వెంకట రామయ్య తండ్రి బాల రామయ్య	121	121	121	121	సాగుభూమి
			0.23	పట్టా మాగాణి	పెమ్మసాని వెంకటేశ్వర్లు తండ్రి రమణయ్య					
			0.05	పట్టా మాగాణి	మామిడూరు లక్ష్మమ్మ భర్త పెంచలయ్య					
26	207	2.51	0.38	పట్టా మాగాణి	అడుసుమల్లి ప్రమీలమ్మ భర్త లక్ష్మయ్య	208	260	207	213	సాగుభూమి
27	208-2	1.49	0.45	పట్టా మాగాణి	చంద్రా సుగుణమ్మ భర్త శ్రీనివాసులు	209	209-2	209-2	212	సాగుభూమి
			0.26	పట్టా మాగాణి	చంద్ర హజరత్తయ్య తండ్రి శ్రీనివాసులు					
28	208-1	1.15	0.68	పట్టా మాగాణి	చంద్ర సుశీలమ్మ భర్త సారంగపాణి	28-2	28-1	28-2	212	సాగుభూమి
29	209	5.48	0.07	పట్టా మాగాణి	పెమ్మసాని రాగయ్య తండ్రి రామకృష్ణయ్య	204	209	209	209	సాగుభూమి
			0.58	పట్టా మాగాణి	పెమ్మసాని వెంకటేశ్వర్లు తండ్రి రమణయ్య					
			0.28	పట్టా మాగాణి	కిలారి ఉమ మహేశ్వరరావు తండ్రి బలరామయ్య					
			0.17	పట్టా మాగాణి	అడుసుమల్లి లక్ష్మయ్య తండ్రి సుబ్బరాయుడు					
			0.15	పట్టా మాగాణి	అడుసుమల్లి కోటేశ్వరరావు తండ్రి కోటయ్య					
			0.22	పట్టా మాగాణి	అడుసుమల్లి లింగయ్య తండ్రి శేషయ్య					
30	212	1.78	0.03	పట్టా మాగాణి	చంద్రా హజరత్తయ్య తండ్రి లేట్ శ్రీనివాసులు	209	208	208	212	సాగుభూమి
31	213	4.06	0.04	పట్టామాగాణి	రాటకొండ రమాదేవి భర్త శంకరయ్య	213	260	213	213	సాగుభూమి
			0.56	పట్టా మాగాణి	అడుసుమల్లి ప్రమీలమ్మ భర్త లక్ష్మయ్య					
32	261	3.04	0.49	పట్టా మాగాణి	1.అడుసుమల్లి ప్రసాద్ తండ్రి సుబ్బారావు 2. అడుసుమల్లి మాధవ రావు తండ్రి సుబ్బారావు	260	262	261	261	సాగుభూమి
			0.19	పట్టా మాగాణి	పమిడి రాధిక భర్త జగదీష్					
33	262-1	2.18	0.10	పట్టామాగాణి	పమిడి రాధిక భర్త జగదీష్	261	262	262	262	సాగుభూమి
			0.36	పట్టా మాగాణి	సోంపల్లి శివ రామయ్య తండ్రి పెంచలనాయుడు					
			0.15	పట్టా మాగాణి	యర్రగుంగు జగదీష్ తండ్రి రమణయ్య					
34	262-2	0.80	0.15	పట్టా మాగాణి	యర్రగుంగు జగదీష్ తండ్రి రమణయ్య	261	262	262-2	262-1	సాగుభూమి
			0.05	పట్టా మాగాణి	రాటకొండ సుబ్బారాయుడు తండ్రి వెంకటయ్య					
35	263-2	0.95	0.37	పట్టా మాగాణి	రాటకొండ సుబ్బారాయుడు తండ్రి వెంకటప్ప రాయుడు	262	264	263-3	263-2	సాగుభూమి
36	263-3	0.59	0.48	పట్టా మాగాణి	సోంపల్లి వేణుగోపాల్ తండ్రి పెంచలయ్య	262	264	263/3	263/2	సాగుభూమి
37	265-1	0.94	0.38	పట్టా మాగాణి	సోంపల్లి శివరామయ్య తండ్రి పెంచలయ్య	264	265-2	267	265-1	సాగుభూమి
38	265-2	1.24	0.33	పట్టా మాగాణి	సోంపల్లి శివరామయ్య తండ్రి పెంచలయ్య	264-1	266	267	265-2	సాగుభూమి
39	266	1.84	0.20	పట్టా మాగాణి	సోంపల్లి శివరామయ్య తండ్రి పెంచలయ్య	265	266	267	266	కొబ్బరికాయ,
			0.27	పట్టా మాగాణి	కొర్రపాటి శ్రీనివాసులు తండ్రి శంకరయ్య					వేప, బోరు
40	267-2	0.64	0.29	పట్టా మాగాణి	సోంపల్లి అమ్మణ్ణి భర్త శివ రామయ్య	264	267-3	267-2	265	సాగుభూమి
41	267-3	0.60	0.23	పట్టా మాగాణి	సోంపల్లి అమ్మణ్ణి భర్త శివ రామయ్య	267-2	268	45	265, 266	బోరు-1
42	269-1ఎ	0.93	0.71	పట్టామాగాణి	కొర్రపాటి సుధాకర్ తండ్రి శంకరయ్య	268	270	269-1బి	269-2	టేకు, కొబ్బరికాయ,
43	269-2	0.38	0.14	పట్టామాగాణి	కొర్రపాటి సుధాకర్ తండ్రి శంకరయ్య	268	270	269-1ఎ	269-2	వేప, బోరు
44	271-2	3.77	1.04	పట్టా మెట్ట	వల్లెగుంట విద్య భర్త వెంకట ప్రసాద్	270	324	271-2	271-2	తాటి, దిరిశ, వేప
			0.22	పట్టామెట్ట	చంద్ర వెంకటేశ్వర్లు తండ్రి రమణయ్య					
45	321	1.74	0.11	పట్టా మెట్ట	రావిళ్ళ మోహన్ రావు తండ్రి సుబ్బారాయుడు	324	327-ఎ	321	321	చింత , కొబ్బరికాయ, వేప, తాటి
			1.18	పట్టా మెట్ట	రావిళ్ళ మురళీ తండ్రి రమణయ్య					
46	322	0.83	0.09	పట్టా మెట్ట	1.మామిడూరు శ్రీనివాసులు తండ్రి రమణయ్య 2. మామిడూరు రమేష్ తండ్రి రమణయ్య 3. మామిడూరు చంద్రమౌళి తండ్రి రమణయ్య	322	326	322	321	చింత, మామిడి, నేరేడు, తాటి, వేప
47	325-1	0.09	0.09	పట్టా మెట్ట	పెమ్మసాని శివరామయ్య తండ్రి రమణయ్య	325-2	324	324	326	కొబ్బరికాయ, బత్తాయి, జామ, టేకు, చింత, నేరేడు, తాటి, కుంకుడు, పనస, మామిడి, బోరు
48	325-2	0.61	0.53	పట్టా మాగాణి	పెమ్మసాని శివరామయ్య తండ్రి రమణయ్య	323	325-1	325-2	326	కొబ్బరికాయ, బత్తాయి, జామ, టేకు, చింత, నేరేడు, తాటి, కుంకుడు, పనస, మామిడి, బోరు
49	323/బి-2	2.93	0.19	పట్టా మాగాణి	ఎస్.కె.బిసమిల్లా తండ్రి బిక్కిసాహెబ్	323/బి-2	323/బి-2	323/బి-2	326	సాగుభూమి
			0.52	పట్టా మాగాణి	షేక్ మహబూబ్ జాన్ భర్త హుసేన్ సాహెబ్					
50	323/బి-3	0.14	0.02	పట్టా మెట్ట	నాటినేని ఆదిశేషయ్య తండ్రి సరసపనాయుడు	323/బి-2	323/బి-2	323/బి-2	326	సాగుభూమి
			0.02	పట్టా మెట్ట	కొర్రపాటి కృష్ణనాయుడు తండ్రి వెంకట రత్నం నాయుడు					
51	326/ఎ	0.14	0.10	పట్టా మెట్ట	మామిడూరు శ్రీనివాసులు తండ్రి రమణయ్య	322	1079	1079	327	బీడు
52	326/బి1	0.53	0.01	పట్టా మెట్ట	రావిళ్ళ మోహన్ రావు తండ్రి సుబ్బారాయుడు	322	1079	1079	327	బీడు
53	326/బి2	2.19	1.36	పట్టా మెట్ట	షేక్ మహబూబ్ జాన్ భర్త హుస్సేన్ సాహెబ్	1079	323-2	324	327	కొబ్బరికాయ, మామిడి, చీమ చింత, వేప
			0.26	పట్టామెట్ట	కొర్రపాటి పెంచమ్మ భర్త బలరామయ్య					
54	327/ఎ1	0.27	0.27	పట్టామెట్ట	రావిళ్ళ మురళీ తండ్రి రమణయ్య	321	1078	326/ఎ	327/ఎ	సాగుభూమి
55	327/ఎ2	0.34	0.13	పట్టామెట్ట	రావిళ్ళ మురళీ తండ్రి రమణయ్య	321	1078	326/ఎ	327/ఎ	సాగుభూమి
56	327/బి1	0.84	0.60	పట్టా మెట్ట	రావిళ్ళ మోహనరావు తండ్రి సుబ్బారాయుడు	1078	327/బి	327/బి	327/బి	సాగుభూమి
57	327/బి2	1.01	0.03	పట్టా మెట్ట	రావిళ్ళ రాజేంద్రబాబు తండ్రి రమణయ్య	1078	326/బి	326/బి	327/బి	మామిడి
58	332-1	11.56	0.09	పట్టామెట్ట	పెమ్మసాని సుబ్బమ్మ తండ్రి పెంచలయ్య	331	26	26	332/1	మామిడి
మొత్తము		127.71	34.41							

ఈ భూముల ప్లాను భూసేకరణాధికారి మరియు శ్రీయుత రెవెన్యూ డివిజనల్ అధికారి, ఆత్మకూరు వారి కార్యాలయములో ఉంచబడినది. దానిని కార్యాలయపు పని దినములలో / వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. ఈ భూసేకరణలో నిర్వాసితులైన కుటుంబములు ఏమియునూ లేవు.

బొగ్గు గనులు , ఇనుపరాయి, పలకరాయి లేక ఇతర ఖనిజ సంపద , సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని వుంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే స్పష్టత గాని తొలగించుటగాని చేయవలెను.

సం/- హరినారాయణన్.యం., కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేట్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు.

పలాయనవాదమే లక్ష్యం

మాట్లాడటానికి ఏమీ లేక గందరగోళం

- శాసనసభలో రెండో రోజూ టీడీపీ అదే వైఖరి
- ఇందులో భాగంగానే విజిల్స్.. నినాదాలతో రభస
- కుర్చీలపై నిల్చొని కవ్వింపు చర్యలు
- నిషేధం ఉన్నా సభలో వీడియో చిత్రీకరణ
- అచ్చెన్నాయుడు, అశోక్‌లపై సెషన్ మొత్తం సస్పెన్షన్ వేటు
- స్పీకర్ చైర్‌ను చుట్టుముట్టి నినాదాలు.. సభ రెండుసార్లు వాయిదా
- మార్షల్స్ ద్వారా మూడంచెల భద్రతా వలయం ఏర్పాటు
- స్పీకర్ ఎంత సర్ది చెప్పినా మారని టీడీపీ ఎమ్మెల్యేల తీరు
- నిమ్మల, వెలగపూడి, గోరంట్ల ఒకరోజు సస్పెన్షన్


స్పీకర్‌ను చుట్టుముట్టి ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టీడీపీ సభ్యులు


విజిల్ ఊదుతున్న టీడీపీ సభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, గద్దె రామ్మోహన్

సాక్షి, అమరావతి : అసెంబ్లీలో ఏం మాట్లాడాలో దిక్కుతోచక, ఏం మాట్లాడితే ఏమవుతుందోననే భయంతో టీడీపీ పలాయనవాదాన్ని నమ్ముకుని, ఆచరిస్తోంది. ఇందులో భాగంగానే చట్టసభల ఖ్యాతిని దిగజారుస్తూ చిల్లర వ్యాఖ్యలతో స్పీకర్, అధికార పక్ష సభ్యులను చిరాకుపరుస్తోంది. తద్వారా సస్పెన్షన్ వేటు వేయించుకుని బయటకు జారుకోవచ్చనే వ్యూహంతో ముందుకు వెళుతోంది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అడ్డంగా బుక్కై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉండటంతో టీడీపీ సభ్యుల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. దీంతో సభలో 'స్కిల్' స్కామ్‌పై మాట్లాడే అవకాశం ఇచ్చినప్పటికీ, జైల్లో సౌకర్యాల గురించి అడ్డగోలుగా తప్పులు పట్టడం మినహా.. ఆయన నేరం చేయలేదని చెప్పేందుకు అవకాశం, ఆధారం లేక సభలో గందరగోళం సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకుంది. గురు, శుక్రవారాల్లో శాసనసభ సమావేశాల్లో టీడీపీ సభ్యుల ప్రవర్తనే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది. రెండవ రోజు శుక్రవారం కూడా టీడీపీ ఎమ్మెల్యేలు తమ స్థాయిని మరిచి వ్యవహరించారు. ఆకతాయిల మాదిరిగా స్పీకర్‌ను చుట్టుముట్టి ఆయనపై కాగితాలు చింపి విసిరేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. నినాదాలు చేస్తూ, బయటి నుంచి తెచ్చుకున్న విజిల్స్ ఊదుతూ అధికార పార్టీ సభ్యులను రెచ్చగొట్టేలా ప్రవర్తించారు. కుర్చీలు, బల్లలపై ఎక్కి తీవ్ర గందరగోళాన్ని సృష్టించారు. చంద్రబాబు అరెస్ట్ అంశంపై సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దమ్ముంటే చర్చలో పాల్గొనాలని మంత్రులు సవాల్ విసిరినా పట్టించుకోలేదు. సభా సమయాన్ని వృథా చేయడమే లక్ష్యంగా గొడవ సృష్టించేందుకు యత్నించారు. నిబంధనలకు విరుద్ధంగా సెల్‌ఫోన్‌లలో చిత్రీకరిస్తున్న ఇద్దరు సభ్యులను స్పీకర్ సెషన్ మొత్తం సస్పెన్షన్ వేటు వేయగా, మరో ముగ్గురిని ఒకరోజు సస్పెన్షన్ చేశారు. దీంతో మిగిలిన టీడీపీ సభ్యులు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్-చంద్రబాబు అరెస్ట్ వ్యవహారంపై చేపట్టిన స్వల్ప కాలిక చర్చలో పాల్గొనకుండా పలాయనం చిత్తగించారు.

సభ ప్రారంభమైంది మొదలు..

రెండో రోజు శాసనసభ ప్రారంభం కాగానే స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రశ్నోత్తరాలు మొదలు పెట్టారు. సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు మంత్రి గుడివాడ అమర్నాథ్ సిద్ధమయ్యారు. టీడీపీ సభ్యులు ప్లకార్డులతో నినాదాలు చేస్తూ సభలోకి వస్తూనే స్పీకర్ పోడియం వైపునకు దూసుకెళ్లారు. స్పీకర్ చైర్‌ను చుట్టుముట్టి నినాదాలు చేశారు. చంద్రబాబు అరెస్ట్ వ్యవహారంపై టీడీపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. ఈ అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చర్చలో పాల్గొని మీ వాదన వినిపించుకోవచ్చన్నారు. అయినా తక్షణమే చర్చకు పట్టుబడుతూ స్పీకర్‌పై కాగితాలు విరుసుతూ నినాదాలు చేయడంతో సభను స్పీకర్ వాయిదా వేశారు. రెండోసారి సభ ప్రారంభం కాగానే టీడీపీ సభ్యుల చుట్టూ మార్షల్స్‌తో మూడంచెల భద్రత వలయాన్ని ఏర్పాటు చేశారు.

టీడీపీ తీరుపై మండిపాటు

టీడీపీ సభ్యుల తీరుపై మంత్రులతో సహా పలువురు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. టీడీపీ ఎమ్మెల్యేల తీరు చూసి.. ఇలాంటి వారినా మనం ఎన్నుకున్నదని ప్రజలు సిగ్గు పడుతున్నారని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌పై చర్చలో పాల్గొనే దమ్ము లేకే టీడీపీ ఎమ్మెల్యేలు ఇలా దిగజారి వ్యవహరిస్తున్నారని మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. అసెంబ్లీలో టీడీపీ రౌడీయిజానికి ఎవరూ భయపడరని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సైకో చంద్రబాబు పాలన ఎప్పుడో పోయిందని మంత్రి జోగి రమేష్ అన్నారు. ఎన్టీఆర్‌ను పొట్టనపెట్టుకున్న చంద్రబాబే అసలైన సైకో అని మండిపడ్డారు. టీడీపీ ఎమ్మెల్యేలు అధ్వాన్నంగా ప్రవర్తిస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ధ్వజమెత్తారు. ప్రజాధనాన్ని దోచుకుని దొరికిపోయిన దొంగ చంద్రబాబు అని మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ మానసిక రోగి అని,ఆయనకు మెంటల్ సర్టిఫికెట్ ఉందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆయన్ను ఆస్పత్రికి తరలించకపోతే గన్ను తెచ్చి సభలో ఎవరో ఒకరిని కాల్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు.

నిషేధం ఉన్నా సెల్‌ఫోన్‌లతో చిత్రీకరణ

మూడంచెల భద్రతను ఏర్పాటుచేయడంతో టీడీపీ సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు, బెందాళం అశోక్‌లు తమ సెల్‌ఫోన్‌ల ద్వారా సభలో దృశ్యాలను రికార్డింగ్ చేయడం మొదలుపెట్టారు. నిబంధనను తుంగలో తొక్కి వీడియో రికార్డు చేసిన టీడీపీ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు స్పీకర్‌ను కోరారు. వీడియో రికార్డింగ్ చేసిన ఎమ్మెల్యేలు అచ్చెన్నాయుడు, అశోక్‌లను సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తూ స్పీకర్ రూల్ పాస్ చేశారు. దీంతో వీరిని మార్షల్స్ బయటకు పంపారు. ఈ దశలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వెలగపూడి రామకృష్ణబాబు, నిమ్మల రామానాయుడుతో సహా సభ్యులందరూ తమ వెంట తీసుకొచ్చిన విజిల్స్ ఊదుతూ సభలో గందరగోళం సృష్టించే యత్నం చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ, గద్దె రామ్మోహన్ సహా టీడీపీ సభ్యులు కుర్చీలలో నిల్చొని విజిల్స్ ఊదుతూ హంగామా చేశారు. సభా సంప్రదాయాలను తుంగలోకి తొక్కి విలువలను దిగజారుస్తున్న సభ్యులపై చర్యలు తీసుకోవాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కోరగా, ఎమ్మెల్యేలు గోరంట్ల, వెలగపూడి, నిమ్మలపై ఒకరోజు సస్పెన్షన్ వేటు వేస్తూ స్పీకర్ ఆదేశాలు జారీచేశారు. వారిని మార్షల్స్ బయటకు పంపగా, వారి వెంట మిగిలిన సభ్యులు కూడా వెళ్లిపోయారు. కనీసం మిగిలిన వాళ్లయినా చర్చలో పాల్గొనాలని మంత్రులు సహా పలువురు సభ్యులు కోరినా పట్టించుకోకుండా సభ నుంచి వెళ్లిపోయారు.

టీడీపీని బతికించేందుకే జనసేన స్థాపించారా?

- చంద్రబాబు పెద్ద కొడుకులా వ్యవహరిస్తున్నారు
- మిమ్మల్ని అభిమానులు నమ్మినట్లు ప్రజలు గుడ్డిగా నమ్మరని తెలుసుకోండి
- పవన్‌కు సామాజిక న్యాయపోరాట వేదిక బహిరంగ లేఖ



సాక్షి, అమరావతి: పవిత్ర గోదావరి సాక్షిగా కాపులు పెద్దన్న పాత్ర పోషించాలని పిలుపునిచ్చిన పవన్‌కళ్యాణ్ చివరకు చంద్రబాబుకు పెద్ద కొడుకు మాదిరిగా వ్యవహరిస్తున్నారని సామాజిక న్యాయ పోరాట వేదిక తప్పుబట్టింది. పవన్ వైఖరిపై పలు ప్రశ్నలు సంధిస్తూ వేదిక కన్వీనర్ రావి శ్రీనివాస్, చైర్మన్ యర్రాకుల తులసీరాం శుక్రవారం బహిరంగ లేఖను మీడియాకు విడుదల చేశారు. ఆ ప్రశ్నలు ఏమిటంటే..

- గౌడ-శెట్టిబలిజ కులస్తులుగానీ, యాదవ కులస్తులుగానీ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే చూసి ఆనందించాలని ఉందని మీరన్నారు. మరిప్పుడు చంద్రబాబును గానీ, ఆయన తనయుడు లోకేశ్‌నుగానీ సీఎంను చేయడమే లక్ష్యంగా ఎందుకు ముందుకెళ్తున్నారు? ఇదేనా మీ సామాజిక న్యాయం?
- టీడీపీని బతికించడం కోసమే మీరు జనసేన పార్టీని స్థాపించారా?
- మీ అభిమానులకు, మిమ్మల్ని నమ్ముకున్న మీ సామాజికవర్గానికి, మిమ్మల్ని అభిమానించే ఇతర సామాజికవర్గాలకు మీరిచ్చే సందేశం ఇదేనా?
- ప్రస్తుత తరుణంలో ఆ రెండు పార్టీలు కరెక్ట్ కాదు.. తృతీయ ప్రత్యామ్నాయంగా బీసీలకు, కాపులకు, దళితులకు ఒక్క అవకాశం ఇవ్వండి అని మీరు ప్రజలకు ఎందుకు అప్పీల్ చేయలేకపోతున్నారు?
- మీరు ప్రతీసారి టీడీపీకే ఎందుకు కొమ్ముకాస్తున్నారు? మీరు పెద్దకొడుకు పాత్ర బాగానే పోషిస్తున్నారు. పెద్దకొడుకుగా ఈసారి ముఖ్యమంత్రి అభ్యర్థిగా మిమ్మల్ని ప్రకటించమని చంద్రబాబును అడగండి. అడిగితే చంద్రబాబు నిజాయితీ ఏమిటో? మీ నిజాయితీ ఏమిటో కూడా తేలిపోతుంది.
- 2014 ఎన్నికల్లో పొత్తుల ద్వారా బలపడాలని ఆనాడు మీకు తెలియదా?
- ఒక్క సీటు కూడా తీసుకోకుండా ఆనాడు ఎందుకు బాబుకు మద్దతు ఇచ్చారు? 2019లో ఎందుకు విడిపోయారు? 2023లో మళ్లీ ఎందుకు కలిసారు?
- 2019లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోవాలని ఉద్దేశ్యపూర్వకంగా విడిపోయారా? 2024లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోకూడదని ఉద్దేశ్యపూర్వకంగా కలుస్తున్నారా? ప్రజలు అంత అమాయకులా?
- మీ అభిమానులు మిమ్మల్ని గుడ్డిగా నమ్మినట్లుగా ప్రజలంతా అదే రీతిలో నమ్మరని గ్రహించండి.
- మీ అభిమానుల జీవితాలతో, మీ సామాజిక వర్గం వారి జీవితాలతో మీరు రాజకీయ క్రీడ నిర్వహిస్తున్నారనేది తేటతెల్లమవుతోంది. మీకు నిజాయితీ ఉంటే ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలో ఉండండి. లేదంటే ఈ రాష్ట్రానికి ఒక బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిగా ప్రకటించండి.
- పెద్దన్న పాత్రను ముందుగా మీరు పోషించండి.. ఇతరులకు చెప్పడం కాదు.

10 లక్షల మంది బాలికలకు 'స్వేచ్ఛ'

ఏటా 12 కోట్ల శానిటరీ న్యాప్కిన్స్ పంపిణీ

- ప్రతి నెలా కోటి చొప్పున నాలుగు నెలలకు ఒకసారి..
- 10,144 స్కూళ్లు, కళాశాలల్లో 10 లక్షల మందికి అందజేత
- రుతుక్రమ సమయంలో ఇబ్బందులకు చెక్
- ఈ ఏడాది రూ.35 కోట్లు వెచ్చించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో చదువుతున్న బాలికలకు 'స్వేచ్ఛ' పథకం కింద శానిటరీ న్యాప్కిన్స్ పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు నెలల కాలానికి గాను మొదటి విడతగా జూన్‌లో ప్యాడ్స్ అందించగా, రెండో విడత పంపిణీని అక్టోబర్ నెలలో ప్రారంభించనున్నారు. బాలికల స్కూల్ డ్రాప్ అవుట్‌కు కారణమవుతున్న రుతుక్రమ సమయంలో ఇబ్బందులను పరిష్కరించేందుకు 2020-21 విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం 'స్వేచ్ఛ' పథకాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఏడు నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న కిశోర బాలికలకు నెలకు 10 చొప్పున ఏడాదికి 120 శానిటరీ ప్యాడ్స్‌ను పంపిణీ చేస్తోంది. కౌమారదశలో ఉన్న బాలికలు రుతుస్రావం సమయంలో పాఠశాల, కాలేజీ మానేస్తున్నారు. దీంతో డ్రాప్ అవుట్స్ పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించడంతో పాటు రుతుక్రమం సమయంలో బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ నాణ్యమైన(బ్రాండెడ్) శానిటరీ ప్యాడ్స్‌ను ప్రభుత్వమే రాష్ట్రంలో ప్రభుత్వ యాజమాన్యంలో నడుస్తున్న 10,144 పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లోని విద్యార్థినులకు అందిస్తోంది. గతంలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం చేపట్టగా, ఈ ఏడాది నుంచి పాఠశాల విద్యాశాఖలోని మధ్యాహ్న భోజన విభాగానికి అప్పగించారు.

వచ్చే నెలలో 4 కోట్ల ప్యాడ్స్ పంపిణీకి ఏర్పాట్లు

దేశంలో 23 శాతం మంది విద్యార్థినులు బహిష్టు సమయంలో పాఠశాలలు, కళాశాలలకు దూరంగా ఉంటున్నారని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో ఈ పరిస్థితిని నివారించేందుకు ప్రభుత్వం 'స్వేచ్ఛ' పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలోని 10,144 స్కూళ్లు, కాలేజీల్లో 7 నుంచి 12వ తరగతి చదువుతున్న 10 లక్షల మంది విద్యార్థినులకు ఒకొక్కరికి నెలకు 10 ప్యాడ్స్ చొప్పున ఏడాదికి 12 కోట్ల ప్యాడ్స్‌ను పంపిణీ చేస్తోంది. ఇందుకోసం ప్రభుత్వం ఈ ఏడాది రూ.35 కోట్ల నిధులను వెచ్చించింది. ప్రతి నాలుగు నెలలకు ఒక పర్యాయం పంపిణీ కార్యక్రమం చేపడుతోంది. ఈ విద్యా సంవత్సరంలో సెప్టెంబర్ వరకు అవసరమైన ప్యాడ్స్‌ను జూన్ నెలలో అందించగా, రెండో విడత పంపిణీని అక్టోబర్‌లో ప్రారంభించనున్నారు. దీంతో రుతుక్రమంలో ఎదురయ్యే సమస్యలు, నివారణ చర్యలపై విద్యార్థినుల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి పాఠశాలలోను నెలకు ఒకసారి మహిళా ఉపాధ్యాయులు, మహిళా పోలీసుల ద్వారా సదస్సులు నిర్వహిస్తున్నారు. వినియోగించిన ప్యాడ్స్‌ను పర్యావరణ హితంగా నాశనం చేసేందుకు ప్రత్యేక డస్ట్‌బిన్లు, యంత్రాలను కూడా అందుబాటులోకి తెచ్చారు.



అసెంబ్లీకి వెళ్లం

- మమ్మల్ని కట్టడి చేస్తున్నందువల్లే వీడియోలు తీశాం
- సస్పెన్షన్ తర్వాత టీడీపీ ఉప సభా నాయకుడు అచ్చెన్నాయుడు



సాక్షి, అమరావతి : అసెంబ్లీ సమావేశాలకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, అసెంబ్లీలో ఆ పార్టీ ఉప సభానాయకుడు అచ్చెన్నాయుడు తెలిపారు. అసెంబ్లీలో శుక్రవారం సస్పెన్షన్ వేటు పడిన అనంతరం ఆయన బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. తాము మాట్లాడుతుంటే మైకులు ఆపేస్తున్నారని.. ముఖ్యమంత్రి, మంత్రులకు మాత్రం గంటల తరబడి అవకాశమిస్తారని ఆరోపించారు. శాసనసభను వైఎస్సార్‌సీపీ కార్యాలయం కంటే దారుణంగా మార్చారని విమర్శించారు. స్పీకర్ తమను నియంత్రిస్తుండడం వల్లే తాము సెల్‌ఫోన్ల ద్వారా వీడియో చిత్రీకరణ చేశామని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుపై చర్చిస్తామంటూ ఆ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. శాసనసభలో జరుగుతున్న పరిణామాలకు కలత చెంది, అధికార పార్టీ సభ్యుల వైఖరిని నిరసిస్తూ ఈ సమావేశాలు ముగిసే వరకు టీడీపీ శాసనసభ్యులు, మండలి సభ్యులు ఉభయ సభలకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఉదయం అసెంబ్లీకి టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రదర్శనగా వచ్చారు.

చంద్రబాబుపై అవినీతి బురద

టీడీపీ నేత పయ్యావుల కేశవ్




సాక్షి, అమరావతి : వ్యక్తిగత విద్వేషాలతో స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో జగన్ ప్రభుత్వం చంద్రబాబుకు అవినీతి బురద అంటిస్తోందని టీడీపీ నేత పయ్యావుల కేశవ్ చెప్పారు. దీనివల్ల అంతిమంగా రాష్ట్ర యువత జీవితాలు నాశనమయ్యాయన్నారు. వెలగపూడిలోని అసెంబ్లీ వద్ద శుక్రవారం ఆయన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సీమెన్స్ సంస్థతో కలిసి పనిచేసిన ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి కనిపించని అవినీతి జగన్ ప్రభుత్వానికే కనిపించడాన్ని ఏమనాలని ప్రశ్నించారు. చంద్రబాబు లాంటి వ్యక్తి తమను గుర్తిస్తే, తమకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వస్తుందని భావించి సీమెన్స్ సంస్థ వారే ఆయన వెంటపడ్డారని, అందువల్లే ప్రాజెక్టుకు ఆయన ఒప్పుకొన్నారని చెప్పుకొచ్చారు. తర్వాత తరానికి ఏం కావాలో ముందే విజువలైజేషన్ చేసిన మేధావి చంద్రబాబని చెప్పారు.

డొల్ల కంపెనీలు.. దొంగ అగ్రిమెంట్లు

స్కిల్ కుంభకోణంపై అసెంబ్లీలో చర్చలో ఆర్థిక మంత్రి బుగ్గన

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో మాజీ సీఎం చంద్రబాబు రూ.371.25 కోట్ల ప్రజాధనాన్ని దొంగ అగ్రిమెంట్లు, డొల్ల కంపెనీలతో దోచుకున్నారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సెబీ, జీఎస్టీ, ఈడీల విచారణలో ఈ కుంభకోణం వెలుగులోకి రాగా, తరువాత ఐటీ శాఖ దాడుల్లో కూడా చంద్రబాబు అక్రమాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. వీటి ఆధారంగా సీఐడీ విచారించడంతో చంద్రబాబు పాత్రతో సహా మరిన్ని అంశాలు తేలాయన్నారు. నాలుగైదేళ్ల విచారణ అనంతరం పలువురు సాక్షులను ప్రశ్నించి పత్రాలను పరిశీలించాక ఆధారాలు లభించడంతోనే చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసిందన్నారు. వాస్తవాలు ఇలా ఉండగా టీడీపీ సభ్యులు అసెంబ్లీలో రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమాలు చేసిన చంద్రబాబును అరెస్టు చేయకుండా సన్మానం చేయమంటారా? అని నిలదీశారు. స్కిల్ స్కామ్‌పై శుక్రవారం అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చకు ఆయన సమాధానమిస్తూ అన్ని అంశాలను కూలంకషంగా సభకు వివరించారు.





పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అసెంబ్లీలో స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో స్కామ్ జరిగిన తీరును వివరిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

హడావుడిగా కార్పొరేషన్.. డొల్ల కంపెనీలకు డబ్బులు

చంద్రబాబు 2014లో అధికారంలోకి రాగానే వీలైనంత వేగంగా ప్రజాధనాన్ని దోచేసేందుకు ప్రణాళికలు రచించారు. అందులో భాగంగానే 2015 ఫిబ్రవరి 25న స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ డిపార్టుమెంట్‌ను ఏర్పాటు చేశారు. స్కిల్ శిక్షణ ఉన్నత విద్యలో భాగంగా ఉండగా దాన్ని వేరుచేసి స్కిల్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంట్‌గా విభజించారు. తరువాత జర్మనీకి చెందిన సీమెన్స్‌కు తెలియకుండా ఆ కంపెనీ ముసుగులో నైపుణ్య శిక్షణ అంటూ జీవో నెం 4 ఇచ్చారు. దానికి భిన్నంగా డిజైన్‌టెక్ అనే షెల్ కంపెనీని తెచ్చి ఒప్పందం చేసుకున్నారు. దొంగ సంతకాలు, తేదీలు వేయకుండా జరిగిన ఈ ఎంఓయూ పూర్తిగా అక్రమమే. ఆరు క్లస్టర్లుగా ఒక్కోదాని పరిధిలోని 5 ఇన్‌స్టిట్యూషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కో క్లస్టర్‌కు అయ్యే ఖర్చు రూ.546 కోట్లుగా చూపించి అందులో 90 శాతం సీమెన్స్ సంస్థ భరిస్తుందని, 10 శాతం నిధులను ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఇస్తుందని జీవోలో పేర్కొన్నారు. వాస్తవానికి ఆ జీవో, ప్రాజెక్ట్ గురించి సీమెన్స్ కంపెనీకి ఏమాత్రం తెలియదు. ఒకవేళ ఎవరైనా ఎంఓయూ చేసుకుని ఉంటే తమకు సంబంధం లేదని సీమెన్స్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఆరు క్లస్టర్లకు రూ.3,281 కోట్లు ఖర్చు అవుతుందని తేల్చారు. ఈ ప్రాజెక్టు నివేదిక కూడా పూర్తిగా బోగస్. తమకు తెలియకుండా ఇండియాలో తమ ఎండీ నాటి చంద్రబాబు ప్రభుత్వంతో ఒప్పందం పేరుతో అవినీతికి పాల్పడ్డారని సీమెన్స్ కంపెనీ అంతర్గత విచారణలో తేలింది. దీంతో ఆ ఎండీని తొలగించినట్లు సీమెన్స్ కంపెనీ లిఖితపూర్వకంగా వెల్లడించింది. అదే విషయాన్ని సీమెన్స్ లీగల్ హెడ్ న్యాయస్థానంలో 164 సెక్షన్ కింద వాంగ్మూలం కూడా ఇచ్చారు. ఇంత జరిగినా చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని టీడీపీ ప్రచారం చేస్తోందంటే అంతకన్నా దారుణం మరొకటి ఉండదు.

జీఎస్టీ డీజీ విచారణతో వెలుగులోకి

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా ఇచ్చిన సమాచారంతో 2017 ఆగస్టులో మొదటిసారిగా జీఎస్టీ డైరెక్టర్ జనరల్ (పుణే) డొల్ల కంపెనీలను విచారిస్తున్న సమయంలో కొన్ని బోగస్‌వి దొరికాయి. ఆ డొల్ల కంపెనీలకు డబ్బులు చేరవేసి అక్కడినుంచి వేరే సంస్థలు, వ్యక్తుల చేతుల్లోకి మళ్లించినట్లు జీఎస్టీ విచారణలో తేలింది. దీంతో అలైడ్ కంప్యూటర్స్ ఇంటర్నేషనల్ ఏషియా లిమిటెడ్, స్కిల్లర్ ఇండియా ఎంటర్ ప్రైజెస్ ఇండియా లిమిటెడ్ (పీవీఎస్పీ ఐటీ స్కిల్స్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్), డిజైన్ టెక్ సిస్టమ్స్ లిమిటెడ్‌కు జీఎస్టీ డీజీ నోటీసులు ఇచ్చారు. చంద్రబాబు ఈ సంస్థలతోనే ఎంఓయూ కుదుర్చుకున్నారు. జీఎస్టీ డీజీ విచారణలో అక్రమాలు బయటపడిన తరువాత, ఈడీ, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు కూడా విచారణ జరిపారు. ఈ క్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంపై జీఎస్టీ అధికారులు నాటి టీడీపీ ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. దాని ఆధారంగా విచారణ చేపట్టాల్సిన గత ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోగా అవినీతికి కీలకమైన ఫైళ్ల నుంచి నోట్ ఫైళ్లను మాయం చేసింది. ఆ తరువాత ఓ విజిల్ బ్లోయర్ (ప్రజా వేగు) స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో గత సర్కారు అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిపై సీఐడీ విచారణతో మొత్తం అక్రమాలు బయటకు వస్తున్నాయి. పలు డొల్ల కంపెనీల ద్వారా ప్రజాధనాన్ని తరలించినట్లు తేటతెల్లమైంది. ప్రాథమిక విచారణ చేశాక 2021 డిసెంబర్ 9న సీఐడీ కేసు నమోదు చేసింది. ఆ తరువాత కొంతమందిని విచారించి అరెస్టు కూడా చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అప్పటి డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మీనారాయణ, స్పెషల్ ఆఫీసర్, సెక్రటరీ నిమ్మగడ్డ వెంకట కృష్ణ ప్రసాద్, సురేష్ గోయెల్ (ఢిల్లీ చార్టెడ్ అకౌంటెంట్), మనోజ్‌కుమార్ జైన్ (ఢిల్లీ చార్టెడ్ అకౌంటెంట్), యోగేష్ గుప్తా (షేర్స్ ట్రేడింగ్ బిజినెస్) శ్రావణ్ కుమార్ తులరాంజాజు (షేర్ ట్రేడింగ్ బిజినెస్)లను అరెస్టు చేశారు. 2017 నుంచి 2023 వరకు సెబీ, జీఎస్టీ ఇంటెలిజెన్సు, ఐటీ, ఈడీలు విచారించాయి. ఈడీ కూడా సౌమ్యాద్రి శేఖర్ బోస్, వికాస్ వినయ్ కన్విల్కర్, ముకుల్‌చంద్ అగర్వాల్, సిరీస్ చంద్రకాంత్‌ఝా, బిపన్‌కుమార్‌శర్మ, నీలన్‌శర్మ, గంటి వెంకటసత్య భాస్కర్ ప్రసాద్, వీరందరినీ విచారించి అరెస్టు చేసింది.

ఇంకా కళ్లు మూసుకుని ఉండాలా?

పలు అరెస్టులు జరిగిన ఈ అంశంలో విచారించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదా? ఈడీ విచారించిన నిందితులే స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కామ్‌లోనూ ఉన్నారు. సీమెన్స్ ఇండియా తరఫున గుజరాత్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని సౌమ్యాద్రి శేఖర్ బోస్‌గా సంతకం చేసిన వ్యక్తి ఏపీకి వచ్చేసరికి ఎంఓయూలో సుమన్ బోస్‌గా సంతకం చేశారు. అతడితోపాటు డిజైన్‌టెక్ తరఫున సంతకం చేసిన కన్విల్కర్, స్కిల్లర్ ఎంటర్‌ప్రైజెస్ తరఫున ఒప్పందం చేసుకున్న చంద్ర అగర్వాల్, పేమెంటు తీసుకున్న సురేష్ గోయెల్‌ను ఈడీ గతంలో అరెస్టు చేసింది. ఇంతమందిని ఈడీ అరెస్టు చేసినా మనం కళ్లు మూసుకొని ఉండాలా? అక్రమాలను గుర్తించిన జర్మనీలోని సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయం సుమన్‌బోస్‌ను ఆ పదవి నుంచి తొలగించింది. ఈ కుంభకోణంపై సీఐడీ ఫోరెన్సిక్ ఆడిట్ కూడా నిర్వహించింది. అనేక అక్రమాలు జరిగినట్లు అందులో తేలింది. ఇన్ని వాస్తవాలు కళ్లముందు కనిపిస్తుండడంతో టీడీపీ వాళ్లు కక్షసాధిస్తున్నారంటున్నారు. తప్పు జరగలేదని చెప్పట్లేదు.

ఒప్పందం తరువాత షెల్ కంపెనీల ఏర్పాటు

ఇక డబ్బుల చెల్లింపులు చూస్తే గత ప్రభుత్వ పెద్దలు ప్రజాధనాన్ని దోచేయడానికి ఎంత ఆరాటపడ్డారో అర్థమవుతుంది. ఒప్పందం కుదిరిన కొద్దిరోజులకే 2015 డిసెంబర్ 5న అప్పటికప్పుడు రూ.185 కోట్లు విడుదల చేశారు. 2016 జనవరి 29న మళ్లీ అర్జెంటుగా రూ.85 కోట్లు, 2016 మార్చి 11న రూ.67 కోట్లు, మార్చి 31న రూ.34 కోట్లు.. ఇలా మొత్తం నిధులను విడుదల చేశారు. విచిత్రమేమంటే క్లస్టర్లేవీ ఏర్పాటు కాకుండానే నిధులను ఇచ్చేశారు. స్కిల్లర్ ఎంటర్ ప్రైజెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లాంటి కొన్ని కంపెనీలను ఎంఓయూ కుదిరిన నెలరోజుల తరువాత ఏర్పాటు చేసి వాటి ద్వారా నిధులను తరలించేశారు. స్కిల్లర్ కంపెనీ అనేది డొల్ల కంపెనీ అని, కేవలం డబ్బులు కాజేయటానికే దాన్ని ఏర్పాటు చేశారని సీఐడీ తేల్చింది. ముందుగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి నేరుగా డిజైన్ టెక్‌కు రూ.273.21 కోట్లను తరలించి అక్కడి నుంచి డొల్ల కంపెనీల ద్వారా వేర్వేరు మార్గాల్లో నిధులను దోపిడీ చేశారు. పీవీఎస్పీ, స్కిల్లర్ ఇండియా, ఏసీఐ, క్యాడన్స్, పోలారస్, నాలెడ్జి పోడియం, ఈటీఏ, పాట్రిక్, ఐటీ స్మిత్, భారతీయ గ్లోబల్ సహా వివిధ ఫారెన్ కంపెనీల ద్వారా ఈ నిధులను కొల్లగొట్టారు. యోగేష్‌గుప్తా డొల్ల కంపెనీలలో భాగస్వామిగా తేలాడు. అతడు చంద్రబాబుకు సంబంధించిన ఇన్‌కమ్ ట్యాక్స్ స్కామ్‌లో నిందితుడు. ఈ స్కామ్‌లో మనోజ్ వాసుదేవ్ పార్థసానిని విచారిస్తే మంగేష్, అతుల్ సోని వినయ్ అనే వ్యక్తులు షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీ నుంచి డబ్బులు తీసుకొని డొల్ల కంపెనీల ద్వారా చంద్రబాబుకు అందించారని ఐటీ శాఖ తేల్చింది. ఇదంతా చంద్రబాబు వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన పెండ్యాల శ్రీనివాస్ ద్వారా నడిచింది. విక్కీజైన్ అనే వ్యక్తిని శ్రీనివాస్ తమకు అటాచ్ చేయడంతో డబ్బులు పంపినట్లు వారు ఐటీ శాఖకు వెల్లడించారు. ఈ స్కామ్‌లో రామోజీరావు వియ్యంకుడు ఆర్వీఆర్ రఘు కూడా ఉన్నాడు. పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసానిలను విచారించడానికి సీఐడీ 2023 సెప్టెంబర్ 5న నోటీసులు ఇవ్వగా వారిద్దరు ఆ మర్నాడే విదేశాలకు పరారయ్యారు.

కార్పొరేషన్ ఏర్పాటే ఒక దుష్ట పన్నాగం

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఎంతో హడావుడిగా విధి విధానాలు లేకుండా, కేబినెట్ అనుమతి లేకుండా ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ ఏర్పాటుకు కేబినెట్ అనుమతి కావాలని అప్పటి ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ అజేయ కల్లం స్పష్టంగా రాసినా చంద్రబాబు పట్టించుకోలేదు. తమకు నచ్చిన వ్యక్తులను తెచ్చి ఇంత ముఖ్యమైన సంస్థలో కీలక పోస్టుల్లో నియమించారు. గంటా సుబ్బారావును ఎండీ, సీఈఓగా నియమించారు. తరువాత అదే వ్యక్తిని ఎక్స్ అఫీషియో సెక్రటరీ టు సీఎం, హయ్యర్ ఎడ్యుకేషన్‌గా నియమించారు. సెక్రటరీ టు స్కిల్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంట్ బాధ్యతలూ అప్పగించారు. అన్ని హోదాల్లో ఒకే వ్యక్తిని నియమించుకున్నారు. నైపుణ్య శిక్షణ పేరిట రూ.371 కోట్లను త్వరగా కొట్టేయాలన్న ఉద్దేశంతోనే ఇవన్నీ చేశారు. 90 శాతం గ్రాంటు వస్తుందని జీఓలో చెప్పి ఎంఓయూలో దాని ఊసే లేకుండా చేశారు. ప్రభుత్వం నుంచి హడావుడిగా నిధులు విడుదల చేశారు. టెండర్లకు వెళ్లకుండా డబ్బులు కాజేసేందుకు పథకం ప్రకారం వ్యవహరించారు.

డిజిటల్ ఫైల్స్ లేకుండా..

ఈ శిక్షణ వ్యవహారంలో గత ప్రభుత్వం ఏ ఒక్క ప్రొసీజర్‌ను కూడా అనుసరించలేదు. డిజిటల్ ఫైల్సు లేకుండా ఫిజికల్ ఫైల్స్‌తోనే తతంగం నడిపించారు. కొత్త ప్రాజెక్టు కనుక ఒకేసారి కాకుండా పైలట్‌గా చేపట్టాలని అప్పటి ఆర్థిక శాఖ కార్యదర్శి సునీత సూచించినా పట్టించుకోలేదు. ముందుగానే రూ.371 కోట్లు ఎలా విడుదల చేస్తారని కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పటి సీఎస్ కృష్ణారావు, ఇతర అధికారులు కూడా నిధుల విడుదలపై కొన్ని అభ్యంతరాలు చెప్పినా పట్టించుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా రూ.371 కోట్లు విడుదల చేసేశారు. ఇవన్నీ నాటి సీఎం పాత్ర లేకుండా జరుగుతాయా? శ్రీనివాస్, పార్థసానిలను విచారిస్తే ఈ డబ్బులు ఎవరిదగ్గరకు చేరాయో తెలుస్తుంది.

చిత్ర విచిత్రాలు

సీఐడీ పరిశోధనల్లో అనేక అవకతవకలు బయట పడ్డాయి. సౌమ్యాద్రి బోస్ అనే వ్యక్తి సీమెన్సు ఇండియా సాఫ్ట్‌వేర్‌కు ఎండీగా ఉన్నాడు. గుజరాత్‌తో చేసుకున్న ఎంఓయూలో సౌమ్యాద్రి బోస్ అని సంతకం చేసి మన దగ్గరకు వచ్చేసరికి సుమన్ బోస్‌గా పేరు మార్చేసి సంతకం చేశాడు. కంపెనీలో ఎండీగా ఉంటూ వేర్వేరు పేర్లతో సంతకాలు పెట్టడమన్నది ప్రపంచంలో ఎక్కడా జరిగి ఉండదు. అగ్రిమెంట్ జూన్ 2015 అని పేర్కొని ఎక్కడా తేదీ వేయలేదు. తేదీ లేకుండా అగ్రిమెంట్ ఎక్కడైనా చూశామా? పేజీ చివర్లో సీమెన్స్ ఇండియా లిమిటెడ్, డిజైన్ టెక్ ఇండియా లిమిటెడ్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మధ్య ఒప్పందం చేసుకున్నట్లు ఉన్నా తేదీలు వేయలేదు. 'డాష్..' అంటూ ఖాళీలు ఉంచారు. సాక్షి సంతకాల వద్ద కూడా ఖాళీ ఉంచారు. ఎంఓయూలో డిజైన్‌టెక్ ద్వారా అమలు చేస్తున్నట్లు చూపించి తరువాత మూడో పార్టీగా పీవీఎస్పీ ఐటీ స్కిల్స్ ప్రైవేటు లిమిటెడ్, స్కిల్లర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థలను తెరపైకి తెచ్చారు. జీఓలో సీమెన్సు అమలు చేయాలని పేర్కొని ఒప్పందంలో డిజైన్‌టెక్‌కు పరిమితం చేసి చివరకు స్కిల్లర్ ఎంటర్ ప్రైజెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగిస్తున్నట్లు చూపించారు. అసలు డిజైన్‌టెక్కే ఓ డొల్ల కంపెనీ. అది మరో డొల్ల కంపెనీకి ఇచ్చేసింది.

ఉపసంహరించుకోవడానికి మనమెవరం?

ప్రతిపక్ష సభ్యులు ఈ శాసనసభలో చాలా అన్యాయంగా ప్రవర్తిస్తున్నారు. చంద్రబాబు అరెస్టును బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఉపసంహరించుకోవడానికి మనమెవరం? కోర్టు, చట్టం తమ పని తాము చేస్తున్నాయి. విపక్ష సభ్యులకు వారికి కేటాయించిన సమయం కన్నా ఎక్కువ ఇస్తామని, ప్రభుత్వం సమాధానమిస్తుందని చెబుతున్నా వినకుండా వెళ్లిపోయారు. విజిల్ వేసిన ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తే మిగతా వారు కూడా వెళ్లిపోయారంటే చర్చించాలని వారికి ఏ కోశానా లేదు. చంద్రబాబు లాంటి మహా మేధావి ఎక్కడా దొరకడని వారి అభిప్రాయం.

సభ చరిత్రలో దుర్దినం

స్కిల్ స్కామ్ నిజమన్నది టీడీపీకి తెలుసు.. అందుకే పారిపోయారు

- స్కిల్ స్కామ్‌లో ఎంత అవినీతి ఎలా జరిగిందో మేం సభలో చెప్పాం
- టీడీపీ ఏం చెప్పుందో సభలోనే చెప్పొచ్చుగా
- చర్చలో పాల్గొంటే దొరికిపోతారన్నది వారి భయం
- స్కిల్ స్కామ్‌లో బాబు చీకటి ఒప్పందాలు, అధికారులపై ఒత్తిళ్లు.. అన్నీ సభలో వివరించాం
- మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: శాసన సభలో శుక్రవారం ప్రతిపక్షం ప్రవర్తించిన తీరు చాలా విచారకరమని, సభ చరిత్రలో దుర్దినమని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఆయన శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. 'ప్రతిపక్ష టీడీపీ ఒక పథకం ప్రకారం సభా సమయాన్ని వృథా చేస్తోంది. అవినీతికి పాల్పడ్డ చంద్రబాబుపై కేసు ఎత్తేయాలని రచ్చ చేస్తున్నారు. రెండు రోజులుగా సభలో టీడీపీ అసభ్యంగా ప్రవర్తిస్తోంది. చర్చకు రమ్మంటే ఎందుకు రావటంలేదో టీడీపీనే సమాధానం చెప్పాలి. స్కిల్ స్కామ్‌లో వాస్తవాలు తెలుసు కాబట్టే వారు పారిపోతున్నారు. స్కిల్ స్కామ్‌లో ఎంత అవినీతి జరిగిందో, ఎలా జరిగిందో మేం సభలో చెప్పాం. టీడీపీ ఏం చెప్పుందో సభలోనే చెప్పొచ్చుగా. చర్చలో పాల్గొంటే దొరికిపోతారన్నది టీడీపీ భయం. తప్పు చేశారు కాబట్టే హైకోర్టు క్వాష్ పిటిషన్ కొట్టేసింది. వారు చంద్రబాబు అరెస్టుపై సమావేశాల్లో చర్చ కోరారు. అందుకు, మేమూ సరేనన్నాం. ఈరోజు చర్చ మొదలు పెట్టాం. మరి తెలుగుదేశం పార్టీ సభ్యులు సమావేశాల్లో లేకుండా ఎందుకు పారిపోయారు? చంద్రబాబు అరెస్టుపై వారి అభిప్రాయం ఎందుకు చెప్పలేదు? వారి పార్టీ అధినేత ఏ తప్పూ చేయలేదని, అసలు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామే జరగలేదని మీరెందుకు చెప్పకుండా వెళ్లిపోయారు? నిజాలపై చర్చించే దమ్మూ ధైర్యం లేదని వారు బహిరంగంగా ఒప్పుకోవచ్చు కదా? చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌తో రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపడంపై ప్రజల్లో చట్టబద్ధమైన వ్యవస్థల పట్ల నమ్మకం ఏర్పడింది. న్యాయవ్యవస్థ, పోలీసులు చట్టాలకు లోబడే పనిచేస్తాయి గానీ రాజకీయ ప్రలోభాలకు లోబడి పనిచేయవు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్, చంద్రబాబు అరెస్టుపై సుదీర్ఘంగా చర్చించాం. స్కామ్ మొదలు నుంచి ఆయన చీకటి ఒప్పందాలు, షెల్ కంపెనీలకు ప్రజాధనం విడుదల చేయడానికి అధికారులపై పెట్టిన ఒత్తిళ్లు.. అన్నీ ప్రభుత్వం తరఫున పాయింట్లవారీగా వివరించాం. సీమెన్స్ ఒప్పందం మేరకు 90 : 10 నిష్పత్తి వాటాల గురించి టీడీపీ సభ్యులే చెబుతున్నారు. ప్రభుత్వ వాటా రూ.371 కోట్లు విడుదల నిజమేనని ఒప్పుకుంటున్న వారు సీమెన్స్ ఒప్పందం వాటా ఎందుకు రాలేదో చెప్పాలి కదా? డిజైన్‌టెక్ నుంచి షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు అందిన వందల కోట్ల రూపాయల గురించి లెక్కలు వివరిస్తే బాగుండేది కదా! చర్చలో పాల్గొంటే దొరికిపోతామన్నది ఆ పార్టీ సభ్యుల భయం. చంద్రబాబు ప్రజాధనం కొల్లగొట్టిన దొంగ అని, అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఆయన అవినీతికి పాల్పడటం వాస్తవమని మేము మరోమారు నిరూపించాం. దీన్ని ప్రజలంతా గమనించి ఆలోచన చేయాలి' అని బొత్స వివరించారు.

టీడీపీది అనవసర రాద్ధాంతం



స్కిల్ స్కాం, అందులో చంద్రబాబు అరెస్టు గురించి అసెంబ్లీలో చర్చించేందుకు అధికార పక్షం సిద్ధంగా ఉన్నా ప్రతిపక్ష తెలుగుదేశం సభ్యులు అనవసర రాద్ధాంతం చేస్తూ సభను అడ్డుకుంటున్నారు. బాలకృష్ణ మీసం తిప్పాల్సింది అసెంబ్లీలో కాదు. ఆయన తండ్రి ఎన్టీఆర్‌ను అవమానించిన సందర్భంలో తిప్పాల్సింది. ఎన్టీఆర్‌కు ఆయన తనయులే ద్రోహం చేశారనే అపోహ ఉంది. ఆ అపవాదును తొలగించుకునేందుకు బాలకృష్ణ ప్రయత్నం చేయాలి. చంద్రబాబు తన కుటుంబానికి ఎంత అన్యాయం చేశారో బాలకృష్ణ తెలుసుకోవాలి. మీ అల్లుడు లోకేశ్ ఎన్నికల్లో గెలవకుండానే ఎమ్మెల్సీగా నామినేట్ అయి మంత్రి అయ్యాడు. హరికృష్ణను మంత్రిగా చేసి ఆ తర్వాత తొలగించారు. బాలకృష్ణ రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనా మంత్రి కాలేకపోయారు. గురువారం సభలో టీడీపీ సభ్యులు పోడియంపైకి వెళ్ళి స్పీకర్‌ను మాన్‌హ్యాండిల్ చేయాలని ప్రయత్నం చేశారు. – మంత్రి అంబటి రాంబాబు

పచ్చ పార్టీకి పిచ్చి పట్టింది



బాబు జైల్లో ఉండేసరికి పచ్చ పార్టీకి పిచ్చి పట్టింది. నిన్న తొడకొట్టిన బాలకృష్ణ ఇవాళ ఎందుకు పారిపోయాడు? బావ తుప్పు కాదు నిప్పు అని ఆయన చెప్పలేకపోయాడు. ధైర్యం ఉంటే బాబుపై కేసులు ఎత్తివేయమని కోర్టులోనూ ఇలాగే తొడకొట్టి, విజిల్స్ వేయండి. చంద్రబాబు సీటు మీద బాలకృష్ణ మనసు పడ్డాడో ఏమో.. ఆ సీటెక్కి కూర్చోలేక, నిల్చోలేక చిల్లర చేష్టలు చేశాడు. పేద పిల్లల స్కిల్ డెవలప్‌మెంట్ సొమ్మును దోపిడీ చేశారని యువత ఆగ్రహంతో ఉంది. రాష్ట్రం కష్టాల్లో ఉందని అబద్ధాలు చెప్పిన బాబు తాను మాత్రం దోచుకుని పక్క రాష్ట్రంలో ప్యాలెస్ కట్టుకున్నారు. దోచుకున్న సొమ్మును తిరిగి ఇస్తానని, క్షమించండి అని ప్రజల కాళ్లావేళ్లా పడి క్షమాపణలు కోరాలి. నిన్ననే స్కిల్ స్కామ్‌పై చర్చకు వాయిదా తీర్మానం ఇచ్చి, ఈ రోజు చర్చ జరుగుతుంటే ఎందుకు పారిపోయారు? మాట్లాడే ధైర్యం లేదా? లేక ఆ స్కాంలో మీకూ వాటాలున్నాయా? స్కామ్ నిజమా కాదా అని చెప్పే అవకాశం వచ్చినప్పుడు బాలకృష్ణ పారిపోయాడంటే అర్థం ఏమిటి? బాబు నిప్పు అనుకుంటే సమావేశాలు ముగిసే లోపల చర్చకు రావాలి. సోమ, మంగళ, బుధ వారాల్లో ఎప్పుడైనా చర్చకు మేం సిద్ధం. స్కిల్ స్కాం ఒక్కటే కాదు...ఫైబర్ గ్రిడ్, తాత్కాలిక సచివాలయం వంటి అన్ని స్కాంలపై చర్చకు సిద్ధంగా ఉన్నాం. లోకేశ్ ఢిల్లీ వెళ్లి బహిరంగ చర్చకు వస్తారా అని అడుగుతున్నాడు. ఎలాగూ లోకేశ్ అసెంబ్లీకి రాలేదు. ఎందుకంటే ఏ ఎన్నికలోనూ ఆయన గెలవలేదు. – మంత్రి ఆర్కే రోజా



తొడగొడితే హీరోలైపోరు



అసెంబ్లీలో మీసం తిప్పితేనో, తొడగొడితేనో హీరోలు కాదు. ప్రజల్లో విశ్వాసం పొంది గెలిచిన వారే నిజమైన హీరో. ఆ హీరో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. బాలకృష్ణ రీల్ హీరో మాత్రమే. రియల్ హీరో కాదు. స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికిన చంద్రబాబు అవినీతిపరుడు.

– మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి


వ్యవస్థపై టీడీపీకి గౌరవం లేదు



రెండు రోజులుగా ప్రతిపక్షం తీరు సభా మర్యాదకు భంగం కలిగించేలా ఉంది. వ్యవస్థపై టీడీపీకి గౌరవం లేదు. స్కిల్ స్కాం మీద చర్చ కావాలంటారు. చర్చ మొదలుపెడితే పారిపోతారు. చంద్రబాబు సీట్లో నిలబడి బాలకృష్ణ విజిల్స్ వేస్తున్నారు. అచ్చెన్నాయుడు వీడియోలు తీశారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. క్వాష్ కోసం సుప్రీంకి వెళ్లినా లాభం లేదు.

– మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

చంద్రబాబు పెద్ద మోసకారి



చంద్రబాబు పెద్ద మోసకారి. చంద్రబాబు అరెస్ట్ అక్రమమైతే టీడీపీ నేతలు ఎందుకు చర్చకు రావడం లేదు? సీమెన్స్ కంపెనీ ఒప్పందం చేసుకోలేదని చెప్పింది. ఆధారాలతో సహా చంద్రబాబు దొరికిపోయాడు.

– ఎమ్మెల్యే కిలారి రోశయ్య

దద్దమ్మల పార్టీ టీడీపీ



స్కిల్ డెవలప్‌మెంట్ కేసుపై టీడీపీ నేతలు నిన్న వాయిదా తీర్మానం ఇచ్చారు. ఫార్మాట్‌లో రమ్మంటే రచ్చ చేశారు. వారికి కావాల్సింది చర్చ కాదు.. రచ్చ. చర్చకు అవకాశం ఉన్నా చర్చ జరగనివ్వడంలేదు. పిరికిపందల్లా, వెధవల్లా చర్చ నుంచి పారిపోతున్నారు. టీడీపీ అంటే తెలుగుదేశం పార్టీ కాదు తెలుగు దద్దమ్మల పార్టీ. – ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

నిధులు ఏమయ్యాయి?



సీమెన్స్ ఒప్పందం ప్రకారం విడుదల చేసిన నిధులు ఏమయ్యాయో టీడీపీ సమాధానం చెప్పాలి. స్కిల్ స్కామ్‌పై చర్చ ఉందని తెలిసీ టీడీపీ నేతలు రకరకాల విన్యాసాలు చేశారు. ఈలలతో విన్యాసాలు చేసినా ప్రభుత్వం సంయమనం పాటించింది. సమాధానం చెప్పలేకే టీడీపీ నేతలు పారిపోయారు. త్వరలోనే లోకేశ్‌కు కూడా చంద్రబాబుకు పట్టిన గతే పడుతుంది.

– ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బాబు తప్పు చేయలేదని నమ్మితే సభకు రండి



చంద్రబాబు తప్పు చేయలేదని నమ్మితే ప్రతిపక్ష సభ్యులు సభకు రావాలి. చర్చలో పాల్గొనాలి. రాష్ట్ర ఖజానాను దోపిడీ చేసిన గజ దొంగ చంద్రబాబు. ఫేక్ ఒప్పందంతో నిధులు మళ్లించారు. సభలో ప్రజా సమస్యలపై మాట్లాడకుండా సమయాన్ని వృథా చేస్తున్నారు. బాలకృష్ణ అసెంబ్లీలో కూడా స్క్రీన్ మీద నటిస్తున్నా అనుకుంటున్నాడు. అరెస్టు చేస్తారని లోకేశ్ ఢిల్లీ పారిపోయాడు.

– ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

గజదొంగ చంద్రబాబు





రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టిన గజదొంగ చంద్రబాబు. సీమెన్స్ కంపెనీ పేరుతో ఫేక్ కంపెనీతో ఒప్పందం చేసుకుని షెల్ కంపెనీల ద్వారా రూ.371 కోట్లు దోపిడీ చేశారు. మండలిలో కొత్త సభ్యులు వచ్చారు. వారు పరిచయం చేసుకోవాలి. ప్రజా సమస్యలను ప్రస్తావించాలి. కానీ అలా జరగనివ్వడం లేదు. మెడలు వంచుతానంటూ రెడ్ బుక్ పెట్టిన లోకేశ్ ఢిల్లీ పారిపోయాడు.

– ఎమ్మెల్సీలు పీవీవీ సూర్యనారాయణరాజు, బల్లి కళ్యాణ్ చక్రవర్తి

బాలకృష్ణకు మెంటల్



చంద్రబాబు పాపం పండి కటకటాల పాలయ్యాడు. త్వరలోనే మరిన్ని బాగోతాలు బయటకు వస్తాయి. టీడీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలి. బాలకృష్ణ ఒక మెంటల్ కేసు. మెంటల్ సర్టిఫికెట్ కూడా ఉంది.

– ఎమ్మెల్సీ పోతుల సునీత


డీఎస్సీ, 40వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వలేదు



జాబ్ క్యాలెండర్, డీఎస్సీపై శాసన మండలిలో వాయిదా తీర్మానం ఇచ్చాం. 40 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. త్వరలో భర్తీ చేస్తామంటున్న మంత్రి బొత్స ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయో ముందు తెలుసుకోవాలి.

– ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

పర్చూరులోనే అత్యధికంగా బోగస్ ఓట్లు



పర్చూరులోనే అత్యధిక బోగస్ ఓట్లు ఉన్నాయి. దీనిపై ఎన్నికల కమిషన్ అధికారికి వినతిపత్రం ఇచ్చాము. 2014కు ముందు బాపట్లలో 40 వేల బోగస్ ఓట్లు చేర్చారు. 2013–14 మధ్య 8 వేల బోగస్ ఓట్లు చేర్చారు. ఏ పోలింగ్ స్టేషన్లో ఏ ఐపీ అడ్రస్‌తో బోగస్ ఓట్లు చేర్చారో ఆధారాలతో ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం ఇచ్చాం. – మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్



మూలపేట పోర్టు నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

మంత్రి అమర్‌నాథ్



సాక్షి, అమరావతి: మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్వాసిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. శాసనసభలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో మూలపేట నిర్వాసితులకు సహాయ, పునరావాస చర్యలపై టీడీపీ ఎమ్మెల్యేలు అశోక్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, బాలవీరంజనేయస్వామి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. పోర్టు నిర్మాణం కోసం 317 ఎకరాల జిరాయితీ భూములు సేకరించామని తెలిపారు. ఎకరానికి రూ.25 లక్షలు చొప్పున ప్రభుత్వం పరిహారం ప్రకటించిందని, ఇప్పటి వరకు రూ.67 కోట్లు చెల్లించినట్లు వివరించారు. నిర్వాసిత కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ పథకాన్ని అమలు చేస్తున్నామని, 594 నిర్వాసిత కుటుంబాలకు రూ.108.86 కోట్లు మంజూరు చేశామని, ఇప్పటివరకు రూ.52 కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. సంతబొమ్మాళి మండలంలోని కస్పాడు, నౌపాడులో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కోసం రూ.13.81కోట్లతో 57 ఎకరాలు సేకరించామని చెప్పారు.

చీకటి ఒప్పందానికి రుజువు

స్కిల్ స్కామ్‌పై సభలో మాజీ మంత్రులు కన్నబాబు, పేర్ని నాని ధ్వజం

- కేసును పక్కదారి పట్టించేందుకే చంద్రబాబే తన పీఎస్‌ను దేశం దాటించారు
- వాళ్లే టికెట్లు తీసి అమెరికా పంపారనేందుకు మాదగ్గర ఆధారాలున్నాయి
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటులో సహకరించిన బాలయ్యకు ఇప్పుడు మంచి చాన్స్..

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో దొరికిపోయిన దొంగ, మాజీ సీఎం చంద్రబాబును ఎల్లో మీడియా పునీతుడిగా, అన్నా హజారేకు అన్న మాదిరిగా ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు విమర్శించారు. గతంలో చంద్రబాబును పెద్ద లంచగొండిగా పేర్కొంటూ రామోజీరావు స్వయంగా తన పత్రికలో కార్టూన్ వేయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు అదే చంద్రబాబును దేశభక్తుడి మాదిరిగా చిత్రీకరించేందుకు ఈనాడు ఆపసోపాలు పడుతోందన్నారు. ఫేక్ ఉద్యమాన్ని నడిపిస్తున్న ఎల్లో మీడియా చంద్రబాబును దోమలతో చంపేలా కుట్ర చేస్తున్నారంటూ కథనాలు ప్రచురించడం పైశాచికత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. సిల్క్ డెవలప్‌మెంట్ స్కామ్‌పై శుక్రవారం శాసనసభలో స్వల్ప కాలిక చర్చలో కన్నబాబు మాట్లాడారు.



కన్నబాబు



పేర్ని నాని

కరెంట్ పోయిందని కహానీలు

ఒప్పందం సమయంలో కరెంట్ పోవడంతో తేదీ వేయలేదని సీమెన్స్ ఇండియా అప్పటి ఎండీ సుమన్‌బోస్ చెప్పడం విడ్డూరంగా ఉంది. నిజమైన చీకటి ఒప్పందానికి ఇదే ఉదాహరణ. విజనరీగా ప్రచారం చేసుకునే చంద్రబాబు హయాంలో సెక్రటేరియట్, సీఎంవోల్లో కనీసం జనరేటర్ కూడా లేదా? కరెంట్

పెండ్యాలకు టికెట్లు తీసింది మీరే..

చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, లోకేశ్ అనుచరుడు కిలారు రాజేష్‌ను విచారిస్తే మొత్తం బయటకొస్తుంది. వారిని ఇప్పటికే దేశం దాటించేశారు. లోకేశ్ జాతీయ మీడియాతో పెండ్యాల శ్రీనివాస్ అసలు ప్రభుత్వ ఉద్యోగి కాదని చెబుతున్నారు. పెండ్యాల శ్రీనివాస్ ప్రభుత్వ ఉద్యోగే. చంద్రబాబుకు సూట్‌కేసుల్లో డబ్బులు తెచ్చింది అతడే. పైగా శ్రీనివాస్ పిక్నిక్‌కు అమెరికా వెళ్లాడని లోకేశ్ చెబుతున్నాడు. అలాగైతే మీ నాన్నను (చంద్రబాబును) అరెస్టు చేసిన వెంటనే వెనక్కి పిలిపించొచ్చు కదా? మీరే టికెట్లు తీసి ఆయన్ను అమెరికా పంపించారనేందుకు మాదగ్గర ఆధారాలున్నాయి. ఇంటర్‌పోల్ సాయం తీసుకునైనా పెండ్యాల శ్రీనివాస్, రాజేష్‌ను వెనక్కి తీసుకొస్తాం.

దొంగతనం తేటతెల్లం: పేర్ని నాని, మాజీ మంత్రి

చంద్రబాబు సీఐడీ విచారణలో నాకు తెలియదు.. మర్చిపోయా.. గుర్తులేదు అంటూ సినిమా డైలాగులు చెప్పారు. ఆయనకు బాకా ఊదే వ్యక్తులు, మీడియా సంస్థలు ఆధారాలు అడుగుతున్నాయి. లంచాలను ఫోన్‌పే, బ్యాంకు ఖాతాల ద్వారా తీసుకుంటారా? ఒకప్పుడు చంద్రబాబు ఒక్కరే ప్రజాధనాన్ని స్వాహా చేయగా లోకేశ్ రాకతో దోచుకునే జేబులు పెరిగాయి. టీడీపీ జమా ఖర్చులు చూసే దొంగ ఆడిటర్‌ను స్కిల్ డెవలప్‌మెంట్‌లో పెట్టుకుని కథ నడిపించారు. చంద్రబాబు తన గ్లామర్, గడ్డం అందాన్ని చూసి సీమెన్స్ పరుగెత్తుకుంటూ వచ్చిందని కేబినెట్‌లో కథలు చెప్పారు. ఇప్పుడు దొంగతనం తేటతెల్లం అవుతోంది. వాటాల కోసమే టీడీపీ సభ్యులు అసెంబ్లీలో రచ్చరచ్చ చేశారు. ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచి సీటు లాక్కున్నప్పుడు కత్తి అందించిన బాలకృష్ణకు ఇప్పుడు మంచి అవకాశం వచ్చింది. మొన్న బావను అరెస్టు చేయగానే పార్టీ ఆఫీసులో సీట్లో కూర్చోగా ఈరోజు అసెంబ్లీలోనే చంద్రబాబు సీట్లో బాలయ్య కూర్చున్నారు. మావాడు (పవన్ కళ్యాణ్) ఒక్కసారి ఎమ్మెల్యేగా, కార్పొరేటర్‌గా కూడా గెలవలేదు. అందుకే చంద్రబాబు ఎక్కడా సంతకం పెట్టలేదని అజ్ఞానంగా మాట్లాడుతున్నాడు. చంద్రబాబు న్యాయవాదులు ఎక్కడా స్కిల్‌లో స్కామ్ జరగలేదని వాదించట్లేదు. రిమాండ్ రిపోర్టులో ఏమీ లేదని ఎనిమిదేళ్ల వయసున్న తన పిల్లాడు కూడా చెబుతాడని చంద్రబాబు కుటుంబ సభ్యురాలు (నారా బ్రహ్మణి) అంటున్నారు. ఈ వివరాలన్నీ తెలిస్తే తన తాతకు ఇంత స్కిల్ ఉందా? అని ఆ పిల్లాడికీ అర్థం అవుతుంది. తప్పు చేస్తే చట్టం ముందు ఎవరైనా ఒకటే. పంజాబ్‌లో సినిమాల షూటింగ్‌ల పిచ్చి ఉన్న డేరా బాబా నేరం చేసి దొరికిపోయాడు. గోదావరి పుష్కరాల్లో అమాయకులను బలి తీసుకున్న చంద్రబాబు కూడా అదే కోవలోకి వస్తారు.

పోయిన వెంటనే సెల్‌ఫోన్‌లో టార్చ్ వేస్తున్న రోజులివి! స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు సహనిందితులు ముకుల్ అగర్వాల్, సుమన్ బోస్, వికాస్ ఖన్వేల్కర్ గతంలో ఒకే కంపెనీలో పనిచేశారు. పక్కా ఆధారాలతో ఈడీ అరెస్టు చేసిన సుమన్ బోస్ బెయిల్‌పై వచ్చి చంద్రబాబు తప్పు చేయలేదని చెప్పడం సిగ్గుచేటు.

గుజరాత్‌తో పోలిక సిగ్గుచేటు

గుజరాత్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో 85 శాతం సీమెన్స్, 15 శాతం ప్రభుత్వం భరించింది. ఇందులో సీమెన్స్ గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా కాకుండా కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా (సీఎస్ఆర్) రూ.99.85 కోట్లు సమకూరిస్తే ప్రభుత్వం రూ.17.10 కోట్లు ఖర్చు పెట్టింది. అదే ఏపీలో రూ.3,281 కోట్ల ప్రాజెక్టు అంటూ సీమెన్స్ పేరుతో బోగస్ ఒప్పందం చేసుకున్నారు. ఆ కంపెనీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండానే ప్రభుత్వ వాటాగా ఏకంగా రూ.371 కోట్లను విడుదల చేసి అప్పనంగా దోచేశారు. చంద్రబాబు తరపున ఢిల్లీ నుంచి వచ్చిన ఒక వకీల్‌సాబ్ కోర్టుల్లో కేసు వాదిస్తుంటే లోకల్ వకీల్ సాబ్ రోడ్లపై దొర్లుతూ వాగుతున్నాడు.

న్యాయస్థానాలకు శతకోటి వందనాలు

1,090వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అవినీతి అనకొండ చంద్రబాబు కేసుల్లో న్యాయబద్ధంగా తీర్పులిచ్చిన న్యాయ స్థానాలకు శతకోటి వందనాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,090వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. ప్రజాధనాన్ని దోచుకుని దాచుకున్న చంద్రబాబుపై ఉన్న కేసులన్నీ పునర్విచారణ చేసి తగిన శిక్ష వేయాలన్నారు. పేదవాడికి రాజధాని ప్రాంతంలో జానెడు జాగా ఇస్తానంటే వద్దని తప్పుడు పిటిషన్లు వేసి నిలిపివేయించిన చంద్రబాబుకు బహుజనుల ఉసురు తగలక తప్పదని హెచ్చరించారు. 14 సంవత్సరాల పాలనలో బాబు పేదల కోసం ఒక్క సంక్షేమ పథకమైనా చిరస్థాయిగా ఉండేలా ప్రవేశపెట్టాడేమో చెప్పాలన్నారు. ఇప్పటి వరకు వ్యవస్థలను మేనేజ్ చేసి అవినీతిని కప్పిపుచ్చు కుందామనుకున్న బాబుకు తగిన శాస్తి జరిగిందని చెప్పారు. బరితెగించిన బాలకృష్ణ అసెంబ్లీలో విజిల్ వేస్తూ బల్లలు ఎక్కి తిరుగుతూ చేస్తున్న చేష్టలు.. ఆయనకు మతి భ్రమించిందనేందుకు నిదర్శనమన్నారు. నాయకులు పెరికే వరప్రసాద్, పల్లె బాబు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

బాబు సీటులో బాలయ్య.. ఛాన్స్ వదలొద్దన్న సభ్యులు

- అసెంబ్లీలో చంద్రబాబు సీటులో కూర్చొని ఈలలు వేసిన బాలకృష్ణ
- మరికొద్దిసేపు సీట్లో నిల్చొని నిరసన
- ఇప్పటికైనా ఆ సీటులో కూర్చోవయ్యా అంటూ అంబటి ఛలోక్తులు

సాక్షి, అమరావతి: ఎవరికైనా అవకాశం వస్తే వదులుకోరు. మరీ ముఖ్యంగా చంద్రబాబు లాంటి వాళ్లు. అందుకే అవకాశం దొరకగానే ఎన్టీఆర్‌ని వెన్నుపోటు పొడిచి టీడీపీని చేజిక్కించుకున్నారు. అదే చంద్రబాబు ఇటీవల స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో రిమాండ్ ఖైదీగా జైలుకు వెళ్లారు. ఆ కొద్దిసేపటికే మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో చంద్రబాబు సీటులో ఆయన బావమరిది, ఎన్టీఆర్ కుమారుడు బాలకృష్ణ కూర్చొని నాయకులతో సమావేశమయ్యారు. శుక్రవారం శాసన సభలోనూ అదే సీను రిపీట్ అయ్యింది. సభలో సహచర సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో బాలయ్య తన బావ చంద్రబాబు సీటులో కొద్దిసేపు కూర్చున్నారు. ఈలలు వేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆ తర్వాత అదే సీటులో నిల్చొని నినాదాలు చేసారు. ఈ ఘటనపై మంత్రులతో సహా పలువురు ఎమ్మెల్యేలు సెటైర్లు విసరడం సభలో నవ్వులు పూయించింది.

ఛాన్స్ మిస్ చేసుకోవద్దు బాలయ్యా.. : అంబటి

'తండ్రి ఎన్టీఆర్‌ను బావ చంద్రబాబుతో కలిసి వెన్నుపోటు పొడిచావు. అప్పటి నుంచి ఆ సీటులో



కూర్చునేందుకు అవకాశం ఎప్పుడు వస్తుందా అని బావమరిది బాలయ్య ఎదురు చూస్తున్నాడు. అవకాశం వచ్చింది ఇప్పటికైనా ఆ సీటులో కూర్చోవయ్యా అంటే కూర్చోలేకపోతున్నావ్' అంటూ మంత్రి అంబటి రాంబాబు ఛలోక్తులు విసిరారు. 'ఆ సీటులో కూర్చోవయ్యా. మీ తండ్రి పార్టీని చేజిక్కించుకోవయ్యా' అంటూ సభలో సభ్యులందరూ వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ.. 'ఏ పార్టీలో అయినా అధినాయకుడు కూర్చున్న సీటు అంటే గౌరవిస్తారు. మా నాయకుడు సభలో ఉన్నా లేకున్నా ఆ సీటులో ఎవరూ కూర్చోరు. చివరికి పార్టీ ఆఫీసులో కూడా ఆయనకు కేటాయించిన సీటులో ఎవరూ కూర్చోరు. అదీ ఆ సీటుకు ఇచ్చే గౌరవం. కానీ టీడీపీ అధినేత చంద్రబాబు సీటులో ఎవరు పడితే వాళ్లు కూర్చుంటున్నారు. ఆ పార్టీలో బాబుకు ఇచ్చే గౌరవం అదీ' అంటూ ఎద్దేవా చేశారు. మీడియా పాయింట్ వద్ద మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ చంద్రబాబు జైలుకెళ్లిన దగ్గర నుంచి బావ సీటులో కూర్చోలేక, నిల్చోలేక బాలయ్య నానా తంటాలు పడుతున్నాడని వ్యాఖ్యానించారు. మొత్తమ్మీద చంద్రబాబు అరెస్ట్ తర్వాత బావ సీటు కోసం బాలయ్య చేస్తున్న విన్యాసాలు సామాజిక మాధ్యమాల్లో, టీడీపీ శ్రేణుల్లో చర్చనీయాంశమయ్యాయి.

కార్పొరేషన్లు, ఆలయ కమిటీల్లో..
ఎస్సీ, ఎస్టీ, బీసీల ప్రాతినిధ్యం ఇదిగో..

వీటిల్లో బీసీలు 3,159 మంది..

- ఎస్సీలు 960 మంది, ఎస్టీలు 657 మంది..
- అలాగే, టీటీడీ బోర్డులో ఏడుగురు ఎస్సీ, ఎస్టీ, బీసీలు
- అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి

సాక్షి, అమరావతి : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డుతో సహా వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లు, ఆలయ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాతినిధ్యం లేదనడంలో వాస్తవం లేదని అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. 2019–20 నుంచి ఈ పోస్టుల్లో రిజర్వేషన్లు అమలుచేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇందులో భాగంగా వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, వ్యవసాయ కమిటీల్లో చైర్మన్లు, సభ్యులుగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు కలిపి మొత్తం 4,776 మంది ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో బీసీలు 4,776 మంది, ఎస్సీలు, 960 మంది, ఎస్టీలు 657 మంది ఉన్నారని పేర్కొంది.

2019-20 నుంచి ఇప్పటివరకు విభాగాల వారీ నియామకాల జాబితా ఇలా..

పోస్టు	ఎస్సీ	ఎస్టీ	బీసీ	మొత్తం
కార్పొరేషన్ చైర్‌పర్సన్‌లు	18	2	98	118
కార్పొరేషన్ డైరెక్టర్లు	60	11	795	866
వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల చైర్‌పర్సన్‌లు	16	10	61	87
వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల సభ్యులు	324	162	648	1,134
ఆలయ కమిటీలు	526	465	1512	2,503
తిరుమల తిరుపతి దేవస్థాన బోర్డు	1	1	5	7
డీసీసీబీలు–చైర్‌పర్సన్లు	-	-	5	5
డీసీసీబీలు–వ్యక్తులు	12	6	30	48
సలహాదారులు	3	-	5	8
మొత్తం	960	657	3,159	4,776

'బ్లూజీన్' ద్వారా కోర్టులో
చంద్రబాబు హాజరు

- తెలుగు రాష్ట్రాల్లోనే ప్రప్రథమంగా ప్రత్యేక యాప్ వినియోగం
- బాబుతో న్యాయవాది లక్ష్మీనారాయణ ములాఖత్
- టీడీపీ లీగల్ టీంపై చంద్రబాబు అసహనం!

సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్న చంద్రబాబుకు ఏసీబీ కోర్టు విధించిన 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ శుక్రవారంతో పూర్తయిన నేపథ్యంలో వర్చువల్ విధానం ద్వారా ఆయన్ను ఏసీబీ న్యాయస్థానం ఎదుట హాజరు పరిచారు. అత్యాధునిక 'బ్లూ జీన్' యాప్ ద్వారా ఆయన్ను రాజమండ్రి సెంట్రల్ జైల్ నుంచి ఉదయం 11 గంటలకు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. మామూలుగా ఖైదీలను వర్చువల్ విధానం అంటే వీడియో కాల్ ద్వారా కోర్టులో హాజరు పరుస్తుంటారు. అప్పుడు కోర్టులో ఉన్న జడ్జిలు వారి స్థానం నుంచి మరో చోటుకు వెళ్లాల్సి వచ్చేది. అయితే చంద్రబాబుకు అత్యంత భద్రత కల్పించాలన్న ఉద్దేశంతో బ్లూ జీన్ యాప్‌ను వినియోగించినట్లు తెలిసింది. దీనిద్వారా జడ్జి తన ఛాంబర్‌లో కూర్చొనే విచారణ చేయొచ్చు. ఖైదీ సైతం తనకు కేటాయించిన బ్యారక్‌లో నుంచే కోర్టు ఎదుట హాజరు కావచ్చు. తెలుగు రాష్ట్రాల్లో మొట్ట మొదటిసారిగా ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రిమాండ్ ఖైదీని కోర్టులో హాజరు పరిచినట్లు ఓ అధికారి తెలిపారు. ఇదిలా ఉండగా, సెంట్రల్ జైల్లో చంద్రబాబుతో న్యాయవాది లక్ష్మీనారాయణ ములాఖత్ అయ్యారు. క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన విషయాన్ని బాబుకు వివరించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా టీడీపీ లీగల్ టీంపై బాబు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. మరింత మంది సుప్రీంకోర్టు సీనియర్లతో మాట్లాడాలని సూచించినట్లు తెలిసింది. ఎంత ఖర్చు అయినా సరే.. టాప్ లాయర్లను రంగంలోకి దింపాలని సూచించినట్లు సమాచారం. ఆధారాల జోలికి వెళ్లకుండా సాంకేతిక దారుల్లో వెళ్లాలని సూచించినట్లు తెలిసింది. అనంతరం నేడు జరగబోయే కస్టడీ విచారణపై చర్చించినట్లు తెలిసింది.

పట్టాభికి భంగపాటు

టీడీపీ నేత పట్టాభికి రాజమండ్రి సెంట్రల్ జైల్ వద్ద భంగపాటు ఎదురైంది. జైలు వద్ద ఉన్న మీడియా పాయింట్‌కు వచ్చిన ఆయన.. కాసేపట్లో తీర్పు వస్తుందని, బాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని, ప్రభుత్వంపై పోరాటం చేస్తారని ప్రకటించారు. ఇదిజరిగిన కొద్ది గంటల్లోనే హైకోర్టులో క్వాష్ పిటిషన్ కొట్టేసినట్లు వార్తలొచ్చాయి. దీంతో కోర్టులో ఉన్న అంశాలపై ఎందుకు మాట్లాడారని పార్టీలోని కొందరు పెద్దలు పట్టాభికి క్లాస్ పీకినట్లు తెలిసింది.

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి గోవర్ధన్‌రెడ్డి
- వ్యవసాయాన్ని బాబు దండగ అన్నారు
- వైఎస్సార్ తర్వాత సీఎం వైఎస్ జగన్ వ్యవసాయాన్ని పండగ చేశారు
- వ్యవసాయ రంగంలో విప్లవాత్మక చర్యలతో దేశానికే ఆదర్శంగా నిలిచారు
- రాష్ట్రంలో వ్యవసాయ రంగం పురోగతిపై మండలిలో స్వల్పకాలిక చర్చ

జగన్ పాలన రైతాంగానికి స్వర్ణయుగం



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రాష్ట్ర రైతాంగానికి స్వర్ణ యుగమని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చెప్పారు. 'ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం పురోగతి–రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు'పై శాసన మండలిలో శుక్రవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో పలువురు ఎమ్మెల్సీలు మాట్లాడిన అనంతరం మంత్రి గోవర్ధన్ బదులిచ్చారు. వ్యవసాయం దండగ అని చంద్రబాబు అంటే.. కాదు పండగ అని నిరూపించిన ఘనత మహానేత వైఎస్సార్‌దని, తర్వాత ఈ ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని చెప్పారు. ఇచ్చిన హామీకి కట్టుబడి వైఎస్సార్ రైతులకు పూర్తిగా రుణ మాఫీ చేశారన్నారు. అదే హామీతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రుణమాఫీకి కోతలు వేసి రైతులను దగా చేశారని తెలిపారు. ఉచిత విద్యుత్తు ఇస్తే కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవడానికే పనికొస్తుందని వెటకారం చేసిన వ్యక్తి చంద్రబాబు అని గుర్తు చేశారు. వైఎస్సార్ అందించిన ఉచిత విద్యుత్‌ను కొనసాగిస్తూ సీఎం వైఎస్ జగన్ వ్యవసాయానికి మరింత శక్తినిచ్చేలా 9 గంటలు నాణ్యమైన కరెంటు ఇస్తున్నారని వివరించారు. సీఎం జగన్ ప్రభుత్వం రైతులకు, కౌలు రైతులకు కూడా అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని చెప్పారు. కోవిడ్ సంక్షోభ సమయంలో అమెరికా, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలు సైతం చేతులెత్తేస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలను, రైతులను ఆదుకొని సీఎం జగన్ పెద్ద మనస్సు చాటుకున్నారని గుర్తు చేశారు. వ్యవసాయంలో ఈ క్రాప్ బుకింగ్, రైతు భరోసా కేంద్రాలు, ప్రకృతి వ్యవసాయం, బీమా వంటి కార్యక్రమాలతో దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఆర్బీకేలు అనేక జాతీయ అవార్డులతోపాటు ప్రపంచ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నాయని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, పశుసంవర్థక, డెయిరీ, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, వైఎస్సార్ జలకళ, ఉచిత విద్యుత్ వంటి చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని మంత్రి వివరించారు.

బాబు వచ్చాడు.. కరువు తెచ్చాడు

చంద్రబాబు 2014లో అధికారంలోకి వస్తూనే కరువు తెచ్చాడని మంత్రి చెప్పారు. బాబు ఐదేళ్ల పాలనలో 1,643 కరువు మండలాలు ప్రకటించారన్నారు. జగన్ పాలనలో సకాలంలో వర్షాలు కురిసి కరువు దరి చేరలేదని చెప్పారు. ప్రస్తుత సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు వస్తే ప్రత్యామ్నాయ కార్యాచరణతో రైతాంగాన్ని ఆదుకుంటామని తెలిపారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల విక్రయం వంటి అక్రమాలకు పాల్పడేవారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చర్చలో పాల్గొన్న సభ్యులు వరుదు కళ్యాణి, మర్రి రాజశేఖర్, ఏసురత్నం, పోతుల సునీత, కేఎస్ లక్ష్మణరావు పలు అంశాలను సభ దృష్టికి తెచ్చారు.

● తెలంగాణ

మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్‌రెడ్డి కన్నుమూత

- గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ తుదిశ్వాస
- ఉమ్మడి ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా సేవలు
- సంతాపం ప్రకటించిన సీఎం కేసీఆర్



పరిగి: పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తండ్రి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్‌రెడ్డి (76) శుక్రవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. పరిగిలోని స్వగృహంలో ఉన్న ఆయన శుక్రవారం రాత్రి ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ రాత్రి 10:30 గంటల సమయంలో మృతి చెందారు. దీనితో ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఐదుసార్లు ఎమ్మెల్యేగా..

పరిగి ఉప సర్పంచ్‌గా 1972లో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన హరీశ్వర్‌రెడ్డి.. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఉమ్మడి ఏపీలో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా, రాష్ట్ర ఆర్థిక సంస్థ అధ్యక్షుడిగా, టీటీడీ సభ్యుడిగా పనిచేశారు. సీఎం కేసీఆర్‌కు సన్నిహితుడిగా బీఆర్ఎస్ పార్టీలో కీలక పాత్ర పోషించారు. హరీశ్వర్‌రెడ్డి పెద్ద కుమారుడు మహేశ్‌రెడ్డి ప్రస్తుతం పరిగి ఎమ్మెల్యేగా ఉన్నారు. కొప్పుల హరీశ్వర్‌రెడ్డి మృతి చాలా బాధాకరమంటూ సీఎం కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా 'మండలి' కార్యక్రమాలు

- టీడీపీ ఎమ్మెల్సీలు విజిల్స్ వేస్తూ కొద్దిసేపు గందరగోళం సృష్టించే యత్నం
- ముగ్గురు టీడీపీ సభ్యుల సస్పెన్షన్
- సభ చరిత్రలోనే తొలిసారిగా సభ్యుల సస్పెన్షన్ విచారకరమన్న చైర్మన్
- కొత్త సభ్యులు రౌడీయిజంతో వ్యవహరించారని వెల్లడి
- కొద్దిసేపటి తర్వాత బయటకు వెళ్లిపోయిన మిగతా టీడీపీ సభ్యులు
- ప్రశ్నోత్తరాలు, స్వల్పకాలిక చర్చలోనూ పాల్గొన్న ప్రతిపక్ష పీడీఎఫ్ సభ్యులు

సాక్షి, అమరావతి : ఉదయం కొద్దిసేపు టీడీపీ ఎమ్మెల్సీలు చైర్మన్ పోడియం వద్ద ఈలలు, నినాదాలతో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేయడం, ఈ క్రమంలో ముగ్గురు టీడీపీ సభ్యుల సస్పెన్షన్ తప్పితే శుక్రవారం శాసన మండలి కార్యక్రమాలు ప్రశాంతంగా సాగాయి. దాదాపు గంటన్నర పాటు ప్రశ్నోత్తరాల కార్యక్రమం జరిగింది. ప్రశ్నోత్తరాలలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, గిరిజనుల సంక్షేమం, ధాన్యం కొనుగోళ్లు తదితర ప్రశ్నలపై చర్చలో పలువురు అధికార పార్టీ సభ్యులతోపాటు ప్రతిపక్ష పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రజా సంబంధ అంశాలపై పలువురు ఎమ్మెల్సీలు 'స్పెషల్ మెన్షన్' కింద మండలి చైర్మన్ మోషేన్‌రాజుకు విజ్ఞాపన పత్రాలు అందించారు. 'రాష్ట్రంలో వ్యవసాయ రంగం పురోగతి – రాష్ట్ర ప్రభుత్వ చర్యలు' అంశంపై రెండు గంటలపాటు స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ చర్చలో వివిధ పార్టీల సభ్యుల ప్రసంగాల అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమాధానమిచ్చారు.



వారంతట వారుగా సభ నుంచి వెళ్లిపోయిన టీడీపీ ఎమ్మెల్సీలు

చంద్రబాబుపై పెట్టిన కేసులపై చర్చించాలంటూ టీడీపీ, 'జాబ్‌క్యాలెండర్'పై చర్చ కోరుతూ పీడీఎఫ్ సభ్యులు రెండు వాయిదా తీర్మానాల నోటీసులు ఇచ్చారు. సభ ప్రారంభం కాగానే ఆ రెండింటినీ తిరస్కరిస్తున్నట్టు మండలి చైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు. ఆ వెంటనే ప్రశ్నోత్తరాల కార్యక్రమం మొదలు పెట్టారు. ఈ సమయంలో టీడీపీ ఎమ్మెల్సీలు చైర్మన్ పోడియం వద్దకు వచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. టీడీపీ ఎమ్మెల్సీలు కోరుతున్న అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మండలి కార్యక్రమాల అజెండాలోనూ ఉందని చైర్మన్ వారికి నచ్చ జెప్పే ప్రయత్నం చేశారు. ఇదే అంశంపై చర్చించాలని బీఏసీలోనూ నిర్ణయించినందున టీడీపీ ఎమ్మెల్సీలు ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి అంబటి రాంబాబు కూడా సూచించారు. అయినా టీడీపీ ఎమ్మెల్సీలు వినకపోవడంతో సభను కొద్దిసేపు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమయ్యాక టీడీపీ ఎమ్మెల్సీలు మరోసారి పోడియం పైకి వచ్చేందుకు ప్రయత్నించారు. మండలి చైర్మన్ మోషేన్‌రాజు మార్షల్స్‌ను పిలిపించి వారు పోడియం వద్దకు రాకుండా నిలువరించారు. టీడీపీ సభ్యులు మార్షల్స్‌ను నెడుతూ, విజిల్స్ వేస్తూ అల్లరి చేశారు. దీంతో మంత్రి సురేష్ చేసిన ప్రతిపాదన మేరకు టీడీపీ సభ్యులు కంచర్ల శ్రీకాంత్‌ను ఈ సమావేశాలు జరిగే అన్ని రోజులు, బీటీ నాయుడు, పంచుమర్తి అనురాధను శుక్రవారం ఒక్క రోజు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు చైర్మన్ ప్రకటించారు. వారిని మార్షల్స్ బయటకు తరలించారు. అనంతరం మిగిలిన టీడీపీ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేసే ప్రయత్నం చేశారు. వారి నుంచి ప్లకార్డులు స్వాధీనం చేసుకోవాలని చైర్మన్ మార్షల్స్‌ను ఆదేశించారు. దీంతో ఆ టీడీపీ ఎమ్మెల్సీలు కూడా వారంతట వారే సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.

కొత్తగా వచ్చారు.. రౌడీయిజంతో ప్రవర్తించడం వల్లే..
- మండలి చైర్మన్

ఈ సభ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా సభ్యులను సస్పెండ్ చేయాల్సి రావడం తీవ్ర విచారకర సంఘటన అని చైర్మన్ మోషేన్‌రాజు అన్నారు. సస్పెండ్ అయిన సభ్యులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 'చాలా దురదృష్టకరం. మీరు కొత్తగా వచ్చిన సభ్యులు. సభా సంప్రదాయాలను తెలుసుకోవాలి. చైర్మన్ స్థానానికి, ఇతర సభ్యులకు గౌరవం ఇవ్వాలి. అది తెలుసుకోకుండా ఏదో రౌడీయిజంగా ప్రవర్తించడం చాలా విచారించదగ్గ అంశం' అని మోషేన్‌రాజు వ్యాఖ్యానించారు.

గిరిజన సంక్షేమానికి | నాలుగేళ్లలో రూ.20,169 కోట్లు

- చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్లలో ఖర్చు చేసింది రూ.5,779 కోట్లే
- మండలిలో ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఉన్న మొత్తం 27.39 లక్షల మంది గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి వైఎస్ జగన్ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా 2019 నుంచి ఇప్పటి వరకు రూ. 20,169 కోట్లు ఖర్చు చేసినట్టు ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర శాసన మండలిలో వెల్లడించారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ.. గత చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో కేవలం రూ.5,779 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్ గిరిజనుల పక్షపాతిగా నిలుస్తున్నారని, గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం గత నాలుగేళ్లుగా బడ్జెట్‌లో కేటాయించే నిధుల కంటే కూడ ఎక్కువే ఖర్చు చేస్తోందన్నారు.

కనీస మద్దతు ధరతో పాటే గోతాలు, కూలీ, రవాణ ఖర్చులకు అదనపు తోడ్పాటు..



ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించడంతో పాటు ఈ ప్రక్రియలో గోతాలు, కూలీ, రవాణా ఖర్చులు వంటివి ప్రభుత్వం రైతులకు అదనపు ప్రయోజనాలు కల్పిస్తుందని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. ఒక వేళ రైతులే ముందుగా వీటిని సమకూర్చుకున్నా, అందుకైన మొత్తాన్ని ఆ చార్జీలను కలిపి ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్టు వెల్లడించారు. 2022–23 సంవత్సరానికి గాను ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులు సొంతంగా 3.09 కోట్ల గోతాలు సమకూర్చుకోగా.. అందుకు రూ.10.43 కోట్ల మొత్తాన్ని, ఈ ప్రక్రియలో అమ్మకాల సమయంలో రైతులు సొంతంగా 8.39 లక్షల మంది కూలీలను ఏర్పాటు చేసుకోగా.. ఇందుకు గాను రూ.117.91 కోట్ల మొత్తాన్ని, 5.57 లక్షల మంది రైతులు సొంతంగా ధాన్యం రవాణా వాహనాలు ఏర్పాటు చేసుకోగా.. వారి రవాణా ఖర్చుల నిమిత్తం అదనంగా మరో రూ.108.57 కోట్ల మొత్తాన్ని ఆయా రైతులకు చెల్లించినట్టు మంత్రి వివరించారు.

ఈ ఏడాది రాష్ట్రం నుంచి 2,069 మంది హజ్‌యాత్రకు..



ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రం నుంచి 2,069మంది యాత్రికులు హజ్‌యాత్రకు వెళ్లారని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా శాసనమండలిలో వెల్లడించారు. హజ్ యాత్రకు వెళ్లేవారు గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి వెళ్లడం వల్ల ఒక్కొక్కరికి రూ.80 వేల చొప్పున ప్రభుత్వంపై అదనపు భారం పడే పరిస్థితి ఉన్నా.. ఈ విషయంలో యాత్రికులెవ్వరు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో అప్పటికప్పుడే అదనపు నిధుల మంజూరుకు సీఎం వైఎస్ జగన్ ఆదేశాలిచ్చారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

"ఏదో ఒక దశలో పరిస్థితులు మనల్ని పడిపోయేలా చేస్తాయి.
అలాగే ఉండిపోకుండా గెలవడానికి ప్రయత్నం చేయి" అంటారు
హైదరాబాద్ కాచిగూడలో ఉంటున్న స్వీటీ బగ్గా (బల్జిత్ కౌర్)
ఇరవై ఏళ్ల వయసులో బస్సు ప్రమాదానికి గురై వెన్నుపూస దెబ్బతిని, నిలబడే శక్తి లేక
వీల్ చెయిర్‌కే పరిమితమైంది స్వీటీ బగ్గా. అయినా, గెలవడానికి ప్రయత్నం చేసింది.
వీల్ చెయిర్ స్పోర్ట్ మారథాన్ రన్నర్‌గా నిలిచింది. నేషనల్ బాస్కెట్‌బాల్ ప్లేయర్‌గా రాణించింది.
స్విమ్మింగ్ నేర్చుకొని, నీటి అడుగు వరకు వెళ్లొచ్చింది. పారామోటరింగ్ చేసి ఔరా అనిపించింది.
తనలాంటి వారికి వీల్‌చెయిర్లు పంపిణీ చేస్తూ తన సహృదయతను చాటుకుంటుంది.
అవగాహన కార్యక్రమాల ద్వారా దివ్యాంగులు జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రయత్నిస్తోంది.

అలాంటి వాళ్లకు ఆమే వెన్నుపూస!




స్వీటీ బగ్గా

"ఇప్పుడు నా వయసు 60. యాభై నాలుగేళ్ల వయసులో స్విమ్మింగ్ నేర్చుకున్నాను. పారామోటరింగ్ చేశాను. నేలమీద నడవలేను. కానీ, ఆకాశంలో ఎగిరాను, స్కూబా డైవింగ్‌తో నీళ్ల అడుగుకు వెళ్లొచ్చాను. అథ్లెట్‌గా పేరు తెచ్చుకున్నాను. ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబ బాధ్యతల్లోనూ పాలు పంచుకున్నాను.

ఐదేళ్లు చీకట్లోనే..

వీల్‌చెయిర్‌కి పరిమితమైన పరిస్థితులు ఎదురైనప్పుడు మొత్తం జీవితమే కోల్పోయాను అనిపించింది. రేపు అనే దానిపైన ఏ మాత్రం ఆశ ఉండేది కాదు. ఆరు నెలల పాటు డిప్రెషన్ నన్ను చుట్టుముట్టింది. నలభై ఏళ్ల క్రితం ఓ రోజు నేనూ, మా బ్రదర్ స్కూటర్ మీద వెళుతుండగా బస్సు ఢీ కొట్టింది. ఆ ప్రమాదంలో వెన్నుపూస దెబ్బతింది. చికిత్స తీసుకొని ఇంటికి వచ్చానే కానీ, మెడ నుంచి శరీరం కదల్చలేని పరిస్థితి. అప్పటికే పద్దెనిమిదేళ్లకే పెళ్లి, ఇరవై ఏళ్లకు ఇద్దరు పిల్లల తల్లిని. నన్ను నేనే చూసుకోలేను, ఇక పిల్లల్నేం చూడగలను? కూర్చోబెడితే కూర్చోవడం, పడుకోబెడితే పడుకోవడం... ఐదేళ్ల పాటు సూర్యకాంతి కూడా చూడలేదు. కొంత ప్రయత్నంతో చేతులు, తల మాత్రమే పనిచేసేవి. జీవితం ఎంత దుర్లభమో పదేళ్లపాటు అనుభవించాను. యూరిన్ ఇన్ఫెక్షన్స్, బెడ్ సోర్స్.. ఒక సమస్య అని చెప్పలేను. కానీ, మా అమ్మనాన్నలు, మా వారు, అత్తింట్లో అందరూ నన్ను ఓపికగా చూసుకున్నారు. పదేళ్ల తర్వాత చెన్నైలో స్పైనల్‌కార్డ్ రిహాబిలిటేషన్ సెంటర్ గురించి తెలిసి, అక్కడకు తీసుకెళ్లారు ఇంట్లోవాళ్లు. అప్పుడు వాళ్లిచ్చిన సలహాలతో నన్ను నేను మెరుగు పరుచుకోవడం మొదలు పెట్టాను.









నన్ను నేను మెరుగుపరుచుకున్నా...

ఉమ్మడి కుటుంబం కావడంతో మా ఇంట్లో పిల్లలు ఎక్కువ. ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్నాను కాబట్టి, పిల్లలందరికీ చదువు చెప్పేదాన్ని. క్రొచెట్ అల్లికలు నేర్చుకున్నాను. బొమ్మలు, స్వెటర్లు తయారుచేస్తుంటాను. బంధుమిత్రుల పుట్టిన రోజున వాటిని కానుకగా ఇస్తుంటాను. గార్డెనింగ్ చేస్తాను. నాకు తెలుసు, జీవితంలో కాలినడక ఉండదని.అయినా, నన్ను నేను మెరుగుపరుచుకోవడానికి నిరంతరం తపించేదాన్ని. ఒకప్పటితో పోల్చితే నాలాంటి వారికి ఇప్పటి రోజులు కాస్త సులువు. వీల్‌చెయిర్ సాయంతో నా పనులు నేను చేసుకోవడం వరకు చాలా దశలు దాటాను. పదేళ్లుగా వాలీబాల్, స్విమ్మింగ్ చేస్తున్నాను. పారా అథ్లెటిక్ పోటీలలో పాల్గొంటున్నాను. పాండిచ్చేరి వెళ్లినప్పుడు అక్కడ స్కూబా డైవింగ్ కూడా చేశాను. హాట్ ఎయిర్ బెలూన్‌లో ఆకాశంలోకి ఎగిరాను. స్ట్రాంగ్ విల్‌పవర్ కావాలంటే నన్ను నేను నిరంతరం మార్చుకోవాలని ఇప్పటికీ తపిస్తూనే ఉన్నాను.

వీల్‌చెయిర్.. పవర్

స్పైనల్ కార్డ్ దెబ్బతిని, బెడ్‌కు పరిమితమైన వారి గురించి అక్కడక్కడా వార్తలు తెలుస్తుండేవి. సోషల్ మీడియా ద్వారా ఇంకొంతమంది పరిచయం అయ్యారు. దీంతో తొమ్మిదేళ్ల క్రితం వీళ్లందరికీ వీల్ చెయిర్స్ ఇస్తే బాగుంటుంది అనుకున్నాను. ఇదే విషయాన్ని మా ఇంట్లోవాళ్లతో చెప్పాను. 'ఐయామ్ పాజిబుల్' పేరుతో ఫౌండేషన్‌ని రిజిస్టర్ చేయించాను. ఇంట్లోవాళ్లనే ఒక్కొక్కరూ ఒక్కో వీల్‌చెయిర్ కొనిమ్మని చెప్పాను. అలా, తొమ్మిది వీల్ చెయిర్లు వచ్చాయి. మరికొన్ని నా బంధువులు, మిత్రులతో కొనిపించాను. మొదటి ఏడాది 33 మందికి వీల్ చెయిర్లు ఇచ్చాను. కోవిడ్ టైమ్‌లో ఇవ్వలేకపోయాను. కిందటేడాది వీల్‌చెయిర్ ర్యాలీ చేశాం.

సీనియర్ సిటిజన్స్, పోలియో వచ్చినవారికీ వీల్ చెయిర్లు ఇస్తున్నాం. స్పైనల్‌కార్డ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ ఏడాదికి ఒకసారి ఏర్పాటు చేస్తున్నాను. దీనిద్వారా తగినంత స్ఫూర్తి అంది, వారి జీవితాలను బాగు చేసుకుంటారనేది నా ఆశ.

వీడియోల ద్వారా అవగాహన..

వెన్నుపూస దెబ్బతిన్నవారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, రోజూ ఎలా ఉండాలి.. అనే విషయాల మీద వీడియోలు చేసి సమస్య ఉన్నవారికి పోస్ట్ చేస్తుంటాను. యూ ట్యూబ్ ద్వారా దివ్యాంగుల కోసం నన్ను నేను ఉదాహరణగా చూపుతూ వీడియోలు చేస్తుంటాను. ఏ కారణంగానైనా వీల్‌చెయిర్‌కి పరిమితమైన వారు ఇంట్లోనే ఉండిపోకుండా తమకు తాముగా స్వయం ఉపాధి పొందమని చెబుతుంటాను. ఉదాహరణకు.. ఇంటి ముందు చిన్న టేబుల్ వేసుకొని చాయ్ బిస్కెట్ లేదా కూరగాయలు అమ్మమని చెబుతుంటాను. రోజుకు వందో, రెండు వందలో ఆదాయం వచ్చినా వారికెంతో ఆదరువు అవుతుందంటూ చిన్న చిన్న సూచనలు చేస్తుంటాను. చదువుకున్న వారైతే ట్యూషన్లు చెప్పమని, కుట్లు అల్లికల ద్వారా కూడా ఆదాయం పొందవచ్చని వివరిస్తుంటాను.

ఇప్పటివరకు తెలంగాణలో 180, ఆంధ్రప్రదేశ్‌లో 200 మందిదాకా స్పైనల్ కార్డ్ సమస్య బాధితులు ఉన్నారని తెలిసింది. ఇంకా మన దృష్టికి రానివారు ఎందరున్నారో. వివిధ రాష్ట్రాల నుంచి కూడా వీల్ చెయిర్ కావాలని అడిగిన వారున్నారు. సెప్టెంబర్ నెలలో స్పైనల్‌కార్డ్ ఇంజ్యూరీ సర్వీస్ డే ఉంది. దీనిని పురస్కరించుకొని ప్రతి ఏటా కార్యక్రమం ఏర్పాటు చేస్తుంటాను. ఆ విధంగా ఈ ఏడాది డెబ్బైమూడు మందికి వీల్‌చెయిర్లు పంపిణీ చేస్తున్నాను. దీనికి ఎంతోమంది తమ సహకారాన్ని అందించారు. ఈ నలభై ఏళ్ల జీవితం నన్ను మానసికంగా ఎంతో బలవంతురాలిని చేసింది. యుద్ధంలో పోరాడాలంటే యోధుడిలాగే ఉండాలి. గాయాలు అయినా, పడిపోయినా.. నిరంతరం మనల్ని మనం కొత్తగా మలుచుకుంటూ, ఆవిష్కరించుకుంటూ ఉండాలి. ఇదే విషయాన్ని తరచూ చెబుతూ నాలాంటి వారిని మోటివేట్ చేస్తుంటాను" అని వివరించారు స్వీటీ బగ్గా.

– నిర్మలారెడ్డి

సేవాపథం

వీరమ్మాళ్ @ 89 విలేజ్ పంచాయతీ ప్రెసిడెంట్

'సేవకు వయసుతో పని ఏమిటి?' అంటోంది 89 సంవత్సరాల వీరమ్మాళ్. ఈ బామ్మ తమిళనాడులోని అరిట్టపట్టి గ్రామ పంచాయితీ ప్రెసిడెంట్. రకరకాల కార్యక్రమాలతో ఎప్పుడూ బిజీగా ఉండే వీరమ్మాళ్ తన ఆరోగ్య రహస్యం 'నిరంతర కష్టం' అంటోంది...

మామూలుగానైతే బామ్మల మాటల్లో 'మా రోజుల్లో' అనేది ఎక్కువగా వినబడుతుంది. అది ఆ వయసుకు సహజమే కావచ్చుగానీ 89 సంవత్సరాల వీరమ్మాళ్ ఎప్పుడూ వర్తమానంలోనే ఉంటుంది. నలుగురితో కలిసి నడుస్తుంది. వారి కష్టసుఖాల్లో భాగం అవుతుంది.

వీరమ్మాళ్ విలేజ్ ప్రెసిడెంట్‌గా ఉన్న మధురైలోని అరిట్టపట్టి గ్రామాన్ని తమిళనాడు ప్రభుత్వం రాష్ట్ర తొలి బయో డైవర్సిటీ సైట్‌గా ఎంపిక చేసింది.

అరిట్టపట్టిలో పుట్టి పెరిగి అక్కడే వివాహం అయిన వీరమ్మాళ్‌కు ఆ గ్రామమే ప్రపంచం. అలా అని 'ఊరి సరిహద్దులు దాటి బయటకు రాదు' అనే ముద్ర ఆమెపై లేదు. ఎందుకంటే గ్రామ సంక్షేమం, అభివృద్ధి కోసం ఉన్నతాధికారులతో మాట్లాడడానికి పట్టణాలకు వెళుతూనే ఉంటుంది.

'ఫలానా ఊళ్లో మంచిపనులు జరుగుతున్నాయి' లాంటి మాటలు చెవిన పడినప్పుడు పనిగట్టుకొని ఆ ఊళ్లకు వెళ్లి అక్కడ అమలు చేస్తున్న కార్యక్రమాలను అధ్యయనం చేస్తుంటుంది. తన గ్రామంలో అలాంటి కార్యక్రమాలు అమలయ్యేలా కృషి చేస్తుంటుంది.

'స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం' అనే మాట గట్టిగా వినిపించని రోజుల్లోనే స్వయం-సహాయక బృందాలను ఏర్పాటు చేసి గ్రామంలోని మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసేది. రైతులకు వ్యవసాయ రుణాలు అందేలా ఆఫీసుల చుట్టూ తిరిగేది.

మహిళలు గడప దాటి వీధుల్లోకి వస్తే... 'ఇదేం చోద్యమమ్మా' అని గుసగుసలాడుకునే కాలం అది. వీరమ్మాళ్ మాత్రం గ్రామంలోని రకరకాల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఎన్నో ఊళ్లు తిరిగేది. ఎవరు ఎలా మాట్లాడుకున్నా పట్టించుకునేది కాదు.

ఆమె దృష్టి మొత్తం సమస్యల పరిష్కారంపైనే ఉండేది. విలేజ్ ప్రెసిడెంట్‌గా వాటర్ ట్యాంకులు, వాగులు దాటడానికి వంతెనలు నిర్మించింది. జల్ జీవన్ మిషన్ కింద ఎన్నో ఇండ్లకు తాగునీరు అందేలా చేసింది. వీధిలైట్ల నుంచి వీధుల పరిశుభ్రత వరకు అన్నీ దగ్గరి నుంచి చూసుకుంటుంది. అలా అని ఊళ్లో అందరూ వీరమ్మాళ్‌కు సహకరిస్తున్నారని కాదు.

ఎవరో ఒకరు ఏదో రకంగా ఆమె దారికి అడ్డుపడుతుంటారు. వారి నిరసన వెనక రాజకీయ కారణాలు ఉన్నాయనే విషయం స్పష్టంగా అర్థమవుతూనే ఉంటుంది. అలాంటి వారికి వీరమ్మాళ్ తరపున గ్రామస్థులే సమాధానం చెబుతుంటారు.

గ్రామంలో వృథాగా పడి ఉన్న భూములను వినియోగంలోకి తీసుకు వచ్చే విషయంపై దృష్టి పెట్టింది వీరమ్మాళ్.

'పనికిరాని భూమి అంటూ ఏదీ ఉండదు. మనం దాన్ని సరిగ్గా ఉపయోగించుకుంటున్నామా, వృథాగా వదిలేస్తున్నామా అనే దానిపైనే ఆ భూమి విలువ ఆధారపడి ఉంటుంది' అంటుంది వీరమ్మాళ్.

'వీరమ్మాళ్ అంకితభావం గురించి ఆ తరం వాళ్లే కాదు ఈ తరం వాళ్లు కూడా గొప్పగా చెబుతుంటారు. గ్రామ అభివృద్ధికి సంబంధించి ఎంతో మందికి ఆమె స్ఫూర్తి ఇస్తుంది' అంటున్నాడు అరిట్టపట్టి విలేజ్ ఫారెస్ట్ కమిటీ హెడ్ ఆర్' ఉదయన్.


వీరమ్మాల్ బామ్మతో ఐఏఎస్ ఆఫీసర్ సుప్రియ సాహు

రోజూ ఉదయం అయిదు గంటలకు నిద్ర లేచే వీరమ్మాళ్ వంటపని నుంచి ఇంటి పనుల వరకు అన్నీ తానే స్వయంగా చేసుకుంటుంది. పొలం పనులకు కూడా వెళుతుంటుంది.

'బామ్మా... ఈ వయసులో ఇంత ఓపిక ఎక్కడిది?' అని అడిగితే–

'నా గ్రామం బాగు కోసం నా వంతుగా కష్టపడతాను... అని అనుకుంటే చాలు ఎక్కడలేని ఉత్సాహం వస్తుంది. అదే శక్తిగా మారి ఆరోగ్యాన్ని ఇస్తుంది. దేవుడు నన్ను ఈ భూమి మీది నుంచి తీసుకుపోయే లోపు గ్రామ అభివృద్ధి కోసం నేను కన్న కలలు సాకారం కావాలని కోరుకుంటున్నాను' అంటుంది వీరమ్మాళ్.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ సుప్రియ సాహు అరిట్టపట్టి గ్రామానికి వచ్చి బామ్మను కలుసుకుంది.

'వీరమ్మాళ్ బామ్మతో మాట్లాడడం, ఆమె నోటి నుంచి గ్రామ అభివృద్ధి ప్రణాళికల గురించి వినడం అద్భుతమైన అనుభవం' అంటుంది సుప్రియ.

ఇంటిప్స్



కల్తీని గుర్తిద్దాం ఇలా...

ఇప్పుడు ఏది చూసినా కల్తీ అవుతోంది. కల్తీ కలిసిన జీలకర్ర తింటే ఆరోగ్యం పాడవుతుంది. అందువల్ల జీలకర్రను నాణ్యమైనదో కాదో ఇలా తెలుసుకోండి...

- కొద్దిగా జీలకర్రను తీసుకుని నలిపి చూడాలి. నలిపినప్పటికీ జీలకర్ర అలానే ఉంటే జీలకర్రలో ఏదీ కలవలేదని అర్థం.
- జీలకర్రను నీటిలో వేసి ఐదు నిమిషాలు నానబెట్టాలి. నీరు రంగు మారితే జీలకర్రలో ఏదో కల్తీ జరిగినట్టే.
- జీలకర్ర వాసన లేకపోతే అది స్వచ్ఛమైన జీలకర్ర కాదు.

వేస్ట్ పేపర్‌తో వావ్! అనిపించే బొమ్మలు!!


న్యూస్‌పేపర్ జీవితకాలం ఒక్కరోజు మాత్రమే. ఈ రోజు పేపర్‌కున్న విలువ మరుసటి రోజుకు ఉండదు. ఏరోజుకు ఆరోజు కొత్త పేపర్ కావాల్సిందే. అందుకే నిన్నటి పేపర్ చిత్తుకాగితంగా మారిపోతుంది. ఇలా టన్నులకొద్దీ పేపర్ భూమిలో కలిసిపోవడం నచ్చని సిమ్రాన్.. కాగితాలతో పేపర్ మఛే క్రాఫ్ట్స్‌ను తయారు చేస్తోంది. వేస్ట్ పేపర్‌ను వావ్ అనేలా తీర్చిదిద్దుతోంది.


సిమ్రాన్

ప్రయాగ్ రాజ్‌కు చెందిన ఇరవైఎనిమిదేళ్ల సిమ్రాన్ కేసర్వాణికి చిన్నప్పటి నుంచి వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడమంటే చాలా ఇష్టం. ఏమాత్రం ఖాళీ సమయం దొరికినా సాంప్రదాయ క్రాఫ్ట్స్‌ను తయారు చేస్తుండేది. ఫ్యాషన్ డిగ్రీ పూర్తయ్యాక, ఇంటీరియర్ డిజైనింగ్‌లో డిప్లొమా చేసింది. తనతోటివారిలా కార్పొరేట్ రంగంలో అడుగుపెట్టాలనుకోలేదు. తనకెంతో ఇష్టమైన క్రాఫ్ట్స్ తయారీనే కెరీర్‌గా ఎంచుకోవాలని నిర్ణయించుకుంది. అందరిలా కాకుండా ఏదైనా కొత్తగా సృజనాత్మకంగా చేయాలని ఆలోచిస్తోన్న సిమ్రాన్‌కు.. చిన్నతనంలో చేసిన 'టోఫీ బాక్స్' గుర్తుకువచ్చింది. సిమ్రాన్ పుట్టినరోజుకి టోఫీ బాక్స్‌లు తయారు చేసి పంచింది. ఆ బాక్స్‌లు చూసిన వారంతా సిమ్రాన్ ప్రతిభను చూసి తెగ మెచ్చుకున్నారు. దీంతో 'పేపర్‌మఛే క్రాఫ్ట్స్' తయారు చేయడం ప్రారంభించింది.

పేపర్‌ను పేస్టుచేసి..

పురాతన కాలం నుంచి మఛే క్రాఫ్ట్స్‌కు మంచి గుర్తింపు ఉంది. పేపర్‌ను నానబెట్టి, తరువాత పేస్టులా నూరి వివిధ రకాల అలంకరణ వస్తువులను తయారు చేస్తారు. దీనినే పేపర్ మఛే క్రాఫ్ట్స్ అంటారు. ఇవి పర్యావరణానికి ఎటువంటి హానీ చేయవన్న భరోసాతో సిమ్రాన్ వీటిని ఎంచుకుంది. కస్టమర్ల దృష్టిని ఆకర్షించే విధంగా వివిధ ఆకారాల్లో ఈ క్రాఫ్ట్స్ తయారు చేయడం మొదలు పెట్టింది సిమ్రాన్. పేపర్ వెయిట్స్, ఫోల్డర్స్, చెరియాళ్ మాస్క్‌లు, ఆకర్షణీయమైన వివిధరకాల ఇంటి అలంకరణ వస్తువులను తయారు చేస్తోంది. ఈ క్రాఫ్ట్స్‌ను మరింత నాణ్యంగా అందంగా తయారు చేసేందుకు స్థానిక కళాకారుల వద్ద మెళకువలు నేర్చుకుంటోంది.







అడ్డంకులు అధిగమించి...

"పేపర్ మఛే క్రాఫ్ట్స్ తయారీ సర్టిఫైడ్ జాబ్ కాదు. దీనికి పెద్ద గుర్తింపు ఉండదు. నువ్వు ఇంజినీరింగ్ లేదా మెడిసిన్ చదువు" అని తల్లిదండ్రులు ఎంతగా హెచ్చరించినప్పటికీ తనని తాను నిరూపించుకోవాలన్న కసితో క్రాఫ్ట్స్ తయారీని ప్రారంభించింది సిమ్రాన్. అయితే సాంప్రదాయ కళాకృతుల గురించి అవగాహన తక్కువ ఉండడం, మార్కెట్ కొత్త కావడంతో సిమ్రాన్‌కు అనేక సమస్యలు ఎదురయ్యాయి. తనకెదురయ్యే ప్రతి వాళ్ల నుంచి కొత్త విషయాన్ని నేర్చుకుంటూ.. సోషల్ మీడియా స్కిల్స్‌తో తన ఉత్పత్తులకు మార్కెట్ చేస్తోంది. వివిధరకాల ఎగ్జిబిషన్‌లలో పేపర్ మఛే క్రాఫ్ట్స్‌ను ప్రదర్శిస్తూ కస్టమర్లకు సరికొత్త అలంకరణ వస్తువులను పరిచయం చేస్తోంది. మద్దారీ మీటర్ అనే ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా కూడా మఛే క్రాఫ్ట్స్‌ను విక్రయిస్తోంది సిమ్రాన్.


మేకా రామ్మోహన్‌రావు

మిల్లెట్ గురు

తెలుగు రాష్ట్రాలు వేగంగా మిల్లెట్స్ గొడుగు కిందకు చేరుతున్నాయి. ఇది అన్ని ట్రెండ్స్‌లా ఇలాగ వచ్చి అలాగ వెళ్లి పోరాదు. ఎన్నో వసంతాలపాటు మనతోపాటు చిగురించాలి.

మిల్లెట్స్ ఆహారంలో భాగమవుతున్నంత వేగంగా కనుమరుగయ్యే ప్రమాదమూ ఉంది. ఎందుకంటే మనం మిల్లెట్స్ వాడకంలో చూపిస్తున్న అత్యుత్సాహం వాటిని అర్థం చేసుకోవడంలో చూపించడం లేదంటున్నారు ఇక్రిశాట్‌లో అగ్రానమిస్ట్‌గా ఉద్యోగవిరమణ చేసి, హైదరాబాద్, బోయిన్‌పల్లి, ఇక్రిశాట్ కాలనీలో విశ్రాంత జీవనం గడుపుతున్న సీనియర్ సైంటిస్ట్ మేకా రామ్మోహన్ రావు.

జ్ఞానాన్ని ఇచ్చి పుచ్చుకున్నాం!

"ఇప్పుడు నేను చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవడం గురించి పని చేస్తున్నాను. కానీ నా అసలు వృత్తి చిరుధాన్యాల సాగు. పటాన్‌చెరులో మా పరిశోధన క్షేత్రం. మనదేశంలో వర్షాధార నేలలను సమర్థంగా సాగులోకి తీసుకురావడానికి మిల్లెట్స్ మీద విస్తృతంగా పరిశోధనలు చేశాను. ఆ తర్వాత కామెరూన్, బ్రెజిల్, నైజీరియా, కెన్యాల్లో పని చేశాను. ప్రధాన పంటతోపాటు అంతర పంటగా మిల్లెట్స్‌ను సాగు చేయడం, అలాగే మిశ్రమ సాగు విధానాన్ని వాళ్లకు అలవాటు చేశాం. మన మిల్లెట్స్‌ని ఆయా దేశాలకు పరిచయం చేశాం. ఆ దేశాలు సమర్థంగా అనుసరిస్తున్నాయి. ఇన్ని దేశాలూ తిరిగి మన జ్ఞానాన్ని వాళ్లకు పంచి, వాళ్ల నుంచి నేర్చుకోవాల్సిన మెళకువలను మనదేశానికి తీసుకు వచ్చిన తర్వాత పరిశీలిస్తే... మనదేశంలో వ్యవసాయం సరికొత్త రూపు సంతరించుకుని ఉంది. ఒకప్పుడు పాడి–పంట కలగలిసి సమాంతరంగా సాగుతుండేవి. పంట సాగు చేసే రైతు ఇంట్లో పాడి కూడా ఉండేది. ఆ పశువుల ఎరువుతో సాగు చేసుకుంటూ అవసరానికి కొంత మేర పై నుంచి రసాయన ఎరువులను వాడేవాళ్లు. ఇప్పుడు పాడి రైతు వేరు, పంట రైతు వేరయ్యారు. దాంతో పంట సాగు ఆరోగ్యంగా లేదు, పాడి రైతు కూడా సౌకర్యంగా లేడు. జరిగిన పొరపాటును సరి చేసుకోవడానికి సేంద్రియ సాగును వెనక్కి తెచ్చుకుంటున్నాం. అలాగే ఆహారంలో కూడా ఇప్పుడు మిల్లెట్స్ రూపంలో ఆరోగ్యాన్ని వెతుక్కుంటున్నాం. చిరుధాన్యాలు, వరిధాన్యం తగు పాళ్లలో తీసుకునే రోజుల నుంచి జొన్నలు, రాగులను పూర్తిగా మర్చిపోయాం. ఇప్పుడు చిరుధాన్యాల పరుగులో వరిధాన్యాన్ని వదిలేస్తున్నారు. మిల్లెట్ మెనూ ప్రాక్టీస్‌లో మనవాళ్లు చేస్తున్న పొరపాట్లు చూస్తుంటే వాటిని అలవాటు చేసుకున్న నెల రోజుల్లోనే మిల్లెట్స్‌కు దూరమైపోతారేమోననే ఆందోళన కూడా కలుగుతోంది. అందుకే అవగాహన కల్పించే బాధ్యతను నాకు చేతనైనంత చేస్తున్నాను.

> **ఇదీ నా పరిచయం!**
>
> మాది కృష్ణాజిల్లా. పాగోలు గ్రామం పరిధిలోని మేకావారి పాలెం. బాపట్ల అగ్రికల్చరల్ కాలేజ్‌లో ఏజీ బీఎస్సీ. హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని ఆచార్య ఎన్‌జీ రంగా (ఇప్పటి ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ) అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ. ఢిల్లీలోని ఐఏఆర్‌ఐ (ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)లో వ్యవసాయ పద్ధతుల మీద పరిశోధన చేశాను. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఇక్రిశాట్‌లో ఒకడినయ్యాను. ఒక మోస్తరు వ్యవసాయ కుటుంబం మాది. మా కుటుంబంలో తొలితరం విద్యావంతుడిని కావడంతో ఏ కోర్సులు చదివితే ఎలాంటి ఉన్నత స్థితికి చేరవచ్చని మార్గదర్శనం చేయగలిగిన వాళ్లెవరూ లేరు. ఢిల్లీకి వెళ్లి పీహెచ్‌డీ చేయడం కూడా మా ప్రొఫెసర్ గారి సూచనతోనే. మా నాన్న చెప్పిన మాట నాకిప్పటికీ గుర్తే. కాలేజ్ ఖర్చులు భరించి చదివించగలనంతే. డొనేషన్‌లు కట్టి చదివించాలని కోరుకోవద్దు' అన్నారాయన. ఆ మాట గుర్తు పెట్టుకుని విస్తరణకు ఉన్న అవకాశాలను వెతుక్కుంటూ సాగిపోయాను. నా ప్రాథమిక విద్య ఏ మాత్రం స్థిరంగా సాగలేదంటే నమ్ముతారా! ఐదవ తరగతి లోపు మూడుసార్లు స్కూళ్లు మారాను. హైస్కూల్ కూడా అంతే. చల్లపల్లి స్కూల్‌లో పన్నెండవ తరగతి వరకు చదివాను. జాతీయ పతాక ఆవిష్కర్త పింగళి వెంకయ్యగారు కూడా చల్లపల్లి స్కూల్‌లోనే చదివారు.
>
> – మేకా రామ్మోహన్‌రావు, సీనియర్ సైంటిస్ట్ (రిటైర్డ్), ఇక్రిశాట్

టేబుల్ మార్చినంత సులువు కాదు!

పుట్టినప్పటి నుంచి కొన్ని దశాబ్దాలుగా అన్నం తినడానికి అలవాటు పడిన దేహాన్ని ఒక్కసారిగా మారమంటే సాధ్యం కాదు. మనం డైనింగ్ టేబుల్ మీద పదార్థాలను మార్చేసినంత సులువుగా మన జీర్ణవ్యవస్థ మారదు, మారలేదు కూడా. అందుకే మొదటగా రోజులో ఒక ఆహారంలో మాత్రమే మిల్లెట్స్ తీసుకోవాలి. జొన్న ఇడ్లీ లేదా రాగి ఇడ్లీతో మొదలు పెట్టాలి. ఒక పూట అన్నం తప్పకుండా తినాలి. రాత్రికి రొట్టె లేదా సంగటి రూపంలో మిల్లెట్స్ అలవాటు చేసుకుంటే ఈ తరహా జీవనశైలిని కలకాలం కొనసాగించడం సాధ్యమవుతుంది. దేహం మొదట మిల్లెట్స్‌ను అడాప్ట్ చేసుకోవాలి, ఆ తర్వాత వాటిని అబ్జార్బ్ చేసుకోవడం మొదలవుతుంది. దేహానికి ఆ టైమ్ కూడా ఇవ్వకుండా ఆవకాయతో అన్నప్రాశన చేసినట్లు మెనూ మొత్తం మార్చేస్తే ఓ నెల తర్వాత ఆ ఇంటి టేబుల్ మీద మిల్లెట్స్ మాయమవుతాయనడం లో సందేహం లేదు. మరో విషయం... వరి అన్నం తీసుకున్నంత మోతాదులో మిల్లెట్ ఆహారాన్ని తీసుకోకూడదు. పావు వంతుతో సరిపెట్టాలి. అలాగే అరవై దాటిన వాళ్లు జావ రూపంలో అలవాటు చేసుకోవాలి. సాయంత్రం మిల్లెట్ బిస్కట్‌లను తీసుకోవాలి. ఇక అనారోగ్యానికి గురయిన వాళ్లు తిరిగి కోలుకునే వరకు మిల్లెట్స్‌కి దూరంగా ఉండడమే మంచిది. ఈ సందర్భంగా ప్రముఖ జర్నలిస్ట్ కుష్వంత్ సింగ్ అనుభవాన్నే ఉదాహరిస్తాను. గట్టి ఆహారం తీసుకునే పంజాబీ కుటుంబంలో పుట్టిన ఆయన వార్ధక్యంలో 'దక్షిణాది ఆహారం సులువుగా జీర్ణమవుతోందని, ఇడ్లీ, అన్నానికి మారినట్లు' రాసుకున్నారు. మిల్లెట్స్ మనదేహానికి సమగ్రమైన ఆరోగ్యాన్ని చేకూరుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. నిదానంగా జీర్ణమవుతూ, నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తుంది. ఊబకాయం సమస్య ఉండదు. ఈ వివరాలన్నీ చెబుతూ మెనూతోపాటు మోతాదును కూడా గమనింపులో పెట్టుకోవాలని మహిళలకు వివరిస్తున్నాను. వాళ్లకు చక్కగా అర్థమైతే చాలు, ఇక ఆ వంటగది నుంచి మిల్లెట్ ఎప్పటికీ దూరం కాదు" అన్నారు రామ్మోహన్‌రావు. రోజూ ఓ గంటసేపు నడక, పాలిష్ చేయని బియ్యంతో అన్నం, మిల్లెట్ బిస్కట్ తీసుకుంటారు. 'మిల్లెట్స్‌తో ఎన్ని రకాల వంటలు చేసుకోవచ్చో వివరించడానికి కాలనీల్లో మిల్లెట్ మేళాలు నిర్వహిస్తుంటాం. కానీ నేను మాత్రం వాటిలో ఒక్క రకమే తింటాను" అన్నారాయన నవ్వుతూ.

– వాకా మంజులారెడ్డి,
ఫొటోలు: మోర్ల అనిల్ కుమార్

ఇంటి గుట్టు లంకకు చేటు అని సామెత. అంటే ఇంట్లో ఉండవలసిన సమాచారాన్ని అవతలి వారికి చేరవేయడం వల్ల అది ఆ ఇంటికంతటికీ అనర్థదాయకం అన్నమాట. జీవితంలో ప్రతి ఒక్కరికి ఎంతో కొంత గోప్యత ఉండాలి. అది పాటించకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. దాన ధర్మాల విషయంలో కూడా కుడి చేతితో చేసిన దానం ఎడమ చేతికి తెలియనివ్వ కూడదనేవారు. మూడోకంటికి తెలియకుండా అని కూడా తరచు వాడేవారు. గోడకు చెవులుంటాయి కనుక కాస్త చూసుకుని మాట్లాడటం మంచిది అనేవారు. జీవితాన్ని కనీసం కొంతవరకైనా గోప్యంగా ఉంచుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో తెలుసుకుందాం.

గోప్యత పాటిస్తారా?



ఇప్పుడున్నంత ఓపెన్‌గా ఒకప్పుడు ఉండేది కాదు ఏ విషయమైనా. దురదృష్టవశాత్తూ సోషల్ మీడియా చొచ్చుకు వచ్చినప్పటి నుంచి అంతా బహిరంగమే అయిపోయింది. చిన్నవారి నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ తమ జీవితాన్ని పబ్లిక్‌గా మార్చేసుకుంటున్నారు. ప్రతి విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రైవసీని కోల్పోతున్నారు. దానివల్ల చిక్కుల్లో పడుతున్నారు.

గోప్యత అంటే..?

గోప్యత అంటే ఏదయినా ఒక ముఖ్యమైన సమాచారాన్ని రహస్యంగా ఉంచడం లేదా బహిర్గతం చేయకుండా ఉండటం. గోప్యత అనేది కేవలం ఆ సమాచారాన్ని బయటకు పొక్కకుండా రహస్యంగా ఉంచే చర్య.

పాటించడం ఎలా?

రహస్య విషయాలను చర్చిస్తున్నప్పుడు ఎవరూ వినలేదని నిర్ధారించుకోండి. పనిని సాధించడానికి అవసరమైన కనీస సమాచారాన్ని మాత్రమే భాగస్వామ్యం చేయండి.

కొంతమంది నిపుణులు... వైద్యులు, న్యాయవాదులు, అకౌంటెంట్లతో సహా వారి వృత్తిపరమైన స్థానం ద్వారా వ్యక్తులు లేదా సంస్థల గురించి సమాచారాన్ని పొందుతారు.

ఉదాహరణకి

- వైద్యులకు వారి రోగుల పరిస్థితులు, చికిత్సల వివరాలు తెలుసు
- న్యాయవాదులకు వీలునామాలు, కోర్టు కేసుల వివరాల గురించి తెలుసు, వాటిలో కొన్ని చట్టం ద్వారా రక్షించబడవచ్చు;
- ట్యాక్స్ కన్సల్టెంట్లు తమ ఖాతాదారుల పన్ను, ఆదాయం గురించి తెలుసుకుంటారు. ఇవన్నీ తమకు తెలిసినప్పటికీ ఆయా వృత్తి నిపుణులు తరచు వృత్తిపరమైన ప్రవర్తనా నియమావళితో పాటు అధికారిక చట్టపరమైన అవసరాలకు కట్టుబడి ఉంటారు. ఉండాలి కూడా.

ఎందుకు అవసరం?

మానసిక ఆరోగ్యానికి, వ్యక్తి ఎదుగుదలకు చాలా ముఖ్యమైన వాటిలో గోప్యత కూడా ఒకటి.. ఎవరినైనా విశ్వసించడం లేదా వారికి రహస్యాలు చెప్పడం అనేది గోప్యతను బయట పెట్టుకోవడమే. ఎందుకంటే గోప్యత అంటే రహస్యంగా ఉంచవలసిన సమాచారం. దీనిని బహిరంగ పరచుకోవడం అంటే తమకు తామే నష్టాన్ని కొని తెచ్చుకోవడమే!

జీవితాన్ని గోప్యంగా ఉంచుకున్నప్పుడు ఆలోచనలు, భావాలు, అనుభవాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశం లభిస్తుంది. ఇది మన విశ్వాసాన్ని మరింత పెంచుతుంది. మన వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవడానికి సాయపడుతుంది. సమాజంలో గౌరవం లభిస్తుంది!

వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచుకోవడం వల్ల ప్రశాంతత, స్థిరత్వం లభిస్తాయి. ఇవి మనల్ని మనం అర్థం చేసుకోవడంలో సహాయపడతాయి. మనలోని నెగటివ్ ఆలోచనల నుంచి ఉపశమనం పొందుతాము. ఇది మన మనోధైర్యాన్ని, స్థైర్యాన్ని పెంచి జీవితాన్ని సానుకూలం చేస్తుంది. జీవితాన్ని కాస్తంత గోప్యంగా ఉంచుకున్నప్పుడు మనలోని సున్నితత్వాన్ని మనం అనుభవిస్తాం. దీనివల్ల మన ఆలోచనలు, భావాలు మనతోనే కనెక్ట్ అవుతాయి. ఇది ఇతరుల పట్ల సున్నితంగా వ్యవహరించడానికి సహాయపడుతుంది. మన చుట్టూ ఉన్న వారిని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

వ్యాపారంలో, ఉద్యోగంలో గోప్యత పాటించడం వల్ల స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. మన జీవితాన్ని మనమే నిర్ణయించుకోవచ్చు. మనపై ఎవరూ పెత్తనం చెలాయించడానికి అవకాశం ఉండదు. దీనివల్ల ఆత్మవిశ్వాసం బలపడుతుంది. మానసిక ఆరోగ్యం, ఎదుగుదల బాగుంటుంది

గోప్యత లోపించిన మన ప్రార్థనలు, దానధర్మాలు, ఉపవాస దీక్షలు వ్యర్థమే అని చెప్పవచ్చు. అవి ఈనాడు బహిరంగ ప్రచార వేదికలయ్యాయి, వాటివల్ల బోలెడు పేరు ప్రఖ్యాతులైతే వస్తాయేమో కాని వాటి అసలు ఫలాలు, ఆశీర్వాదాలు మాత్రం లభించవు. ఇతరులకు ఒక చేతితో చేసే సహాయం, మరో చేతికి తెలియకూడదని, అదంతా రహస్యంగా జరగాలని మత గ్రంథాల ఆదేశం. మనం మన పొరుగువారికి, పేదలకు చేసే సహాయం లేదా ధర్మం ఎంత రహస్యంగా ఉంటే దానివల్ల దేవుని ఆశీర్వాదాలు మనకు అంత ధారాళంగా ప్రతిఫలంగా లభిస్తాయని బైబిల్ చెబుతుంది. ఇది ఏ మతంలోనైనా వర్తిస్తుంది.

చివరగా... గోప్యంగా ఉండమన్నారు కదా అని వైద్యుల వద్దకు వెళ్లినప్పుడు మీ జబ్బులను మాత్రం గోప్యంగా ఉంచకండి. డాక్టర్ల వద్ద అన్నీ చెప్పుకోవడం మంచిది.

తినండి... తేలిక పడండి



ఈ రోజుల్లో చాలామంది ఊబకాయంతో బాధపడుతున్నారు. దీనికి కారణం శారీరక శ్రమ తగ్గించడం, ఎక్కువ కేలరీలు ఉన్న ఆహారాన్నీ, జంక్ ఫుడ్‌నీ తీసుకోవడం, తగినంత నిద్ర పోకపోవడం వంటివి.

ఊబకాయం వల్ల చాలా ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్, హై బీపీ, గుండె జబ్బులు, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు ఎదురవుతాయి. అందుకే సరైన బరువును మెయింటెయిన్ చేయడం అవసరం. బరువు తగ్గాలంటే పొట్ట మాడ్చుకోనవసరం లేదు. కొన్ని రకాల కూరగాయలని డైట్‌లో చేర్చుకోవాలి. వాటి గురించి తెలుసుకుందాం.

బ్రకోలీ



బ్రకోలీలో ఉండే కెరోటినాయిడ్ అనే మూలకం వేగంగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇందులో విటమిన్ సి, కె వంటి పోషకాలు, ఫైబర్ ఉంటాయి. ఇందులో తక్కువ కేలరీలు ఉంటాయి. అందువల్ల బ్రకోలీని సూపర్ ఫుడ్ అని చెప్పవచ్చు.

క్యాబేజీ



క్యాబేజీలో విటమిన్ ఎ, బి, ఐరన్, జింక్, కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. ఇది తక్కువ కేలరీలను కలిగి ఉంటుంది. కాబట్టి త్వరగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

పాలకూర



పాలకూరలో ఐరన్, విటమిన్ ఎ, కాల్షియం, విటమిన్ సి వంటి పోషకాలు ఉంటాయి. ఇందులో ఫైబర్ అధిక శాతం ఉండటం వల్ల మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆకలి అదుపులో ఉంటుంది. కంటిచూపు మెరుగుపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుతుంది. ఇది త్వరగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

క్యాప్సికమ్



క్యాప్సికమ్‌లో పొటాషియం, ఫోలేట్, విటమిన్ బి6, సి, ఇ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో క్యాప్సైసిన్ అనే మూలకం ఉంటుంది. ఇది జీవక్రియ రేటును పెంచుతుంది. వేగంగా బరువు తగ్గడంలో సహాయపడుతుంది.


కాలీఫ్లవర్



కాలీఫ్లవర్‌లో ఫాస్పరస్, మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇందులో ఎక్కువ మొత్తంలో నీరు ఉంటుంది. దీన్ని తినడం వల్ల ఆకలి అదుపులో ఉంటుంది. సులువుగా బరువు తగ్గుతారు.

వీటన్నింటినీ తీసుకోవడంతోపాటు ప్రతిరోజూ వ్యాయామం చేయడం, సమయానికి తినడం, తగినంత నిద్ర పోవడం కూడా అవసరం.

హెల్త్ టిప్స్



- సీతాఫలం విత్తనాలు, ఆకులు మెత్తగా నూరి పట్టిస్తే, పేలు పోతాయి. అరటిపండు, తేనెతో కలిపి తీసుకుంటే క్షయవ్యాధిగ్రస్తులకు మంచిది.
- నేరేడు ఆకులు నీటిలో మరిగించి, వడగట్టి, ఆ నీటిని పుక్కిలిస్తే నోటిపూతలు తగ్గుతాయి.
- రెండు, మూడు రోజుల పాటు రెండు మిరియాల గింజలు, మెలమెల్లగా నములుతూ, ఆ రసం మింగితే దగ్గు తగ్గుతుంది.
- వేప చెట్టు బెరడును పెనంపై బాగా కాల్చి, మెత్తగా పొడి చేయాలి. ఆ పొడికి కొద్దిగా కొబ్బరి నూనె చేర్చి, కురుపులపై రాస్తే ఉపశమనం వుంటుంది.
- వేపాకు రసం, దానికి సమాన భాగంలో పెరుగు జోడించి, కాస్త నిమ్మ రసం కలిపి తలకు పట్టిస్తే చుండ్రు తగ్గుతుంది.

మీకు తెలుసా?



- వంట పూర్తయిన తర్వాత అంట్లను కొందరు వంటింటి షింకులోనే అలా ఉంచేస్తుంటారు. అలా చేయకండి. ఎప్పటికప్పుడు వాటిని శుభ్రం చేసుకోవడమో లేకపోతే బయట వేసుకోవడమో చేయండి. సింకులో గిన్నెలు పడి ఉండటం వల్ల వాటిలో బ్యాక్టీరియా చేరి దుర్వాసన రావడం ప్రారంభం అవుతుంది. వాటిని వాడటం వల్ల రకరకాల ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి.



- సాధారణంగా చాలా మంది వంటింట్లోనే చెత్త డబ్బాను పెట్టుకుంటుంటారు. ఒకటి రెండు రోజులు గనుక అది అలాగే ఉండిపోతే సూక్ష్మ జీవులు చేరి కంపు రావడం ప్రారంభం అవుతుంది. కాబట్టి ఏ రోజుకారోజు చెత్తను తీసివేయండి. వెసులుబాటు ఉంటే గనుక అసలు దీన్ని వంటింటి బయట వైపు ఏర్పాటు చేసుకోవడం మంచిది.

వేడిగా తినండి కానీ.. వేడి చేసి తినకండి



ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారాన్ని పదే పదే వేడి చేయడం వల్ల అందులో ఉండే పోషకాలు మొత్తం నశిస్తాయి. ఇది క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారపు అలవాట్లు పాటించాలి.

ఎలాంటి ఆహారాలు వేడి చేసి తినడం వల్ల నష్టం ఏమిటో తెలుసుకుందాం.

మాంసాహారాలు: చాలామంది నాన్ వెజ్ ఫుడ్‌ని ఫ్రిజ్‌లో స్టోర్ చేసి తర్వాత వేడి చేసి తింటూ ఉంటారు. దీనివల్ల ఫుడ్ పాయిజనింగ్ జరుగుతుంది. అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

చాలామంది రాత్రి మిగిలిన అన్నాన్ని ఫ్రిజ్‌లో పెట్టి ఉదయం వేడి చేసి తింటారు. అలాగని ఉదయం మిగిలిన దానిని రాత్రికి వేడి చేసి తినడం మంచిదనుకోకండి. అది కూడా మంచి పద్ధతి కాదు. కొన్ని నివేదికల ప్రకారం అన్నాన్ని మళ్లీ మళ్లీ వేడి చేసి తింటే ఫుడ్ పాయిజన్ జరుగుతుందని తేలింది.

గుడ్లని ఆమ్లెట్ వేసుకొని, ఉడకబెట్టుకొని తింటారు. కొన్నిసార్లు వీటితో కూరలు కూడా వండుతారు. గుడ్లలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. అయితే గుడ్లు వండిన వెంటనే తినడం మంచిది. ఫ్రిజ్‌లో పెట్టి వేడి చేసిన తర్వాత తినకూడదు. దీనివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

ఆకుపచ్చ కూరగాయలుప్త్ర ఆకుపచ్చ కూరగాయలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిలో నైట్రేట్ కూడా ఉంటుంది. ఇలాంటి కూరగాయలతో వండిన వంటకాలని వేడి చేసినప్పుడు అవి క్యాన్సర్ కారకాలను విడుదల చేస్తాయి. ఇవి క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. అందుకే ఈ తప్పు అస్సలు చేయకూడదు.

సినిమా రీల్స్

అభిమాన హీరోలు వెండితెరపై ఒక గెటప్‌లో కనిపిస్తేనే ఫ్యాన్స్ ఖుషీ అవుతారు. అలాంటిది ఆ స్టార్ హీరో పలు రకాల గెటప్స్‌లో కనిపిస్తే ఆ ఖుషీ డబుల్ అవుతుంది. అలా డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించే కథలు కొందరు స్టార్స్‌కి సెట్ అయ్యాయి. ఒక్కో హీరో మినిమమ్ నాలుగు, ఇంకా ఎక్కువ గెటప్స్‌లో కనిపించనున్నారు. గెట్.. సెట్.. గెటప్స్ అంటూ ఆ స్టార్స్ చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

గెట్.. సెట్.. గెటప్స్



● 'ఇండియన్ 2'లో కమల్ హాసన్



● 'గేమ్ చేంజర్'లో రామ్‌చరణ్



● 'కంగువా'లో సూర్య

విభిన్న భారతీయుడు

విభిన్నమైన గెటప్స్‌లో కనిపించడం కమల్‌హాసన్‌కు కొత్తేం కాదు. 'దశావతారం'లో కమల్ పది పాత్రల్లో పది గెటప్స్ చేసి ఆడియన్స్‌ను ఆశ్చర్యపరిచారు. అన్ని పాత్రల్లో కాదు కానీ 'ఇండియన్ 2'లో కమల్‌హాసన్ డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించనున్నారని తెలుస్తోంది. 1996లో హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' వీరి కాంబినేషన్‌లోనే రూపొందుతోంది. 1920 నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని, ఇందులో కమల్ హాసన్ నాలుగుకి మించి గెటప్స్‌లో కనిపిస్తారని కోలీవుడ్ టాక్. వీటిలో లేడీ గెటప్ ఒకటనే టాక్ తెరపైకి వచ్చింది. మహిళగా, 90 ఏళ్ల వృద్ధుడిగా, యువకుడిగా.. ఇలా విభిన్నంగా కనిపించడానికి కమల్‌కి ప్రోస్థటిక్ మేకప్ వేసుకోవడానికి, తీయడానికి మూడు గంటలకు పైగా పడుతోందని యూనిట్ అంటోంది.

ఈ చిత్రం వచ్చే ఏడాది రిలీజ్ కానుంది.



● 'జపాన్'లో కార్తీ



● రవితేజ

పెయింటరా? సైంటిస్టా?

పెయింటరా? రైతా? సైంటిస్టా? అసలు 'ఈగిల్' సినిమాలో రవితేజ క్యారెక్టర్ ఏంటి? అనే సందేహం తీరాలంటే ఈ సంక్రాంతి వరకూ వెయిట్ చేయాల్సిందే. ఎందుకంటే ఈ సినిమా రిలీజ్ అయ్యేది అప్పుడే. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'ఈగిల్'. ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్ ఓ లీడ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో రవితేజ ఐదారు గెటప్స్‌లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. వీటిలో ప్రొఫెషనల్ స్నైపర్ గెటప్ ఒకటి అని భోగట్టా. ఇంకా రవితేజ లుక్ విడుదల కాలేదు.

పదికి మించి..

ప్రయోగాత్మక పాత్రలకు సూర్య ముందుంటారు. 'సుందరాంగుడు', 'సెవెన్త్ సెన్స్', '24', 'బ్రదర్స్'... ఇలా సూర్య కెరీర్‌లో వైవిధ్యమైన చిత్రాల జాబితా ఎక్కువే. ఈ కోవలోనే సూర్య నటించిన మరో చిత్రం 'కంగువా'. శివ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సూర్య పదమూడు గెటప్స్‌లో కనిపిస్తారనే టాక్ ఎప్పట్నుంచో వినిపిస్తోంది. 17వ శతాబ్దంలో మొదలై 2023కి కనెక్ట్ అయ్యేలా 'కంగువా' కథను రెడీ చేశారట శివ. రెండు భాగాలుగా విడుదల కానున్న 'కంగువా' తొలి భాగం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది.

స్టూడెంట్.. రాజకీయ నాయకుడు

కాలేజ్ స్టూడెంట్, ఐఏఎస్ ఆఫీసర్, రాజకీయ పార్టీ కార్యకర్త... ఇలా 'గేమ్ చేంజర్' సినిమాలో రామ్ చరణ్ ఏడు గెటప్స్‌లో కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్ కూడా ఉన్నాయి. రాజకీయ నాయకులకు, ఐఏఎస్ ఆఫీసర్లకు మధ్య నెలకొని ఉండే అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందట. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

2 దశాబ్దాలు.. 4 గెటప్స్

'తొలిప్రేమ' (2018)లో వరుణ్ తేజ్ క్యారెక్టర్‌లో డిఫరెంట్ షేడ్స్ కనిపిస్తాయి. కాలేజీ కుర్రాడిలా, ఉద్యోగం చేసే వ్యక్తిగా కనిపిస్తారు. ఇదే తరహాలో వరుణ్ తేజ్ మరో సినిమా చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే 'మట్కా'. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ నాలుగు గెటప్స్‌లో కనిపిస్తారని చిత్ర యూనిట్ వెల్లడించింది. వైజాగ్ నేపథ్యంలో 1958 నుంచి 1982 టైమ్ పీరియడ్‌లో 'మట్కా' కథనం ఉంటుంది. 'పలాస' ఫేమ్ కరుణకుమార్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ అక్టోబరు మొదటి వారంలో ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది ఈ సినిమాను విడుదల చేస్తారు.

పలు అవతారాల్లో స్మగ్లింగ్

స్మగ్లింగ్ చేస్తున్నారట కార్తీ. అది కూడా గోల్డ్ స్మగ్లింగ్. ఇందులో భాగంగా అధికారులను బోల్తా కొట్టించేందుకు తన గెటప్ మార్చుతుంటారట. ఇదంతా 'జపాన్' సినిమా కోసం. రాజు మురుగన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ఇది. గోల్డ్ స్మగ్లింగ్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని, ఇందులో కార్తీ డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారని సమాచారం. ఈ చిత్రం ఈ దీపావళికి విడుదల కానుంది.



● వరుణ్ తేజ్

ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్



● శివ రాజ్‌కుమార్

శివ రాజ్‌కుమార్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఘోస్ట్'. శ్రీని దర్శకత్వంలో సందేశ్ నాగరాజ్ (ఎమ్మెల్సీ) సమర్పణలో సందేశ్ ఎన్. నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 19న కన్నడ, తెలుగు, తమిళ, హిందీ, మలయాళం భాషల్లో విడుదల కానుంది. అర్జున్ జన్య సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్ మ్యూజిక్ ...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను చెన్నై లయోలా కాలేజ్‌లో అభిమానుల సమక్షంలో కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో రిలీజ్ చేశారు. ''హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన చిత్రం 'ఘోస్ట్'. రజనీకాంత్ 'జైలర్' చిత్రంలో శివ రాజ్‌కుమార్ పాత్రకు వచ్చిన మంచి స్పందన 'ఘోస్ట్' పై మరిన్ని అంచనాలు పెంచింది'' అని చిత్రబృందం పేర్కొంది.

ఆటతో...



● చైతన్య

చైతన్య పసుపులేటి, హీనా రాయ్ జంటగా నటించిన చిత్రం 'జీటీఏ'. దీపక్ సిద్ధాంత్ దర్శకత్వంలో డా. సుశీల నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 6న విడుదల కానుంది. ఈ చిత్రం విడుదల తేదీ పోస్టర్‌ను రచయిత–దర్శకుడు కృష్ణ చైతన్య రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''కొత్త కాన్సెప్ట్‌తో రాబోతున్న ఈ సినిమా హిట్ అవ్వాలి'' అన్నారు. ''క్రైమ్ యాక్షన్ డ్రామాగా జీటీఏ అనే ఆట ఆధారంగా ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు దీపక్ సిద్ధాంత్. ఈ చిత్రానికి సంగీతం: మార్క్ కె. రాబిన్, కామెరా: కేవీ ప్రసాద్.

హైలెస్సో హైలెస్సా...



● నవమి, ఆనంద్

''ప్రేమించుకుందాం రా, సూర్యవంశం, మనసంతా నువ్వే' వంటి చిత్రాల్లో బాల నటుడిగా చేసిన ఆనంద్ వర్ధన్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'నిదురించు జహాపన'. ప్రసన్న కుమార్ దేవరపల్లి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నవమి గయాక్, రోష్నీ సాహోతా హీరోయిన్లు. సామ్ .జి, వంశీకృష్ణ వర్మ నిర్మిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ మూవీలోని 'హైలెస్సో హైలెస్సా...' అంటూ సాగే పాటని తెలంగాణ రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి విడుదల చేశారు. డి. ప్రసన్న కుమార్ సాహిత్యం అందించిన ఈ పాటను ధనుంజయ్ సీపాన, ఎ. ప్రవస్తి పాడారు. ''అందమైన ప్రేమకథని తెలియజేసే లవ్లీ మెలోడీగా ఈ పాటని స్వరపరిచారు అనూప్'' అన్నారు మేకర్స్.

మిషన్ సిద్ధం



● తేజేశ్వర్, ప్రగ్య

తేజేశ్వర్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'మిషన్ సి 1000'. ప్రగ్య నయన్ హీరోయిన్. టి. విరాట్, సుహాసిని నిర్మించారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను నిర్మాత అభిషేక్ అగర్వాల్ రిలీజ్ చేశారు. తేజేశ్వర్ మాట్లాడుతూ– ''తెలుగు, హిందీ భాషల్లో నిర్మించిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. శ్రీధర్ ఆత్రేయ సంగీతం సమకూర్చిన ఈ సినిమాలో మొత్తం మూడు పాటలున్నాయి. ముఖ్యంగా శ్రీరాముడిపై చిత్రీకరించిన పాట ఈ మూవీలో హైలెట్‌గా నిలుస్తుంది'' అన్నారు. ''త్వరలో సినిమాని రిలీజ్ చేస్తాం'' అన్నారు నిర్మాతలు.


నవ్వు..భయం



● అవినాష్, కోదండ రామిరెడ్డి

'జబర్దస్త్', 'బిగ్ బాస్' షోలతో బుల్లితెర ప్రేక్షకులను అలరించిన అవినాష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ప్రీ వెడ్డింగ్ ప్రసాద్'. రాకేష్ దుబాసి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సాయికుమార్, సంగీత, రియాజ్, రూప ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. డెక్కన్ డ్రీమ్ వర్క్స్‌పై నబీ షేక్ నిర్మిస్తున్న 'ప్రీ వెడ్డింగ్ ప్రసాద్' మూవీ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి రచయిత కోన వెంకట్ కెమెరా స్విచ్ఛాన్ చేయగా, డైరెక్టర్ కోదండ రామిరెడ్డి క్లాప్ ఇచ్చారు. రాకేష్ దుబాసి దర్శకత్వం వహించారు. దర్శకుడు సాయి రాజేష్ ఈ సినిమా టైటిల్ లోగోని లాంచ్ చేయగా, దర్శకుడు వీరభద్రం చౌదరి, నిర్మాత బెక్కం వేణుగోపాల్ అతిథులుగా పాల్గొన్నారు. నబీ షేక్ మాట్లాడుతూ– ''ఈ చిత్రకథ, స్క్రీన్ ప్లే చాలా వైవిధ్యంగా ఉంటాయి'' అన్నారు. ''మా సినిమా చూసి ప్రేక్షకులు నవ్వుకుంటారు.. భయపడతారు.. థ్రిల్ అవుతారు'' అన్నారు అవినాష్. ''నబీ షేక్‌గారి లాంటి నిర్మాత ఉంటే యువ ప్రతిభ పరిశ్రమలోకి వస్తుంది'' అన్నారు రాకేష్ దుబాసి. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: శ్యామ్ కె. నాయుడు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మహాదేవ్.

పా.. పా వస్తోంది



● 'పా..పా'లో ఓ దృశ్యం

కవిన్, అపర్ణా దాస్, మోనికా చిన్నకోట్ల, ఐశ్వర్య, భాగ్యరాజ, వీటీవీ గణేష్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'దా... దా...'. గణేష్ కె. బాబు దర్శకత్వం వహించారు. ఎస్. అంబేత్ కుమార్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం తమిళంలో హిట్ అయింది. ఈ సినిమా 'పా... పా...' పేరుతో తెలుగులో విడుదల కానుంది. నీరజ సమర్పణలో పాన్ ఇండియా మూవీస్, జేకే ఎంటర్‌టైన్మెంట్స్‌పై ఎంఎస్ రెడ్డి తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ''యూత్‌ఫుల్, లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'పా... పా...'. త్వరలో ట్రైలర్ విడుదల చేయనున్నాం. కొత్త తరహా చిత్రాలను ఆదరించే తెలుగు ప్రేక్షకులు 'పా...పా...'ని కూడా హిట్ చేస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు ఎంఎస్ రెడ్డి. ఈ చిత్రానికి కెమెరా: కె. ఎళిల్ అరసు, సంగీతం: జెన్ మార్టిన్, సహనిర్మాతలు: శ్రీకాంత్ నూనెపల్లి, శశాంక్ చెన్నూరు.

దేశభక్తి నేపథ్యంలో...



● పరశురామ్, సూర్య

సూర్య అయ్యలసోమయాజుల హీరోగా, మిహిరామ్ వైనతేయ దర్శకునిగా పరిచయమవుతున్న చిత్రం 'రామ్' (ర్యాపిడ్ యాక్షన్ మిషన్). ధన్యా బాలకృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు. దీపికా ఎంటర్‌టైన్‌మెంట్–ఓఎస్‌యం విజన్‌పై దీపికాంజలి వడ్లమాని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్, గ్లింప్స్‌ని డైరెక్టర్ పరశురామ్ విడుదల చేశారు. ''వాస్తవ ఘటనలను ఆధారం చేసుకుని, దేశభక్తి నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'రామ్'. దేశాన్ని, దేశ ప్రజలను ఉద్దేశిస్తూ గ్లింప్స్‌లో హీరో చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలుస్తుంది. మా సినిమా ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంది'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఆశ్రిత్ అయ్యంగార్, కెమెరా: ధారన్ సుక్రే.

సాక్షి బిజినెస్
శనివారం
23-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
221	68
66,009	19,674

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	13,279	△ 55
డోజోన్స్	34,050	▽ 20
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,684	△ 5
డాక్స్	15,557	▽ 15
హాంగ్‌సెంగ్	3,132	△ 48
నికాయ్	32,402	△ 163

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

	ధర	మార్పు
బంగారం (24 క్యారెట్)	59,086	▽ 14
బంగారం (22 క్యారెట్)	58,849	▽ 14
వెండి (కిలో)	72,975	△ 1,004

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.10	83.77
£	బ్రిటన్ పౌండ్	100.19	103.52
€	యూరో	86.81	89.91
¥	జపాన్ ఎన్ (100)	55.12	56.85
AUS	ఆస్ట్రేలియా డాలర్	52.17	54.51
S$	సింగపూర్ డాలర్	59.72	61.66
SAR	సౌదీ రియాల్	21.16	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	21.68	23.48
¥	చైనా యువాన్	10.23	12.31

మ్యూచువల్ ఫండ్స్‌పై ఫోరెన్సిక్ విచారణ

34 సంస్థలను ఎంపిక చేసిన సెబీ



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్, వాటిని నిర్వహించే అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీలు), వాటి ట్రస్టీలపై ఫోరెన్సిక్ విచారణ నిర్వహించేందుకు సెబీ 34 సంస్థలను ఎంపిక చేసింది. ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఎల్ఎల్‌పీ, డెలాయిట్ టౌచే తోమత్సు, గ్రాంట్ థార్న్‌టన్ భారత్ ఎల్ఎల్‌పీ, కేపీఎంజీ అష్యూరెన్స్ అండ్ కన్సల్టింగ్ సర్వీసెస్, చోక్సీ అండ్ చోక్సీ ఎల్ఎల్‌పీ, నాంజియా అండ్ కో ఎల్ఎల్‌పీ, పిపార అండ్ కో ఎంపికైన వాటిల్లో ఉన్నాయి. 2023 సెప్టెంబర్ 20 నుంచి 2026 సెప్టెంబర్ 19 వరకు ఇవి సెబీ ఎంపానెల్‌మెంట్ సంస్థలుగా కొనసాగుతాయి. ఫిబ్రవరిలో ఆసక్తి వ్యక్తీకరణను సెబీ ఆహ్వానించగా, వచ్చిన దరఖాస్తుల నుంచి 34 సంస్థలను ఎంపిక చేసింది. సెబీ ఆదేశాల మేరకు ఈ సంస్థలు మొబైల్, కంప్యూటర్లు, ట్యాబ్లెట్లు, హార్డ్‌డ్రైవ్‌లు, యూఎస్‌బీల నుంచి సమాచార విశ్లేషణ, వెలికితీయడం, వాస్తవాల ఆధారంగా నివేదిక రూపొందించి సమర్పించాల్సి ఉంటుంది. దేశంలో మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ భారీగా వృద్ధి చెందుతుండడంతో, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోణంలో మ్యూచువల్ ఫండ్ ట్రస్టీలలో జవాబుదారీతనాన్ని పెంచుతూ ఈ ఏడాది జూలైలో సెబీ ఆదేశాలు తీసుకురావడం గమనార్హం.

ఐఫోన్ 15కి భారీ డిమాండ్

ఐఫోన్ 14తో పోలిస్తే తొలిరోజు విక్రయాలు డబుల్

న్యూఢిల్లీ: దేశీయంగా ఐఫోన్ 15 స్మార్ట్‌ఫోన్‌లకు గణనీయంగా డిమాండ్ కనిపిస్తోంది. ఐఫోన్ 14తో పోలిస్తే ఐఫోన్ 15 తొలి రోజు అమ్మకాలు ఏకంగా 100 శాతం అధికంగా నమోదైనట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. టెక్ దిగ్గజం యాపిల్ మిగతా దేశాలతో సమానంగా ఏకకాలంలో భారత్‌లోనూ ఐఫోన్ విక్రయాలను ప్రారంభించడం, అది కూడా మేడిన్ ఇండియా ఫోన్లను అందుబాటులోకి తేవడం ఇదే ప్రథమం. తొలి రోజున సాయంత్రం ఆరు గంటల సమయానికి ఐఫోన్ 14తో పోలిస్తే 15 అమ్మకాలు రెట్టింపు నమోదయ్యాయని, చాలా చోట్ల కొనుగోలుదారులు క్యూ కట్టారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఐఫోన్ 15 ప్రో సిరీస్ కోసం చాలా మంది బుక్ చేసుకున్నప్పటికీ.. ఐఫోన్ 15, ఐఫోన్ 15 ప్లస్ మోడల్స్‌కు కూడా యాపిల్ స్టోర్స్, యాపిల్ ప్రీమియం రీసెల్లర్ స్టోర్స్‌లో భారీగా డిమాండ్ కనిపిస్తోందని వివరించాయి. టెక్ దిగ్గజం యాపిల్ ఇటీవలే ఆవిష్కరించిన ఐఫోన్ 15 ధరలు మోడల్‌ను బట్టి రూ. 79,900 నుంచి రూ. 1.99 లక్షల వరకు ఉన్నాయి.

రిలయన్స్, బ్లింకిట్ ఆఫర్లు..

ఐఫోన్ 15కి సంబంధించి రిలయన్స్ రిటైల్ 'న్యూఫోరియా' పేరిట ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. దీని కింద ఐఫోన్ 15 కొనుగోలుదారులు ఆరు నెలల పాటు జియో సర్వీసులు, అపరిమిత డేటాను ఉచితంగా పొందవచ్చు. మరోవైపు, క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్ కూడా యాపిల్ ప్రీమియం రీసెల్లర్ యూనికార్న్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీని కింద బెంగళూరు, ముంబై, పుణే, ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో ఆర్డరు చేసిన 10 నిమిషాల్లో ఐఫోన్ 15, ఐఫోన్ 15 ప్లస్‌ను అందించనుంది.



ముంబైలోని యాపిల్ బీకేసీ స్టోర్ వద్ద ఐఫోన్ 15 కొనుగోలు కోసం బారులు తీరిన జనం

హ్యుందాయ్ కొత్త ఐ20 ఎన్‌-లైన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ భారత మార్కెట్లో కొత్త ఐ20 ఎన్ లైన్ ప్రవేశపెట్టింది. 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో తయారైంది. 6 స్పీడ్ మాన్యువల్, 7 స్పీడ్ డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ వేరియంట్స్ ఉన్నాయి. 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, 7 స్పీకర్ బోస్ ఆడియో సిస్టమ్, క్రూజ్ కంట్రోల్, సన్‌రూఫ్ వంటి హంగులు ఉన్నాయి. 6 ఎయిర్‌బ్యాగ్స్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్ కంట్రోల్, వెహికిల్ స్టెబిలిటీ మేనేజ్‌మెంట్, 3 పాయింట్ సీట్‌బెల్ట్స్, సీట్ బెల్ట్ రిమైండర్ వంటి భద్రతా ఫీచర్లను జోడించారు. 16 అంగుళాల అలాయ్ వీల్స్, 60కిపైగా కనెక్టెడ్ కార్ ఫీచర్స్, 127 ఎంబెడ్డెడ్ వీఆర్ కమాండ్స్, 52 హింగ్లీష్ వాయిస్ కమాండ్స్, 7 ఆంబియెంట్ నేచర్ సౌండ్స్, సి–టైప్ చార్జర్ అదనపు హంగులు. 2 అంతర్జాతీయ భాషలు, 10 ప్రాంతీయ భాషలను సపోర్ట్ చేస్తుంది. ఎక్స్‌షోరూంలో ధర రూ.9.99 లక్షల నుంచి ప్రారంభం.

19,700 దిగువకు నిఫ్టీ

సెన్సెక్స్ నష్టం 221 పాయింట్లు

- నాలుగో రోజూ బేర్స్ పైచేయి
- ఫార్మా, ఫైనాన్స్, మెటల్ షేర్లలో అమ్మకాలు



ముంబై: స్టాక్ మార్కెట్‌పై బేర్ ఆధిపత్యం కొనసాగడంతో స్టాక్ సూచీలు నాలుగోరోజూ నష్టాలు చవిచూశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు(1.50%)పతనంతో పాటు విదేశీ ఇన్వెస్టర్లు వరుస విక్రయాలు ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీనతలు మరింత ఒత్తిడి పెంచాయి. ఉదయం కొద్దిసేపు లాభాల్లో కదలాడిన సూచీలు వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్, ఫార్మా, ఐటీ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 221 పాయింట్లు పతనమై 66,009 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 492 పాయింట్ల పరిధిలో 65,953 వద్ద కనిష్టాన్ని, 66,445 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 68 పాయింట్లు క్షీణించి 19,674 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 86 పాయింట్లు పతనమై 19,656 వద్ద కనిష్టానికి దిగివచ్చింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆటో షేర్లకు స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,327 కోట్ల షేర్లు అమ్మేయగా..., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.801 కోట్ల షేర్లను కొన్నారు. ఈ వారంలో సెన్సెక్స్ 1,829 పాయింట్లు క్షీణించడంతో బీఎస్ఈలో దాదాపు రూ.6 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద హరించుకుపోయింది. వడ్డీరేట్ల పెంపు అంచనాల నేపథ్యంలో బాండ్లపై రాబడులు పెరగడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాలతో ట్రేడవుతున్నాయి.


జాగిల్ ప్రీపెయిడ్ ఓషియన్ సర్వీసెస్ లిస్టింగ్ నిరాశపరిచింది. ఇష్యూ ధర (రూ. 164)తో పోలిస్తే షేరు ఒకశాతం డిస్కౌంట్‌తో రూ.162 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో రూ. 156 వద్ద కనిష్టాన్ని, రూ.176 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 3.50% నష్టపోయి రూ.158 వద్ద నిలిచింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,933 కోట్లుగా నమోదైంది.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- నష్టాల మార్కెట్లోనూ సంహీ హోటల్స్ లిస్టింగ్ సక్సెస్ అయ్యింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.126)తో పోలిస్తే షేరు 4% ప్రీమియంతో రూ.130.55 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 16% ర్యాలీ చేసి రూ.146 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 14% లాభంతో రూ.144 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,130 కోట్లుగా నమోదైంది.
- నిర్మా గ్రూప్‌కు తన అనుబంధ సంస్థ గ్లెన్‌మార్క్ లైఫ్ సైన్సెస్‌లో 75% వాటాను విక్రయించడంతో గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ షేరు 3% నష్టపోయి రూ.802 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో ఆరున్నర శాతం క్షీణించి రూ.775 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.
- జేపీ మోర్గాన్ వచ్చే ఏడాది నుండి తమ ఎమర్జింగ్ మార్కెట్ ఇండెక్స్‌లో చేర్చాలని యోచిస్తున్నట్లు తెలపడంతో ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అత్యధికంగా సెంట్రల్ బ్యాంక్ షేరు 9% ఎగసింది. యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్ షేర్లు 5% ర్యాలీ చేశాయి. మహారాష్ట్ర బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, పీఎస్‌బీ, యూకో బ్యాంక్ షేర్లు 4% రాణించాయి.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు వరుసగా నాలుగో రోజూ అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్ఈలో శుక్రవారం 1.50% నష్టపోయి రూ.1,529 వద్ద స్థిరపడింది. మొత్తం నాలుగు ట్రేడింగ్‌లో 8% నష్టపోవడంతో బ్యాంకు రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాప్‌ను కోల్పోయింది.

ఐటీ హార్డ్‌వేర్‌లో స్వావలంబన

మూడేళ్లలో దేశీయంగానే 70% ఉత్పత్తి • కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ వెల్లడి



న్యూఢిల్లీ: ఐటీ హార్డ్‌వేర్ కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని, స్వావలంబన సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా వచ్చే మూడేళ్లలో ఐటీ హార్డ్‌వేర్ అవసరాల్లో 70 శాతం భాగాన్ని దేశీయంగానే ఉత్పత్తి చేసుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఆయన చెప్పారు. 'ప్రస్తుతం మన డిజిటల్ వ్యవస్థకు అవసరమైన ఉత్పత్తుల్లో 80 శాతం వాటా దిగుమతులదే ఉంటోంది. మన దగ్గర 8–10 శాతం మాత్రమే తయారవుతున్నాయి. దీన్ని వచ్చే మూడేళ్లలో 65–70 శాతానికి పెంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇంటర్నెట్, క్లౌడ్.. డేటా సెంటర్లు మొదలైన వాటిని దేశీయంగా నిర్మించుకుంటున్నప్పుడు వాటికి ఉపయోగించే సర్వర్లు, ల్యాప్‌టాప్‌లు మొదలైనవన్నీ విశ్వసనీయమైన వనరుల నుంచి వచ్చినవై ఉండాలి. అవి విశ్వసనీయమైనవిగా ఉండాలంటే, దేశీయంగా తయారు చేసిన విడిభాగాల్లాంటివి ఆయా ఉత్పత్తుల్లో ఉపయోగించడం మరింతగా పెరగాలి' అని మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో ల్యాప్‌ట్యాప్‌లు, ట్యాబ్లెట్లు, సర్వర్లు మొదలైన వాటిని ఉత్పత్తి చేసేందుకు సంబంధించి కేంద్రం ప్రకటించిన ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కోసం 40 పైచిలుకు కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో డెల్, హెచ్‌పీ, లెనొవొ తదితర సంస్థలు ఉన్నాయి. పీఎల్ఐ స్కీము కోసం కేంద్రం రూ. 17,000 కోట్లు ప్రకటించగా.. ఈ కంపెనీలన్నీ ఎంపికైన పక్షంలో ప్రోత్సాహక మొత్తాన్ని రూ. 22,890 కోట్లకు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

దిగుమతులకు ఆథరైజేషన్ ఆన్‌లైన్‌లోనే ..

ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, సర్వర్లు మొదలైన వాటి దిగుమతులకు అనుమతులిచ్చే ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఉండనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించిన 'ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' సెప్టెంబర్ ఆఖరు నుంచి అందుబాటులోకి రాగలదని కంపెనీలకు కేంద్రం తెలిపిందని వివరించాయి. దిగుమతిదారులు తమ డేటాతో పాటు గత మూడేళ్లలో దిగుమతుల వివరాలను కూడా ఇందులో పొందుపర్చాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. ప్రాథమికంగా ఏడాది వ్యవధికి ఆథరైజేషన్ లభిస్తుందని, ఆ తర్వాత నుంచి క్రమంగా ఫినిష్డ్ ఉత్పత్తుల దిగుమతి కోటా 5 శాతం మేర తగ్గుతూ వస్తుందని సంబంధిత వర్గాలు చెప్పాయి. కొన్ని కేసుల్లో అవసరాన్ని బట్టి కొంత మేర మినహాయింపులు లభించవచ్చని వివరించాయి.

సాక్షి స్పోర్ట్స్

వన్డే ప్రపంచకప్ విజేతకు రూ. 33 కోట్లు!

వన్డే వరల్డ్ కప్‌లో విజేతగా నిలిచే జట్టుకు 40 లక్షల డాలర్లు (సుమారు రూ. 33 కోట్లు), రన్నరప్ జట్టుకు 20 లక్షల డాలర్లు (సుమారు రూ.16 కోట్ల 50 లక్షలు) ప్రైజ్‌మనీగా లభిస్తుందని ఐసీసీ శుక్రవారం ప్రకటించింది. టోర్నీ కోసం మొత్తం 1 కోటి డాలర్లు (సుమారు రూ. 83 కోట్లు) కేటాయించారు.

ముగ్గురు భారత అథ్లెట్లకు చైనా వీసా నిరాకరణ

నిరసన వ్యక్తం చేసిన క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్



న్యూఢిల్లీ: ఆసియా క్రీడలకు సంబంధించి అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. వుషు పోటీల్లో పాల్గొనాల్సిన 11 మంది సభ్యుల భారత బృందంలో ముగ్గురికి చైనా ప్రభుత్వం వీసా నిరాకరించింది. ఈ ముగ్గురూ అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారే. అరుణాచల్‌ప్రదేశ్‌కు సంబంధించి భారత్, చైనా మధ్య సరిహద్దు వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వీసా నిరాకరణ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ముగ్గురు మహిళా వుషు ప్లేయర్లు నైమన్ వాంగ్సూ, ఒనిలు టెగా, మేపుంగ్ లంగులను భారత అథ్లెట్లుగా గుర్తించేందుకు చైనా నిరాకరించింది. దాంతో శుక్రవారం రాత్రి వీరు మినహా మిగిలిన ముగ్గురు ఆసియా క్రీడల కోసం చైనా బయల్దేరి వెళ్లారు. ఈ అంశంపై కేంద్ర క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలకు హాజరయ్యేందుకు చైనాకు వెళ్లాల్సిన ఠాకూర్... తాజా పరిణామాలకు నిరసనగా తన పర్యటనను రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు.

నసీమ్ స్థానంలో హసన్ అలీ

ప్రపంచకప్‌కు పాక్ జట్టు ప్రకటన



లాహోర్: వన్డే వరల్డ్ కప్‌లో పాల్గొనే 15 మంది సభ్యుల పాకిస్తాన్ క్రికెట్ జట్టును శుక్రవారం సెలక్షన్ కమిటీ చైర్మన్ ఇంజమామ్ ఉల్ హక్ ప్రకటించారు. ఆసియా కప్‌లో గాయపడి ఆటకు దూరమైన పేస్ బౌలర్ నసీమ్ షా స్థానంలో హసన్ అలీని జట్టులోకి తీసుకున్నారు. లెగ్‌స్పిన్నర్ ఉసామా మీర్‌కు కొత్తగా చోటు దక్కింది. హసన్ అలీ ఇప్పటి వరకు 60 వన్డేల్లో 91 వికెట్లు పడగొట్టాడు.


పాకిస్తాన్ జట్టు: బాబర్ ఆజమ్ (కెప్టెన్), ఫఖర్, ఇమామ్, షఫీఖ్, రిజ్వాన్, సౌద్ షకీల్, ఇఫ్తిఖార్, సల్మాన్, నవాజ్, షాదాబ్, ఉసామా మీర్, షాహిన్ అఫ్రిది, రవూఫ్, వసీమ్, హసన్ అలీ.

బంగ్లాదేశ్‌తో భారత్ తొలి పోరు

దుబాయ్: వచ్చే ఏడాది శ్రీలంక వేదికగా జరిగే అండర్–19 ప్రపంచ కప్ టోర్నీ షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విడుదల చేసింది. 2024 జనవరి 13 నుంచి ఫిబ్రవరి 4 వరకు కొలంబోలోని ఐదు వేదికల్లో టోర్నమెంట్ జరుగుతుంది. ఐదుసార్లు చాంపియన్ అయిన భారత్ జనవరి 14న తమ తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను 'ఢీ'కొంటుంది.

తొలి వన్డే భారత్‌దే

- 5 వికెట్లతో ఆసీస్‌పై విజయం
- షమీకి 5 వికెట్లు
- రుతురాజ్, గిల్, రాహుల్, సూర్యకుమార్ అర్ధసెంచరీలు
- మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌కు భారత్



షమీ

మొహాలీ: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. సాధారణ లక్ష్యాన్ని ఛేదించడంలో కొంత ఇబ్బంది పడినట్లు కనిపించినా చివరకు ఎలాంటి ఉత్కంఠకు అవకాశం ఇవ్వకుండా ప్రశాంతంగా టీమిండియా ఆట ముగించింది. శుక్రవారం ఇక్కడి పీసీఏ స్టేడియంలో జరిగిన తొలి వన్డేలో భారత్ 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. ఈ గెలుపుతో భారత్ ఐసీసీ వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంది. ప్రస్తుతం భారత్ మూడు ఫార్మాట్‌లలో (టెస్ట్, వన్డే, టి20) టాప్ ర్యాంక్‌లో ఉండటం విశేషం.

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా సరిగ్గా 50 ఓవర్లలో 276 పరుగులకు ఆలౌటైంది. వార్నర్ (53 బంతుల్లో 52; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీ చేయగా... ఇన్‌గ్లిస్ (45 బంతుల్లో 45; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్మిత్ (60 బంతుల్లో 41; 3 ఫోర్లు, 1 సిక్స్), లబుషేన్ (49 బంతుల్లో 39; 3 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడారు. రెండో వికెట్‌కు వార్నర్, స్మిత్ 17.4 ఓవర్లలో 94 పరుగులు జోడించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షమీ (5/51) ఐదు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు. అనంతరం భారత్ 48.4 ఓవర్లలో 5 వికెట్లకు 281 పరుగులు సాధించింది. భారత్ తరఫున నలుగురు బ్యాటర్లు శుబ్‌మన్ గిల్ (63 బంతుల్లో 74; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), రుతురాజ్ గైక్వాడ్ (77 బంతుల్లో 71; 10 ఫోర్లు), కేఎల్ రాహుల్ (63 బంతుల్లో 58 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), సూర్యకుమార్ యాదవ్ (49 బంతుల్లో 50; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేసి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించారు. ఓపెనర్లు రుతురాజ్, గిల్ 21.4 ఓవర్లలో తొలి వికెట్‌కు 142 పరుగులు జత చేశారు. అయితే 9 పరుగుల వ్యవధిలో జట్టు 3 వికెట్లు కోల్పోగా, ఇషాన్ (18) కూడా విఫలమయ్యాడు. ఈ దశలో రాహుల్, సూర్య ఐదో వికెట్‌కు 14.1 ఓవర్లలో 80 పరుగులు జత చేసి జట్టును గెలుపు దిశగా నడిపించారు. విజయానికి 12 పరుగుల దూరంలో సూర్య వెనుదిరిగినా... రాహుల్ చివరి వరకు నిలిచాడు. అబాట్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టడంతో మరో 8 బంతులు మిగిలి ఉండగా జట్టు విజయం ఖాయమైంది. ఈ మ్యాచ్‌లో భారత మేనేజ్‌మెంట్ పేసర్ సిరాజ్‌కు విశ్రాంతినిచ్చింది. నియంత్రణతో కూడిన బౌలింగ్ ప్రదర్శనతో అశ్విన్ తనకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగా... అర్ధ సెంచరీతో సూర్య ఫామ్‌లోకి రావడం భారత్‌కు సానుకూలాంశం. ఆదివారం ఇండోర్‌లో రెండో వన్డే జరుగుతుంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మిచెల్ మార్ష్ (సి) గిల్ (బి) షమీ 4; వార్నర్ (సి) గిల్ (బి) జడేజా 52; స్మిత్ (బి) షమీ 41; లబుషేన్ (స్టంప్డ్) రాహుల్ (బి) అశ్విన్ 39; గ్రీన్ (రనౌట్) 31; ఇన్‌గ్లిస్ (సి) అయ్యర్ (బి) బుమ్రా 45; స్టొయినిస్ (బి) షమీ 29; షార్ట్ (సి) సూర్య (బి) షమీ 2; కమిన్స్ (నాటౌట్) 21; అబాట్ (బి) షమీ 2; జంపా (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్)** 276. **వికెట్ల పతనం:** 1–4, 2–98, 3–112, 4–157, 5–186, 6–248, 7–250, 8–254, 9–256, 10–276. **బౌలింగ్:** షమీ 10–1–51–5, బుమ్రా 10–2–43–1, శార్దుల్ ఠాకూర్ 10–0–78–0, అశ్విన్ 10–0–47–1, రవీంద్ర జడేజా 10–0–51–1.

భారత్ ఇన్నింగ్స్: రుతురాజ్ (ఎల్బీ) (బి) జంపా 71; గిల్ (బి) జంపా 74; శ్రేయస్ అయ్యర్ (రనౌట్) 3; కేఎల్ రాహుల్ (నాటౌట్) 58; ఇషాన్ కిషన్ (సి) ఇన్‌గ్లిస్ (బి) కమిన్స్ 18; సూర్యకుమార్ (సి) మార్ష్ (బి) అబాట్ 50; జడేజా (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (48.4 ఓవర్లలో 5 వికెట్లకు)** 281. **వికెట్ల పతనం:** 1–142, 2–148, 3–151, 4–185, 5–265. **బౌలింగ్:** కమిన్స్ 10–0–44–1, స్టొయినిస్ 5–0–40–0, అబాట్ 9.4–1–56–1, గ్రీన్ 6–0–44–0, షార్ట్ 8–0–39–0, జంపా 10–0–57–2.

ఆసియా సంరంభం నేడే ఆరంభం



ప్రారంభ, ముగింపు వేడుకలకు ఆతిథ్యమివ్వనున్న హాంగ్జౌ ఒలింపిక్ స్పోర్ట్స్ సెంటర్ స్టేడియం

ఔత్సాహిక క్రీడాకారులు... వర్ధమాన తారలు... ఒలింపిక్ చాంపియన్స్... జగజ్జేతలు... అందరూ మళ్లీ ఒకే వేదికపై తళుక్కుమనే సమయం ఆసన్నమైంది. ఒలింపిక్స్ తర్వాత అంతటి ప్రాధాన్యమున్న ఆసియా క్రీడలకు నేడు తెర లేవనుంది. చైనాలోని హాంగ్జౌ నగరం ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమివ్వనుంది. వాస్తవానికి 19వ ఆసియా క్రీడలు గత ఏడాదిలోనే జరగాలి. అయితే చైనాలో కరోనా వైరస్ తగ్గుముఖం పట్టకపోవడంతో ఈ క్రీడలను ఈ ఏడాదికి వాయిదా వేశారు. అధికారికంగా ఈ క్రీడలు నేడు ఆరంభమవుతున్నా... ఇప్పటికే పలు టీమ్ ఈవెంట్స్ (టి20 క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, రోయింగ్, టేబుల్ టెన్నిస్)మొదలయ్యాయి.

- నేటి నుంచి 19వ ఆసియా క్రీడలు
- చైనాలోని హాంగ్జౌ నగరం ఆతిథ్యం
- పతకాల పట్టికలో టాప్–5 లక్ష్యంగా బరిలోకి భారత్
- అథ్లెటిక్స్, షూటింగ్, రెజ్లింగ్ క్రీడాంశాలపై భారీ అంచనాలు
- సాయంత్రం గం. 5:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



హాంగ్జౌ: ఆసియా క్రీడా పండుగకు వేళయింది. 19వ ఆసియా క్రీడలకు నేడు చైనాలోని హాంగ్జౌ నగరంలో అధికారికంగా తెర లేవనుంది. మొత్తం 45 దేశాల నుంచి 12 వేలకుపైగా క్రీడాకారులు 40 క్రీడాంశాల్లో పతకాల వేటకు సిద్ధమయ్యారు. అక్టోబర్ 8న ఈ క్రీడా సంరంభం సమాప్తం కానుంది. 1982 న్యూఢిల్లీ ఆసియా క్రీడల్లో తొలిసారిగా పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన చైనా గత 2018 జకార్తా ఆసియా క్రీడల వరకు తమ టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంటూ వస్తోంది. ఈసారి కూడా పతకాల పట్టికలో చైనాకు నంబర్‌వన్ స్థానం దక్కడం లాంఛనమే. జపాన్, దక్షిణ కొరియా, ఇరాన్, ఉజ్బెకిస్తాన్ టాప్–5లో ఉండే అవకాశముంది. క్రితంసారి భారత్ 16 స్వర్ణాలు, 23 రజతాలు, 31 కాంస్యాలు కలిపి మొత్తం 70 పతకాలతో ఈ క్రీడల చరిత్రలోనే తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. పతకాల పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచిన భారత బృందం ఈసారి పతకాల సంఖ్య 100 దాటడంతో పాటు టాప్–5లో చోటు సంపాదించాలనే పట్టుదలతో ఉంది. అథ్లెటిక్స్, షూటింగ్, రెజ్లింగ్, ఆర్చరీ, బాక్సింగ్, టెన్నిస్ క్రీడాంశాల్లో ఈసారి భారత క్రీడాకారుల నుంచి భారీ అంచనాలు ఉన్నాయి. భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రధాన ఆకర్షణగా నిలువనున్నాడు. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో, ఇటీవల ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు గెలిచిన నీరజ్ వరుసగా రెండో ఆసియా క్రీడల్లో తన పసిడి పతకాన్ని నిలబెట్టుకునే లక్ష్యంతో చైనాలో అడుగు పెడుతున్నాడు. భారత్ నుంచి ఈసారి అత్యధికంగా 655 మంది క్రీడాకారులు బరిలోకి దిగుతున్నారు. నేడు జరిగే ప్రారంభ వేడుకల్లో భారత బృందానికి పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మహిళా స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ పతాకధారులుగా వ్యవహరించనున్నారు. భారత స్క్వాష్ స్టార్ ప్లేయర్లు సౌరవ్ గోషాల్, జోష్నా చినప్ప ఆరోసారి ... టేబుల్ టెన్నిస్ స్టార్ ఆచంట శరత్ కమల్ ఐదోసారి... వెటరన్ టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న నాలుగోసారి ఆసియా క్రీడల్లో పోటీపడనుండటం విశేషం.

7 ఇప్పటి వరకు జరిగిన అన్ని ఆసియా క్రీడల్లోనూ పోటీపడిన దేశాల సంఖ్య. భారత్, ఇండోనేసియా, జపాన్, ఫిలిప్పీన్స్, శ్రీలంక, సింగపూర్, థాయ్‌లాండ్ ఈ జాబితాలో ఉన్నాయి.

671 ఇప్పటి వరకు జరిగిన 18 ఆసియా క్రీడల్లో పోటీపడి భారత్ గెలిచిన పతకాలు. ఇందులో 155 స్వర్ణాలు, 200 రజతాలు, 316 కాంస్య పతకాలు ఉన్నాయి. అత్యధికంగా అథ్లెటిక్స్‌లో భారత్‌కు 254 పతకాలు వచ్చాయి. బాక్సింగ్ (57), షూటింగ్ (57), రెజ్లింగ్ (49), టెన్నిస్ (32) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

3187 ఆసియా క్రీడల చరిత్రలో చైనా నెగ్గిన పతకాలు. ఇందులో 1473 స్వర్ణాలు, 994 రజతాలు, 720 కాంస్యాలు ఉన్నాయి. చైనా తర్వాత జపాన్ (3054), దక్షిణ కొరియా (2235) రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.

ఈసారి ఆసియా క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి 16 మంది, తెలంగాణ నుంచి 14 మంది క్రీడాకారులు భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్: ధీరజ్ బొమ్మదేవర, వెన్నం జ్యోతి సురేఖ (ఆర్చరీ), జ్యోతి యర్రాజీ (అథ్లెటిక్స్), కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్ (బ్యాడ్మింటన్), బాచిరాజు సత్యనారాయణ (బ్రిడ్జి), పెంటేల హరికృష్ణ, కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక (చెస్), నేలకుడితి అనూష (సాఫ్ట్ టెన్నిస్), సాకేత్ మైనేని (టెన్నిస్), ఆకుల సాయి సంహిత, దొంతర గ్రీష్మ (స్కేటింగ్), బారెడ్డి అనూష (క్రికెట్), శివ కుమార్ (సెపక్‌తక్రా).



జ్యోతి సురేఖ

తెలంగాణ: వ్రితి అగర్వాల్ (స్విమ్మింగ్), అగసార నందిని (అథ్లెటిక్స్), పుల్లెల గాయత్రి, సిక్కి రెడ్డి (బ్యాడ్మింటన్), నిఖత్ జరీన్ (బాక్సింగ్), గురుగుబెల్లి గీతాంజలి (రోయింగ్), కైనన్ చెనాయ్, ఇషా సింగ్ (షూటింగ్), ఆకుల శ్రీజ (టేబుల్ టెన్నిస్), ఇరిగేశి అర్జున్ (చెస్), ప్రీతి కొంగర (సెయిలింగ్), బత్తుల సంజన (స్కేటింగ్), గుగులోత్ సౌమ్య (ఫుట్‌బాల్), తిలక్ వర్మ (క్రికెట్).



నిఖత్ జరీన్

క్లుప్తంగా...

ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానం భేష్

- ఆస్ట్రేలియా గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ సీఈవో రాక్వెల్ ఫ్రాఫ్



చీమకుర్తి గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న రాక్వెల్ ఫ్రాఫ్

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానం చాలా బాగుందని, ఇందుకోసం ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఆస్ట్రేలియా గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ సీఈవో రాక్వెల్ ఫ్రాఫ్ అన్నారు. ఆమె శుక్రవారం ప్రకాశం జిల్లాలో పర్యటించారు. డీఈవో వీఎస్ సుబ్బారావు, పరిషత్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(పీఈవో) సోమా సుబ్బారావుతో కలిసి జిల్లాలోని పలు పాఠశాలలు, ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం, రామచంద్ర మిషన్‌ను రాక్వెల్ ఫ్రాఫ్ సందర్శించారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో అభివృద్ధి, విద్యార్థులకు అందించిన యూనిఫాం, షూ, పుస్తకాలు, కెరీర్ గైడెన్స్, ఇంగ్లిష్ మీడియంలో బోధన, మార్గదర్శినిపై విద్యాశాఖ చేస్తున్న కసరత్తును పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు సరికొత్త రూపు సంతరించుకోవడంపై ఆమె హర్షం వ్యక్తంచేశారు. ముందుగా ఆమెకు విద్యాశాఖ అధికారులు, రోటరీ క్లబ్ సభ్యులు ఘన స్వాగతం పలికారు.

'బీఎస్సీ నర్సింగ్' ప్రాథమిక మెరిట్ జాబితాలు విడుదల

సాక్షి, అమరావతి: రెండేళ్ల డిగ్రీ పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియలో భాగంగా సర్వీస్, నాన్-సర్వీస్ అభ్యర్థుల ప్రాథమిక మెరిట్ జాబితాను వేర్వేరుగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం విడుదల చేసింది. దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులైన నాన్-సర్వీస్ విభాగంలో 1,177 మంది, సర్వీస్ విభాగంలో 38 మందితో జాబితాలు ప్రకటించింది. అనర్హుల జాబితాలను వేరుగా విడుదల చేసింది. మెరిట్ జాబితాలపై విద్యార్థులు తమ అభ్యంతరాలను ఈ నెల 25వ తేదీ ఉదయం 11 గంటలలోగా తెలియజేయాల్సి ఉంది. https:// ugpostbasic.ysruhs.-com/ Grievance వెబ్‌సైట్‌లో సంబంధిత ధ్రువపత్రాలతో విద్యార్థులు తమ అభ్యంతరాలు, వినతులను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. గడువు ముగిసిన అనంతరం అభ్యంతరాలు, వినతులను పరిగణలోకి తీసుకోబోమని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి పేర్కొన్నారు.

మాప్ అప్ రౌండ్ ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా మాప్-అప్ రౌండ్ కౌన్సెలింగ్‌లో భాగంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేసింది. తమకు సీట్లు కేటాయించిన కళాశాలల్లో విద్యార్థులు ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

3, 5వ తేదీల్లో టెక్నికల్ అసిస్టెంటు పోస్టులకు పరీక్షలు

సాక్షి, అమరావతి: మైనింగ్ శాఖలోని టెక్నికల్ అసిస్టెంటు పోస్టుల భర్తీ కోసం అక్టోబర్ 3, 5 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. సంబంధిత హాల్ టికెట్లను 25వ తేదీ నుంచి అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపింది.

జార్ఖండ్ వైపు తరలిన అల్పపీడనం

- నేడు కోస్తాంధ్రలో వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం జార్ఖండ్ వైపు తరలిపోయింది. అనంతరం ఉపరితల ఆవర్తనంగా బలహీనపడి ఇప్పుడు అక్కడ సముద్రమట్టానికి 7.6 కి.మీల ఎత్తులో కొనసాగుతోంది. ప్రస్తుతం రాష్ట్రంపైకి నైరుతి, పశ్చిమ దిశల నుంచి గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో రానున్న రెండు రోజులు వర్షాలు కురవనున్నాయి. శనివారం ఉత్తర, దక్షిణ కోస్తాల్లో పలుచోట్ల, రాయలసీమలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ శుక్రవారం రాత్రి నివేదికలో తెలిపింది. ఆదివారం ఉత్తర కోస్తా, రాయలసీమల్లో కొన్నిచోట్ల, దక్షిణ కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

ఐసీఎఫ్ఆర్ఈ డైరెక్టర్‌గా ఐఎఫ్ఎస్ వినయ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్, ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా (ఐసీఎఫ్ఆర్ఈ–ఇంటర్నేషనల్ కోఆపరేషన్) తెలంగాణ కేడర్‌కు చెందిన సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి వినయ్‌కుమార్ నియమితులయ్యారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఉంది. ప్రస్తుతం ఆయన తెలంగాణ అటవీ శాఖలో అదనపు పీసీసీఎఫ్ హోదాలో ఐటీ, వర్కింగ్ ప్లాన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్త పోస్టులో ఫారెస్ట్ రీసెర్చ్, ఎడ్యుకేషన్‌పై అంతర్జాతీయ సంబంధాలను వినయ్‌కుమార్ సమన్వయం చేయనున్నారు. పలు దేశాలకు చెందిన సంస్థల అటవీ అధ్యయనం, పరిశోధనలు, పర్యావరణ మార్పులపై జరిగే సదస్సులను ఆయన పర్యవేక్షిస్తారు. ఈ పదవిలో ఐదేళ్ల పాటు కొనసాగుతారు.

పాత దుస్తులే వాళ్లకి ఫ్యాషన్!

ఆఫ్రికా ఖండాన్ని ముంచెత్తుతున్న సెకెండ్ హ్యాండ్ దుస్తులు



- ఎక్కువగా అమెరికా, యూరప్, చైనా నుంచి దిగుమతి
- 2021లో దిగుమతి విలువ 1,841 మిలియన్ డాలర్లు
- దిగుమతి చేసుకున్న దుస్తుల్లో 50 శాతం పైగా పనికిరానివే
- అగ్ర దేశాలు వదిలించుకున్న దుస్తులతో ఆఫ్రికాకు ముప్పు
- నేల, నదులు, సముద్రాలు, అడవులు కాలుష్య మయం

సాక్షి, అమరావతి: అమెరికా, చైనా వంటి అగ్ర దేశాల్లో వాడేసి వదిలేసిన పాత దుస్తులే ఆఫ్రికా ప్రజలకు కొత్త ఫ్యాషన్. దీంతో ఆఫ్రికా ఖండాన్ని సెకండ్ హ్యాండ్ వస్త్రాలు ముంచెత్తుతున్నాయి. అక్కడి వ్యాపారస్తులు విదేశాల నుంచి టన్నుల కొద్దీ పాత దుస్తుల్ని దిగుమతి చేసుకుని పెద్దఎత్తున వ్యాపారం చేస్తున్నారు. ఇలా వచ్చిన వాటిలో 50 శాతం పైగా వాడుకోవడానికి వీలుగా లేకపోవడంతో చెత్తకుప్పలుగా మిగిలిపోతున్నాయి. ఆ దుస్తులు ఆఫ్రికాలోని పర్యావరణానికి సవాలు విసురుతున్నాయి. వాస్తవానికి ప్రపంచంలో అత్యంత నాణ్యమైన పత్తిని ఆఫ్రికా దేశాల్లోనే పండిస్తున్నా.. పేదరికం కారణంగా అక్కడి ప్రజలు మాత్రం దిగుమతి చేసుకున్న సెకెండ్ హ్యాండ్ దుస్తులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇక్కడి పరిస్థితులను మెరుగు పరిచేందుకు ఇటీవల 'ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా' ద్వారా ఖండం అంతటా సెకండ్ హ్యాండ్ దుస్తుల వ్యాపారాన్ని నిషేధించాలని నిర్ణయించినా పెద్దగా ఫలితం కనిపించడం లేదు.

లక్షల టన్నుల్లో దిగుమతి

ఆఫ్రికా ఖండంలో మాగ్రెబ్ (అరబ్ సంస్కృతి గల దేశాలు), సబ్ సహారా దేశాలు ఉన్నాయి. 2021లో మాగ్రెబ్ దేశాల్లో సెకండ్ హ్యాండ్ దుస్తుల మొత్తం దిగుమతులు సుమారు 107 మిలియన్ డాలర్లు కాగా, సబ్ సహారాలో 1,734 మిలియన్ డాలర్లకు పైగా ఉంది. 'గ్రీన్‌పీస్ ఆఫ్రికా' సంస్థ సర్వే ప్రకారం మడగాస్కర్ ఏటా లక్ష టన్నుల సెకండ్ హ్యాండ్ దుస్తులను దిగుమతి చేసుకుంటే, కెన్యా 900 మిలియన్ల దుస్తులు, ఘనా 720 మిలియన్ల పాత దుస్తులను దిగుమతి చేసుకుంటున్నాయి. పాత వస్త్రాల దిగుమతిపై సరైన చట్టాలు లేకపోవడం, చెత్తగా మిగిలిన వాటిని ప్రాసెస్ చేయడంపై సరైన పరిజ్ఞానం లేకపోవడంతో ఈ దేశాలు సెకండ్ హ్యాండ్ దుస్తుల చెత్త కుప్పలుగా మారుతున్నాయి. దిగుమతైన దుస్తుల్లో 60% పైగా ప్లాస్టిక్ కలిసిన వస్త్రాలే ఉండడంతో వాటిని తగులబెట్టినా.. భూమిలో పాతిపెట్టినా పర్యావరణానికి ప్రమాదకరంగా మారుతున్నాయని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'ట్రాషన్: ది స్టెల్త్ ఎక్స్‌పోర్ట్ ఆఫ్ వేస్ట్ ప్లాస్టిక్ క్లాత్స్ టు కెన్యా' నివేదిక ఆఫ్రికాకు సెకండ్ హ్యాండ్ దుస్తుల దిగుమతులు డిమాండ్‌ను మించిపోయాయని, అవి ఇక్కడి పర్యావరణ వ్యవస్థను దెబ్బతీస్తున్నట్టు ప్రకటించింది. ఈ వ్యర్థాల వల్ల నదులు, సముద్రాలు, పట్టణాలు, అడవులు, ప్రజల ఆరోగ్యం కలుషితమవుతున్నట్టు నివేదించింది. ఈ దేశాల్లో 2029 నాటికి సెకెండ్ హ్యాండ్ దుస్తుల వార్షిక విలువ 27.5 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేసింది. ఇది ఆఫ్రికా మొత్తం ఆదాయంలో 12.4 శాతం.

ఆఫ్రికాలో రెండో అతిపెద్ద ఉపాధి రంగం

పేదరికం తాండవించే ఆఫ్రికా దేశాల్లో చవకైన దుస్తులకు డిమాండ్ ఉంది. అక్కడ వ్యవసాయం తర్వాత సెకండ్ హ్యాండ్ వస్త్రాల మార్కెట్టే అతిపెద్ద ఉపాధి రంగం. ఈ తరహా దుస్తులకు అతిపెద్ద ఎగుమతిదారు బ్రిటన్. ఆ దేశం నుంచి 14 మిలియన్ టన్నులు, అమెరికా నుంచి 7 లక్షల టన్నులు వాడేసిన దుస్తులను ఏటా ఆఫ్రికాకు ఎగుమతి చేస్తుండగా, యూరోపియన్ యూనియన్, చైనా తర్వాతి స్థానంలో ఉన్నాయి. భారత్, పాకిస్తాన్ నుంచి కూడా ఆఫ్రికాకు ఈ వస్త్రాలు ఎగుమతి అవుతున్నాయి.

- ఒక్క ఘనా దేశానికే ప్రతివారం యూరప్, యూఎస్, ఆస్ట్రేలియా నుంచి 15 మిలియన్ల సెకండ్ హ్యాండ్ వస్త్రాలు ఎగుమతి అవుతున్నాయి.
- సెకెండ్‌హ్యాండ్ దుస్తులను ఎక్కువగా దిగుమతి చేసుకునే కెన్యాలో ప్రతిరోజూ 4 వేల టన్నుల వస్త్ర వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. కెన్యా ప్రభుత్వానికి సెకండ్‌హ్యాండ్ వస్త్రాల దిగుమతి, ఇతర దేశాలు విరాళంగా ఇచ్చిన వాటిపై విధించే పన్ను ముఖ్య ఆదాయ వనరు. ఈ దేశంలో 91.5 శాతం కుటుంబాలు సెకండ్‌హ్యాండ్ దుస్తులను కొనుగోలు చేస్తున్నాయని అంచనా.
- పత్తి ప్రధాన ఉత్పత్తిదారైన జింబాబ్వే పెట్టుబడుల కొరత కారణంగా 85 శాతం పత్తిని ఎగుమతి చేస్తూ, 95 శాతం వస్త్రాలు దిగుమతి చేసుకుంటోంది.
- గ్రీన్‌పీస్ ఆఫ్రికా 2022లో ఇచ్చిన నివేదిక ప్రకారం ఆఫ్రికా దేశాలకు విరాళంగా ఇచ్చే సెకెండ్ హ్యాండ్ దుస్తుల్లో 40 శాతం పైగా ధరించేందుకు పనికిరానివే. వాటిని బహిరంగ ప్రదేశాల్లో వదిలేయడమో, నదుల్లో పారవేయడమో చేస్తున్నారు.

పటిష్ట విద్యా వ్యవస్థతో యువత ప్రగతి



వరల్డ్ బ్యాంక్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫ్రాన్సిస్కో వింటర్‌తో ఏపీ విద్యార్థులు

- యూఎన్ఓ ఇంటర్నేషనల్ యూత్ కాన్ఫరెన్స్‌లో ఏపీ విద్యార్థులు
- నవ భారత నిర్మాణంలో యువత పాత్రపై ప్రసంగం

సాక్షి, అమరావతి: ఒక దేశం ఆర్థికంగా, శక్తివంతంగా ఎదగాలంటే ఉన్నత విలువలు గల యువత పాత్ర ఎంతో కీలకమని ఐక్యరాజ్య సమితి సదస్సులో ఏపీ విద్యార్థులు తెలిపారు. యువత ప్రగతికి పటిష్టమైన విద్యా వ్యవస్థ అవసరమని, ఇది భారతదేశంలోను, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోను బలంగా ఉందని చాటిచెప్పారు. ఏపీ నుంచి 10 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బృందం ఐక్యరాజ్య సమితి వరల్డ్ ఎస్‌డీజీ సమ్మిట్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. వీరు ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీల్లో ఒకటైన కొలంబియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్నారు. న్యూయార్క్‌లోని యునైటెడ్ నేషన్స్ గ్లోబల్ కమ్యూనికేషన్స్ విభాగంలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్నేషనల్ యూత్ కాన్ఫరెన్స్‌కు వీరు హాజరయ్యారు. యూఎన్ఓ స్పెషల్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్‌కుమార్ నేతృత్వంలో సదస్సుకు హాజరైన విద్యార్థినులు రాజేశ్వరి, షేక్ అమ్మాజాన్ తమ ప్రసంగంతో అందరినీ ఆకట్టుకున్నారు. ఆర్థిక ప్రగతిలో యువత పాత్ర, భారతదేశంలో సుస్థిరాభివృద్ధి, ప్రజావైద్యం అంశాలపైన, రాష్ట్రంలో ప్రజా వైద్యానికి ఇస్తున్న ప్రాధాన్యం, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌పై వారు ప్రసంగించారు. ఏపీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, నవరత్నాలు సుస్థిరాభివృద్ధికి ఏ విధంగా తోడ్పడుతున్నాయో, ఏపీ విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన సమూల మార్పులు పేద కుటుంబాలకు చెందిన తమను అంతర్జాతీయ వేదికలపై ఎలా నిలి పాయో అంతర్జాతీయ ప్రతినిధులు, మేధావుల ముందు వారు వివరించారు.

ఏఐ టెక్నాలజీ వినియోగించుకోవాలి..

ఇక ఐక్యరాజ్య సమితి భాగస్వామ్య సంస్థలైన యూఎన్ హాబిటాట్, యూఎన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గ్లోబల్ కమ్యూనికేషన్స్, సివిల్ సొసైటీ యూనిట్, యునిసెఫ్, ఏఎస్ఎఫ్, యూత్ అసెంబ్లీ ఆధ్వర్యంలో రెండ్రోజులుగా యూత్ కాన్ఫరెన్స్ జరుగుతోంది. ఇందులో పాల్గొన్న రాజేశ్వరి, అమ్మాజాన్ మాట్లాడుతూ.. ప్రపంచాన్ని ఉన్నతంగా మార్చడంలో యువత చురుకైన పాత్ర పోషించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, శాంతిస్థాపన, రాజకీయాలు, విధాన రూపకల్పనలో యువత నిమగ్నం కావాలని, విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ వినియోగించుకోవాలన్నారు. ఏపీలో పాఠశాల విద్యలో ఈ తరహా పరి జ్ఞానం అమలు చేస్తున్నారని వివరించారు. అలాగే, పాలనలోనూ, విధానపరమైన నిర్ణయాల్లోనూ యువత అభిప్రాయాలకు ఏపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో స్టూడెంట్–పేరెంట్ కమిటీలు వేసి వారి సలహాలు, సూచనలు తీసుకుంటున్నట్లు రాజేశ్వరి వివరించింది. ఏపీలో విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్ డిజిటల్ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టారని అమ్మాజాన్ తెలిపింది. షకిన్‌కుమార్ మాట్లాడుతూ.. భారత్‌లో యువతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని.. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలోనూ వారికి ఏపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఇందుకు 10 మంది విద్యార్థులను ఐరాస సదస్సుకు పంపడమే నిదర్శనమన్నారు.

ఒకేసారి 9 'వందేభారత్'ల పరుగు

- రేపు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- వాటిల్లో కాచిగూడ–యశ్వంత్‌పూర్, విజయవాడ–చెన్నై రైళ్లు కూడా..



సాక్షి, హైదరాబాద్: వందేభారత్ రైళ్లను మరింత వేగంగా పట్టాలెక్కించే విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. గతంలో మాదిరిగా ఒక్కో రైలును ప్రారంభించటం కాకుండా ఒకేసారి ఎక్కువ సంఖ్యలో రైళ్లను ప్రారంభించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 24న ఒకేసారి తొమ్మిది వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రధాని మోదీ వర్చువల్‌గా వాటిని జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఇందులో కాచిగూడ–యశ్వంత్‌పూర్ మధ్య నడిచే వందేభారత్‌తోపాటు విజయవాడ–చెన్నై సర్వీసు కూడా ఉంది. అలాగే ఉదయ్‌పూర్–జైపూర్, తిరునెల్వేలి–చెన్నై, పట్నా–హౌరా, కాసర్‌గాడ్–తిరువనంతపురం, రౌర్కెలా–భువనేశ్వర్–పూరీ, రాంచీ–హౌరా, జామ్‌నగర్–అహ్మదాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను కూడా ప్రారంభించేందుకు రైల్వే శాఖ ఏర్పాట్లు చేసింది. వాస్తవానికి రెండు నెలల క్రితమే కాచిగూడ–యశ్వంత్‌పూర్ సర్వీసు ప్రారంభం కావాల్సి ఉండగా ఒకేసారి ఎక్కువ సంఖ్యలో రైళ్లను ప్రారంభించేందుకు వీలుగా దాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు.

అన్నీ చిన్న రైళ్లే..

గతంలో ప్రారంభించిన వందేభారత్ రైళ్లు 16 కోచ్‌లతో ఉండగా ఇప్పుడు ఒకేసారి 9 రైళ్లు ప్రారంభించనున్నందున ఎనిమిది కోచ్‌లతోనే వాటిని సిద్ధం చేశారు. ఇందులో ఒక ఎగ్జిక్యూటివ్ చైర్ కార్, ఏడు ఎకానమీ చైర్‌కార్ కోచ్‌లు ఉండనున్నాయి. విశాఖ, తిరుపతి సర్వీసులు 120 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో పరుగుపెడుతున్నాయి. కొత్తగా ప్రారంభమయ్యేవి కూడా అదే స్థాయి డిమాండ్‌తో నడిస్తే వాటి కోచ్‌ల సంఖ్యను కూడా పెంచే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.




భారత్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా యుద్ధ నౌకలు

ముగిసిన త్రైపాక్షిక నౌకాదళ విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం: భారత్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా దేశాల మధ్య తొలిసారిగా జరిగిన త్రైపాక్షిక నౌకాదళ విన్యాసాలు శుక్రవారంతో ముగిశాయి. ఇండో–పసిఫిక్ సముద్ర జలాల్లో ఈ నెల 20న మారిటైమ్ విన్యాసాలు మొదలయ్యాయి. భారత నౌకాదళం స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన ఐఎన్ఎస్ సహ్యాద్రి యుద్ధనౌక భారత్‌కు ప్రాతినిధ్యం వహించగా.. రాయల్ ఆస్ట్రేలియా, ఇండోనేషియా దేశాలకు చెందిన యుద్ధనౌకలు, జలాంతర్గాములు, యుద్ధ విమానాలు పాల్గొన్నాయి. మూడు దేశాల మధ్య భాగస్వామ్యం బలోపేతం చేయడం, సామర్థ్యాల్ని మెరుగుపరిచేందుకు పరస్పర సహకారంతోపాటు ఇండో– పసిఫిక్ సముద్ర జలాల్లో స్థిరమైన శాంతియుత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా ఈ త్రైపాక్షిక విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి. చివరి రోజున వ్యూహాత్మక విన్యాసాలు, క్రాస్‌డెక్ ఆపరేషన్స్, హెలికాప్టర్ల క్రాస్‌డెక్ ల్యాండింగ్ తదితర విన్యాసాలు నిర్వహించారు.

ఈ నెలలో ఇప్పటి వరకు 85 బాల్య వివాహాలకు చెక్

- సీఎస్ జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: బాల్య వివాహాల నివారణపై రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి నుంచి ప్రత్యేక దృష్టి సారించడం ఫలితాలనిస్తోంది. గత నెలలో 159 బాల్య వివాహాలను నివారించిన ప్రభుత్వ యంత్రాంగం.. ఈ నెలలో ఇప్పటి వరకు 85 బాల్య వివాహాలను నివారించినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షలో వెల్లడించారు. ఇదే స్ఫూర్తిని ఇక ముందు కూడా కొనసాగించాల్సిందిగా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. జిల్లాల వారీగా బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే హాట్‌స్పాట్లను గుర్తించి అక్కడ చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని, అక్షయ తృతీయ, శ్రావణ, మాఘ మాసాలు మొదలైన శుభ సందర్భాల్లో బాల్య వివాహాలు జరగకుండా మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాల నివారణకు జారీచేసిన మార్గదర్శకాలపై సంబంధిత సిబ్బందికి, అధికారులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. 15–18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలను, 15–21 సంవత్సరాల వయస్సు గల బాలురను గుర్తించి వారిని ఓపెన్ స్కూల్స్, ఇంటర్, ఇతర దూరవిద్య కార్యక్రమాల్లో చేర్పించాలని సీఎస్ ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల బయట ఉన్న కౌమార బాలికలను గుర్తించి వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఇప్పించాలని చెప్పారు. బాల్య వివాహాల నిషేధ అధికారులు ప్రతి మూడు నెలలకోసారి సమీక్షలు నిర్వహించాలని, బాల్య వివాహాల నివారణతో పాటు బాలల హక్కులు, బాలల రక్షణ సమస్యలపై స్కూల్స్, జూనియర్ కాలేజీలు, సంక్షేమ హాస్టళ్లలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు.

పాల్ ల్యాబ్స్‌తో ఆధునిక విద్యాబోధన

- పాల్ ల్యాబ్స్ రాష్ట్ర నోడల్ అధికారి విజయభాస్కర్



మాట్లాడుతున్న విజయభాస్కర్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధునిక విద్యాబోధన అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పాల్ ల్యాబ్స్‌కు శ్రీకారం చుట్టినట్లు పాల్ ల్యాబ్స్ రాష్ట్ర నోడల్ అధికారి విజయభాస్కర్ పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పర్సనల్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) కార్యక్రమంపై రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు గుంటూరులోని ఏసీ కళాశాల వేదికగా రెండు రోజుల పాటు నిర్వహించిన ఓరియెంటేషన్ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా నోడల్ అధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాల్ ల్యాబ్స్ మంజూరు చేసిన 60 పాఠశాలల పరిధిలోని ప్రధానోపాధ్యాయులతో పాటు గణిత, సైన్స్ ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల మేధస్సుకు మరింత పదును పెట్టాలని చెప్పారు. రాష్ట్ర సమన్వయకర్త కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ పాల్ కార్యక్రమ ఉద్దేశం, ప్రధానోపాధ్యాయుల బాధ్యతలను వివరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.